ఈనాడు

విజయవాడ 20-3-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 219

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఊహించిందే జరిగింది

మళ్లీ వాయిదా పడిన అవిశ్వాసం

- లోక్‌సభ వెల్‌లో ఏఐఏడీఎంకె, తెరాస ఆందోళన
- చర్చకు సిద్ధంగా ఉన్నట్లు రాజ్‌నాథ్ ప్రకటన
- మద్దతిస్తున్నట్లు నిల్చొని చేతులెత్తిన విపక్షాలు
- సభ సజావుగా లేదు... లెక్కించలేకపోతున్నానన్న స్పీకర్
- నేటి కోసం మళ్లీ నోటీసులిచ్చిన తెదేపా, వైకాపా
- స్పీకర్ విందు బహిష్కరణ



అయామ్ సారీ

అవిశ్వాస తీర్మానాలను సభ ముందుంచడం నా విధి. సభ సజావుగా జరగకపోతే 50 మంది సభ్యులను లెక్కించడం సాధ్యంకాదు. ఇలా ఆందోళన చేస్తే ఎలా? సభ ఆర్డర్‌లో లేనందున అవిశ్వాస తీర్మానాలను సభ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. అయామ్ సారీ... అయామ్‌సారీ.

- స్పీకర్ సుమిత్రా మహాజన్


అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సభలో కాంగ్రెస్, వామపక్షాలు, తెలుగుదేశం, వైకాపా, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులంతా లేచి నిల్చొన్నా లోక్‌సభ టీవీలో మాత్రం అది ఒక్కసారైనా చూపించలేదు. భాజపా సభ్యుల బెంచీలనే పదేపదే చూపించారు.

ఈనాడు – దిల్లీ

ఊహించిందే జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెదేపా, వైకాపా సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు సోమవారం లోక్‌సభలో చర్చకు రాలేదు. ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు తమతమ డిమాండ్లపై ఆందోళన కొనసాగించడంతో సభలో గందరగోళం నెలకొంది. సభ సజావుగా లేదని చెప్పి స్పీకర్ సుమిత్రా మహాజన్ వెంటనే మంగళవారానికి వాయిదా వేశారు. సోమవారం కోసం సమర్పించిన అవిశ్వాస తీర్మాన నోటీసులు మురిగిపోయాయి. ఉదయం నుంచి ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు. మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాస తీర్మానం నోటీసుల గురించి సభలో ప్రస్తావించారు. హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లేచి తాము అవిశ్వాస తీర్మానాలు సహా ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అప్పటికి ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు వెల్‌లో నిల్చొని కావేరి నదీ యాజమాన్య మండలి ఏర్పాటు, రిజర్వేషన్ల కోటా పెంపు డిమాండ్లతో (మిగతా 2లో)



సోమవారం దిల్లీలోని విజయ్‌చౌక్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న తెదేపా లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం. చిత్రంలో ఆ పార్టీ నేతలు



"ఇతర పార్టీలతో భాజపానే గలాభా సృష్టించి, సభను నిరవధికంగా వాయిదా వేసే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వాళ్ల కదలికల్ని బట్టి మన స్పందన ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై దేశం మొత్తం సానుభూతితో ఉంది. అనేక పార్టీల నుంచి వస్తున్న మద్దతే అందుకు నిదర్శనం. మంగళవారం కూడా ఇదే స్ఫూర్తితో పోరాడండి. ఐదు కోట్ల ప్రజలు మీ వెనుక ఉన్నారు. మీ వైపే రాష్ట్రం, దేశం యావత్తూ చూస్తోంది."

ద్రోహులకు డిపాజిట్లు రావు

- సభలో గొడవ చేయిస్తోంది భాజపానే
- అవిశ్వాసంపై చర్చ జరగకుండా కుట్ర
- ప్రతిరోజూ నోటీసు ఇస్తున్నా పట్టించుకోరా?
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ఉదయం, రాత్రి సీఎం టెలికాన్ఫరెన్స్
- రాష్ట్రవ్యాప్తంగా సైకిల్, ద్విచక్రవాహనాల ర్యాలీలు చేయాలని చంద్రబాబు ఆదేశం

ఈనాడు – అమరావతి

లాలూచీ రాజకీయాలతో రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న వారెవరికీ వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు రావని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. భాజపా లోక్‌సభలో ఒక పార్టీతో అవిశ్వాసం పెట్టించి, మరో పార్టీతో గొడవ చేయించి సభ వాయిదా వేసుకుని పోవాలని చూస్తోందని, లాలూచీ రాజకీయాలకు ఇది పరాకాష్టని ధ్వజమెత్తారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనాయకులతో ముఖ్యమంత్రి సోమవారం ఉదయం, రాత్రి రెండు సార్లు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి అన్ని పార్టీల మద్దతు కోరుతున్నామని, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై జాతీయస్థాయిలో చర్చ జరుగుతోందని తెలిపారు. "మన హక్కుల కోసం ఎంపీలు వీరోచితంగా పోరాడుతున్నారు. ఇది కీలక సమయం. అందరూ అప్రమత్తంగా ఉండాలి. మనం అడుగుతోంది న్యాయం చేయమనే కదా? న్యాయం కోరితే యుద్ధం చేస్తారా? ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ కూడా ప్లీనరీలో చెప్పింది. అలాంటప్పుడు (మిగతా 2లో)

రైలు ప్రయాణమా.. బహు పరాక్..!

- వేసవి ప్రారంభంతో దోపిడీలకు తెగబడుతున్న ముఠాలు
- రాష్ట్రంలో రోజుకు నాలుగైదు ఘటనలు నమోదు
- అరవై శాతం రైళ్లలోనే గస్తీ సిబ్బంది
- సరైన తనిఖీలు లేక రెచ్చిపోతున్న వైనం

16లో

లోక్‌సభలో కుమ్మక్కు!

- 'అవిశ్వాసం' చర్చకు రాకుండా అడ్డుకుంటున్నారు
- పొరుగు రాష్ట్రాల పార్టీలతో గందరగోళం చేయిస్తున్నారు
- చర్చకు అనుమతించేవరకు నోటీసులు ఇస్తూనే ఉంటాం
- స్పష్టం చేసిన తెదేపా ఎంపీలు

14లో

త్వరలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ

- వారంలో ఆర్థిక శాఖ నుంచి అనుమతి
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి
- టెట్ అర్హత 46.87శాతం...ఫలితాల విడుదల



విజయవాడలో టెట్ ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు. చిత్రంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి, టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించి వారం రోజుల్లో ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభిస్తుందని మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంటా మాట్లాడుతూ 10వేల వరకు ఖాళీలు ఉంటాయని, నివేదికను ఆర్థిక శాఖకు సమర్పించామని, అనుమతి వచ్చిన వెంటనే నియామకాల ప్రక్రియ చేపడతామని వివరించారు. టెట్‌లో మొత్తం 4,14,120 మంది పరీక్ష రాయగా.. ఇందులో 46.87శాతం మంది అర్హత సాధించారని ఆయన చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో నిర్వహించిన టెట్‌లో 35శాతం మంది అర్హత సాధించగా ఈసారి 11.87 శాతం పెరిగింది. ఓసీలకు 90, బీసీలకు 75, ఎస్సీ, ఎస్టీలకు 60మార్కులు అర్హతగా ఉంది. అన్ని (మిగతా 2లో)



కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ కవిత

ముందడుగు

- బలమైన కూటమిగా ఫెడరల్ ఫ్రంట్
- దేశ ప్రజలను ఏకం చేసే సంకల్పం
- కాంగ్రెస్, భాజపాయేతర పార్టీలన్నింటితో చర్చిస్తాం
- కోల్‌కతాలో తెలంగాణ సీఎం కేసీఆర్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

6లో

దూదికీ దిక్కు లేదు!

- 20% సర్జికల్ బడ్జెట్ కాగితాలకే పరిమితం
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా నిధులు విదల్చని వైనం
- రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో దారుణ పరిస్థితులు



ఈనాడు – గుంటూరు

కోస్తా జిల్లాల ఆరోగ్య వరప్రదాయినిగా చెప్పుకునే గుంటూరు సర్వజనాసుపత్రి (జీజీహెచ్)లో ప్రస్తుతం గాయాన్ని శుభ్రపరిచి కట్టు కట్టడానికి అవసరయ్యే దూది కూడా లేని పరిస్థితి నెలకొంది. కాస్తంత అతిశయంలా అనిపించిన ఇది నిజం. ఒక్క దూదే కాదు.. ఇంజెక్షన్ చేయాలన్నా, రక్త పరీక్షలు నిర్వహించాలన్నా అందుకు అవసరమైన సిరంజీల నిల్వలు లేని దుస్థితి. ఈ పరిస్థితిలో బోధనాసుపత్రి కొట్టుమిట్టాడుతోంది. నిబంధనల ప్రకారం రాబోయే మూడు నెలలకు సరిపడా ఔషధాలు, సర్జికల్ సామగ్రి నిల్వలు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులు చెబుతారు. 3మాసాలకు కాదు కదా.. 30రోజులకు సరిపడా నిల్వలు కూడా ప్రస్తుతం జీజీహెచ్‌లో లేవు. సర్జికల్ బడ్జెట్ కింద 20 శాతం నిధులను నేరుగా ప్రభుత్వం ఆసుపత్రి ఖాతాకు జమ చేస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో పది రోజుల్లో ముగియనుంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ బోధనాసుపత్రికి ఈ ఏడాది కేటాయించిన 20 శాతం బడ్జెట్ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడంతో (మిగతా 2లో)

'లింగాయత'కు మతం హోదా

- కర్ణాటక మంత్రివర్గం ఆమోదం
- కేంద్ర పరిశీలనకు సిఫారసు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: 'లింగాయత'ను ప్రత్యేక మతం, ధర్మంగా గుర్తించవచ్చని జస్టిస్ నాగమోహనదాస్ ఇచ్చిన నివేదికను కర్ణాటక మంత్రివర్గం సోమవారం ఆమోదించింది. బసవతత్వాన్ని అనుసరించే లింగాయత-వీరశైవ లింగాయతలకు మైనార్టీ హోదాను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో మంత్రులు విధానసౌధలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. లింగాయత అంశంపై (మిగతా 2లో)

రెవెన్యూ లోటు భర్తీ ఎప్పుడు?

- ఇవ్వాల్సింది రూ.16,078 కోట్లు.. ఇచ్చింది రూ.3,975.50 కోట్లు
- మరో రూ.138.39 కోట్లే వస్తాయంటూ కొత్త పల్లవి
- 2014–15 లోటు భర్తీపై కేంద్రం తీరిది

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన కారణంగా ఆదాయాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు తొలి ఏడాదిలో(2014-15) ఏర్పడిన రెవెన్యూ లోటు భర్తీకి అందజేయాల్సిన మొత్తంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ కనీసం నాలుగో వంతైనా ఇవ్వలేదు. 2014 జూన్ 2 నుంచి 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు ఆమోదం పొందే రోజు వరకూ మధ్యనున్న కాలవ్యవధిలో రెవెన్యూ లోటు ఎంత ఉందో లెక్కగట్టి ఆ మొత్తాన్ని 2014-15 కేంద్ర బడ్జెట్‌లో కేటాయిస్తామని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటించినా.. ఈ పద్దు కింద గత నాలుగేళ్లలో విడతలవారీగా రూ.3,975.50 కోట్లే విడుదలైంది. ఇదికాక మరో రూ.138.39 కోట్లే ఇవ్వాల్సి ఉందంటూ ఇప్పుడు కేంద్రం వాదిస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.16,078.76 కోట్లు రెవెన్యూ లోటు ఉందని కాగ్ ధ్రువీకరించినా.. అందులో రాష్ట్రప్రభుత్వ కొత్త పథకాలు, పీఆర్సీ



బకాయిల సొమ్ము కూడా కలగలిసి ఉన్నందున అంత మొత్తాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. కేంద్రం నుంచి తెదేపా మంత్రులు రాజీనామా చేసినా, ఎన్డీయే నుంచి ఆ పార్టీ వైదొలగినా ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తొలి ఏడాది రెవెన్యూలోటు భర్తీ విషయంలో తాజాగా పాత పాటే పాడుతున్నారు. ఫలితంగా అతి కీలకమైన విభజన హామీల్లో ఒకటైన ఈ అంశం అమలు నీరుగారిపోతోంది.

రూ.16,078.76 కోట్లు ఇవ్వాల్సిందే: రాష్ట్రం

★ 2014 జూన్ 2 నుంచి 2015 మార్చి 31 వరకూ ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొనే ఆర్థికలోటు భర్తీకి కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించేలా సూచనలిచ్చేందుకు ఉన్నత స్థాయి కమిటీని వేయాలని 2014 మార్చి 20న గవర్నర్ నరసింహన్ కేంద్రానికి (మిగతా 2లో)



సోమవారం రాంచీలో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం వద్ద బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్

మరో దాణా కుంభకోణ కేసులో

దోషిగా లాలూ

ప్రత్యేక న్యాయస్థానం తీర్పు 11లో



గేట్ టాపర్‌కు సీఎం అభినందన

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గేట్)-2018లో అఖిల భారత టాపర్‌గా నిలిచిన కృష్ణా జిల్లాకు చెందిన భువనచంద్రను సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అభినందించారు.

హ్యాకథాన్లలో పాల్గొనే వారికి ఉద్యోగావకాశాలు

ఈనాడు, విశాఖపట్నం: హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటూ ఐటీ పరిజ్ఞానంతో వివిధ సమస్యల పరిష్కార మార్గాలను ఆవిష్కరిస్తున్న యువతను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే వివిధ రంగాలపై 'హ్యాకథాన్'లు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం ఇన్నోవేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యవసాయరంగ పరిజ్ఞానాలపై అగ్రి హ్యాకథాన్, ఎపీటా (ఆంధ్రప్రదేశ్ ఐ.టి. అకాడమీ) ఆధ్వర్యంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీలపై హ్యాకథాన్, ఎలక్ట్రానిక్ పరిజ్ఞానాలపై ఎలక్ట్రోథాన్‌లు నిర్వహించింది. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు బృందాలుగా పాల్గొని వినూత్నమైన ఐ.టి. ఉత్పత్తులను వీటిల్లో ఆవిష్కరించారు. విజేతలకు ప్రభుత్వం బహుమతులు అందించింది. అంకుర సంస్థ (స్టార్టప్ కంపెనీ) ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినవారికి ప్రోత్సాహం అందిస్తోంది. ప్రత్యేక కేంద్రాల్లో కొంత ప్రాంగణాన్ని కేటాయించి అందులో వారి కార్యకలాపాల్ని నిర్వహించుకునేలా చర్యలు చేపడుతోంది. హ్యాకథాన్లలో పాల్గొనే వారు ఉద్యోగాలు చేయదలచుకుంటే వివిధ ఐ.టి. సంస్థల్లో అవకాశం దక్కేలా తాజాగా ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఉద్యోగమేళాలను నిర్వహించాలని నిర్ణయించింది.

మొదటి ప్రయోగం విజయవంతం

బ్లాక్‌చైన్ హ్యాకథాన్లో పాల్గొన్న విద్యార్థుల కోసం రుషికొండ గాయత్రి పరిషత్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 980మంది విద్యార్థులు హాజరయ్యారు. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన ఏడు ఐ.టి. సంస్థలు 69మందిని ఎంపిక చేసుకున్నాయి.

ద్రోహులకు డిపాజిట్లు రావు

> "కేంద్ర పెద్దల్ని పదే పదే కలవడం, వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధాని కార్యాలయంలో తిష్టవేయడం కంటే లాలూచీ రాజకీయాలకు రుజువులేం కావాలి? వాళ్ల కేసుల కోసం రాష్ట్రం, భవిష్యత్ తరాల భవిష్యత్తుని తాకట్టు పెడతారా? నాలుగేళ్లుగా విమర్శలు చేయని పవన్‌కల్యాణ్ ఇప్పుడే ఎందుకు యూ టర్న్ తీసుకున్నారో అందరికీ తెలుసు. ద్రోహులు ఎవరికీ డిపాజిట్లు కూడా రావు. తప్పుడు పనులు చేసేవారు దొంగాట ఆడుతున్నారు. వైకాపా నాయకులు లాలూచీ రాజకీయాలు చేస్తూ ఫొటోలతో సహ దొరికిపోయారు."
>
> "కుట్ర రాజకీయాల్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అన్ని నియోజకవర్గాల్లో సైకిల్, ద్విచక్ర వాహనాల ర్యాలీలు నిర్వహించాలి. ఇంటింటికీ ప్రచారం చేయాలి. కరపత్రాలు పంచాలి. గ్రామ గ్రామాన ప్రచారం ఉద్ధృతం చేయాలి..."
>
> **- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రానికి అభ్యంతరమేమిటి?..." అని సీఎం ప్రశ్నించారు. కేసుల మాఫీకి జగన్ అప్పుడు కాంగ్రెస్‌తో, ఇప్పుడు భాజపాతో లాలూచీ పడ్డారని ధ్వజమెత్తారు. అప్పట్లో రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలోనూ లోక్‌సభలో తెదేపా ఎంపీల మాటున జగన్ దాక్కున్నారని సీఎం పేర్కొన్నారు.

అవిశ్వాసంపై చర్చకు తోడ్పాటునివ్వాలని కోరండి: సీఎం

"ప్రతి రోజూ అవిశ్వాస తీర్మానంపై నోటీసులిస్తున్నా పరిగణనలోకి తీసుకోరా? చర్చ చేపట్టరా?..." అని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. "అందరినీ సంప్రదించండి. రాష్ట్రానికి జరిగిన అన్యాయం చక్కదిద్దేందుకు సహకారం అర్థించండి. అవిశ్వాసంపై చర్చకు తోడ్పాటునివ్వాలని కోరండి..." అని సూచించారు. సభలో హాజరు తగ్గకుండా చూడాలని, ఇతర పార్టీల ఎంపీలూ హాజరయ్యేలా శ్రద్ధ వహించాలని, ఇతర పార్టీలతోనూ నోటీసులు ఇప్పించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సోమవారం సభలో చోటు చేసుకున్న పరిణామాల్ని ముఖ్యమంత్రికి ఎంపీలు వివరించారు. టీఎంసీ, ఎన్సీపీ, ఆప్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రదర్శించాయని తోట నరసింహం తెలిపారు. తెదేపా వెల్‌లోకి వెళ్లి అడ్డుకుందని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని, దానిలో వాస్తవం లేదని చెప్పారు. లోక్‌సభ వెల్‌లో ఎవరున్నారో రాజ్యసభ సభ్యుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల్లో అపోహలు రేకెత్తించేందుకే వైకాపా ఒక వ్యూహం ప్రకారం తెదేపాపై దుష్ప్రచారం చేస్తోందని చెప్పారు. భాజపా, శివసేన ఎంపీలు కూర్చున్నారని, అన్నాడీఎంకే, తెరాస ఎంపీలు వెల్‌లో ఉన్నారని, మిగతా పార్టీల ఎంపీలంతా అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా లేచి నిలుచున్నారని ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. త్వరలోనే ఎన్నికలు వస్తాయని, జగన్ భాజపాతోనే ఉంటారంటూ.. ఒక ఆంగ్ల పత్రికలో రాశారని సి.ఎం.రమేష్ తెలిపారు. కుట్ర రాజకీయాలపైనే దిల్లీలోనూ చర్చ జరుగుతోందన్నారు. తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఇతర పార్టీల ఎంపీల సంతకాలతో వేరే నోటీసులు కూడా ఇవ్వనున్నట్టు చెప్పారు. అన్నాడీఎంకే, తెరాస సభ్యులు వెల్‌లోకి వెళ్లి గలాభా సృష్టించడంపై రకరకాల ప్రచారం జరుగుతోందని ఎంపీ రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ... ఏ పార్టీలు ఎలా వ్యవహరిస్తోందీ, ఆయా రాష్ట్రాల ప్రజలతో పాటు, దేశం మొత్తం గమనిస్తోందని, వారలా ఎందుకు చేస్తున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని వ్యాఖ్యానించారు. జాతీయ రాజకీయాలపై తనకు ఆసక్తి లేదని చంద్రబాబు చెప్పడం సరైనది కాదని, అవసరమైతే జాతీయ రాజకీయాల్లోను క్రియాశీలంగా మారతానని చెప్పడం సముచితంగా ఉంటుందని ఎంపీ గరికపాటి మోహన్‌రావు పేర్కొన్నారు. భాజపాతో జగన్ కుమ్మక్కుపై దళిత కాలనీల్లో ప్రచారం ఉద్ధృతం చేస్తామని జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. కాపులకు రిజర్వేషన్లపై శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోని విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు ఇతర పార్టీలను రెచ్చగొట్టడం రాజ్యాంగ వ్యతిరేకమని, అంబేడ్కర్ ఆశయాల్ని కాలరాయడమేనని వర్ల రామయ్య తెలిపారు. దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద మానవహారాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రతిపాదించగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. ఈ సందర్భంగా వెయ్యి మోటార్ సైకిళ్లతో ర్యాలీలు నిర్వహించామని శాసనసభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు కొందరు చెప్పగా ఆ మేరకు అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు.



ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబును కలిసి హజ్రత్ సయ్యద్ షాబుఖారీ ఉర్సు ఉత్సవ ఆహ్వాన పత్రికను అందిస్తున్న ముస్లిం మతపెద్దలు. చిత్రంలో ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ తదితరులు

అన్యాయం చేయడంతో భాజపాతో తెగతెంపులు చేసుకున్నాం

"మీ మనోభావాలు నాకు తెలుసు. ఇన్నాళ్లు భాజపాకి తెదేపా మద్దతివ్వడంపై మీలో కొన్ని అభ్యంతరాలున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం సహకారం లేకపోతే ఇబ్బంది పడతామన్న ఉద్దేశంతోనే పొత్తు పెట్టుకున్నాం. విభజన చట్టంలోని అంశాల్ని, రాజ్యసభలో ఇచ్చిన హామీల్ని అమలు చేయమని అడిగాం. చివరి బడ్జెట్‌లోను అన్యాయం జరగడంతో తెగతెంపులు చేసుకుని బయటకు వచ్చేశాం..." అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ముస్లింల ప్రయోజనాల్ని, మతసామరస్యాన్ని కాపాడిన పార్టీ తెదేపా మాత్రమేనని తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని ప్రజాదర్బార్ హాల్‌లో పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లిం నాయకులు, మతపెద్దలను ఉద్దేశించి మాట్లాడారు. వారంతా విజయవాడ పశ్చిమ శాసనసభ్యుడు జలీల్‌ఖాన్ నేతృత్వంలో ముఖ్యమంత్రిని కలసి సంఘీభావం ప్రకటించారు. భాజపాతో తెదేపా తెగతెంపులు చేసుకున్నందుకు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. "పదమూడు జిల్లాల్లో ఉర్దూని రెండో భాషగా చేశాం. హైదరాబాద్‌లో హజ్‌హౌస్ కట్టాం. మక్కా యాత్రకు వెళ్లేందుకు నేరుగా విమాన సర్వీసు ఏర్పాటు చేశాం. షాదీఖానాలు, మసీదుల నిర్మాణానికి ఆర్థిక సాయం చేశాం..." అని సీఎం పేర్కొన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని చెబుతూ ఇప్పటివరకు అమలు చేసిన పథకాలను వివరించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలోను, ముస్లింల ప్రయోజనాలకు విరుద్ధంగా తాను వ్యవహరించబోనని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముస్లింల రిజర్వేషన్లు కాపాడేందుకు ఎంత ఖర్చయినా వెనుకాడకుండా న్యాయపోరాటం చేయమని ఆదేశాలు జారీ చేశానన్నారు. ముస్లిం నాయకులు రాష్ట్రమంతా తిరగాలని, ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు వెళ్లి వాస్తవ పరిస్థితుల్ని వివరించి, వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో వారంతా తెదేపాకి సహకరించాలని, దీనికి ముస్లిం సోదరులు ముందున్నారని మీరు నిరూపించాలని చెప్పారు. భాజపాకి దూరంగా జరిగినందుకు ముఖ్యమంత్రికి ముస్లింల తరపున జలీల్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలతో పాటు ఇతర మైనారిటీ వర్గాలు భాజపా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 13 శాతం వరకు ఉన్న మైనార్టీ వర్గాల మద్దతు తెదేపాకి చెక్కు చెదరదని ఆయన పేర్కొన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ల పేరుతో ముస్లింలను మోసం చేశారన్నారు.

ఊహించిందే జరిగింది

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన కొనసాగిస్తున్నారు. తొలుత సభ ముందుకొచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దాని తర్వాత తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసుల గురించి సభలో ప్రస్తావించారు. 'వీటిని సభ ముందుంచడం నా విధి. సభ సజావుగా జరగకపోతే 50 మంది సభ్యులను లెక్కించడం సాధ్యంకాదు. అందరూ వెళ్లి మీమీ స్థానాల్లో నిల్చోండి. అప్పుడే అవిశ్వాస తీర్మానాలను అనుమతించాలా? లేదా? అన్నది నిర్ధారించుకోవడానికి వీలవుతుంది' అని సూచించారు.

మద్దతిస్తున్నట్లు గట్టిగా అరిచి చెప్పిన సభ్యులు

సభ సజావుగా లేదన్న కారణంతో గత శుక్రవారం లాగే సభను స్పీకర్ వాయిదా వేస్తారేమోనన్న అనుమానంతో సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, ములాయంసింగ్‌తోసహా కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపా, ఎస్పీ, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు లేచి, తామంతా మద్దతిస్తున్నట్లు చేతులెత్తి గట్టిగా అరిచారు. అయితే వెల్‌లో నిల్చున్న సభ్యులు ఆందోళన చేస్తుండటంతో... తాను ఎవరినీ చూడలేకపోతున్నట్లు స్పీకర్ చెప్పారు. వెల్‌లో నిల్చున్న సభ్యులు ఆమెకు మిగతావారు కనపడకుండా ప్లకార్డులు అడ్డుపెట్టే ప్రయత్నం చేశారు. తాను సభ్యులను చూసి లెక్కించాలనుకుంటున్నానని, ఇలా అయితే ఎలా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష సభ్యులు సీట్లలోంచి లేచి తమను లెక్కించుకోమని గట్టిగా అరిచారు. అందుకు స్పీకర్ స్పందిస్తూ 'అదెలా సాధ్యం... నేను చేయలేను' అన్నారు.

వాయిదాపై సభ్యుల అభ్యంతరం

ఆ తర్వాత వెల్‌లో ఉండి ఆందోళన చేస్తున్న ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు మరింత గట్టిగా ఓఓఓఓ ఓఓఓఓ... అని హోరెత్తించారు. ఈ పరిస్థితుల్లో అవిశ్వాస తీర్మానాలను ముందుకు తీసుకురాలేకపోతున్నానని స్పీకర్ చెప్పి, సభను మంగళవారానికి వాయిదావేశారు. ఆ సమయంలో తెలుగుదేశం సభ్యులంతా వారివారి సీట్లలో ఉంటూ బిగ్గరగా నిరసన వ్యక్తంచేశారు. కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు, వైకాపా సభ్యులు కూడా అలాగే అభ్యంతరం చెప్పారు. సభ వాయిదాపడిన వెంటనే తెదేపా లోక్‌సభాపక్షనేత తోట నరసింహం మంగళవారం కోసం మరో అవిశ్వాస నోటీసును స్పీకర్ కార్యాలయంలో ఇచ్చారు. అనంతరం వైకాపా సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కూడా పంపారు. సభ వాయిదా తర్వాత సమాజ్‌వాదీ నేత రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే సభను ఎందుకు సజావుగా ఉంచలేదని ప్రశ్నించారు. అన్నాడీఎంకేను ఉపయోగించి సభలో భాజపా గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ పార్లమెంటు సభ్యుల కోసం ఏర్పాటు చేసిన గుడిపడ్వా పండుగ విందును తెలుగుదేశం, వైకాపాలు బహిష్కరించాయి.

10 నిమిషాల్లోనే రాజ్యసభ వాయిదా

రాజ్యసభ కూడా ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టలేకుండా... సమావేశమైన పది నిమిషాల్లోపే మంగళవారానికి వాయిదా పడింది. పదేపదే సభను వాయిదా వేయించడం దేశానికి, పార్లమెంటు ప్రయోజనాలకు మంచిది కాదని ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు హితవు పలికారు. మంగళవారం కూడా పార్లమెంటులో ఇదే చిత్రం పునరావృతమయ్యే అవకాశం కనిపిస్తోంది. అవిశ్వాసంపై చర్చను భాజపా కోరుకోవడంలేదని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. నిరవధిక వాయిదా పడేంతవరకూ సభలో గందరగోళం నెలకొనడం... సభను వాయిదా వేయడం జరుగుతూ పోతాయని అంచనా వేస్తున్నారు.



సోమవారం లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్

ప్రభుత్వం సిద్ధంగా ఉంది: అనంత్‌కుమార్

అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ చెప్పారు. పార్లమెంటు లోపలా, వెలుపలా తమకు తగినంత మద్దతు ఉందని స్పష్టం చేశారు. 'భాజపా సర్కారుకు మెజారిటీ ఉంది. ఎన్డీఏతో కలిపితే మూడింట రెండొంతుల ఆధిక్యం మాదే'నని ఆయన విలేకరులకు తెలిపారు.

దూదికీ దిక్కులేదు!

(మొదటి పేజీ తరువాయి)

బోధనాసుపత్రి వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే గుంటూరు బోధనాసుపత్రిలో దూది, సిరంజీల కోసం చేసిన అప్పులు రూ.30 లక్షలకుపైగా పేరుకుపోవడంతో ఇకమీదట వాటిని సరఫరా చేయలేమని వ్యాపారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ఆసుపత్రి అధికారులు హైరానాపడుతున్నారు. ఈ ఏడాది గుంటూరు జీజీహెచ్‌కు 20 శాతం బడ్జెట్‌తో కలిపి సర్జికల్ బడ్జెట్ కింద రూ.4 కోట్లు ఇస్తున్నట్లు కేటాయింపుల్లో చూపారు. వీటిల్లో రూ.3.20 కోట్లకు అవసరమైన అన్ని రకాల మందులు, సర్జికల్ సామగ్రిని ఆంధ్రప్రదేశ్ వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) కొనుగోలు చేసి ఆసుపత్రికి పంపుతుంది. మిగిలిన రూ.80 లక్షలను ఆసుపత్రి ఖాతాకు జమ చేస్తే అత్యవసర మందులతో పాటు ఏపీఎంఎస్ఐడీసీ సరఫరా చేయని మందులను కూడా కొనుగోలు చేసుకుని ముందుకెళ్లడానికి వెసులుబాటు కలుగుతుంది. ఈ ఏడాది ఇప్పటివరకు 20శాతం బడ్జెట్‌కింద రూపాయి కూడా ఇవ్వకపోవడంతో అన్ని బోధనాసుపత్రుల్లో అప్పులు పేరుకుపోయాయి. సగటున ఒక్కో బోధనాసుపత్రిలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అప్పులు పేరుకుపోవడంతో సర్జికల్ సామగ్రిని సరఫరా చేయటానికి వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. మరోవైపు, శస్త్రచికిత్సల థియేటర్లలో దూది, బ్లేడులు ఎక్కువగా వినియోగిస్తారు. ప్రయోగశాలల్లో సిరంజీలు అవసరమవుతాయి. గుండెకు స్టెంట్ వేయించుకున్నవారు, కాళ్లు, చేతులు విరిగి కనీసం మూత్రశాల వరకు వెళ్లలేని వారికి యూరినరీ కెథటర్స్ వేస్తారు. వాటిద్వారా వారు పడకపైనే అత్యవసరాలు తీర్చుకుంటారు. ఆ పైపులు లేక ప్రస్తుతం ఇబ్బందిగా ఉందని ఆసుపత్రివర్గాలు ఆవేదనవ్యక్తం చేస్తున్నాయి.

లేఖలకు స్పందన శూన్యం.. రాష్ట్రంలో బోధనాసుపత్రులు, రిమ్స్‌లు, జిల్లా ఆసుపత్రులు మొత్తం 32 ఉన్నాయి. వాటికి 20 శాతం సర్జికల్ బడ్జెట్ కింద ప్రభుత్వం రూ.6.57 కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపులు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ నిధులను వెంటనే ఆసుపత్రులకు విడుదల చేయాలని రాష్ట్ర వైద్య, విద్య సంచాలకుడు గతేడాది జులై, ఆగస్టులో రెండుసార్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎండీకి లేఖలు రాశారు. వాటిపై ఏపీఎంఎస్ఐడీసీ నుంచి స్పందనే లేదు.

కర్నూలు యువతికి టెట్‌లో మొదటి ర్యాంకు



సి.భారతి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు నగరం పూలబజార్‌కు చెందిన పద్మాజీరావు, హేమ దంపతుల కుమార్తె సి.భారతి టెట్‌లో రాణించింది. మొదటి ప్రయత్నంలోనే పేపర్-1 పరీక్షలో 150కి 141 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2014-16లో డీఎడ్ కోర్సు పూర్తిచేసింది. ప్రస్తుతం దూరవిద్యలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. స్థానికంగా ఆర్నెల్లు శిక్షణ తీసుకోవడంతో సులువుగా పరీక్షలో రాణించినట్లు ఆమె వెల్లడించింది.

త్వరలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

పేపర్లలో కలిపి 25శాతం మందికి 90మార్కుల కంటే ఎక్కువ వచ్చాయి. పరీక్షలు రాసిన 95మంది అభ్యర్థుల ఫలితాలను వెల్లడించలేదు. పేపర్-1 పరీక్షకు సంబంధించి ఏడు పరీక్షా కేంద్రాల్లో 84మంది అభ్యర్థులు తమకు 5ప్రశ్నలు ఆన్‌లైన్‌లో కనిపించలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోనందున ఈ ఫలితాలు వెల్లడించలేదు. ఇద్దరు అభ్యర్థులు రెండేసి హాల్‌టిక్కెట్లతో రెండు పర్యాయాలు పరీక్షలు రాయగా.. తొమ్మిది మంది అభ్యర్థులు వారు ఇచ్చిన ఐచ్ఛిక మాధ్యమం కాకుండా ఇతర మాధ్యమంలో పరీక్షలు రాశారు. వీరి ఫలితాలను నిలిపివేశారు. దీనిపై 10రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి గంటా వెల్లడించారు. పేపర్-1లో సి.భారతి, యాంద్ర సుబ్రమణ్యంలు అత్యధికంగా 141మార్కులు సాధించగా.. పేపర్-2లో మట్టా నాగజ్యోతి, పెసల జ్యోతిలకు 133మార్కులు, పేపర్-3లో చల్లా రవికుమార్‌కు అత్యధికంగా 138 మార్కులు లభించాయి. పేరు, పుట్టినతేదీ, వయస్సు ఇతరత్రా తప్పుల సవరణకు వెబ్‌సైట్ http://cse.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు పేపర్-1,2లలో కలిపి ప్రశ్నలు, జవాబుల్లో తప్పులు దొర్లడంతో 16 మార్కులను కలిపారు.

టెట్ స్వరూపం ఇదీ

- ఆన్‌లైన్‌లో మొత్తం దరఖాస్తులు: 4,46,833
- హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 4,36,829
- పరీక్షకు హాజరైనవారు: 4,14,120
- అర్హత సాధించినవారు: 1,94,093

పేపర్	రాసినవారు	అర్హులు	శాతం
పేపర్-1	1,73,861	1,00638	57.88
పేపర్-2	1,81,734	68,524	37.70
పేపర్-3	58,525	24,931	42.60

రెవెన్యూ లోటు భర్తీ ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాశారు. ప్రణాళిక సంఘం, కేంద్ర ఆర్థిక శాఖ, హోంశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని సీనియర్ అధికారులతో ఉమ్మడి కమిటీ వేయాలని దానిలో కోరారు.

- మొత్తం పది నెలల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15,691 కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడుతుందని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 2014 మే 27న కేంద్రానికి మరో లేఖ రాశారు.
- దానికి స్పందిస్తూ కేంద్రం 2014-15 బడ్జెట్‌లో రెవెన్యూ లోటు భర్తీ కింద రూ.2,303 కోట్లు కేటాయించింది.
- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఖాతాలను తనిఖీ చేసిన కాగ్ 2014-15 బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిన రూ.2,303 కోట్లు మినహాయించి రూ.13,775.76 కోట్లు రెవెన్యూ లోటు ఉందని నిర్ధారించింది. మొత్తం కలిపితే ఈ లోటు రూ.16,078.76 కోట్లు అవుతుందని తేల్చింది.
- ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అంచనా వేసిన రెవెన్యూ లోటు, కాగ్ నిర్ధారించిన రెవెన్యూ లోటు దాదాపు సమానంగా ఉంది.
- రాజ్యసభలో అప్పటి ప్రధాని హామీ మేరకు రూ.16,078.56 కోట్లు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనూ సీఎం చంద్రబాబు ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు.
- అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖాధికారుల మధ్య దఫదఫాలుగా జరిగిన చర్చల్లో రెవెన్యూ లోటు రూ.7,500 కోట్లుగా అనధికారిక ఒప్పందం కుదిరింది.
- తర్వాత కేంద్ర ఆర్థికశాఖ మళ్లీ మాట మార్చింది. మొత్తం లోటు సుమారు రూ.నాలుగువేల కోట్లే అంటోంది.

తొలి ఏడాది రెవెన్యూ లోటు రూ.4117.89 కోట్లే: కేంద్రం

"కాగ్ ధ్రువీకరించిన రెవెన్యూ లోటు రూ.16,078 కోట్లలో రూ.11,960 కోట్లు కొత్త పథకాలైన రుణమాఫీ(రూ.7069.67 కోట్లు), వృద్ధాప్య పింఛన్లు(రూ.3391.20 కోట్లు), డిస్కమ్‌ల ఫైనాన్సింగ్ రీస్ట్రక్చరింగ్ ప్యాకేజీ (రూ.1500 కోట్లు)కి సంబంధించినవి. ఆ వ్యయంతో పాటు పీఆర్సీ బకాయిలనూ మేం పరిగణనలోకి తీసుకోవడం లేదు. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది రెవెన్యూ లోటు మొత్తం రూ.4117.89 కోట్లే. ఇప్పటికే రూ.3979.50 కోట్లు ఇచ్చేశాం. ఇక రూ.138.39 కోట్లే రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది." అని కేంద్రం చెబుతోంది. ఇదే విషయాన్ని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పలుమార్లు స్పష్టం చేశారు. ఆ మొత్తాన్నీ వార్షిక వాయిదాల కింద చెల్లిస్తామన్నారు.

2014-15 ఆర్థిక సంవత్సరంలోని పది నెలల కాలానికి రెవెన్యూ లోటు భర్తీ కింద ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చిన నిధుల గణాంకాలు

ఆర్థిక సంవత్సరం	రెవెన్యూ లోటు భర్తీ కింద కేంద్రం ఇచ్చింది (రూ.కోట్లల్లో)
2014-15	2,303
2015-16	500
2016-17	1,176.50
మొత్తం	**3,979.50**


'లింగాయత'కు మతం హోదా

(మొదటి పేజీ తరువాయి)

అమాత్యుల మధ్య తీవ్రవాద ప్రతివాదనలు కొనసాగాయి. చివరికి లింగాయతను ప్రత్యేక మతంగా గుర్తించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని నిర్ణయించామని సమావేశానంతరం మంత్రి టి.బి.జయచంద్ర తెలిపారు. లింగాయతులకు అల్ప సంఖ్యాక హోదాను కట్టబెడితే మైనార్టీ రిజర్వేషన్లకు వచ్చే ముప్పేమి లేదని పేర్కొన్నారు. దీన్ని ప్రత్యేక ధర్మంగా గుర్తించాలని వచ్చిన విన్నపాలను పరిగణనలోకి తీసుకుని జస్టిస్ నాగమోహనదాస్ నేతృత్వంలో ఓ సమితిని ఏర్పాటు చేసిన నేపథ్యాన్ని గుర్తుచేశారు. కర్ణాటక రాష్ట్ర మైనార్టీ చట్టాల్లోని 2(డి) నిబంధనలకు అనుగుణంగా తాము లింగాయతులను అల్ప సంఖ్యాకులుగా గుర్తించాలని కేంద్రానికి సిఫారసు చేస్తున్నామని వివరించారు.

నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు

మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కొందరు మతాధిపతులు స్వాగతించగా.. మరికొందరు వ్యతిరేకించారు. లింగాయత, వీరశైవ ఒక్కటేనని లింగాయతకు ప్రత్యేక ధర్మం అంటూ ప్రభుత్వం కొత్త కుట్రకు తెరతీసిందని బాళేహొన్నూరు రంభాపురి మఠం పీఠాధ్యక్షుడు జగద్గురు రేణుకాచార్య నిప్పులు చెరిగారు. ఈ అంశంపై న్యాయపోరాటాన్ని, ధర్మయుద్ధాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. తాజా వ్యవహారంతో తేనెతుట్టెను కదిలించినట్లయ్యిందని మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవెగౌడ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హిందువులను విభజించిన మిమ్మల్ని కన్నడిగులు ఎప్పటికీ క్షమించరంటూ మాజీ మంత్రి, లోక్‌సభ సభ్యురాలు శోభా కరంద్లాజె ట్వీట్ చేశారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడగానే లింగాయత సమాజం ప్రతినిధులు రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. వారి వేడుకలకు వ్యతిరేకంగా మరికొన్ని చోట్ల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు వినయ్ కులకర్ణి, ఎం.బి.పాటిల్ తదితరుల చిత్రపటాలను ఆందోళనకారులు దహనం చేశారు.



బెంగళూరులోని బసవేశ్వర కూడలిలో వెల్లువెత్తిన ఉత్సాహం

ఇది నిప్పుతో చెలగాటమే: భాజపా

లింగాయతలకు మతం హోదా కల్పించడాన్ని భాజపా తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నిప్పుతో చెలగాటం ఆడుతున్నారని పార్టీ కర్ణాటక బాధ్యుడు పి.మురళీధర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 'విభజించి పాలించు' అనే బ్రిటిష్ నినాదాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందే ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని.. నాలుగేళ్ల నుంచి ఇది ఎందుకు చేయలేకపోయారని సోమవారం ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

గ్రహం అనుగ్రహం

20–3–2018 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
తదియ: సా. 5-03 తదుపరి చవితి
అశ్విని నక్షత్రం: రా. 8-04 తదుపరి భరణి
అమృత ఘడియలు: మ. 12-57 నుంచి 2-31 వరకు
వర్జ్యం: సా. 4-06 నుంచి 5-41 వరకు
తిరిగి తె. 5-25 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 8-33 నుంచి 9-20 వరకు
తిరిగి రా. 10-56 నుంచి 11-44 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-09; సూర్యాస్తమయం: సా.6-07
శ్రీమత్స్యజయంతి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.0	21.5
కర్నూలు	38.2	24.8
కడప	37.0	22.0
శ్రీకాకుళం	37.0	21.5
గుంటూరు	36.7	21.0
విజయవాడ	36.0	21.0
తిరుపతి	35.8	22.1
హైదరాబాద్	35.8	21.0
ఒంగోలు	35.6	23.9
విశాఖపట్నం	35.4	23.0
అనంతపురం	34.9	22.4
నెల్లూరు	34.0	23.0
నరసాపురం	33.6	22.6
తాడేపల్లిగూడెం	32.5	22.5

భూగర్భ 'ముదురు' వ్యవస్థ



అత్యంత సుందరమైన విశాఖలోని ఎంవీపీకాలనీ సెక్టార్-11లో భూగర్భ డ్రెయినేజి నీరు నేరుగా గెడ్డలోకి విడిచిపెడుతున్న దృశ్యమిది. ఈ నీటిని శుద్ధి చేశాకే గెడ్డల్లో, సముద్రంలో విడిచిపెట్టాలన్న ప్రాథమిక సూత్రాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. శుద్ధి చేయని నీటిని నేరుగా విడిచిపెట్టడంతో భూగర్భ జలాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చుట్టు పక్కల బావుల్లో నీరు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

★ గుంటూరులో 18 మంది మృతికి, మరో 500 మందికిపైగా అస్వస్థతకు కలుషిత నీరు తాగడమే ప్రధాన కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చిన యంత్రాంగం యూజీడీలో భాగంగా వేసిన మ్యాన్‌హోల్స్(అవసరమైనప్పుడు పైపు లైన్లకు మరమ్మతులు చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసే మూతలు) నుంచి బయటకు వచ్చి కాలువలో కలిసిన నీరు కూడా మరో కారణమన్న విషయాన్ని తాజాగా గుర్తించింది. గుంటూరులో 1959లోనే 22 శాతం ప్రాంతాలకు భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఆయా ప్రాంతాల్లో నిర్వహణ లోపంతో మ్యాన్‌హోళ్ల నుంచి నీరు బయటకొచ్చి పక్కనే ఉన్న కాలువల్లో కలుస్తోంది. ఇదే కాలువల్లో నుంచి, పక్కన ఉన్న తాతల కాలం నాటి రంధ్రాలు పడిన తాగునీటి పైపుల్లోకి వెళుతున్న నీటిని తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

- యూజీడీ ఉన్న చోట నిర్వహణా లోపాలు
- కొత్తగా మంజూరైన చోట నత్తనడకన పనులు

ఈనాడు, అమరావతి

నిర్వహణాలోపంతో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ గుంటూరు లాంటి ప్రాంతాల్లో ఒకపక్క ప్రజల ప్రాణాల్ని అపాయంలోకి నెడుతుండగా... మరోపక్క ఈ పనులు కొత్తగా చేపట్టిన చోట నత్తను తలపిస్తున్నాయి. యూజీడీ వ్యవస్థ వల్ల అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నది ఎంత వాస్తవమో, నిర్వహణ లోపిస్తే అంతకంటే ఎక్కువ ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొనే అవకాశాలున్నాయన్నది అంతకంటే వాస్తవం. మరుగుదొడ్లు, స్నానపు గదుల్లో నుంచి వచ్చే నీరు భూగర్భంలోని పైపుల నుంచి నేరుగా పంపుల్లోకి, అక్కడి నుంచి మురుగు నీటి శుద్ధి కేంద్రాలకు (ఎస్‌టీపీ) వెళ్లాలి. నిర్వహణ, పర్యవేక్షణ లోపంతో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు బయటకు రావడం విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రధాన నగరాల్లో నిత్యకృత్యమవుతోంది. ప్రత్యేకించి వర్షాకాలంలో ఈ బెడద మరీ ఎక్కువ. రాష్ట్రంలోని 82 శాతం పట్టణాలకు ఈ వ్యవస్థ అందుబాటులో లేదు. ఉందనుకున్నచోట చాలా ప్రాంతాల్లో నిర్వహణ లోపిస్తోంది.

ఉమ్మడి రాష్ట్రంలో...

యూజీడీ వ్యవస్థ ఏర్పాటు ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో ప్రభుత్వాలు అన్ని ప్రాంతాల్లోనూ చేపట్టేందుకు నిధులు కేటాయించలేకపోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ నవీకరణ కార్యక్రమంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి చోట్ల కొన్ని ప్రాంతాల్లో యూజీడీ పనులు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు నగరపాలక సంస్థల నిధులతో కలిపి రూ.1,850 కోట్లకుపైగా ఖర్చు చేశారు. మొత్తం 97 పురపాలక సంఘాల్లో, మరో 13 నగరపాలక సంస్థల్లో 2022 నాటికి పూర్తిస్థాయిలో యూజీడీని తీసుకురావాలన్న ప్రణాళికలు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం నిధులు ఎంత అవసరం, సమీకరణకు ఉన్న అవకాశాలు, పురపాలక, నగరపాలక సంస్థల ఆర్థిక పరిస్థితి తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు.



గుంటూరులో సాగుతున్న భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనులు

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే...

★ గుంటూరులో 1,073 కిలో మీటర్లలో పనుల కోసం రూ.903.82 కోట్లు అవుతుందని అంచనా వేశారు. గత ఏడాది జనవరిలో చేపట్టిన పనుల్లో ఇప్పటికీ 50 శాతం పూర్తి కాలేదు. 480 కిలో మీటర్లలో మొదటి విడతగా చేపట్టిన పనులు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతిపాదిత మొత్తం పనులు పూర్తి చేయడమన్నది అనుమానమే.

ఇవి పూర్తి చేశాక మళ్లీ రెండో విడత మరో 500 కిలో మీటర్లకుపైగా పనులు పూర్తి చేయాలి. గడువులోగా సాధ్యమేనా?

★ కర్నూలులో 2008లో రూ.120 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. నిధులు కేటాయించే దశలో రాతి నేలలైనందున ప్రాజెక్టు నిర్వహణ సాధ్యం కాదని నిపుణుల బృందం నివేదిక ఇవ్వడంతో పనులు ప్రారంభం కాలేదు. 60 ఏళ్ల క్రితమే ఇదే కర్నూలులో ఏబీసీ క్యాంపుల్లోగల 1400 ఇళ్లకు యూజీడీ ఏర్పాటు చేయడం విశేషం.

★ విజయవాడలో 90 శాతం ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నా పది శాతం ప్రాంతాల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రత్యేకించి వన్‌టౌన్ ప్రాంతంలో ఇళ్ల నుంచి కనెక్షన్లను ప్రధాన పైపులైన్లకు అత్యధిక చోట్ల అనుసంధానించాలి. శివారు ప్రాంతాల్లో పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయి.

★ మహా విశాఖ నగరంలో 700 కిలో మీటర్ల పరిధిలో భూగర్భ డ్రెయినేజి వ్యవస్థ ప్రస్తుతం అందుబాటులో ఉంది. మరో 2 వేల కిలో మీటర్ల పొడవునా అవసరం. నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మాత్రమే పదేళ్ల క్రితం పనులు చేపట్టి పూర్తి చేశారు. పారిశ్రామిక ప్రాంతంతోపాటు విలీన ప్రాంతాల్లోనూపనుల కోసం ప్రతిపాదనలైతే ఉన్నాయి.

★ నెల్లూరులో రూ.516 కోట్ల అంచనా వ్యయంతో 430 కిలోమీటర్లలో పనులు ఏడాది క్రితం ప్రారంభమయ్యాయి. 290 కిలో మీటర్ల పొడవునా పూర్తయ్యాయి. ఐదు మురుగునీటి శుద్ధి ప్లాంట్లలో రెండు చోట్ల పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. స్థల సమస్య, ఇతర కారణాలతో మిగతా పనులు ప్రారంభం కాలేదు.



విశాఖలో నిత్యం ఏదో ఒక చోట ఇలా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగిపొర్లాల్సిందే (పాత చిత్రం)

నిజరూప అలంకారంలో భ్రమరాంబాదేవి దర్శనం



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో విళంబి నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో పూర్ణాహుతి జరిగింది. అనంతరం చండీశ్వరుడికి విశేష పూజలు జరిపి మల్లికాగుండంలో వైదిక స్నానం చేయించారు. అర్చకులు వసంతోత్సవం జరిపారు. అక్కమహాదేవి అలంకార మండపంలో భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లు అశ్వ వాహనంపై కొలువుదీరగా అర్చకులు, వేదపండితులు పూజలుచేసి ఉత్సవాలకు ముగింపు పలికారు.

25, 26న తిరుమలలో శ్రీరామనవమి వేడుకలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీరామనవమి పండుగ నేపథ్యంలో ఈ నెల 25న సాయంత్రం 7 గంటల నుంచి తిరువీధుల్లో శ్రీమలయప్పస్వామి హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. 26న శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది. 25న ఉదయం సుప్రభాతం సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరగనుంది. రాత్రి 10 నుంచి 11 గంటల వరకు బంగారువాకిలి ఎదుట శ్రీరామనవమి ఆస్థానాన్ని నిర్వహించనుంది. 26న రాత్రి 8 గంటలకు బంగారువాకిలి ఎదుట ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని జరపనున్నారు. ఆయా రోజుల్లో వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను రద్దు చేసింది.

శ్యామాప్రసాద్ ముఖర్జీ నామఫలకంపై నల్లటిసిరా

ప్రెసిడెన్సీ విశ్వవిద్యాలయంలో దుండగుల దుశ్చర్య

కోల్‌కతా: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ నామఫలకంపై దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇక్కడి ప్రెసిడెన్సీ విశ్వవిద్యాలయంలోని తెల్లటి నాపరాతిగోడపై చెక్కిన ఆయన పేరుపై నల్లటి సిరా పూశారు. ఒకప్పుడు ప్రెసిడెన్సీ కళాశాలగా సుప్రసిద్ధమైన, ప్రస్తుత ఈ విశ్వవిద్యాలయంలో ముఖర్జీ పూర్వవిద్యార్థి. ఆయనతో పాటు పలువురు పూర్వ విద్యార్థుల పేర్లను సంస్థ ప్రధాన భవంతి గోడపై చెక్కించారు. 1922లో కళాశాల నుంచి మొదటి తరగతిలో ఉత్తీర్ణుడైన మొట్టమొదటి విద్యార్థిగా ముఖర్జీ చరిత్ర సృష్టించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ దేబజ్యోతి కొనార్ మాట్లాడుతూ తప్పు చేసినవారిని కనిపెట్టడానికి ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించామన్నారు.

రైళ్లలో శుభ్రతను మెరుగుపరచండి: జీఎం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రైళ్లలో, రైల్వే స్టేషన్లలో పరిశుభ్రతను మెరుగుపరచాలని, నిరంతరం పర్యవేక్షించాలని దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన వివిధ విభాగాల ముఖ్య కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్ మేనేజర్లతో దృశ్య మాధ్యమ సమీక్షలో మాట్లాడారు.

గ్రూపు-1 జాబితాపై 'స్టే' తొలగింపు

ఈనాడు, అమరావతి: గ్రూపు-1 నోటిఫికేషన్ (2011) ప్రకారం ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాపై ఏపీ ట్రిబ్యునల్ జారీ చేసిన 'స్టే' తొలగినట్లు ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. కమిషన్ వాదన విన్న అనంతరం స్టే తొలగించినట్లు తెలిపారు. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తూ.... గ్రూపు-1 ఉద్యోగాలకు ఎంపికైన వారి నుంచి అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు అవకాశాన్ని కల్పించామని పేర్కొన్నారు.

ముందు ఆరోపణలు.. ఆపై క్షమాపణలు!

- గడ్కరీ, అమిత్ సిబాల్‌లకు కేజ్రీవాల్ లేఖలు
- పరువునష్టం కేసుల ఉపసంహరణ

దిల్లీ: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పాటు మాజీ మంత్రి కపిల్ సిబాల్ కుమారుడు, న్యాయవాది అమిత్ సిబాల్‌పై గతంలో చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలపై దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వారికి బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈమేరకు ఇద్దరికీ లేఖలు రాశారు. ఇప్పటికే కేజ్రీవాల్‌పై పరువునష్టం దావాలు వేసిన ఇద్దరూ.. ఈ లేఖలతో వాటిని ఉపసంహరించుకున్నారు. కేజ్రీవాల్‌తో పాటు, దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాలను అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సమర్ విశాల్ ఆయా కేసుల నుంచి విడుదల చేశారు. దేశంలో అత్యంత అవినీతిపరులు అంటూ ఆప్ రూపొందించిన ఓ జాబితాలో గడ్కరీ పేరును చేర్చడంతో ఆయన కేజ్రీవాల్‌పై గతంలో పరువునష్టం దావా వేశారు. దీనిపై గడ్కరీకి రాసిన లేఖలో - ''నిర్ధారించుకోకుండా నేను కొన్ని వ్యాఖ్యలు చేశాను. అవి మిమ్మల్ని గాయపరచడంతో మీరు నాపై దావా వేశారు. వ్యక్తిగతంగా మీపై నాకేమీ లేదు. మీపై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తున్నాను.'' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. అలాగే అమిత్ సిబాల్‌పై కూడా కొన్ని ఆరోపణలు చేయడంతో ఆయన 2013లో కేజ్రీవాల్‌తో పాటు మనీశ్ సిసోడియాలపై క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. దీనిపై తాము సరిచూసుకోకుండా ఆరోపణలు చేశామంటూ ఇద్దరూ సోమవారం అమిత్‌కు క్షమాపణ లేఖ రాశారు. కాగా గతంలోనూ శిరోమణి అకాలీదళ్ నేత విక్రమ్‌సింగ్ మజీతియాపై కూడా ఆరోపణలు చేయగా.. కోర్టులో కేసు వేయడంతో అనంతరం కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పి దాన్నుంచి బయటపడ్డారు.

జీపీఎస్‌పై సైబర్ దాడులకు ముకుతాడు

హ్యూస్టన్: స్థలకాల సంకేతాలను సూచించే గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్)పై ఇక దాడులకు తావుండదు! 'తప్పుదోవ' పట్టించే నకిలీ జీపీఎస్‌ల భరతం పట్టే పరిష్కారాన్ని టెక్సాస్ విశ్వవిద్యాలయం ఆవిష్కరించింది. ఉపగ్రహ ఆధారంగా పనిచేసే ఈ రేడియో నేవిగేటర్ వ్యవస్థకు అమెరికా ప్రభుత్వమే యజమాని. ఆ దేశ వాయుసేన దీనిని నిర్వహిస్తోంది. అక్కడి పవర్ గ్రిడ్, రవాణా తదితర కీలక వ్యవస్థలు జీపీఎస్ ఆధారంగానే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అయితే... విద్వేష శక్తులు స్థల-కాలాలకు సంబంధించిన జీపీఎస్ సంకేతాలపై పంజా విసిరి, వివరాలను తారుమారుచేసే ముప్పుంది. ఇప్పటికే ఇలాంటి ఘటనలు అప్పుడప్పుడు వెలుగు చూస్తున్నాయి. దీనిపై దృష్టి సారించిన యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (యూటీఎస్‌ఏ)... జీపీఎస్ సంకేతాలపై దాడులను, తప్పుడు జీపీఎస్‌లను పసిగట్టే అల్గారిథమ్‌ను రూపొందించింది. ఈ సరికొత్త సాంకేతికత తొలుత ప్రజా సంబంధ వ్యవస్థల్లో అందుబాటులోకి రానుంది. క్రమంగా, ప్రపంచ వ్యాప్తంగా ఇది అందరి సెల్‌ఫోన్లలోనూ అందుబాటులోకి వస్తుందని పరిశోధనలో పాల్గొన్న గేట్సిస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫేస్‌బుక్ ఖాతాదారుల ఇష్టాయిష్టాలు బహిర్గతం

ట్రంప్ అనునాయి స్టీవ్‌బానన్ కంపెనీ నిర్వాకం

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుయాయుడు స్టీవ్‌బానన్ నెలకొల్పిన 'కేంబ్రిడ్జ్ అనలిటికా' అనే సంస్థ, నకిలీ సమాచారాన్ని ఎంతో తెలివిగా స్వార్థప్రయోజనాల కోసం వినియోగించుకుంది. లక్షలాది ప్రజల ఆలోచనలను తనకు ప్రయోజనం కల్గించేలా, తను ఊహించిందే నిజమని భ్రమించేలా చేయడంలో కృతకృత్యురాలైంది. వ్యక్తిత్వ పరీక్షల కోసం ఉద్దేశించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న 2,70,000 మంది సమాచారాన్ని దుర్వినియోగం చేసింది. వీరంతా ఏం ఇష్టపడతారో, ఎలాంటి సమాచారాన్ని చదువుతారో అర్థం చేసుకుని అలాంటి సమాచారంతో కూడిన బ్లాగ్‌లు, వెబ్‌సైట్లను చూసేలా ఫేస్‌బుక్‌లోని ఇతరులతో సంభాషణలు నెరిపేలా జాగ్రత్త పడింది. 'సమాచార ఆధిపత్యం' అనే ఆలోచనతో 2016లో ఇదంతా చేశామని ఒకప్పుడు కేంబ్రిడ్జ్ అనలిటికాలో పనిచేసిన, కెనడాకు చెందిన మాజీ ఉద్యోగి ఒకరు తాజాగా వెల్లడించారు. 2,70,000 మంది ఖాతాదారుల సమాచారం దుర్వినియోగం కావడం నిజమేనని ఫేస్‌బుక్ కూడా అంగీకరించింది. వాస్తవానికి ఈ విషయం తెలిసి రెండేళ్లు అవుతున్నా, తాజాగా అంగీకరించిందని అమెరికా, బ్రిటన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు 50 లక్షల మంది సమాచారం తస్కరణకు గురైందని అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు జుకెర్‌బర్గ్‌పై చర్యలకు యోచిస్తున్నాయి.

కారుణ్య మరణానికి అనుమతించండి

- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు మహిళ విన్నపం
- కణతి బాధ భరించలేకున్నానని వెల్లడి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అండాశయంలో ఏర్పడిన కణతి రోజురోజుకు పెద్దదై కలిగిస్తున్న బాధను తాళలేని ఆ ఇల్లాలు చివరికి కారుణ్య మరణానికి అనుమతించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. గుండెలను పిండేసే ఈ ఘటన సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో చోటుచేసుకుంది. పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన పత్తి రామలక్ష్మి(35)కి అండాశయంలో కణతి ఏర్పడి.. రోజురోజుకు పెద్దదై తీవ్ర బాధ కలిగిస్తోంది. ఈ అరుదైన వ్యాధికి చికిత్స చేయించుకునేంత ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో కారుణ్య మరణానికి అనుమంతించాలని రామలక్ష్మి కోరారు. తన భర్త కొండబాబుతో ఈ విషయాన్ని వినతి రూపంలో సోమవారం కాకినాడలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కార్తికేయ మిశ్రాకు అందజేశారు. అంత బాధతోనే ఆమె ఆటోలో కలెక్టరేట్‌కు వచ్చారు. కిందకు దిగలేని పరిస్థితుల్లో ఆమె భర్త ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. రామలక్ష్మికి భర్త కొండబాబు, ఇద్దరు కుమారులు అర్జున్(14), ఉమామహేశ్వరరావు(12) ఉన్నారు. కొండబాబు కూలి మాత్రమే ఆ కుటుంబానికి ఆధారం. రామలక్ష్మికి రెండేళ్ల కిందట కడుపులో కణతి వస్తే శస్త్రచికిత్స చేసి తొలగించారు. అనంతరం మళ్లీ అండాశయంలో కణతి ఏర్పడడంతో ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా శస్త్రచికిత్స చేయడానికి రూ.4.50 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా రూ.1,01,790 మంజూరు చేశారు. మిగతా సొమ్మును భరించే పరిస్థితి లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో కారుణ్య మరణానికి అనుమతించాలని కలెక్టర్‌ను కోరారు. ఆమెకు ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ద్వారా వైద్యం అందించడానికి హైదరాబాద్‌లో పనిచేయడంలేదు. పరిస్థితి తెలుసుకున్న కలెక్టర్ కార్తికేయ మిశ్రా రామలక్ష్మికి చికిత్స చేయించడానికి సత్వర చర్యలు చేపడతామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయకర్త వి.వరప్రసాద్‌ను పిలిపించి వైద్యసేవలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బాధితురాలు 'హ్యూజ్ ఎబ్డామినో పెల్విక్ పోలీ సిస్టిక్ ఓవేరియన్ మాస్' అనే వ్యాధితో బాధపడుతోందని, మెరుగైన వైద్య సహాయం అందించడానికి కృషి చేస్తామని డాక్టర్ వరప్రసాద్ చెప్పారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద పత్తి రామలక్ష్మి



వెలగపూడిలోని ఏపీ సచివాలయం ప్రాంగణంలో చెట్టు ఆకారంలో ఏర్పాటుచేసిన సౌరవిద్యుత్ ఫలకలు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ సౌర విద్యుత్ చెట్టు ఉద్యోగులు, సందర్శకులను అలరిస్తోంది.

19కు చేరిన అతిసార మృతుల సంఖ్య

- గుంటూరులో సంచార చికిత్స కేంద్రాలు
- ముగ్గురు అదనపు సంచాలకుల పర్యటన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కలుషిత నీటి కారణంగా అతిసార వ్యాధితో మృతిచెందిన వారి సంఖ్య సోమవారం 19కి చేరింది. నగరంలోని అల్లీనగర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్(52)ను సోమవారం మధ్యాహ్నం జీజీహెచ్ అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. మూడు రోజులుగా వాంతులు, విరేచనాలు అవుతున్నాయని వైద్యులకు వివరించారు. వార్డులో చేరిన గంటలోనే షేక్ మృతిచెందాడు. అతనికి ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయని వైద్యులు చెప్పారు. జీజీహెచ్‌లో వివిధ వార్డుల్లో 34మంది చికిత్స పొందుతున్నారు. పొరుగు రోగుల విభాగానికి ఆరుగురు వచ్చారు. రమేష్ ఆసుపత్రుల్లో మొత్తం 13మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురికి వెంటిలేటర్ సాయంతో కృత్రిమశ్వాస అందిస్తున్నారు. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పారు.

సంచార క్లినిక్కులు...: నగరంలో కలుషిత నీరు సరఫరా అయిన ప్రాంతాల్లో మంగళవారం నుంచి సంచార అతిసార చికిత్స కేంద్రాలను నడపనున్నారు. నల్లచెర్వు, డీఎస్‌నగర్, పొత్తూరివారితోట, మంగళదాస్‌నగర్, సంగడిగుంట, ఐపీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ వాహనాలు అందుబాటులోలా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి తక్షణమే ప్రాథమిక చికిత్స ఇక్కడ లభించనుంది. మెప్మా సిబ్బంది సాయంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు.

అవగాహనపై ప్రత్యేక దృష్టి: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఆదేశాల మేరకు ముగ్గురు అదనపు సంచాలకులు గీతాప్రసాదిని, నీరద, షాలినీదేవి సోమవారం గుంటూరు చేరుకున్నారు. వీరు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని వేడివేడిగా తినాలని, ఇళ్లలో నీటిని కాచి తాగటం ముఖ్యమని జాగ్రత్తలు చెప్పారు.

చంద్రబాబు పాలనలో ఎవ్వరూ సంతోషంగా లేరు

- ప్రజాసంకల్ప పాదయాత్ర సభలో జగన్

ఈనాడు డిజిటల్, గుంటూరు: నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్రం అవినీతిమయంగా తయారైందని, రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి ఇపుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. జగన్ ప్రజాసంకల్ప యాత్ర సోమవారం గుంటూరులోని కాకుమాను, పెదనందిపాడులో జరిగింది. ఈ సందర్భంగా పెదనందిపాడు సభలో జగన్ మాట్లాడారు. రైతు, డ్వాక్రా రుణమాఫీ చేయకుండా చంద్రబాబు ఆటలాడుతున్నారన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఉందని, ముడిచమురు ధరలు, సిమెంట్ ధరలు తగ్గినా గుత్తేదారులకు రేట్లు పెంచడం వెనక మతలబు ఏమిటో అర్థం కాలేదన్నారు. ప్రతిగ్రామంలోనూ మద్యం దుకాణాలు వెలిసేలా చేశారన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయని చెప్పి, ప్రస్తుతం రెండింతల ఛార్జీలతో నడ్డి విరుస్తున్నారన్నారు. వృద్ధులకు 60సంవత్సరాల వయసు నుంచి, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన మహిళలకు 45ఏళ్ల నుంచే రూ.2వేలు పింఛను అందజేస్తానని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక నవ్యాంధ్రలో 25 లక్షల ఇళ్లు నిర్మించి మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా కోరుతూ వైకాపా నాయకులు కొమ్మూరులో ఏర్పాటుచేసిన మానవహారంలో జగన్ పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన తెదేపా నాయకుడు జ్యోతుల చంటిబాబు జగన్ సమక్షంలో వైకాపాలో చేరారు. యానాదుల సంక్షేమ సంఘం ప్రతినిధులు జగన్‌ను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. వారికి కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఎమ్మెల్సీ సీటు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేటు ఆసుపత్రుల నర్సింగ్ ఉద్యోగులు కలిసి పక్క రాష్ట్రాల్లో మాదిరి తమకూ కనీస వేతనాలు ఇప్పించాలని కోరారు. వైకాపా నాయకులు ముస్తఫా, రామకృష్ణారెడ్డి, రావి వెంకటరమణ, సుచరిత తదితరులు పాల్గొన్నారు.



పెదనందిపాడు బస్టాండ్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్

కెనడాలో ఉద్యోగాల పేరుతో టోకరా

- కోటి వసూలు చేసి చేతులెత్తేసిన సంస్థ
- గుంటూరు అర్బన్ ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

గుంటూరు, న్యూస్‌టుడే: కెనడాలో ఉద్యోగాలంటూ ఓ కన్సల్టెంట్ సంస్థ నిరుద్యోగులను మోసం చేసింది. కోటి వరకూ వసూలు చేసి బోర్డు తిప్పేసింది. బాధితులంతా కలిసి నిలదీయడంతో.. వారు చెల్లించిన దానిలో 20 శాతం తిరిగి ఇచ్చింది. సర్టిఫికెట్లతో పాటు మిగతా మొత్తాన్ని ఇవ్వకుండా సదరు సంస్థ నిర్వాహకుడు తాను మాజీ గవర్నర్ మనవడినని, తనకు రాజకీయంగా పలుకుబడి ఉందని తననేమీ చేయలేరని బెదిరించాడని బాధితులు వాపోయారు. గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 11 మంది బాధితులు అర్బన్ ఎస్పీ విజయరావుకు దీనిపై ఫిర్యాదు చేశారు. మరో రెండు బ్యాచ్‌లలో 25 మంది బాధితులు ఉన్నారని వివరించారు. స్పందించిన ఎస్పీ ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించారు.

గుంటూరు నగరం బ్రాడీపేటలో ఓ ప్రయివేట్ కన్సల్టెంట్ సంస్థ విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ బోర్డు పెట్టింది. ఆసక్తితో సంప్రదించిన వారికి.. 'కెనడాలో నెలకు రూ.1.50 లక్షల వేతనంతో ఉద్యోగాలు ఉన్నాయి. వీసా, పాస్‌పోర్టు అన్ని మేమే చూసుకుంటాం. ఒక్కో పోస్టుకు స్థాయిని బట్టి రూ.3.50 లక్షల నుంచి 5 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. తొలుత రూ.1.35 లక్షలు చెల్లిస్తే దరఖాస్తు పనులు ప్రారంభిస్తాం' అంటూ నమ్మించారు. తర్వాత కెనడా నుంచి ఇమ్మిగ్రేషన్ పత్రాలు వచ్చాయని చెప్పి మిగిలిన డబ్బులు తీసుకున్నారు. మరో వారం రోజుల్లో కెనడా వెళ్లడమే తరువాయి అంటూ నకిలీ కాల్‌లెటర్లు చేతికిచ్చారు. తర్వాత ఇంకా పిలుపు రాలేదంటూ కాలం వెళ్లదీస్తూ వచ్చారు. చివరకు మోసపోయామని తెలుసుకున్న నిరుద్యోగులు తల్లిదండ్రులతో కలిసి సదరు కార్యాలయానికి వెళ్లి నిలదీశారు. దీంతో ఒక్కొక్కరికి తాము కట్టిన దానిలో 20 శాతం ఇచ్చిన నిర్వాహకుడు, మిగిలిన డబ్బులు, ధ్రువపత్రాలు ఇవ్వడంలేదని, ఓ మాజీ గవర్నర్ మనవడినంటూ తమనే బెదిరిస్తున్నాడని బాధితులు ఆరోపించారు. బాధితుల్లో ఇద్దరు పోలీసు ఉద్యోగుల కుమారులు కూడా ఉండడం గమనార్హం.

రెండుమూడు రోజుల్లో సమాచార కమిషనర్ల పేర్లు ప్రకటన

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్, ముగ్గురు కమిషనర్ల ఎంపిక కొలిక్కి వచ్చింది. రెండు మూడురోజుల్లో వారి పేర్లు ప్రకటించే అవకాశం ఉంది. కమిషనర్ల ఎంపిక కోసం ఏర్పాటైన కమిటీ సోమవారం రాత్రి పొద్దుపోయాక సచివాలయంలో సమావేశమైంది. సీఎం చంద్రబాబు, ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు పాల్గొన్నారు. ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి రాలేదు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తమకు అందిన 300 దరఖాస్తులను పరిశీలించారు.

కేశవరెడ్డి విద్యాసంస్థ చరాస్తుల జప్తు

ఈనాడు, అమరావతి: కేశవరెడ్డి విద్యాసంస్థలకు సంబంధించిన పలు చరాస్తులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జప్తు చేసింది. ఈ సంస్థకు సంబంధించిన 102 బస్సులను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనూరాధ ఉత్తర్వులు జారీ చేశారు.

యాదాద్రి థర్మల్‌ప్లాంటుకు 182 మంది ఏపీజెన్‌కో ఉద్యోగులు

దామరచర్ల, న్యూస్‌టుడే: ఉమ్మడి రాష్ట్రంలో పనిచేసిన ఏపీ జెన్‌కో ఉద్యోగులు 182 మంది సోమవారం యాదాద్రి థర్మల్ ప్లాంటులో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కోర్టు ఆదేశాల మేరకు వీరిని యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంటుకు ఎటాచ్ చేశారు. వీరంతా సోమవారం దామరచర్లలోని ఎస్‌ఈ కార్యాలయంలో టీజెన్‌కో సీఈ సమ్మయ్య, ఎస్‌ఈ రామకృష్ణారెడ్డి సమక్షంలో విధుల్లో చేరారు. బాధ్యతలు చేపట్టిన వారిలో ఈఈ, డీఈఈ, ఏఈలతో పాటు కింది స్థాయి సిబ్బంది ఉన్నారు.

ఈనాడు

కాంగ్రెస్‌లో రణోత్సాహం

రానున్న సార్వత్రిక సమరానికి కురుపాండవ కురుక్షేత్రంగా సరిపోల్చి, అధికార దురహంకారానికి సత్యసంధతకు జరిగే పోరుగా దాన్ని ప్రస్తావించి కార్యవర్గశ్రేణుల్లో కొత్త ఉత్తేజం నింపే మహా క్రతువుగా కాంగ్రెస్ 84వ ప్లీనరీ ముగిసిపోయింది. అయిదేళ్లకోసారి పార్టీ పథగమనాన్ని నిర్దేశించే ప్లీనరీ అయిదోతరం నేతగా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ అజమాయిషీలో జరగడం ఇదే తొలిసారి! వరస పరాజయాలతో నిస్పృహలో కూరుకున్న పార్టీలో నవోత్తేజం రగిలించి, త్వరలో జరగనున్న కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2019 సార్వత్రిక ఎలెక్షన్లకూ సన్నద్ధం చెయ్యడం, భాజపాకు సరైన ప్రత్యామ్నాయాన్ని సంసిద్ధం చెయ్యడం తక్షణ లక్ష్యాలుగా సాగిన ప్లీనరీ- నషాళానికి అంటే రాజకీయ మసాలాను గట్టిగానే నూరింది. 2014 ఎన్నికల్లో మోదీ సారథ్యంలోని భాజపా నోట మోతెక్కిపోయిన 'అచ్ఛేదిన్' నినాదానికి 'వక్త్ హై బదల్ కా' (మార్పునకు సమయం ఇదే) అంటూ ఎన్డీఏ నాలుగేళ్ల పాలన వైఫల్యాలను హస్తం పార్టీ నిగ్గదీసింది. భాజపా-ఆర్ఎస్ఎస్‌లను ఓడించడానికి అన్ని భావసారూప్య పక్షాలతో కలిసి నడిచే వాస్తవిక దృక్పథంతో ముందడుగేయనున్నట్లు, అందునిమిత్తం కనీస ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు కాంగ్రెస్ రాజకీయ తీర్మానం చాటుతోంది. సంకీర్ణాల శకంలో మడి కట్టుకు కూర్చుంటే మునిగిపోతామన్న ప్రాప్తకాలజ్ఞత రహించగా భావసారూప్య సిద్ధాంతానికి లోగడ పాచ్‌మఢీ సదస్సులో సోనియా కాంగ్రెస్ తెరతీసింది. సొంతంగా గట్టెక్కే అవకాశం వట్టిదేనన్న నిజం కళ్లకు కడుతున్నప్పుడు- భాజపా వ్యతిరేక వేదికను కాంగ్రెస్ ఏయే సైద్ధాంతిక ప్రాతిపదికల మీద కొత్తగా నిర్మిస్తుందో చూడాలి. ప్రజాతీర్పును తారుమారు చేసేలా ఈవీఎమ్‌ల దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉందంటూ బ్యాలెట్ పత్రాలకే హస్తం పార్టీ ఓటేస్తోంది. ఏక కాల ఎన్నికలు వద్దంటూ హేతుబద్ధంగా స్పందించిన కాంగ్రెస్- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని గట్టిగా తీర్మానించింది. ఇంతదాకా వేదిక మీద వయసుడిగిన నేతల సమారోహంగా కనిపించిన ప్లీనరీ- యువమంత్రం నవతంత్రం జావళీగా జరగడం ఈసారి విశేషమే మరి!

రాజకీయ, ఆర్థిక, విదేశీ వ్యవహారాలతో పాటు వ్యవసాయం, ఉద్యోగిత, పేదరిక నిర్మూలనలపై మొత్తం నాలుగు తీర్మానాల్ని కాంగ్రెస్ ప్లీనరీ ఆమోదించింది. వచ్చే ఎన్నికలకు ప్రణాళిక పత్రాల్లా తీర్మానాలు ఉండరాదని మొదట్లో అనుకొన్నా- అంతిమంగా అవి అలాగే రూపుదిద్దాల్చాయి. జాతి నిర్మాతలు కలలుగన్న భారతావనిని పునరావిష్కరించడం కేవలం పునరుత్తేజిత కాంగ్రెస్ వల్లనే సాధ్యపడుతుందన్న స్వోత్కర్షలు, భాజపా పాలనలో అన్ని వర్గాలవారూ వంచనకు గురయ్యారన్న పరనిందలూ రాజకీయ తీర్మానంలో విస్తృతంగా పరచుకొన్నాయి. పార్టీ ఫిరాయింపుదారుల్ని ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చెయ్యకుండా నిషేధించాలంటున్న కాంగ్రెస్- చట్టసభల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్ల బిల్లుకు వచ్చే ఎలెక్షన్లలోగా మోక్షం దక్కించాలని డిమాండ్ చేసింది. 2004-'14 మధ్య పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు 'ఏకాభిప్రాయ ఏకతారా' వినిపించి మహిళా రిజర్వేషన్లను అటకెక్కించిన పార్టీ, ఇప్పుడీ కొత్తరాగం ఆలపిస్తోంది. 'విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో సమస్యల్ని పరిష్కరించకుండా ఈ నాలుగేళ్లలో ఏం చేశారో చెప్పండి?' అని కేంద్రాన్ని గట్టిగా నిలదీసిన కాంగ్రెస్ పార్టీ- అంతకుముందు దశాబ్దకాలం పాటు వాటిని నిర్లక్ష్యం చేసిన నేరంలో ముద్దాయి! గ్రామీణ ఉపాధి హామీలో సగటు రాబడిని రూ.7,200 నుంచి రూ.18 వేలకు పెంచుతామని, వ్యవసాయ రుణాలు రద్దుచేసి, రెండు హెక్టార్లలోపు వారందరికీ వడ్డీరహిత రుణాలిస్తామని ప్లీనరీ ద్వారా కాంగ్రెస్ వాగ్దాన ధార కురిపిస్తోంది. పురోగామి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, సమాఖ్య నిధుల పంపిణీ ద్వారా రాష్ట్రాలను బలోపేతం చేసే సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టాలన్న కీలకాంశంపై ప్లీనరీ మూగనోము పట్టడం ఏమిటి?

'ఇప్పటిదాకా ప్రపంచం ముందు అమెరికా చైనాల దార్శనికతలే ఉన్నాయి... పదేళ్లలో వాటి సరసన భారత్ దార్శనికతా చేర్చాలన్న' రాహుల్ గాంధీ కోరిక వంక పెట్టలేనిది. ప్రజలే ప్రభువులైన ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలకు దార్శనికంగా గొడుగు పట్టి కాలానుగుణ స్వీయ సంస్కరణలతో రాణించే పార్టీలే జనాదరణ చూరగొంటాయి. 'కాంగ్రెస్ ఈ దేశ ప్రజల వాణి' అని ఘంటాపథంగా చెబుతున్న రాహుల్- పార్టీలో అంతర్గత లోటుపాట్లపై మొదట కార్యవర్గ శ్రేణుల వాణి వినాలి! సీనియర్లు, యువత జోడెడ్లుగా పార్టీకి కొత్త దిశ నిర్దేశిస్తామంటున్న రాహుల్- తనకు కార్యకర్తలకు మధ్య అడ్డుగోడల్ని కూల్చేస్తానని ప్రకటించారు. అధికారం, రాజకీయ పలుకుబడితో అవినీతికి పాల్పడే నిస్వార్థ కార్యకర్తలపై యథేచ్ఛగా స్వారీ చేస్తూ పార్టీని ప్రజలకు దూరం చేసిన నిక్షేపరాయుళ్లపై కాంగ్రెస్ శతసంవత్సర వేళ అప్పటి అధ్యక్షుడిగా రాజీవ్ గాంధీ నిప్పులు చెరిగారు. ముఠాల సంస్కృతిని, ముఖప్రీతి రాజకీయాల్ని ఖండించి అట్టడుగుస్థాయి కార్యకర్తలకు గౌరవప్రద స్థానం కల్పిస్తామని రెండు దశాబ్దాల క్రితం సోనియా సైతం సంకల్పం చెప్పుకొన్నారు. దశాబ్దాలుగా ఆచరణకు రాని ఆ సదాశయాలే రాహుల్ గాంధీ నోటా చెవిన పడుతున్నాయిప్పుడు! అత్యున్నత నిర్ణయాధికార వేదికైన సీడబ్ల్యూసీలో సగం మంది సభ్యపదవులకు ఎన్నికలు జరపాలని పార్టీ నిబంధనావళి చాటుతున్నా నామినేషన్ల ద్వారా వాటి భర్తీ బాధ్యతలను రాహుల్‌కే ప్లీనరీ అప్పగించింది. ఎకాయెకి 65 శాతం యువజన సంద్రంతో పోటెత్తుతున్న భారతావని అభివృద్ధి కాంక్షలకు దీటుగా కాంగ్రెస్ స్వీయ మార్పునకు సంసిద్ధం కావాల్సిన సమయమిది!

చీడపీడలకు మరింత చేవ?

పంటల సాగులో ఉత్పత్తి పెంచడానికి మేలైన విత్తనంతోపాటు సమర్థ యాజమాన్య పద్ధతులు అవసరం. వాటిని సరిగ్గా అమలుచేస్తేనే సత్ఫలితాలు దక్కుతాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన క్రిమిసంహారకాల ముసాయిదా బిల్లు ఆ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. ఉత్పత్తి పెరగాలంటే క్రిమిసంహారకాలను అధికంగా వాడాలని అది చెబుతోంది. క్రిమిసంహారకాల వినియోగాన్ని తగ్గించేలా బిల్లు ఉండాలి తప్ప, వాటి తయారీదారులను ప్రోత్సహించేలా ఉండరాదు. పాతకాలం చట్టాలను మార్చాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయం స్వాగతించదగినదే అయినా, వాస్తవికతకు భిన్నంగా రైతులకు మేలుచేసే అంశాలను ప్రతిపాదిత బిల్లులో విస్మరించారు. నాసిరకం ఉత్పత్తులను నియంత్రించేలా బిల్లులో నిబంధనలను పొందుపరచకపోవడం శోచనీయం!

మొక్కుబడి తంతు

క్రిమిసంహారకాల చట్టంలో మార్పులు తెస్తూ గత సంవత్సరాంతంలో 'పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు-2017' ముసాయిదాను కేంద్రం రూపొందించింది. నిపుణుల నుంచి అభిప్రాయాలను కోరుతూ దాన్ని విడుదల చేసింది. 'ఇన్‌సెక్టిసైడ్స్ యాక్ట్(1968), ఇన్‌సెక్టిసైడ్స్ రూల్స్(1971)' తరవాత ఆ వరసలో దేశంలో కొత్త చట్టం రాలేదు. పురుగుమందుల తయారీ, విక్రయాలు, ఎగుమతి, దిగుమతి, పంపిణీ, వినియోగం, రవాణా తదితర అన్ని అంశాల విషయంలో కేంద్ర క్రిమిసంహారకాల బోర్డు అనుమతి తప్పనిసరి. ఈ అంశాలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలను ముసాయిదాలో కేంద్రం పేర్కొనలేదు. 2008లో రూపొందించిన ఒక ముసాయిదాను రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో అది చట్టరూపం దాల్చకుండా ఆగిపోయింది. అందులోని అంశాలనే దాదాపుగా తాజా ముసాయిదాలోనూ పొందుపరచారు. మారిన పరిస్థితులు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, చట్టాల్లోని లొసుగుల్ని అడ్డుపెట్టుకొని మోసగిస్తున్న కంపెనీలకు అడ్డుకట్ట వేసేలా చట్టాన్ని రూపొందించాల్సిన ప్రభుత్వం, మొక్కుబడిగా వ్యవహరించడం ఆవేదన కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సాగు విధానాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా సురక్షిత ఆహారం దిశగా ప్రపంచం ముందడుగు వేస్తోంది. పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఉత్పత్తుల తయారీకి అత్యధిక ప్రాధాన్యం లభిస్తోంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) సైతం వ్యవసాయోత్పత్తుల విషయంలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించేలా 'కోడెక్స్ నిబంధన'లను అమలుచేయాలని అన్ని దేశాలనూ కోరుతోంది. సంపన్న దేశాలు ఈ విషయంలో ముందున్నాయి. సాంకేతికతను ఇంకా అందిపుచ్చుకోని పలు వర్ధమాన దేశాలు వ్యవధిని కోరుతున్నాయి. దీన్ని సాకుగా చూపిస్తూ పలు సంపన్న దేశాలు, విష రసాయనాలు పరిమితికి మించి ఉంటున్నాయంటూ పేదదేశాల వ్యవసాయోత్పత్తులను తిరస్కరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో దేశంలో విచ్చలవిడిగా రసాయనాల వాడకాన్ని నియంత్రించాల్సిన క్రిమిసంహారకాల అనుమతుల బోర్డు, అడ్డగోలుగా వీటి తయారీ సంస్థలకు అనుమతులు ఇస్తోందన్న విమర్శలున్నాయి. అధిక విష తీవ్రత ఉన్న పురుగుమందులను గుర్తించి నియంత్రించకపోవడం వల్ల దేశంలో వీటి ప్రభావానికిలోనై ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఝార్ఖండ్‌లోని రాంచీ సమీపంలో బెరో బ్లాక్‌లో కూరగాయలు అధికంగా పండిస్తారు. నిరుడు అక్కడ క్రిమిసంహారకాల వాడకంపై అధ్యయనం నిర్వహించారు. డీలర్లు ఏది ఇస్తే అది కొని వాడటమే తప్ప, తమకు ఏ మందులు ఎందుకు వాడాలనే విషయం తెలియదని అక్కడి రైతులు చెప్పడాన్నిబట్టి- మందుల పిచికారీలో వారికున్న అవగాహనను అర్థం చేసుకోవచ్చు. ఆ మందులేవీ స్థానికంగా వేస్తున్న పంటలకు సిఫార్సు చేసినవి కావని అధ్యయనంలో తేలింది. గతంలో కేరళలో ఎండోసల్ఫాన్ వాడకంవల్ల సంభవించిన మరణాలు, ఆంధ్రప్రదేశ్‌లో పత్తి రైతుల ఆత్మహత్యల పరంపర, నేటి గులాబీ రంగు పురుగు చేసిన నష్టాల వరకు... క్రిమిసంహారకాల విచ్చలవిడి వాడకానికి తిరుగులేని దృష్టాంతాలు ఎన్నెన్నో. మద్దతు ధరలు నిర్ణయించే విషయంలో కేంద్రం ఏ తప్పయితే చేస్తుందో, అదే తప్పు తాజాగా క్రిమిసంహారకాల విషయంలోనూ అనుసరిస్తుండటం రైతుల్ని ఆందోళన పరుస్తోంది.

దేశంలోని అన్ని రాష్ట్రాల నేలల స్థితిగతులు, వాతావరణ పరిస్థితులు ఒకేలా ఉండవు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జీవ వైవిధ్యానికి తగ్గట్లు పంటలసాగు ఉంటుంది. ఆ మేరకు మందుల తయారీ, విక్రయం, పంపిణీ లైసెన్సులను అనుమతించాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా కేంద్రస్థాయిలో ఏకపక్షంగా దేశం మొత్తానికీ అనుమతులిచ్చేస్తుండటం సమస్యలకు దారితీస్తోంది. దేశంలోని పురుగు మందుల కంపెనీలు, బహుళజాతి సంస్థలు రాష్ట్రాల వారీగా అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది. అందుకు బదులుగా పురుగుమందుల కంపెనీలవారు నేరుగా కేంద్రాన్ని సంప్రతించి అనుమతులు తెచ్చుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా నిషేధించిన ఎన్నో రకాల పురుగు మందుల్ని మనదేశంలో ఇష్టానుసారం వాడేస్తున్నారు. తాజా ముసాయిదా బిల్లును పంజాబ్ సహా ఏడెనిమిది రాష్ట్రాలు అధికారికంగా ఇప్పటికే వ్యతిరేకించాయి. పురుగు మందుల్లో విషప్రభావం, పరిమితికి మించిన వాటి గాఢతను పట్టించుకోకపోవడం, తయారీ వినియోగాలపై గట్టి నియంత్రణలు లేకపోవడాన్ని దేశవ్యాప్తంగా రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తప్పుపట్టాయి. ఈ ముసాయిదా బిల్లులో సమగ్రత లోపించిందన్నది వాటన్నింటి ఉమ్మడి మాట.

లోపాలపుట్టగా క్రిమిసంహారకాల ముసాయిదా బిల్లు



- ■ అధిక వినియోగానికి అనుచిత ప్రోత్సాహం
- ■ తిరస్కరించిన అంశాలకే తిరిగి చోటు
- ■ కాలానుగుణ మార్పులు కరవు
- ■ తయారీ సంస్థలకు అనుకూలం
- ■ రైతు శ్రేయానికి భంగకరం

మోనోక్రోటోఫాస్‌ను అత్యంత ప్రమాదకర విషరసాయనంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించినా దేశంలో దాన్ని నిషేధించకుండా కేవలం కొన్నిపరిమితులు మాత్రమే విధించారు. 2015-16లో తీవ్ర విషపూరితమైనవిగా డబ్ల్యూహెచ్ఓ వ్యవసాయ ఆహారసంస్థ (ఎఫ్ఏఓ)లు ధ్రువీకరించిన 18 రకాల రసాయనాలను దేశంలో నేటికీ విచ్చలవిడిగా వాడుతున్నారు. క్రిమిసంహారకాల మోతాదులు, వాటి గడువు తేదీలు, వాడకంపై రైతుల్లో అవగాహన పెంపొందించడంలో కేంద్ర ఇన్‌సెక్టిసైడ్స్ బోర్డు సహా సంబంధిత శాఖలన్నీ విఫలమయ్యాయి. నేటికీ దేశంలో పురుగుమందులు చల్లేటప్పుడు అధికశాతం రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంలేదు. ఏ మందుల్ని ఏయే పంటలకు వాడాలన్న విషయంలోనూ ప్రభుత్వశాఖలు ఒకేతరహా సూచనలు ఇవ్వడంలేదు. మొక్కల ఆరోగ్య యాజమాన్యంపై జాతీయ పరిశోధన సంస్థ (ఎన్ఐపీహెచ్ఎం) సూచనలకు కేంద్ర ఇన్‌సెక్టిసైడ్స్ బోర్డు (సీఐబీఆర్‌ఈ) సిఫార్సులకు పొంతన కుదరడం లేదు. ఉదాహరణకు ఎన్ఐపీహెచ్ఎం వెబ్‌సైట్‌లో మిరపలో కాయతొలుచు పురుగు నివారణకు అసిఫేట్ వాడకాన్ని సిఫార్సు చేస్తే, సీఐబీఆర్‌ఈ దాన్ని ధ్రువీకరించలేదు. మిరపలో పూత పురుగు నివారణకు అసిఫేట్ 75 ఎస్.పి.ని సిఫార్సు చేస్తే, వాస్తవానికి సీఐబీఆర్‌ఈ ఈ మందును పత్తి, పొద్దుతిరుగుడు, వరి పంటలకు మాత్రమే వాడాలని అంటోంది. దేశీయంగా అనుమతి పొందిన క్రిమిసంహారకాల వాడకం విషయంలో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ప్రభుత్వపరంగా ఒక శాస్త్రీయ ఏకాభిప్రాయం కనిపించడలేదు. మరోవైపు పురుగు మందులను విచ్చలవిడిగా వాడటంవల్ల పలు పంటల్లో చీడపీడలు తాత్కాలికంగా నివారణ అయినా, తరవాత అవి ఆ మందుల్ని తట్టుకునే శక్తిని సమకూర్చుకుంటున్నాయి. అంతకంటే గాఢత ఉన్న మందుల్ని రూపొందిస్తున్న సంస్థలు వాటిని రైతులతో వాడిస్తుండటంతో ప్రజారోగ్యానికి పెనుప్రమాదం వాటిల్లుతోంది. బీటీ పత్తి ఇందుకు ఉదాహరణ. గులాబీరంగు కాయతొలుచు పురుగును నివారిస్తుందని దేశంలో 95 శాతం బీటీ పత్తి సాగుచేసిన రైతులు గత సీజన్‌లో ఆ పురుగు తాకిడికి వేలకోట్ల రూపాయల విలువైన పంటను నష్టపోవాల్సి వచ్చింది.

భారత్‌లో క్రిమిసంహారకాల వాడకం

క్రిమిసంహారకం	నిషేధించిన దేశాల సంఖ్య	భారత్‌లో 2015-16 వాడిన మొత్తం (టన్నులు)
మోనోక్రోటోఫాస్	60	371
ట్రైజోఫాస్	40	315
మిథైల్ పెరాథియాన్	59	674
కార్బోఫ్యూరాన్	49	337
పాస్ఫామిడాన్	49	90
ఫొరేట్ గుళికలు	37	455

ఆధారం: డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారెంటైన్ అండ్ స్టోరేజి

ప్రమాదంలో ప్రజారోగ్యం

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఉత్పత్తిని పెంచేలా పరిశోధనలు సాగించకుండా మందుల్ని విచ్చలవిడిగా వాడాలని ముసాయిదాలో చెప్పడమేమిటని రైతుసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ముసాయిదా బిల్లు ప్రకారం దేశంలో నకిలీ, నాసిరకం బ్రాండ్ల పేరుతో క్రిమిసంహారకాల ఉత్పత్తి, విక్రయం, ఎగుమతి, దిగుమతి, పంపిణీ నిర్వహిస్తే చట్టప్రకారం లక్ష నుంచి అయిదు లక్షల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు. గరిష్ఠంగా రెండేళ్ల వరకు జైలుశిక్ష లేదా రెండు దండనలూ విధించవచ్చు. విష కారకాల తీవ్రత, వాటి వాడకం, తయారీలపై నియంత్రణలు కఠినంగా విధించకుండా శిక్షల గురించి మాత్రమే ప్రస్తావించారు. క్రిమిసంహారకాల ఉత్పత్తికి ముందు నిర్వహించే పరీక్షల గురించి అసలు వివరించలేదు. వీటి గురించి బోర్డుకు ముందస్తు సమాచారం ఇవ్వడం, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా షరతులు విధించడం వంటివి ముసాయిదాలో చేర్చాలి. రాష్ట్రస్థాయిలో కమిటీల ఏర్పాటు, జిల్లాస్థాయిలో పరిహారం చెల్లించేలా బృందాల గురించి ప్రస్తావనా లేదు. ప్యాకింగ్, వివరాల ముద్రణ, కల్తీ, అనుమతులు, శుద్ధి ప్రక్రియల గురించి ఎటువంటి అంశాలనూ ముసాయిదాలో పేర్కొనలేదు. నాణ్యతా నియంత్రణకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటుచేయాల్సి ఉన్నా అదీ లేదు. క్రిమిసంహారకాల యాజమాన్యం చర్చల్లో పై రాష్ట్రాల అభిప్రాయలకు బిల్లులో చోటివ్వలేదు. క్రిమిసంహారకాల బోర్డులో, వాటి నమోదు కమిటీలో రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని స్వచ్ఛంద సంస్థలు తప్పుపడుతున్నాయి. కొన్ని సంస్థలు బిల్లుకు సవరణలు సూచించాయి. మందుల గురించి విస్తృత ప్రచారం చేసే సంస్థలపై కఠిన చర్యలను ముసాయిదాలో చేర్చాలని అవి పట్టుబడుతున్నాయి. తీవ్ర విషపూరితంగా గుర్తించిన ఉత్పత్తుల నమోదును అడ్డుకోవాలి. ప్రజారోగ్యానికి, జంతువులు, పర్యావరణానికి హానికరమని గుర్తిస్తే వాటి గుర్తింపును రద్దుచేసే అధికారం బోర్డుకు ఉండాలి. మందుల వాడకం కేసులను నెలరోజుల్లో పరిష్కరించాలి. అందుకు జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలి. కల్తీ మందులు, నకిలీ బ్రాండ్లను గుర్తించి నిరోధించడంలో నిఘా యంత్రాంగం సమర్థంగా ఉండటం, నేరాలకు పాల్పడితే భారీ జరిమానా, జైలు శిక్షలు విధించడంతోపాటు వారి లైసెన్సును శాశ్వతంగా రద్దుచేయాలి. దీన్ని దృష్టిలో ఉంచుకుని లైసెన్సులు ఇవ్వడానికి రిజిస్ట్రేషన్ కమిటీ తరహాలో రాష్ట్రస్థాయిలోనూ ఒక బోర్డు ఏర్పరచాలి. రిజిస్ట్రేషన్ కమిటీ నిర్ణయాలను సమీక్షించే అధికారం బోర్డుకు ఉండాలి. కట్టుదిట్టమైన చర్యలతోనే అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశముంది. ప్రజారోగ్యంతో ముడివడిన క్రిమిసంహారకాల అనుమతి విషయంలో కఠిన వైఖరి లేకపోతే తీవ్ర అనర్థాలకు ప్రభుత్వమే తావిచ్చినట్లవుతుంది. అందువల్లే ముసాయిదా బిల్లును పటిష్ఠంగా క్రోడీకరించి దాన్ని సత్వరం చట్టంగా రూపొందించడం ఎంతో ముఖ్యం!

– అమిర్నేని హరికృష్ణ

కట్టుకథలే పెట్టుబడి!

అన్నింటికీ మూలం- కచ్చితత్వం. అది లేనప్పుడు, తప్పుడు సమాచారం పుట్టుకొస్తుంది. అది కొన్నిసార్లు వినోదం పంచుతుంది. ఒక్కోసారి ప్రమాదకరంగా మారుతుంది. సంచలనం సృష్టించాలని ఆ వార్త లేదా సమాచారానికి రంగులు పులిమితే, ఎన్నో అనర్థాలే దాపురిస్తాయి. ఇటీవలి కాలంలో దీనికి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. దేశంలో గల సమాచార సాధనాలు అనేకం, అసంఖ్యాకం. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు- అందులోనూ ఎలక్ట్రానిక్ మీడియా, మొబైల్ ఫోన్లలో పలు వార్తలు/ సమాచారాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాటి విచ్చలవిడితనం ఎంతగా వ్యాపించిపోయిందంటే- ఏది నిజమో తెలిసేందుకు, తేల్చుకునేందుకు ఎంతో శ్రమించాల్సి వస్తోంది.

విలువలకు తిలోదకాలు

'తెలుసుకోవాలి' అని జనం అనుకున్నదే వార్త. దాన్ని తెలియజెప్పడంలో ఏ మాధ్యమాలైనా ప్రాథమిక సూత్రాలు పాటించాలి. పనిగట్టుకొని నిజాల్ని దాచకూడదు. ఇష్టానుసారం వ్యాఖ్యానించడం అసలే తగదు. వ్యక్తి, వర్గ సంబంధ దూషణలు ఎంతమాత్రం పనికిరావు. మౌలిక విలువల్ని దెబ్బతీయాలని చూడటం, సామాజిక విద్రోహమే! కొంతకాలంగా వార్త, సమాచారం, ప్రచారం అతిగా మారాయి. తప్పుడు వార్తలు, అసత్య సమాచారాలు, దుష్ప్రచారాలు ఎక్కువయ్యాయి. జనం తక్షణం చూసేలా, వారితో తప్పక చదివించేలా చేసేందుకు కొన్ని మాధ్యమాలు నానారకాల విన్యాసాలకు తెగబడుతున్నాయి. రోజుల వ్యవధిలో సాగిన అటువంటి డజను వ్యవహారాల్ని 'ఆల్టర్(నేటివ్) న్యూస్' వెల్లడించింది. వెబ్‌సైట్ల ద్వారా వెల్లువెత్తిన తప్పులతడకల సమాచారాన్ని కనిపెట్టి బహిరంగపరచే స్వతంత్ర స్థాయి దేశీయ పరిశీలక సంస్థ అది. బాలీవుడ్ నటీమణి శ్రీదేవి గత నెల దుబాయిలో తాను బసచేసిన హోటల్‌గది స్నానాల తొట్టెలో నిర్జీవంగా కనిపించారు. అందుకు సంబంధించి, పలు కథ(నా)లు పలు విధాలుగా వెలువడటం అందరికీ తెలుసు. పరిధి, పరిమితి మచ్చుకైనా కనిపించకపోవడం అంటే ఏమిటో ఆయా 'ప్రసారాలు' చూస్తే ఇట్టే బోధపడుతుంది. నియంత్రణ గురించి ఇక చెప్పేదేముంటుంది? వీక్షకులు పెరిగేకొద్దీ, ఆ తరహా వీడియోలతో కొన్ని సంస్థలు దండిగా దండుకుంటున్నాయి. క్షణాల్లో అవి కథలు కథలుగా అంతటా ప్రత్యక్షం కావడమే పెద్ద వైపరీత్యం. అత్యంత ప్రముఖ వ్యక్తులు విదేశాల్లో పర్యటించినప్పుడు చేసే వ్యాఖ్యల 'పూర్వాపరాల సమర్పణ'లోనూ పెడ పోకడలు కనిపిస్తున్నాయి.

అతి ప్రభావానికి లోనుకాకుండా తప్పించుకోవడం, ఒక దశలో సాక్షాత్తు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఈఏ)కే సాధ్యం కాలేదు. ఇజ్రాయెల్‌కు వెళ్లే ఎయిరిండియా విమానాలు మార్గమధ్యంలో సౌదీ అరేబియా వైమానిక ప్రదేశాన్ని వినియోగించుకొనేలా అనుమతి లభించిందని అప్పట్లో ఓ సమాచారం చక్కర్లు కొట్టింది. అది మొదట ఆ దేశ మాధ్యమాల్లో వెలువడి, భారత ప్రభుత్వ మంత్రిత్వశాఖ 'ఫేస్‌బుక్' ఖాతాలోనూ చోటుచేసుకుంది. అనంతరం సంబంధిత వార్తాసంస్థ ఆ 'పోస్టు'ను తొలగించింది. వెంటనే ఇక్కడి ప్రభుత్వ 'ముఖపుస్తకం'లోనూ అది మటుమాయమైంది! ధ్రువీకృతం కాని సమాచారం ఎన్ని దేశాల్లో ఎంత చేటు తెస్తుందో దీన్నిబట్టి స్పష్టమవుతోంది. కొన్నాళ్ల క్రితం 'కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సమక్షంలో ఓ ఉన్నతస్థాయి సమావేశం జరుగుతుండగానే, పార్లమెంటు సభ్యురాలు రేణుకా చౌదరి నవ్విన తీరు' అంటూ ఓ కథనం వ్యాపించింది. ఆమె నవ్వు వైనం ఆ పార్టీపెద్దలకు రుచించలేదన్నది సారాంశం. దాన్ని కొన్ని వార్తాఛానళ్లు కట్టగట్టుకొని ప్రచారం చేశాయి. చివరికి అదంతా ఓ ప్రసిద్ధ పత్రిక వ్యంగ్య రచనల్లో భాగమని తేలింది.

దేశంలో చరవాణి (మొబైల్) ప్రభంజనం అంతా ఇంతా కాదు. దాని అంతర్జాల (ఇంటర్‌నెట్) వినియోగ విస్తృతి- మంచితో పాటు చెడునీ పంచుతోంది, పెంచుతోంది. దేశంలో 2017 నాటికే 65కోట్లమంది పైగా చరవాణి వాడుతున్నారు. వారిలో దాదాపు సగంమంది విలువైన స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారని ఓ అంచనా. 2017 ముగింపు నాటికి, అంతర్జాల వినియోగదారుల సంఖ్యలో చైనా తదుపరి స్థానం ఇండియాదే. చరవాణుల వాడకంతో సామాజిక సమాచార వ్యవస్థ (సోషల్ నెట్‌వర్క్) నానాటికీ పెరుగుతూనే ఉంది. దీనితో పాటు మాధ్యమాల విస్తరణ ఆయా వాడకందారుల సంఖ్యను, స్వేచ్ఛను అపారంగా పెంచింది. ఆ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల్ని వారు ఎలా వినియోగిస్తున్నారన్నదే ప్రధానమని అంతర్జాల, చరవాణి జాతీయ సంస్థ (ఐఏఎంఏఐ) మొదటినుంచీ చెబుతున్నప్పటికీ; కొన్ని వార్తాసంస్థల అత్యుత్సాహం సమాచార విశ్వసనీయతకే భంగం కలిగిస్తోంది. సామాజిక మాధ్యమం అనేది విస్తారమైన భావప్రకటన వేదిక. అది పలు సందర్భాల్లో దుర్వినియోగమవుతోంది. గాలివార్తలు వ్యాప్తి చెందుతున్నాయి. దిగజారుడు ప్రచారాలు ఎందరెందరికో హాని కలిగిస్తున్నాయి. వార్తలకు, వదంతులకు తేడా ఉండటం లేదు. ఏది నిజమో, ఏది కల్పనో అంతుపట్టని స్థితి నెలకొంది. సామాజిక అనుసంధానం ఉండాల్సిన చోట 'శీల హననం' చొరబడుతోంది. వ్యక్తులకు, కుటుంబాలకే కాదు- సంస్థలు, సంఘాలు, శాఖలు, ఉద్యోగాలు, వృత్తులకు... కొన్ని మాధ్యమాల తీరుతెన్నులతో పెనుముప్పు ఎదురవుతోంది. బెదిరింపులు, హెచ్చరికలే వార్తాప్రసారాల్లో చొరబడుతున్నాయి. దుష్ప్రచారాల పరంపర గతంలో హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, గోవా ప్రాంతాల్ని తీవ్రంగా కలవరపరచింది. కొన్ని జాతులు, మతాలు, సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టే రాతలు, మాటలు, దృశ్యాల 'వ్యాప్తి' సాధారణ జన జీవితాలపై అవాంఛనీయ ప్రభావం చూపుతోంది. అసోం, పశ్చిమ్ బంగ రాష్ట్రాల్లో అప్పట్లో నిప్పు రాజుకుంది. పాకిస్థాన్, ఇజ్రాయెల్ దేశాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. భాష, ప్రాంతం, వర్గాలపరంగా అనూహ్య పరిణామాలు ఎదురై, తరచుగా శాంతిభద్రతల సమస్యా ఉత్పన్నమవుతోందంటే- ఆ పాపం అంతా అసంబద్ధ ప్రచారాలదే! ఒక మతంవారి పవిత్ర ప్రార్థనల మాసం సందర్భంలో మూకుమ్మడి దాడులు జరిగే అవకాశం ఉందన్న ప్రచారం ఉన్నపళంగా ఉద్రిక్తతల్ని రెచ్చగొట్టింది. పలు ప్రాంతాల సమాహారమైన బోడోలాండ్ ప్రాదేశిక జిల్లాల (బీటీఏడీ)వారికి, బెంగాలీ భాష మాట్లాడే వలసదారులకు మధ్య హింస చెలరేగింది. అందుకు అప్పట్లో కొన్ని సామాజిక మాధ్యమాలే పుణ్యం కట్టుకున్నాయి.



సామాజిక మాధ్యమాల్లో మిథ్యా కథనాలు

కట్టడి తప్పనిసరి

మనదేశంలోనే కాదు, పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోనూ తప్పుడు వార్తల చేరవేత ఎక్కువ. మరొక దేశ భాషను పాక్ సెనేట్ అధికారికంగా గుర్తించనుందని అక్కడి వార్తాసంస్థ ఒకటి ఆమధ్య పేర్కొంది. దాన్ని ఇండియాలోని వార్తాసంస్థలూ మరో ఆలోచన లేకుండా, కనీసం ధ్రువీకరించుకోకుండా యథాతథంగా జనం ముందు ఉంచాయి! అసలు విషయం ఆ తరవాత బయటపడింది. చైనాభాష కోర్సు ఒకదానికి పాక్‌లో అధికారిక హోదానిస్తూ ఆ దేశ సెనేట్ ఒక తీర్మానం ఆమోదించిందని, చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా(సీపీఈసీ)లో అది ఒక భాగమని తేలింది. ఓ వార్తను ప్రచురించేటప్పుడు, ప్రసారం చేసేటప్పుడు సంస్థలు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. అవి లోపిస్తే, ఆపై వాటికి కల్పనలూ జోడిస్తే పరిస్థితి చెయ్యి దాటిపోతుంది. అణుశక్తికి సంబంధించి పాక్, ఇజ్రాయెల్ మధ్య ప్రకటనల యుద్ధాన్నీ కొన్ని వార్తాసంస్థలే సృష్టించాయి. సిరియాకు పాకిస్థాన్ తన సేనాదళాల్ని తరలిస్తే చూస్తూ ఉండబోమని, అణుబలంతో బదులిస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరించారన్నదే ఆ వార్తాంశం. 'అణ్వాయుధాలు మీకే కాదు, మాకూ ఉన్నాయి' అని పాకిస్థాన్ రక్షణ మంత్రీ అదేస్థాయిలో స్పందించారని కథనాలు వెలువడ్డాయి. ఆఖరికి, అవన్నీ వార్తాసంస్థల కల్పితాలే తప్ప- వాస్తవాలు కావని తేలింది. సంచలనాలు సృష్టించడానికి, వాటి ద్వారా 'రేటింగ్' పెంచుకోవడానికి అలాంటి సంస్థలు దిగజారుతున్నంత కాలం- దేశాల మధ్య దౌత్య సంబంధాలూ దెబ్బతినిపోతాయి. వార్తాంశం వాస్తవాన్ని ప్రతిఫలించాలే కానీ, భావోద్వేగాల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలతో దేన్నీ మసి పూసి మారేడుకాయ చేయకూడదు. అభూత కల్పనలు సామాజిక మాధ్యమాల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తాయి!

– డాక్టర్ అరుణ్ విశ్వనాథన్

స్వేచ్ఛ-స్వచ్ఛత

శాస్త్రానికి సంబంధించిన అంశం ఏదైనా, అది సముద్రంతో సమానం. ఆ అంశాన్ని అర్థం చేసుకున్నా, అధ్యయనం చేసినా మనిషి అందులో కొంతవరకే సాధించగలడు. సంపూర్ణ అభ్యాసానికి అతడి జీవితకాలం సరిపోదు. అంతా కరతలామలకం అయిందని కొందరు అనుకుంటారు. తమను మించినవాళ్లు లేరని మిడిసిపడతారు. తాడి దన్నేవాడు ఉంటే, వాడి తలదన్నేవాడు ఉంటాడని కొంతకాలానికి తెలుసుకుంటారు. విహంగంలా ఆకాశ విహారం చేసే కాళ్లను మళ్లీ భూమిమీద ఆన్చక తప్పదు.

మనిషి విజ్ఞానానికి మొదటి సవాలు ప్రకృతి. ఎన్నో ప్రతులున్న అద్భుత పుస్తకమది. వీక్షించే, ఆలకించే మనసు ఉండాలే కాని- అన్నీ వింతలూ విడ్డూరాలే! కళ్లు విప్పార్చుకుని చూస్తూ ఆశ్చర్యపడటం తప్ప, దాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం అసాధ్యం. ప్రకృతి ముందు అందరూ పసికూనలే. ఒడిలో చేర్చుకొని లాలించే కన్నతల్లి ప్రకృతి. కన్నెర్ర చేస్తే, అది అపర కాళి. తల్లిని గౌరవించినట్లు, ప్రకృతికీ మనిషి శుశ్రూష చేయాలి. అప్పుడే అతడి మనుగడ నల్లేరు మీద బండి నడక. లేదంటే, ప్రళయ హేల!

మనిషి మనసులో ఎన్నో రకాల భావాలు నాటిన అంతర్యామి, అందులో సూదిమొనంత స్వార్థాన్నీ చేర్చాడు. ఎదుగుతున్న మానవుడు దాన్ని చీమంత ఉంచుతాడా, ఏనుగంత చేసుకుంటాడా అన్నది అతడి వ్యక్తిత్వానికే వదిలిపెట్టాడు. మానవుణ్ని బుద్ధిజీవిగా సృష్టించాడు కాబట్టి- ప్రకృతిలో అడుగడుగునా అణువణువునా తన అస్తిత్వం ఉందని, దాని పట్ల జాగ్రత్త వహించాల్సిన బాధ్యత అతడిదేనని నర్మగర్భంగా తెలియజెప్పాడు. స్వార్థం వ్యక్తిగతమే అయితే, అది అతడికి చెరుపు చేస్తుంది. సామాజికం అయితే, మొత్తం సమాజమే అతలాకుతలం అవుతుంది. దాని దుష్ప్రభావం ప్రకృతి మీదా పడుతుంది. ఒకరు పాలిథీన్ సంచిలో సరకులు తెచ్చుకుంటారు. బయట పడేసిన ఆ సంచిని ఆవు తిని, జీర్ణం కాక సతమతమవుతుంది. దాని బాధను అతడు చూడలేకపోవచ్చు. జీవహింసకు కారణం మాత్రం ఆ మనిషే!

ఉద్యోగాలు కల్పించి పొట్ట నింపే పారిశ్రామిక సంస్థ- వ్యర్థ పదార్థాల్ని కలుషిత నీరు, వాయువు రూపాల్లో వెలుపలికి వదులుతుంది. పరిసర ప్రాంతాల్ని విషతుల్యం చేస్తుంది. జీవ సమతుల్యతను దెబ్బతీస్తుంది. తోటమాలి రక్షణలో ఉన్న మొక్క చక్కని నిగారింపుతో పూలు, పళ్లతో మిసమిసలాడుతుంది. రోడ్డును విభజిస్తూ ఏర్పరచిన స్థలంలో గల మొక్క- అటూ ఇటూ తిరిగే వాహనాల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతూ వాడిపోయి ఉంటుంది. ప్రకృతిలో జనించిన ప్రతి జీవికీ స్వేచ్ఛగా, ఆనందంగా స్వచ్ఛమైన వాతావరణంలో జీవించే హక్కు ఉంది. అది దైవ ప్రసాదితం. దాన్ని కాలరాసే అధికారం ఎవరికీ లేదు. కాగితాల మీద ఏవో కొన్ని హక్కులు రాసుకుని, వాటిని పూర్తిగా తన సౌలభ్యం కోసమే ఉపయోగించుకోవాలని మనిషి అనుకోవడం అసమంజసం.



అంతర్వాణి

మానవుడు ఎంత సాధించినా, వానల కోసం రుతువుల మీద ఆధారపడాల్సిందే. పెద్ద కొండలుంటేనే, అవి మేఘాల్ని అడ్డుకుంటాయి, వానలు కురిపిస్తాయి. చెట్లు ఉంటేనే ప్రాణవాయువు నిచ్చి, మనిషి గుండెను పదిలంగా ఉంచుతాయి. సర్వత్రా స్వచ్ఛత ఉన్నప్పుడే, మనిషికి ఆయుర్దాయం. ప్రకృతి అన్నీ స్వచ్ఛంగానే ఇచ్చింది. దాన్ని మనిషి స్వార్థమే కలుషితం చేస్తోంది. నదులు, చెరువులు ఉంటేనే ప్రాణుల దాహార్తి తీరుతుంది. అవి కలుషిత కాసారాలైతే, మనిషిని కాపాడే దిక్కెవరు?

మానవుడు తన స్వేచ్ఛను హరించే ఏ పని జరిగినా, అన్యాయం అనిపించినా గొంతెత్తుతాడు. రోడ్డెక్కుతాడు. చెట్లు, పుట్టలు, మూగజీవులు ఆ పని చేయలేవు. అన్నింటినీ మౌనంగా భరిస్తాయి. పూర్వం రుషుల ఆశ్రమ వాతావరణంలో మనుషులతో పాటు జంతువులూ కలిసి ఉండేవి. కాలక్రమంలో జంతువులకు మనిషి దూరమయ్యాడు. భారమయ్యాడు. ప్రకృతి పరిరక్షణ, జంతు సంరక్షణ గురించి మానవీయ కోణంలో పిల్లలకు పాఠాలు చెబితే- రానున్న తరాలైనా ప్రకృతిని, జీవ జంతుజాలాన్ని తమ కళ్లతో చూడగలుగుతాయి. లేదంటే తెరపై కదిలే దృశ్యాలే మిగులుతాయి. కృత్రిమ వాతావరణంలో ప్రాణం గల జీవిగా మనిషి ఒక్కడే మిగులుతాడు!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

22న రాజధానిలో తాత్కాలిక రిజిస్ట్రేషన్ కేంద్రాల ప్రారంభం!

ఈనాడు, అమరావతి: రాజధాని పరిధిలో ఆరు తాత్కాలిక రిజిస్ట్రేషన్ కేంద్రాలు రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు కాబోతున్నాయి. నవులూరు, నిడమర్రు, వెంకటపాలెం, రాయపూడి, తుళ్లూరు, శాఖమూరులో ఈ కేంద్రాల ఏర్పాటు పనులు పూర్తికావొచ్చాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈనెల 22న ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. ఈ కేంద్రాల పరిధిలోకి 18 గ్రామాలు వచ్చాయి. రాజధాని నిర్మాణానికి సుమారు 34వేల ఎకరాల భూమిని వారు భూసమీకరణ సమయంలో ఇచ్చారు. వారికి సీఆర్‌డీఏ స్థలాలను తిరిగిచ్చింది. ఏడాది కిందటే మొదలైనా ఇప్పటివరకు 12వేల వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో ఈ తాత్కాలిక కేంద్రాలు ఏర్పాటు చర్యలు మొదలయ్యాయి. వీటిల్లో పనిచేసేందుకు ప్రత్యేకంగా ఉద్యోగులను కూడా నియమించారు. ఈ కేంద్రాల రాక ద్వారా ఆయా గ్రామాల రైతులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు మార్గం సుగమమైంది.

వివాహ నిర్వహణ అధికారులుగా సబ్ రిజిస్ట్రార్లు

జిల్లా, సబ్ రిజిస్ట్రార్లను వివాహ నిర్వహణ అధికారులుగా గుర్తిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మహిళా శిశు సంక్షేమ శాఖ విజ్ఞప్తి, తప్పనిసరి వివాహ గుర్తింపు చట్టం-2002 అనుసరించి వీరు వివాహ నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్తి చిదంబరంపై లుక్‌అవుట్ నోటీసు కేసులో తీర్పు వాయిదా

చెన్నై, న్యూస్‌టుడే: ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారంలో కార్తి చిదంబరంపై లుక్‌అవుట్ నోటీసుకు సంబంధించిన కేసు తీర్పును మద్రాసు హైకోర్టు రిజర్వులో ఉంచింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కార్తి చిదంబరంపై కేంద్ర ప్రభుత్వం లుక్‌అవుట్ నోటీసు జారీచేసిన సంగతి తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ కార్తి చిదంబరం తరఫున మద్రాసు హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. అందులో... హైకోర్టు విధించిన నిబంధనలను అనుసరించి విదేశాలకు వెళ్లి తిరిగొచ్చానని, విమానాశ్రయంలోనే తనను సీబీఐ అధికారులు అరెస్టు చేశారని తెలిపారు. తనపై లుక్‌అవుట్ నోటీసు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో విచారణ దశలో ఉండగానే హైకోర్టు అనుమతిలేకుండా తనను అరెస్టు చేయడం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. సీబీఐ అధికారుల చర్య కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందని తెలిపారు. తన తండ్రి చిదంబరం కేంద్ర మంత్రిగా పనిచేశారని, అందువల్ల రాజకీయ కక్షసాధింపు ఉద్దేశంతో లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారని ఆరోపించారు. ఈ నోటీసును రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరాబెనర్జీ, న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ కుద్దూస్ సమక్షంలో సోమవారం మళ్లీ విచారణకు వచ్చింది. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత తేదీ ప్రకటించకుండా కేసు తీర్పును వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తులు ఆదేశాలు ఇచ్చారు.

సస్పెండ్ చేసిన ఇన్విజిలేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఈనాడు అమరావతి: నెల్లూరులో పదో తరగతి పరీక్షలకు పరిశీలకులు(ఇన్విజిలేటర్లు)గా ఉన్న ఉపాధ్యాయులను అకారణంగా సస్పెండ్ చేశారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఎస్.టి.యు, పీఆర్టీయూ, వై.యస్.ఆర్ ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్షులు, సి.హెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గడ్డం నారాయణరావు, వి.రెడ్డి శేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పురుష ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమిస్తే పరీక్ష రాస్తున్న బాలికలను ఎలా తనిఖీ చేస్తారని వారు ప్రశ్నించారు. బాలికల వద్ద చిట్టీలు దొరికితే సంబంధంలేని ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక పురుష, ఒక మహిళ ఇన్విజిలేటర్లను రిజర్వులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను విధులలోకి తీసుకోకపోతే విధులను బహిష్కరించడానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.

గుత్తేదారును హతమార్చిన నక్సలైట్లు

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో ఓ గుత్తేదారు(కాంట్రాక్టర్)ను నక్సలైట్లు సోమవారం హతమార్చారు. బిజాపూర్ జిల్లా తుమ్నార్, కోయిట్‌పల్‌ల మధ్య రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతానికి చేరుకున్న సాయుధులైన నక్సలైట్లు ముందు 4 యంత్రాలను తగులబెట్టారు. అనంతరం గుత్తేదారు విశాల్ కుమార్ (36)ను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి హతమార్చినట్లు దక్షిణ బస్తర్ రేంజి డీఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

10 మంది నక్సలైట్ల లొంగుబాటు..

జన్‌మిలిటియా కమాండర్ వికాస్ సలామ్(40)తో పాటు 10 మంది నక్సలైట్లు సోమవారం కొండగాన్ జిల్లా ఎస్పీ అభిషేక్ పల్లవ్ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఓ మహిళ కూడా ఉన్నారు.

ఇద్దరు మావోయిస్టుల ఆస్తులు జప్తు..

దిల్లీ: బిహార్‌లో నగదు అక్రమ చెలామణి వ్యవహారంతో సంబంధం ఉన్న ఇద్దరు సీనియర్ మావోయిస్టు నేతలకు చెందిన రూ. 68 లక్షల ఆస్తులను జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం తెలిపింది. ఈమేరకు ప్రద్యుమన్ శర్మ, ప్రమోద్ శర్మ సోదరుల ఇళ్ల స్థలాలు, ఓ ఇల్లు, బ్యాంకుల్లోని నగదును జప్తు చేసినట్లు పేర్కొంది.

నివేదికలందినా చర్యలేవీ?

- కొత్త వంగడాల తయారీలో సంబంధం లేని వారి పేర్లు
- రెండోసారి విచారణకు ఆదేశించిన వ్యవసాయ వర్సిటీ
- నివేదిక వచ్చినా.. చర్యలపై జాప్యం

ఈనాడు - అమరావతి

కొత్త వంగడాల రూపకల్పనలో ప్రమేయం లేకున్నా తమ పేర్లు పెట్టుకున్న శాస్త్రవేత్తలపై వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రెండో విచారణ నివేదిక అందింది. అయినా వారిపై చర్యల విషయంలో పాలకవర్గం మీనమేషాలు లెక్కిస్తోంది. విశ్వవిద్యాలయ పరిధిలో గత కొన్నేళ్లుగా పలు కొత్త వంగడాలు విడుదలయ్యాయి. కొందరు శాస్త్రవేత్తలకు ఇందులో ఎలాంటి పాత్రలేకున్నా.. తమ హోదాను ఉపయోగించుకుని పేర్లు చేర్చారు. దీనిపై వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులకు ఫిర్యాదు అందగా విచారణకు ఆదేశించారు. ఎవరెవరి పాత్ర ఉందనే విషయం నివేదికలో వెల్లడైంది. వారిపై చర్యలకు ఇది సరిపోదని గుర్తించిన పాలకవర్గం మరోసారి విచారణకు ఆదేశించింది. మార్గదర్శకాల కోసం



కమిటీ వేసింది. కొద్దిరోజుల కిందట అవీ చేతికొచ్చాయి.

జాబితాలకే పరిమితం

వంగడాల తయారీపై రెండోసారి విచారణ నివేదిక కూడా విశ్వవిద్యాలయానికి అందింది. ఇందులో అక్రమాలకు పాల్పడిన వారెవరో నిర్ధరించకపోవడం గమనార్హం. శాస్త్రవేత్తలు పనిచేసిన కాలం, పంటల వారీగా జరిగిన పరిశోధనలపై నివేదికలు ఇచ్చారు. ప్రధానంగా వేరుశనగ వంగడ రకాల్లో అక్రమాలు జరిగినట్లు నివేదిక చెప్పకనే చెబుతోంది. ఒక్క శాస్త్రవేత్త ఏకంగా 10కి పైగా వంగడాల రూపకల్పనలో పాలుపంచుకున్నట్లు ఇందులో స్పష్టమైంది. మరికొందరి పాత్ర కూడా వెలుగులోకి వచ్చింది. ఒక్కరే ఇన్ని వంగడాలను రూపొందించడం ఎలా సాధ్యం? అనే ప్రశ్న పలువురు అధికారుల్లో వ్యక్తమవుతోంది.

మార్గదర్శకాలిచ్చినా..

వంగడాల రూపకల్పన విషయమై విలువల కమిటీ కూడా మార్గదర్శకాలు సిద్ధం చేసింది. వీటిని పాలకవర్గానికి సమర్పించింది. అయినా అక్కడ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీన్ని ఆమోదిస్తే అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలకు వీలుంటుందనేది అధికారుల అభిప్రాయం. వంగడాల తయారీలో ఎవరెవరు ఎలాంటి పాత్ర పోషించారో తెలిశాక కూడా ఎందుకు జాప్యం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఉన్నత పదవులకు అవకాశమా?

ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో 9 ఉన్నతస్థాయి పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. పాలనలో ఇవి ఎంతో కీలకమైనవి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వీటికి దరఖాస్తు చేశారు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరుగుతోందని అధికారులే పేర్కొంటున్నారు. కావాలనే వారికి సహకరించేలా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. తప్పు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నారు.



విజయవాడలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రదర్శన

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- విజయవాడలో భారీ ప్రదర్శన

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది విజయవాడలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ 'చలో విజయవాడ' పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సోమవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి అలంకార్ ధర్నా చౌక్ వరకు భారీ ప్రదర్శన చేపట్టి అక్కడ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి సుప్రజ, మాజీ మంత్రి పార్థసారథి, వివిధ జిల్లాల నుంచి సిబ్బంది పాల్గొన్నారు.

రియల్ టైం గవర్నెన్స్ బాగు

నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సందర్శన

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సర్కారు అమలుచేస్తున్న రియల్‌టైం గవర్నెన్స్(ఆర్టీజీ) చాలా బాగుందని నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం ఒక ప్రకటనలో అభిప్రాయపడింది. సోమవారం ఆ కళాశాల మేనేజర్ జనరల్ హరికిరత్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సచివాలయంలోని ఆర్టీజీ స్టేట్ కమాండ్ కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా వారికి ముఖ్య కార్యనిర్వహణాధికారి బాబు ఆర్టీజీ పనితీరును వివరించారు. సర్వైలెన్స్ కెమెరాల ద్వారా భద్రత పర్యవేక్షణ, పౌరసరఫరాల వ్యవస్థలో బయోమెట్రిక్, ఈపోస్ యంత్రాల వినియోగం, ఫైబర్‌నెట్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి కేవలం రూ.149లకే కేబుల్‌టీవీ, అంతర్జాలం, టెలిఫోన్ సదుపాయం కల్పిస్తున్న తీరును వివరించారు. వినూత్న ఆలోచన విధానాన్ని అమలుచేస్తున్న సీఎం చంద్రబాబునాయుడును బృందం సభ్యులు అభినందించారు. డైరెక్టర్ బాలాజీ ఆదివిష్ణు, అనంత్‌కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

3 గ్రంథాలయాలకు కేంద్ర నిధులు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మూడు గ్రంథాలయాలకు కేంద్ర సాంస్కృతిక శాఖ నిధులు అందిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి మహేష్‌శర్మ తెలిపారు. సోమవారం లోక్‌సభలో తెదేపా సభ్యుడు రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ కింద గుంటూరులో రాష్ట్రస్థాయి ప్రాంతీయ గ్రంథాలయం, రాజమండ్రిలో ప్రాంతీయ గ్రంథాలయం, అనంతపురంలో కల్లూరి సుబ్బారావు స్మారక జిల్లా సంగ్రహణాలయం ఏర్పాటుకు నిధులు ఇస్తున్నట్లు తెలిపారు.

ఐఆర్‌సీటీసీ భారతదర్శన్ ప్రత్యేక ప్యాకేజీలు

- పర్యాటక, పుణ్యక్షేత్రాల సందర్శనార్థం..

విజయవాడ న్యూస్‌టుడే: దేశంలోని పలు పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాల సందర్శనార్థం వెళ్లే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ భారత్‌దర్శన్ పేరిట పలు ప్యాకేజీలను ప్రవేశపెట్టింది. సోమవారం విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో సంస్థ అధికారులు ఎన్.సంజీవయ్య, మధుసూదనరావు వివరాలు వెల్లడించారు.

★ నవ జ్యోతిర్లింగాల యాత్ర: ఏప్రిల్ 4న ఉదయం రేణిగుంటలో బయలుదేరే భారత్‌దర్శన్ రైలు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఖమ్మం, వరంగల్ మీదుగా మధ్యాహ్నం సికింద్రాబాద్ చేరుకోనుంది. అక్కడి నుంచి జ్యోతిర్లింగాల సందర్శన ఉంటుంది. 14వ తేదీన రైలు తిరుగు ప్రయాణమవుతుంది. స్లీపర్ తరగతి ఒక్కొక్కరికి రూ.13,020, థర్డ్ ఏసీలో రూ.15,540గా టికెట్ల ధర నిర్ణయించారు.

★ గంగా, యమున యాత్ర: ఏప్రిల్ 18న రేణిగుంటలో ప్రత్యేక రైలు బయలుదేరనుంది. కడప, యర్రగుంట్ల, కాచిగూడ, ఖాజీపేట, రామగుండం మీదుగా వెళుతుంది. ఆగ్రా, మధుర, దిల్లీ, హరిద్వార్, అయోధ్య, వారణాసి, గయ సందర్శన అనంతరం ఏప్రిల్ 29న తిరుగు ప్రయాణమవుతుంది. ఒక్కొక్కరికి స్లీపర్ తరగతిలో రూ.11,340, థర్డ్ ఏసీలో రూ.13,860 ఉంటుంది.

★ దక్షిణ భారత యాత్ర: మే 4న రైలు సికింద్రాబాద్‌లో బయలుదేరి వరంగల్, విజయవాడ, రేణిగుంట మీదగా వెళుతుంది. తిరుచరాపల్లి, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, గురువాయర్, తిరుపతి, శ్రీకాళహస్తి ఆలయాల సందర్శన అనంతరం 12న రైలు తిరుగు ప్రయాణమవుతుంది. ఒక్కొక్కరికి స్లీపర్‌లో రూ.8,505, థర్డ్ ఏసీలో రూ.10,395 ఉంటుంది.

వసతి, విడిది, రవాణాతో కలిసి టికెట్ల ధరను నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్ల కొనుగోలు, ఇతర వివరాలకు 0866-2572280, 9701360632, 9701360675, 9701360690, 9701360701 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఆసుపత్రుల్లో ఏడాది విధులు 'ఐచ్ఛికం'!

- పీజీ వైద్యవిద్య పూర్తిచేసిన వారికి వెసులుబాటు
- వేతనాల పెంపునకూ సిద్ధం
- త్వరలో ఉత్తర్వుల విడుదల
- ఏపీ ప్రభుత్వ సూచనప్రాయ నిర్ణయం

ఈనాడు - అమరావతి

పీజీ వైద్యవిద్యను పూర్తిచేసిన విద్యార్థులు ఏడాదిపాటు ప్రభుత్వాసుపత్రులో తప్పక పనిచేయాలన్న నిబంధనను ఐచ్ఛికం చేయబోతున్నారు. వారికి నెలకు రూ.45వేల వరకు ఇస్తున్న ఉపకార వేతనాన్ని పెంచబోతున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయం తీసుకుంది. 2013 నుంచి అమలులో ఉన్న పై నిబంధన రూపేణా ఏటా సుమారు 1400 మంది పీజీ విద్యార్థులు సీనియర్ రెసిడెన్సీగా బోధన, వైద్య విధాన పరిషత్ పరిధి జిల్లా, ఇతర ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన వారంతా ఇలా ఏడాదిపాటు పనిచేస్తున్నందున.. అవసరాలకు మించి వీరు అందుబాటులో ఉంటున్నారు.



అయితే.. గ్రామీణ ఆస్పత్రుల కన్నా వీరిలో అధిక శాతం బోధనాసుపత్రుల్లో పనిచేసేందుకు ముందుకొస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జూనియర్ వైద్యుల డిమాండును అనుసరించి 'ఏడాది నిబంధన'ను ఐచ్ఛికం చేయాలని ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయించింది. బోధనాస్పత్రుల్లో సహాయ ఆచార్యులుగా పనిచేయాలంటే ప్రభుత్వాసుపత్రుల్లో ఏడాదిపాటు తప్పక పనిచేయాలన్నది జాతీయ వైద్య మండలి నిబంధన. దీని ప్రకారం రాష్ట్రంలో ఏటా పీజీ వైద్యవిద్య పూర్తిచేస్తున్న 1400 మందిలో సగం మంది 'ఐచ్ఛికం'వైపు మొగ్గుచూపుతారన్నది అధికారిక అంచనా.

ఆలోచించి నిర్ణయించాలి

ఐచ్ఛికం నిర్ణయాన్ని తీసుకునే ముందు ఒంగోలు రిమ్స్, అనంతపురం రిమ్స్ లాంటిచోట్ల తలెత్తే పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకోవాలి. సీనియర్ రెసిడెన్సీల ద్వారా బోధన, రోగులకు వైద్యసేవలు చాలావరకు అందుతున్నాయి. ఈ తరుణంలో వారు వైదొలిగితే కొత్త సమస్యలు తలెత్తుతాయి.

– డా॥మస్తాన్, సంచాలకులు, ఒంగోలు రిమ్స్

ఆరు వారాలపాటు ఎన్నికల ప్రక్రియ చేపట్టొద్దు

తెలంగాణ ఎమ్మెల్యేల బహిష్కరణపై హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: అసెంబ్లీలో బహిష్కరణకు గురైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌కు చెందిన నియోజకవర్గాల ఎమ్మెల్యే స్థానాలు ఖాళీ అయినట్లు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఆరు వారాలపాటు ఎన్నికల ప్రక్రియ చేపట్టరాదంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌ను సోమవారం హైకోర్టు ఆదేశించింది. 10 రోజులపాటు ఎన్నికల ప్రక్రియ నిర్వహించబోమంటూ ఎన్నికల సంఘం ఇచ్చిన హామీని నమోదు చేయడంతోపాటు ఆరు వారాలపాటు ఎన్నికల ప్రక్రియ చేపట్టరాదంటూ స్పష్టం చేసింది. గవర్నర్ ప్రసంగం సందర్భంగా జరిగిన సంఘటనలకు సంబంధించిన మొత్తం వీడియో ఫుటేజీని సీల్డ్ కవర్‌లో సమర్పించాలని అసెంబ్లీ కార్యదర్శికి చెప్పింది. బహిష్కరణకు సంబంధించిన వ్యవహారంపై మొత్తం వివరాలతో ఈనెల 23లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన అసెంబ్లీ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాలను ఆదేశించింది. దీనిపై ప్రతి కౌంటర్లు దాఖలు చేయాలనుకుంటే చేయవచ్చని పిటిషనర్లకు సూచిస్తూ విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.

రూ.25లక్షల విలువైన నకిలీ మిర్చి విత్తనాల స్వాధీనం

గుంటూరు, న్యూస్‌టుడే: లారీ పార్శిల్ సర్వీసులో రవాణా అవుతున్న నకిలీ మిర్చి విత్తనాల్ని వ్యవసాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గుంటూరు నగరం ఏటుకూరు రోడ్డులోని వీఆర్ఎల్ లాజిస్టిక్స్ లిమిటెడ్ లారీ పార్శిల్ సర్వీసులో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం కొప్పల్ నుంచి గుంటూరులోని సన్ సీడ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు ఎలాంటి బిల్లులు లేకుండా నకిలీ మిర్చి విత్తనాలు రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. రూ.25లక్షల విలువ చేసే 205 కిలోల మిర్చి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ విత్తనాల్ని వ్యాపారులు ప్యాకెట్ల రూపంలో తయారు చేసి రైతులకు విక్రయాలు చేస్తారని వివరించారు. స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లపై తయారీ తేదీ, ముగింపు తేదీ, ఎమ్మార్పీ వివరాలు ఏమీ లేవని ఆయన తెలిపారు. నకిలీ విత్తనాల గురించి తెలిస్తే తమశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో వ్యవసాయశాఖ అధికారులు ఎ.అంకారావు, సిబ్బంది ఎ.ఆంజనేయులు, కామేశ్వరరావులు పాల్గొన్నారు.



నకిలీ మిర్చి విత్తనాల్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఏపీకి 5 అఖిల భారత పరిశోధనామండలి ప్రాజెక్టులు

- మారుతున్న పంటల సరళికి అనుగుణంగా పరిశోధనలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు అయిదు అఖిల భారత పరిశోధనామండలి ప్రాజెక్టులు మంజూరయ్యాయి. వీటిని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ పంటలపై పరిశోధనలు చేసే ప్రాజెక్టులు ఉండేవి. విభజన తర్వాత వీటిలో అధికభాగం తెలంగాణకు వెళ్లాయి. దీంతో 17 ప్రాజెక్టులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్రానికి లేఖలు రాశారు. అయిదు ప్రాజెక్టులకు అంగీకారం లభించింది. ఆముదాలు-అనంతపురం, నువ్వులు-తిరుపతి, వెర్రినువ్వులు-చింతపల్లి, విత్తనోత్పత్తి కేంద్రం(ఐకార్)-నెల్లూరు, మొక్కజొన్న -విజయరాయి, మొక్కజొన్న(ఐకార్)-పెద్దాపురంలో ఏర్పాటు చేయనున్నారు. పప్పుధాన్యాల పంటలకు సంబంధించి ప్రకాశం జిల్లా ఒంగోలులో పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి అనుమతి లభించాల్సి ఉంది.

వాతావరణానికి అనుగుణంగా

వ్యవసాయంలో మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్త లక్ష్యాలను నిర్దేశించింది. పరిశోధన కేంద్రాల్లో ఇప్పటిదాకా కొన్ని పంటలపైనే దృష్టిపెడుతున్నారు. అయితే వాతావరణ పరిస్థితులతో పంటల సరళి, సాగు కాలం మారుతోంది. వీటన్నింటి నేపథ్యంలో పరిశోధనా కేంద్రాలకు అదనంగా కొన్ని పంటలను అప్పగించారు. ఉదాహరణకు శ్రీకాకుళం పరిశోధన కేంద్రంలో ఇప్పటిదాకా గోగుపైనే పనిచేస్తుండగా కొత్తగా పప్పుధాన్యాలపైనా దృష్టిసారించనున్నారు. సాగుకాలం ముందు నుంచి వీరు వాటిపై అధ్యయనం చేస్తూ వ్యవసాయ అధికారులకు సలహాలు, సూచనలు ఇస్తారు.

పురపాలక పాఠశాలల్లో ప్రమాణాల పెంపునకు చర్యలు: నారాయణ



నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: పురపాలక పాఠశాలలను ఉన్నత స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, వచ్చే విద్యా సంవత్సరంలో ఎక్కడా వసతుల కొరత లేకుండా చూస్తామని మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. సోమవారం గుంటూరు నగరం జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను పర్యవేక్షించే రాష్ట్ర సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక మంత్రి మాట్లాడుతూ 2018 విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్, నగరపాలకసంస్థల్లోని ఉన్నత పాఠశాలలు అత్యధిక విద్యార్థులతో మెరుగ్గానే ఉన్నా.. ప్రాథమిక పాఠశాలలు కునారిల్లుతున్నాయన్నారు. ఇందుకు కారణాలు అన్వేషించి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమన్వయకర్తలు మాట్లాడుతూ కృష్ణాలో 30, అనంతపురంలో 40శాతం మేర పాఠశాలలు రెండు, మూడు గదులతోనే నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని, తరగతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం కూడా అమలవుతున్నందున ప్రతి విద్యార్థినీ తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్యాప్రమాణాలు పెంచనున్నట్లు తెలిపారు. అన్నిచోట్ల అవసరమైన తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకం గురించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

నేడు పద్మ పురస్కారాల ప్రదానం

దిల్లీ: సంగీత సామ్రాట్ ఇళయరాజా, హిందుత్వ సిద్ధాంతకర్త పరమేశ్వరన్ పరమేశ్వరన్ సహా 41 మంది ప్రముఖులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం పద్మ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేబినెట్ మంత్రులు హాజరుకానున్నారు. ఈ ఏడాది ముగ్గురికి పద్మ విభూషణ్, తొమ్మిది మందికి పద్మభూషణ్ సహా 84 మందికి పద్మ అవార్డులు ఇస్తామని కేంద్రం తెలిపింది. ఏటా గణతంత్ర దినోత్సవంనాడు వీటిని ప్రకటిస్తారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, ప్రజాసేవ, వాణిజ్యం, పరిశ్రమలు తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారు.

భైరవానితిప్ప, ఎగువ పెన్నార్ టెండర్లు పిలవండి

- వెలిగొండ టన్నెళ్లకు కూడా..
- పోలవరంలో పొరపాట్లకు తావివ్వొద్దు
- మిగిలిన ప్రాజెక్టులకు డీపీఆర్‌లు, పాలనామోదాలు పూర్తి చేయాలి
- కొత్త, పాత ప్రాజెక్టులపై సీఎం సమీక్ష, ఆదేశాలు

ఈనాడు – అమరావతి

అనంతపురం జిల్లాలో చేపట్టనున్న భైరవానితిప్ప, ఎగువ పెన్నార్ ఎత్తిపోతల పథకాలకు ఈ వారంలోనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టుల్లో టన్నెళ్లకు సంబంధించి మిగిలిన పనులకు కూడా వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలన్నారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజికి ఎగువన వైకుంఠపురం వద్ద నిర్మించబోతున్న బ్యారేజి పనులు, గోదావరి పెన్నా అనుసంధానం తొలి దశ పనులు తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైకుంఠపురం బ్యారేజి ప్రతిపాదనలను సోమవారమే ప్రభుత్వానికి సమర్పించాలని, గోదావరి పెన్నా అనుసంధానం పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదికను రెండు వారాల్లో సమర్పించాలన్నారు. వీటికి తక్షణమే పాలనామోదం ఇచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. పోలవరం, రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల పనుల పురోగతి, కొత్త ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. పోలవరం పనుల్లో పొరపాట్లకు తావివ్వొద్దని గుత్తేదారులను ఆదేశించారు. పునరావాసానికి సంబంధించిన పనులన్నీ డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు.



రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, మంత్రి దేవినేని ఉమా, తదితరులు

పోలవరం ప్రాజెక్టు పూర్తయినది	:	54.4శాతం
ప్రధాన డ్యాం	:	41.2 శాతం పూర్తి
డయాఫ్రంవాల్ మొత్తం:		1427 మీటర్లు.. పూర్తయింది: 1049 మీటర్లు.
దిగువ కాఫర్ డ్యాం	:	1417 మీటర్లు, పూర్తయింది: 1095 మీటర్లు
ఎగువ కాఫర్ డ్యాం	:	2050 మీటర్లు పూర్తయింది: 525 మీటర్లు.

సమీక్షలో వివిధ ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు పాల్గొని ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ప్రాజెక్టుల మౌలిక సదుపాయాలకు, పునరావాసానికి 4,500 ఎకరాలు అవసరమవుతాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "మడకశిర బ్రాంచి కాలువ ద్వారా మార్చి 31 నాటికి లేపాక్షికి నీరందించాలి. గండికోట జలాశయంలో పునరావాసానికి నిధులు తక్షణమే విడుదల చేసి 12 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేయాలి. గాలేరు నగరి రెండో దశను కడప జిల్లా కోడూరు వరకు తీసుకువెళ్లేందుకు వీలుగా భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి." అని ఆదేశించారు. వంశధార, నాగావళి అనుసంధానం మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. నీరు మీరు ప్రగతిపై కూడా సీఎం సమీక్ష నిర్వహించారు. ఇంతవరకు రూ.450 కోట్ల పనులు జరిగినట్లు అధికారులు వివరించారు. 749 చెరువుల పునరుద్ధరణ చేసినట్లు, 1,200 చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.

పోలవరంపై రాళ్లేయొద్దు

- కేంద్ర కమిటీయే వచ్చి పనుల్ని భేష్ అంది
- ఏ జాతీయ ప్రాజెక్టు పనులు ఇంత వేగంగా లేవు
- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమా వెల్లడి

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై రాళ్లేయొద్దని, దేశంలోని ఏ ఇతర జాతీయ ప్రాజెక్టులోను ఇక్కడ జరిగినంత వేగంగా పనులు జరగడం లేదని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. అవసరంగా కొందరు కేంద్రానికి ఫిర్యాదులు చేసి ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కొందరు పత్రికల్లో లేనిపోని కథనాలు రాయిస్తూ విచారణలు అంటూ అల్లరి చేస్తున్నారని చెప్పారు. సోమవారం రాత్రి సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి ఉమా మాట్లాడారు. కేంద్రం నియమించిన నిపుణుల కమిటీ శని, ఆదివారాల్లో పోలవరం వచ్చి పనులు చూసిందని, సమీక్ష నిర్వహించి పనుల తీరును మెచ్చుకుందని చెప్పారు. పనులు వేగంగా సాగుతున్నాయని మీడియా ముందు కూడా వారు చెప్పారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు రాకముందే రాష్ట్రమే నిధులు ఖర్చుచేసి పనులు చేయిస్తోందని తెలిపారు. దేశంలో మొత్తం 16 ప్రాజెక్టులు జాతీయహోదాతో నిర్మిస్తోంటే ఒక్క ప్రాజెక్టులో కూడా పనులు ఇంత వేగంగా సాగడం లేదని మంత్రి చెప్పారు. పోలవరం ఖర్చు లెక్కలు, పనుల ప్రగతిని వెబ్‌సైట్‌లో ఉంచామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పుణెలో త్రీడీ నమూనా అధ్యయనాలు పూర్తయ్యాయని, ఆ నివేదికలూ అందాయని మంత్రి ఉమా తెలిపారు. వీటి ఆధారంగా పెండింగులో ఉన్న ఆకృతులన్నీ ఆమోదం పొందుతాయన్నారు. తక్షణమే ఆకృతులను ఆమోదించేలా కేంద్ర జలసంఘం ఆదేశాలు ఇచ్చిందన్నారు.

ప్రభుత్వాలు స్పందించకుంటే భారీగా ప్రజల వలసబాట!

ప్రపంచబ్యాంకు హెచ్చరిక

వాషింగ్టన్: ప్రపంచ దేశాల ప్రభుత్వాలు కనుక జోక్యం చేసుకోకుండా ఉపేక్షిస్తే...రాబోయే 30 ఏళ్లలో భారీ సంఖ్యలో ప్రజలు వలసలు వెళ్లి పోవలసిన పరిస్థితి తలెత్తుతుందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. పంటలుండవు....కరవు కాటకాలు పీడిస్తాయి.... సముద్ర మట్టాలు ప్రమాదకరంగా పెరుగుతుంటాయి... ఈ పరిణామాలతో జనం భారీగా వలస బాట పడతారంటూ ప్రపంచబ్యాంకు నివేదిక పునరుద్ఘాటించింది. వీరిని 'వాతావరణ వలసదారులు'గా పేర్కొంది. ప్రభుత్వాలు పట్టించుకోకపోతే 2050 నాటికి సహారా ఎడారి పరిసర దేశాల నుంచి సుమారు 8.6 కోట్లు, దక్షిణాసియా నుంచి 4కోట్లు, లాటిన్ అమెరికా నుంచీ కోటీ 70 లక్షల పై చిలుకు...ఇలా భారీ ఎత్తున జనంవలసబాట పట్టడం ఖాయమని విశ్లేషించింది. వాతావరణ మార్పులనేవి మెరుగైన ఆవాసం కోసం ప్రజలు వెతుక్కుంటూ వెళ్లే పరిస్థితికి కారణమౌతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచదేశాల ప్రజలకు ఈ వాతావరణ మార్పు అనేది ఓ ఆర్థిక, సామాజిక, అస్తిత్వపరమైన ముప్పుగా బెదరగొడుతూనే ఉందని ప్రపంచబ్యాంకు సీఈవో క్రిస్టాలినా జార్జీవా అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ధరకే పవన్ స్థలం కొనడమూ తప్పేనా?

ట్విట్టర్‌లో జనసేన

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకే స్థలం కొనుక్కోవడం కూడా తప్పేనా? అని జనసేన పార్టీ ట్విట్టర్‌లో ప్రశ్నించింది. పవన్‌కల్యాణ్ ఇంటి స్థలాన్ని తక్కువ ధరకు కొన్నారని గగ్గోలు పెడుతున్న తమ్ముళ్లు, బాబులు ఒకసారి మీ ప్రభుత్వం నిర్ణయించిన విలువలు చూసుకోండని పేర్కొంది. "కాజా గ్రామంలో పవన్ కొనుగోలు చేసిన స్థలం విలువ ఎకరానికి రూ.20 లక్షలేనని ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ శాఖే లెక్కకట్టింది. కావాలంటే ఈసీలను చూసుకోవచ్చు. దాని ప్రకారమే సర్వే నెంబరు 368-బి1లోని 2 ఎకరాల 7 సెంట్ల భూమిని రూ.41.40 లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు. పవన్‌కల్యాణ్ స్థలానికి సమీపంలోని 364, 365, 366, 367, 369 సర్వే నెంబర్లలో కూడా ఎకరా ధర రూ.20 లక్షలే. మీకు లెక్కలు తెలియకపోతే మంగళగిరి, పెదకాకాని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి అడగండి చెబుతారు..." అని జనసేన ట్విట్టర్‌లో పేర్కొంది.

రేపటి నుంచి కొన్నిచోట్ల జల్లులు

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల ఈ నెల 21 నుంచి జల్లులు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని వివరించింది.

విదేశీ పెట్టుబడులకు చిరునామాగా రాష్ట్రం

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'హ్యుండై మొబిస్'తో అవగాహన ఒప్పందం

ఈనాడు, అమరావతి: అనంతపురం నుంచి చిత్తూరు మీదుగా నెల్లూరు వరకు ఏర్పాటయ్యే ఆటోకారిడార్ దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)కు చిరునామాగా నిలుస్తుందన్న ఆశాభావాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో కొరియాకు చెందిన 16 ఆటోమొబైల్ అనుసంధ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం కియా అనుబంధసంస్థలైన 'హ్యుండై మొబిస్'తో ప్రాథమిక అవగాహన ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ ఈ పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, నిబద్ధతతో ఆటోమొబైల్ రంగంలో కొరియా సంస్థలు రూ.24,600 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ప్రత్యేకించి



చంద్రబాబు, మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న 'హ్యుండై మొబిస్' ప్రతినిధి, సాల్మన్ ఆరోఖ్యరాజ్

అనంతపురం-నెల్లూరు మధ్య కారిడార్‌లో రూ.4,790 కోట్ల పెట్టుబడులు పెట్టి 6,583 మందికి ఉపాధి కల్పించనున్నాయని వివరించారు. అనంతపురం జిల్లా ఎర్రమంచి దగ్గర దక్షిణకొరియా క్లస్టర్‌కు 534 ఎకరాలు, గుడిపల్లిలో 71 ఎకరాలు, అమ్మవారిపల్లిలో 131 ఎకరాలు కేటాయించామని వివరించారు. ఆటోమొబైల్ రంగంలో రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ పెరుగుతోందని, దిగ్గజ సంస్థలైన ఇసుజు మోటార్స్ అనుబంధ సంస్థలు, హీరో మోటార్స్, అశోక్ లేల్యాండ్, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ కంపెనీలు తమ ఉత్పాదక యూనిట్లు ఏర్పాటు చేస్తాయని వివరించారు. నెలాఖరులోగా తొలి కారును విడుదల చేయాలని కియా కంపెనీ నిర్వాహకులకు చంద్రబాబునాయుడు సూచిస్తూ... ఏటా 3 లక్షల వాహనాలు ఉత్పత్తి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం, హ్యుండై మొబిస్ మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్న కొరియన్ సంస్థల్లో... హ్యుండై డైమోస్, హ్యూండై స్టీల్స్, హ్యూండై గ్లోవిస్, సింగ్ వూ, సేహాన్, సియోవయాన్ ఎవహా, ఎన్.వి.హెచ్, హ్యూండై మెటీరియల్స్, ఫోరేసియా, ఎస్ఎల్, వూయంగ్, హోసీయంగ్, ఇంజి, డీఏస్సీ ఇందులో ఉన్నాయి. రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి అనుకూల వాతావరణం ఉందని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథరెడ్డి అన్నారు.

అసెంబ్లీ తర్వాత జిల్లా పర్యటనలు

అసెంబ్లీ సమావేశాల తర్వాత జిల్లా పర్యటనలకు వస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. నీరు-ప్రగతి, వ్యవసాయాభివృద్ధి, వివిధ రంగాలపై సోమవారం వివిధశాఖల అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రభుత్వమే ఎప్పటికప్పుడు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.. ధర రాలేదని ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదు..' అని ఆయన స్పష్టం చేశారు. కందుల కొనుగోలుకు అదనపు బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో రైతు నుంచి 25 క్వింటాళ్ల వరకు కొంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటిదాకా 600 గ్రామాల్లో పోషకాహారతోటలకు భూములను గుర్తించినట్లు తెలిపారు. కేంద్రం నుంచి అరకొర తోడ్పాటు ఉన్నా మన కాళ్లపై మనం నిలబడే స్థితికి వచ్చామని వివరించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. డిసెంబరులో 57శాతం ఉన్న సంతృప్తి స్థాయి ఫిబ్రవరిలో 62శాతానికి పెరిగిందని వివరించారు. రాష్ట్రంలో రూ.9వేల కోట్లతో ఉపాధిహామీ పనులు చేపట్టేలా సామర్థ్యం పెంచుకోవాలని నిర్దేశించారు. తొలిదశ కింద 20కోట్ల పనిదినాలకు రూ.7,260కోట్ల పనులకు ఆమోదం లభించినట్లు తెలిపారు. జలసంరక్షణ కింద చెరువులను పటిష్ఠం చేసే చర్యలు చేపట్టాలన్నారు. రైతుబజార్ల సంతల్లో షెడ్లు నిర్మించి నీడలో వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునే విధంగా చూడాలన్నారు. పశుగ్రాసం కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయంలో దూరవిద్య

- కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్జీరంగా వర్సిటీ
- వివిధ అంశాలపై సర్టిఫికెట్ కోర్సులు

ఈనాడు, అమరావతి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్తగా దూరవిద్యా విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. వివిధ విభాగాల్లో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తోంది. ఈ ఏడాది జూన్ నుంచి తరగతులు ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. విళంబినామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఈ కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను సీఎం ఆవిష్కరించారు.

ఉపయోగం: వివిధ అంశాలపై సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తారు. రెండు వారాల నుంచి ఆరు నెలల వరకు శిక్షణ ఉంటుంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెట్టాలనుకునే యువతకు ఇక్కడ శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రాలిస్తుంది. స్వయం ఉపాధి కల్పనలోనూ వీటికి ప్రాధాన్యం ఉంటుంది. యువత, పొదుపు సంఘాల మహిళలు, విస్తరణ సిబ్బందికి అనువైన కోర్సులు తయారు చేస్తున్నట్లు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ తాతినేని రమేశ్‌బాబు తెలిపారు.

ఎనిమిది అంశాలపై: 8 అంశాలపై కోర్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడం, సాంకేతిక వినియోగం ఇందులో ప్రధాన లక్ష్యం. తొలి దశలో సేంద్రియ వ్యవసాయం, మిద్దెతోటల పెంపకం కోర్సుల్ని అందుబాటులోకి తెచ్చారు. కోర్సుల్లో ప్రవేశాలకు రూ.3 వేలు రుసుముగా నిర్ణయించారు. 13 జిల్లాల్లోని కృషి విజ్ఞాన కేంద్రాల్లో ప్రతి నెలా రెండో శనివారం, ఆదివారం తరగతులు జరుగుతాయి. వయోపరిమితి లేదు. ఆరోతరగతి అర్హతగా నిర్ణయించారు. క్షేత్రస్థాయి సందర్శనలుంటాయి.

పూర్తి వివరాలకు: www.angrau.ac.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

స్వీయచోదక కారు ఢీకొని పాదచారిణి మృతి!

న్యూయార్క్: స్వీయచోదక విధానం (సెల్ఫ్ డ్రైవింగ్ మోడ్)లో ప్రయాణిస్తున్న ఉబర్ క్యాబ్ బలంగా ఢీకొని... రోడ్డుపై నడుచుకెళ్తున్న ఓ మహిళ మృతిచెందింది! అరిజోనా రాష్ట్రంలోని టెంపె పట్టణంలో సోమవారం చోటుచేసుకుందీ ఘటన. స్వీయచోదక విధానంలో వెళ్తున్న కారు ఢీకొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం ఇదే ప్రథమం. ఘటనా సమయంలో కారులో డ్రైవర్ ఉన్నా, అటానమస్ మోడ్‌లోనే ఆ వాహనం నడుస్తున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని సమీప ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రాణాలు విడిచినట్లు వారు వెల్లడించారు. ఈ దుర్ఘటనపై ఉబర్ సీఈవో స్పందిస్తూ- "అరిజోనా ఘటన తీవ్రంగా కలచివేసింది. బాధితురాలి కుటుంబం గురించే ఆలోచిస్తున్నాం. స్థానిక దర్యాప్తు అధికారులకు సహకరిస్తాం" అని ట్వీట్ చేశారు. ప్రమాద కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. మరోవైపు- ఫియోనిక్స్, పీట్స్‌బర్గ్, శాన్ ఫ్రాన్సిస్కో, టొరంటోల్లో తమ స్వీయచోదక వాహనాలకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ఉబర్ వెల్లడించింది. డ్రైవర్ రహిత వాహనాలను ఆ సంస్థ పలు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా తిప్పుతోంది. గతేడాది అరిజోనాలో ఓ కారు ప్రమాదానికి గురైనప్పుడు ఉబర్ తన వాహనాలను తాత్కాలికంగా విరమించుకుంది. 2016లో కాలిఫోర్నియాలో స్వీయచోదక ఉబర్ వాహనాలు వేగ సూచికలను పట్టించుకోకుండా దూసుకెళ్లడం అప్పట్లో తీవ్ర సంచలనమైంది.

దేశంలో ఫెడరల్ ఫ్రంట్‌కి ముందడుగు

- కూటమికి సమష్టి నాయకత్వం
- కోల్‌కతాలో తెలంగాణ సీఎం కేసీఆర్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా వెల్లడి

ఈనాడు – హైదరాబాద్

దేశంలో కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయంగా బలమైన సమాఖ్య కూటమి (ఫెడరల్ ఫ్రంట్) ఆవశ్యకత ఉందని, ఏర్పాటుకు తొలి అడుగు పడిందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. తమది మూస కూటమి కాదని, రెండు మూడు పార్టీల కలయికగా ఉండదని, దేశ ప్రజలను ఏకం చేయడం, రాజకీయాల్లో విప్లవాత్మక, గుణాత్మక మార్పులకు కృషి చేస్తుందని వెల్లడించారు. కొత్త ఆలోచనలకు ఇది ఆవిర్భావమని, తమతో కలిసి వచ్చే ఇతర పార్టీలతో త్వరలోనే చర్చించి దీనికి సమగ్ర స్వరూపం తెస్తామని తెలిపారు. పరిస్థితులను బట్టి నాయకులు పుడతారని, కొత్త కూటమికి సమష్టి, సమాఖ్య నాయకత్వం ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ సచివాలయంలో మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. మూడు గంటల పాటు జరిగిన చర్చల అనంతరం వారు సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముందుగా కేసీఆర్ మాట్లాడుతూ.. "2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు దేశంలో కొత్త కూటమి ఏర్పాటు కావాలని ప్రజలు ఆశిస్తున్నారు. కోల్‌కతా వేదికగా తొలి కూటమి పురుడు పోసుకోవడం ఆనందంగా ఉంది. మమతతో భేటీకి చాలా ప్రాధాన్యం ఉంది. చర్చలు సానుకూలంగా, సంతృప్తికరంగా సాగాయి. కొన్ని అంశాలపై అంగీకారం కుదిరింది. కూటమి ఏర్పాటుపై మేమిద్దరమే అన్ని అంశాలను నిర్ణయించలేం. మాతో కలిసొచ్చే మిత్రులతో కలిసి మిగతా విషయాలు వెల్లడిస్తాం. ఈ కూటమి ఒకటి, రెండు, మూడు పార్టీలకు పరిమితం కాదు. ఇది ప్రజా కూటమిగా ఉంటుంది. చైనా ఇతర ఆర్థిక శక్తులతో ఎందుకు పోటీ పడలేకపోతున్నాం? మనకు గొప్ప అవకాశాలున్నాయి. సిలికాన్ వ్యాలీలో భారతీయ నిపుణులు ఉన్నారు. దేశంలో 60 శాతం మందికిపైగా యువత ఉండటం కలిసొచ్చే అంశం. దేశ యువతలో ఎంతో ప్రతిభ దాగుంది. మనకు సహజ, ఖనిజ వనరులు అపారంగా ఉన్నాయి. కాంగ్రెస్, భాజపా ప్రభుత్వాలు అన్నింటా విఫలమయ్యాయి. ప్రత్యామ్నాయ అజెండా, ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యవస్థ, రాజకీయ శక్తి అవసరాన్ని ప్రజలు గుర్తించారు. కూటమిపై అన్ని పార్టీల నేతలం కూర్చొని చర్చిస్తాం. మమతతో జరిగిన సమావేశం ఒక ప్రారంభమే. ఇంకా పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి. నాకు పూర్తి నమ్మకం ఉంది. మా కూటమి ఆదర్శంగా ఉంటుంది. దేశ ప్రజలందరినీ ఏకం చేస్తుంది.



కోల్‌కతాలోని సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మమతా బెనర్జీ. చిత్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్

గడిచిన 71 ఏళ్లుగా దేశంలో ఎలాంటి మార్పులు లేవు. కాంగ్రెస్ పోతే భాజపా వచ్చింది. ఒకరిమీద కోపంతో మరొకరికి ఓటేస్తే అద్భుతాలు జరగవు. దేశంలో అద్భుతం జరగాలి. గొప్ప మార్పు రావాలి. దేశాన్ని బలోపేతం చేసేందుకు, కొత్త దశ, దిశ చాటేందుకు అంతా ముందుకు రావాలి. కొత్త కూటమికి ఉమ్మడి, సమాఖ్య నాయకత్వం ఉంటుంది. మమత దీదీ నాయకత్వంలో బెంగాల్ బాగా అభివృద్ధి చెందుతోంది. ఆమె ఎంతగానో శ్రమిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే కోల్‌కతా రూపురేఖలు ఇప్పుడు బాగా మారిపోయాయి" అని కేసీఆర్ పేర్కొన్నారు.

అన్ని పార్టీలతో కలిసి అభివృద్ధికి కృషి: మమతా బెనర్జీ

మమతా బెనర్జీ మాట్లాడుతూ.."కేసీఆర్ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. ఇది మంచి ఆరంభం. శుభ పరిణామం. దేశం మార్పు కోరుకుంటోంది. దేశాభివృద్ధి లక్ష్యంగా బలమైన సమాఖ్య కూటమిపై కేసీఆర్‌తో చర్చించాం. భవిష్యత్తు భారత్‌పై రాజకీయ పునర్నిర్మాణం. రైతులు వ్యవసాయంతో పాటు ఇతర అంశాలపై మాట్లాడుకున్నాం. మాకు ఎలాంటి హడావిడి, ఆత్రుత లేదు. రాజకీయాలు నిరంతర ప్రక్రియ, దేశం అభివృద్ధి చెందాలి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం బలోపేతమవుతుంది. దీనికి కలిసి పని చేయాలి. దేశంలో ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలున్నాయి. మాకు బలమైన దార్శనికత ఉంది. కూటమి నాయకత్వం సమస్య కానే కాదు. రాజకీయాలు భిన్నమైన వ్యక్తులతో కలిసి పనిచేసే పరిస్థితులు కల్పిస్తాయి. వాటిని నేను విశ్వసిస్తాను. భావసారూప్యమున్న అన్ని పార్టీలను కలుపుకొని పోతాం. ఒక పార్టీ చెప్పినట్టే మిగతా పార్టీలు నడవాలనుకోవడం సరికాదు" అని మమత పేర్కొన్నారు.

పీఆర్‌లో కొలువుదీరిన ఐఏఎస్‌లు

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి(పీఆర్)శాఖ (గ్రామీణ తాగునీటి సరఫరా, గ్రామీణ పారిశుద్ధ్యం) కార్యదర్శిగా బి.రామాంజనేయులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరక్టర్‌గా రంజిత్ భాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఐఏఎస్‌ల బదిలీల తర్వాత బాధ్యతల కేటాయింపులో నెలకొన్న గందరగోళానికి తెరదీస్తూ ప్రభుత్వం ఇటీవల మరో జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. కార్యదర్శిగా రామాంజనేయులు సచివాలయంలోని ఐదో బ్లాకులో, విజయవాడలోని కార్యాలయంలో డైరక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రంజిత్ భాషా ఈ సందర్భంగా వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు.

గుజరాతీ సైన్‌బోర్డులను తొలగించిన ఎంఎన్ఎస్ కార్యకర్తలు

థానే(మహారాష్ట్ర): గుజరాతీ భాషలో రాసిన ఉన్న ఇక్కడి కొన్ని వాణిజ్య సంస్థలకు చెందిన సైన్ బోర్డులను మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) కార్యకర్తలు తొలగించేశారు. ఆదివారం రాత్రి ఈ బోర్డుల తొలగింపు జరిగినట్లు ఎంఎన్ఎస్ నాయకుడు అవినాశ్ జాదవ్ సోమవారం నాడిక్కడ వెల్లడించారు. థానే జిల్లాలోని వసాయి ప్రాంతంలో ముంబయి-అహ్మదాబాద్ హైవే మీద గుజరాతీ భాషలో రాసి ఉన్న సుమారు 20కి పైగా సైన్ బోర్డులను కిందకు లాగేసినట్లు తెలిపారు.



సమరానికి దిగిన కైరప్పల గ్రామస్థులు

పిడకలతో సమరోత్సాహం

ఆస్పరి, ఆదోని, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరప్పల గ్రామంలో సోమవారం పెద్ద పిడకల ఉత్సవం రణరంగాన్ని తలపించింది. గ్రామంలో వీరభద్రస్వామి, కాలమ్మ ఉత్సవాల్లో భాగంగా ఏటా ఉగాది మరుసటి రోజు పిడకల సమరాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామస్థులంతా ఒక చోటికి చేరి రెండు వర్గాలు విడిపోయి పిడకలతో కొట్టుకోవడం ఉత్సవంలో ప్రత్యేకంగా నిలిచింది. అరగంటపాటు సాగిన పోరులో సుమారు 28 మంది గాయపడ్డారు. ఈ సమరంలో తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేకమని గ్రామస్థులు తెలిపారు.

నేడు అంతర్జాతీయ ఆనంద దినం

సంతోషం సగం బలం అన్నారు పెద్దలు. కాదు కాదు.. సంతోషం సంపూర్ణ ఆరోగ్యం అంటున్నారు వైద్య శాస్త్రవేత్తలు. సంతోషం, ఆనందం, ఉల్లాసం. పేరు ఏదైతేనేం? ఇలాంటి సానుకూల ధోరణులు మానసికంగానే కాకుండా శారీరకంగానూ మంచి ఫలితాలు చూపిస్తున్నాయని చెబుతున్నాయి అధ్యయనాలు. ఆరోగ్యవంతమైన జీవితానికి, మరింత ఎక్కువకాలం బతకటానికి తోడ్పడుతున్నాయని వివరిస్తున్నాయి. మరి సంతోషించటానికి సంకోచమెందుకు? ఆనందించటానికి అడ్డంకులెందుకు? 'అంతర్జాతీయ ఆనంద దినం' సందర్భంగా ఉరుకుల పరుగుల వ్యవహారాలను కాస్త పక్కనపెట్టి ఆనందయోగంపై ఓ కన్నేయండి. ఒకింత సంతోష మాధుర్యాన్ని చవిచూడండి.

"జీవిత పరమార్థం, ఉద్దేశం ఆనందమే. మనిషి పరమోత్కృష్ట లక్ష్యం, అతడి ఉనికి అంతం కూడా అదే" -ప్రముఖ గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ 2 వేల సంవత్సరాల క్రితం పలికిన మాట. ఇప్పటికీ ఇది సత్యంగానే నిలుస్తోంది. అవును. మనిషి ఏ పనిచేసినా ఆనందం కోసమే. అదే లేకపోతే అన్నీ వ్యర్థమే. అందుకే ఆనందం, సంతోషం కోసం మనిషి అనాదిగా వెంపర్లాడుతూనే ఉన్నాడు. మనం ఆనందాన్ని అనుభవించగలం. చేతలతో వ్యక్తీకరించగలం. కానీ ఆనందమంటే ఏంటని అడిగితే మాత్రం బిక్క మొహం వేస్తాం. ఆనందాన్ని ఒక్క మాటలో నిర్వచించటం అసాధ్యం. ఒక పనిని విజయవంతంగా పూర్తి చేసినప్పుడు పెదవులపై మెదిలే చిరునవ్వు. కోరుకున్నది చేతికందినపుడు కళ్లల్లో మెరిసే సంతోషం. చిన్ననాటి స్నేహితులను చూసినపుడు ఉరకలెత్తే ఉత్సాహం. చిరకాలంగా ఊరిస్తున్న లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో అణువణువునా తొణికిసలాడే ఆత్మ విశ్వాసం. అన్ని అవరోధాలను ఎదిరించి జీవిత మాధుర్యాన్ని చవిచూశామన్న సంతృప్తి. ఇలాంటి సానుకూల భావోద్వేగాలన్నీ సంతోషం, ఆనందానికి ప్రతీకలే. అయితే ఇవి కేవలం మానసిక పరమైన భావనలు మాత్రమే కాదు. వీటి ప్రభావాలు మనసుకు కొత్త హుషారును, హాయిని కలిగించటంతోనే ఆగిపోవు. శారీరకంగానూ గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఆనందం, సంతోషం వంటివి జీవితాన్ని సానుకూల దృక్పథంతో, ఆశావహ దృష్టితో చూడటానికి తోడ్పడతాయి. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవటం.. మరింత ఎక్కువగా వ్యాయామం చేయటం వంటి జీవనశైలి, అలవాట్లకూ దోహదం చేస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవన్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరచేవే. ఆరోగ్యం బాగుంటే మనసూ బాగుంటుంది. ఇది ఆనందాన్ని మరింత రెట్టింపు చేస్తుంది కూడా.

ఆనందయోగం ఆరోగ్యభాగ్యం!





వితరణ శీలి, ఐరాస ప్రత్యేక సలహాదారు జేమ్ ఇలీన్ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన 'అంతర్జాతీయ ఆనంద దినం'ను 2013 నుంచి నిర్వహిస్తున్నారు

జన్యువులు కీలకం

ఆనందం, సంతోషం చాలావరకూ వ్యక్తిగత అనుభూతులే. మన సంస్కృతి, పుట్టి పెరిగిన పరిస్థితులు, చుట్టుపక్కల పరిసరాలు.. వీటి మూలంగా ఎదురైన అనుభవాల వంటివన్నీ వీటిని ప్రభావితం చేస్తాయి. అంతేకాదు.. ఇందులో మన జన్యువుల పాత్ర కూడా కీలకమే. వేర్వేరు అండాలు ఫలదీకరణ చెందటం వల్ల పుట్టిన కవలలతో పోలిస్తే ఒకే అండం ఫలదీకరణ చెందటం వల్ల జన్మించిన కవలల్లో ఆనంద స్థాయిలు ఒకే విధంగానూ, అవి మరింత స్థిరంగానూ ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆనందం విషయంలో జన్యువులు పాలు పంచుకుంటున్నట్టు ఇవి చెప్పకనే చెబుతున్నాయి. ఆనందం, హాయి వంటి భావనలను కలిగించటానికి తోడ్పడే డొపమైన్ అనే నాడీ రసాయనం మన మెదడులో ఎక్కువగా లేదా తక్కువగా ఉత్పత్తి కావటానికి ఈ జన్యువులు దోహదం చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

ఆనంద రహస్యమేంటి?

మనం ఆనందంగా ఉండటమనేది చాలావరకు జన్యువుల మీదే ఆధారపడి ఉంటుందని చెప్పుకోవచ్చు. అందుకే కొందరు సహజంగానే ఇతరుల కన్నా ఎక్కువ ఆనందంగా, సంతోషంగా కనిపిస్తుంటారు. పుట్టుకతోనే సంక్రమించే ఈ జన్యువులను, వాటి ప్రభావాలను మనం మార్చలేకపోవచ్చు. అంతమాత్రాన చింతించాల్సిన పనేమీ లేదు. ఎందుకంటే దాదాపు 40% మంది తమ అలవాట్లు, అభిరుచులు, ప్రవర్తనల వంటి వాటి ద్వారానే సంతోషంగా జీవిస్తున్నారని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆనందం మీద హార్వర్డ్ విశ్వవిద్యాలయం దీర్ఘకాలంగా.. 1938 నుంచీ అధ్యయనం చేస్తూనే ఉంది. ఈ అధ్యయనం కోసం ఎంచుకున్నవారిలో కొందరి వయసు ఇప్పుడు 90 ఏళ్లు దాటింది కూడా. ప్రతి రెండేళ్లకూ వీరి నుంచి వివిధ రకాల సమాచారాన్ని సేకరించి పరిశోధకులు విశ్లేషిస్తూనే వస్తున్నారు. మనిషి ఆనంద స్థాయుల విషయంలో కొన్ని రకాల గుణాలు, ప్రవర్తనలు దోహదం చేస్తున్నట్టు ఇందులో గుర్తించారు.

- **గతం గతః:** వైఫల్యాలను, దెబ్బతిన్న సంబంధాలను అదేపనిగా తలచుకొని బాధపడితే ఒరిగేదేమీ లేదు. జరిగిందేదో జరిగిపోయిందని గుర్తించి, వర్తమానంలో జీవించటం నేర్చుకునేవారు మరింత ఆనందంగా ఉంటున్నారని పరిశోధకులు చెబుతున్నారు. ఇలాంటివాళ్లు జీవితం చిన్నదనే విషయాన్ని గ్రహించి, తమకు సంతోషం కలిగించే విషయాలపై మరింత ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఇది మరింత హాయిగా జీవించటానికి తోడ్పడుతోంది.
- **సామాజిక సేవ:** స్వచ్ఛంద సేవ, వితరణ, బాధల్లో ఉన్నవారిని ఆదుకోవటం వంటి వాటితో జీవిత పరమార్థం అవగతమవుతుంది. మనసు తేలిక పడి, కొత్త ఉత్సాహం పరవళ్లు తొక్కుతుంది. ఇలాంటి సామాజిక సేవల ప్రభావం 45-80 ఏళ్ల వయసువారిలో మరింత ప్రస్ఫుటంగా కనబడుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. జీవితంలో ఒడిదొడుకులు సహజం. ఆత్మీయులను కోల్పోవటం, జబ్బులు, అనుకోని ఆపదల వంటివి ఎదురైనప్పుడు తమలాంటి సమస్యలతోనే బాధపడుతున్నవారిని కలుసుకొని, మాట్లాడుకోవటం మంచిది. దీంతో తనలాంటి వాళ్లు మరెందరో ఉన్నారనే సంగతీ అవగతమవుతుంది.
- **బాల్యంలోకి తొంగిచూడటం:** చిన్నప్పుడు ప్రతిదీ అపురూపమే. అన్నీ ఆశ్చర్యకరమే. ఆడినా, పాడినా అదంతా ఆనందలోకమే. కాబట్టి అప్పట్లో ఆనందం కలిగించినవేంటని ఒకసారి బాల్యంలోకి తొంగి చూస్తే చాలు. చాలా సంతోష రహస్యాలు తెలుస్తాయి. మరచిపోయిన, సమయం దొరక్క విడిచిపెట్టిన హాబీల వంటివి తిరిగి మొదలుపెడితే ఆనందం దానంతట అదే పొంగుకొస్తుంది.
- **సమయాన్ని 'కొనటం':** డబ్బుతో సంతోషాన్ని కొనలేం. కానీ డబ్బును ఖర్చు చేసే తీరు కచ్చితంగా మనసుపై ప్రభావం చూపుతుంది. సమయాన్ని మిగిల్చే సేవల కోసం డబ్బు వెచ్చించటం.. అంటే ఇంటిని శుభ్రపరచటం, పెరటితోట పెంపకం, లేదా కిరాణా సామగ్రి ఇంటికి తెచ్చిఇవ్వటం వంటి వాటికి ఖర్చు చేయటం మరింత ఆనందానికి కారణమవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. సేవల కోసం ఖర్చు పెట్టినపుడు సంతోషం కలిగించే పనులను చేయటానికి మరింత సమయం దొరుకుతుంది. అలాగే రోజూ ఇంటి పనులతో విసిగిపోవటంతో తలెత్తే ఒత్తిడి కూడా తగ్గుతుంది.
- **ఒకింత వ్యాయామం:** ఆనందం, వ్యాయాయం.. రెండూ పరస్పర ఆధారితాలు. వ్యాయామం చేస్తే మెదడులో ఎండార్ఫిన్ల వంటి రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి నొప్పి తగ్గటానికి, హాయి భావన కలిగించటానికి తోడ్పడతాయి. ఇక మనసు ఆనందంగా ఉన్నప్పుడు మరింత హుషారుగా వ్యాయామం చేయాలనీ అనిపిస్తుంది. కాబట్టి వ్యాయామాన్ని చిన్నచూపు చూడటం తగదు.



ఆత్మీయ సంబంధాలు

జీవిత భాగస్వామి, కుటుంబం, స్నేహితులతో ఆత్మీయ, సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటానికీ ఆనందానికీ బలమైన సంబంధమే ఉంటోంది. వ్యక్తిగత సంబంధాలు మనసును, భావోద్వేగాలను ప్రేరేపిస్తాయి. ఇవి మూడ్‌నూ ఉత్తేజితం చేసి ఆనందంగా ఉండేందుకు తోడ్పడతాయి.

అధ్యయనాల దన్ను

మంచి అలవాట్లు, సానుకూల దృక్పథం అబ్బేలా చూడటమో, ఆత్మ విశ్వాసం ఇనుమడించేలా చేయటమో.. కారణమేదైనా ఆనందం వల్ల మనకు ఎన్నెన్నో ప్రయోజనాలు లభిస్తున్నాయని అధ్యయనాలూ రుజువు చేస్తున్నాయి.

1 గుండెకు రక్షణ


సంతోషం, ఆనందం గుండె నుంచి పుట్టుకురాకపోవచ్చు. కానీ గుండెకు మాత్రం ఎంతో మేలు చేస్తాయి. ఉల్లాసంగా, సంతోషంగా గడిపేవారిలో గుండె వేగం, రక్తపోటు తక్కువగా ఉంటున్నట్టు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ అధ్యయనాలు పేర్కొంటుండటమే దీనికి నిదర్శనం. వీరి రక్తంలో గుండెజబ్బు ముప్పును పెంచే ఫైబ్రినోజెన్ ప్రోటీన్ స్థాయిలూ తక్కువగా ఉంటున్నట్టు తేలింది. గుండెజబ్బు ముప్పు పొంచి ఉన్నవారిలోనూ ఆనందం, సంతోషం మంచి ప్రభావాలు చూపుతున్నట్టు 2008లో చేసిన మరో అధ్యయనంలో బయటపడింది. వీళ్ల ఆనందంగా, సంతోషంగా ఉన్న రోజున పరీక్షించగా- అంతకుముందు కన్నా గుండె మరింత సమర్థంగా పనిచేస్తున్నట్టు బయటపడటం విశేషం. ఆనందం వంటి సానుకూల భావనల మూలంగా గుండెజబ్బు ముప్పు 22% తగ్గుతున్నట్టు 2010లో నిర్వహించిన దీర్ఘకాల అధ్యయనం ఒకటి పేర్కొంటోంది.

2 రోగనిరోధకవ్యవస్థ బలోపేతం

ఆనందానికీ, రోగనిరోధకవ్యవస్థకూ మధ్య బలమైన సంబంధమే ఉంటున్నట్టు పరిశోధనలు పేర్కొంటున్నాయి. కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు 2003లో ఒక వినూత్న ప్రయోగం చేశారు. సుమారు 350 మందిని ఎంచుకొని జలుబు వైరస్ ప్రభావానికి గురిచేసి.. ఐదు రోజుల పాటు విడిగా ఉంచారు. ఆనందంగా, ఉత్సాహంగా, ప్రశాంతంగా ఉండేవారు జలుబుకు అంత త్వరగా లొంగకపోవటం గమనార్హం. దీనికి కారణమేంటని పరిశోధకులు మరింతగా శోధించారు కూడా. మరో మూడేళ్ల తర్వాత కొందరు విద్యార్థులకు హెపటైటిస్ బి టీకా ఇచ్చి పరిశీలించారు. సానుకూల భావోద్వేగాలు ఎక్కువగా గలవారిలో టీకా సంబంధ యాంటీబాడీలు రెండు రెట్లు ఎక్కువగా కనిపించటం ఆశ్చర్యకరం. ఇది రోగనిరోధకశక్తి చాలా సమర్థంగా పనిచేస్తుందనటానికి సూచిక. ఆనందం కణ స్థాయిలోనూ పనిచేస్తోందని ఇది నొక్కిచెబుతోంది.

సర్వతోముఖాభివృద్ధి సాధనం

"ఇదీ ఆనందమని మనం కచ్చితంగా నిర్వచించలేకపోవచ్చు గానీ ఎలాంటి ప్రతికూల ఉద్రేకాలు లేని స్థితిని ఆనందం, సంతోషమని చెప్పుకోవచ్చు. రోజూ మనం రకరకాల ఉద్రేకాలకు లోనవుతుంటాం. కోపం, బాధ, విచారం వంటివి శరీరానికి చాలా హాని చేస్తాయి. అదే సంతోషం, ఆనందం వంటి సానుకూల భావోద్వేగాలు ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతాయి. రక్తపోటు, గుండె వేగం తగ్గటం వంటి మంచి మార్పులకు బీజం వేస్తాయి. ఆనందం మూలంగా శరీరంలోని అన్ని వ్యవస్థలు సజావుగా పనిచేస్తాయి. ఇది జబ్బుల నివారణకూ, ఆయుష్షు పెరగటానికీ దోహదం చేస్తుంది. మానసికంగానూ చక్కటి ప్రయోజనాలు ఒనగూడుతాయి. మనసు కుదురుగా ఉంటుంది, ఏకాగ్రత పెరుగుతుంది. సానుకూల ఆలోచనలు వెల్లువెత్తుతాయి. దీంతో అణువణువునా ఉత్సాహం, ఉల్లాసం తొణికిసలాడతాయి. ఆనందం, సంతోషం అనేవి కేవలం శరీరం, మనసుకే కాదు.. మనం సామాజికంగా సర్దుకుపోవటానికీ ముఖ్యమే. ఆనందంగా ఉన్నప్పుడు మెదడులో నాడుల మధ్య సమాచారాన్ని చేరవేసే రసాయనాలు సమర్థంగా పనిచేస్తాయి. దీంతో నలుగురితో సర్దుకుపోయే గుణం మెరుగవుతుంది. ఎప్పుడూ సీరియస్‌గా కనిపించేవారు నలుగురితో సరిగా కలవలేరు. వీళ్ల కోపం, విచారం వంటి వాటిని బయటకు ప్రదర్శించలేకపోయినా కూడా వాటి ఛాయలు ముఖంలో కదలాడుతూనే ఉంటాయి. ఇలాంటివారు నలుగురితో కలవటంలో ఇబ్బంది పడతారు. మనసు విప్పి మాట్లాడలేరు. దీంతో సామాజిక సంబంధాలూ దెబ్బతింటాయి. ముఖ్యంగా చెప్పుకోవాల్సిందేటంటే- ఆనందమనేది మనిషి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే సాధనం. ఇది శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా.. ఇలా అన్ని రకాలుగా మనిషి ఉన్నతికి తోడ్పడుతుంది."



- డా॥ కె.నిరంజన్ రెడ్డి
క్లినికల్ సైకాలజిస్ట్

3 ఒత్తిడిని ఓడిస్తుంది

ఒత్తిడి మన మానసిక స్థితిని దెబ్బతీయటమే కాదు. ఒంట్లో హార్మోన్లను అస్తవ్యస్తం చేయటం దగ్గర్నుంచి రక్తపోటు పెరగటం వరకూ ఎన్నెన్నో దుష్ప్రభావాలకూ దారితీస్తుంది. ఆనందం ఇలాంటి ప్రభావాలు నియంత్రణలో ఉండటానికి, వీటి నుంచి త్వరగా కోలుకోవటానికి తోడ్పడుతుంది. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేవారిలో ఒత్తిడికి కారణమయ్యే కార్టిజోల్ హార్మోన్ స్థాయులు 23% తగ్గుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. రక్తం గడ్డకట్టేలా చేసే ప్రోటీన్ మోతాదులు సైతం 12 రెట్లు తక్కువగా ఉంటున్నట్టూ వెల్లడైంది. ఒత్తిడి అనివార్యమైన పరిస్థితుల్లోనూ ఆనందం మంచి ప్రభావం చూపుతోంది. కొందరు విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురిచేసి పరిశీలించగా.. సంతోషం వంటి సానుకూల భావోద్వేగాలు గలవారిలో గుండె వేగం, రక్తపోటు చాలా త్వరగా మామూలు స్థాయికి చేరుకున్నట్టు తేలింది.

4 జబ్బులు, వైకల్యంతోనూ పోరు

తీవ్రమైన, దీర్ఘకాల జబ్బుల నుంచి కోలుకోవటానికీ ఆనందం తోడ్పడుతుంది. ఆనందంగా గడుపుతున్నామని, జీవితం మీద సంతృప్తి చెందుతున్నామని చెప్పినవారిలో చాలామందికి దీర్ఘకాల జబ్బుల ముప్పు 1.5 రెట్లు తక్కువగా ఉంటున్నట్టు 2008లో ఆస్ట్రేలియాలో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఆత్మ విశ్వాసం, ఆనందం, ఉత్సాహం వంటివి ఎక్కువగా గల వృద్ధులను దుర్బలత్వం అంత త్వరగా దరిజేరటం లేదని మెక్సికోలో నిర్వహించిన మరో అధ్యయనం పేర్కొంటోంది. ఇలాంటి వృద్ధులకు పక్షవాతం ముప్పు సైతం తక్కువేనని, ముఖ్యంగా మగవారిలో ఇది మరింత స్పష్టంగా కనబడుతోందని పరిశోధకులు పేర్కొంటున్నారు.


5 ఆయుష్షు పెంచుతుంది

మన జీవనకాలం పెరగటంలోనూ ఆనందం, సంతోషం కీలకపాత్ర పోషిస్తాయి. గతంలో కొందరు నన్‌లపై చేసిన ప్రముఖ అధ్యయనమే దీనికి పెద్ద నిదర్శనం. నన్‌లు 20 ఏళ్ల వయసులో రాసుకున్న ఆత్మకథాత్మక వ్యాసాలను పరిశోధకులు క్షుణ్నంగా విశ్లేషించారు. ఆనందంగా, సంతోషంగా ఉన్నామని పేర్కొన్నవారు 7-10 సంవత్సరాలు ఎక్కువగా జీవించినట్టు గుర్తించారు. ఈ విషయం 2011లో నిర్వహించిన అధ్యయనంలోనూ మరోసారి రుజువైంది. ఆనందం స్థాయులు ఎక్కువగా గల వృద్ధులకు మరణించే ముప్పు 35% వరకు తగ్గుతున్నట్టు తేలటం గమనార్హం.

ఒత్తిడి.. జుట్టుకూ చేటే!

జుట్టు ఊడిపోవటానికి కారణాలు ఎన్నెన్నో. వీటిల్లో ఒత్తిడీ ఒకటి. శారీరకంగా, మానసికంగా తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు కొందరికి జుట్టు ఊడిపోతుంటుంది. కొందరికి కొన్ని వారాలు, నెలల పాటూ జుట్టు రాలిపోతుంటుంది. ఆందోళనకు గురిచేసేదే అయినా ఇది తాత్కాలిక సమస్యే. ఒత్తిడి తగ్గితే జుట్టు తిరిగి మొలుస్తుంది. ఒత్తిడి మూలంగా జుట్టు రాలటమనేది సాధారణంగా మూడు రకాలుగా కనబడుతుంది.

- ఒత్తిడికి లోనైనప్పుడు చాలా వెంట్రుకల కుదుళ్లు విశ్రాంతి దశలోకి వెళ్లిపోతుంటాయి. ఫలితంగా వెంట్రుకలు పెరగటం ఆగిపోతుంది. ఇలాంటి కుదుళ్లతో కూడిన వెంట్రుకలు కొన్ని నెలల తర్వాత హఠాత్తుగా కుచ్చుకుచ్చులుగా ఊడిపోవటం మొదలవుతుంది. దీంతో తలలో అక్కడక్కడా ఖాళీగా ఉన్నట్టు కనిపిస్తుంటుంది.
- పేను కొరుకుడుకు రకరకాల అంశాలు దోహదం చేస్తాయి. ఒత్తిడి మూలంగానూ ఇది రావొచ్చు. వీరిలో రోగనిరోధక వ్యవస్థ పొరపాటున వెంట్రుకల కుదుళ్లపై దాడిచేసి వెంట్రుకలు ఊడిపోవటానికి కారణమవుతుంది.
- కొందరు ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, ఒంటరితనం వంటి వాటి నుంచి బయటపడటానికి జుట్టును చేతులతో బలంగా లాగుతుంటారు. ఇదీ వెంట్రుకలు ఊడి రావటానికి దారితీస్తుంది.



తగ్గించుకోవటమెలా?

ఒత్తిడిని తగ్గించుకోవటం చాలా కీలకం. ఒత్తిడి తగ్గితే జుట్టు తిరిగి మొలుస్తుంది. ఇందుకు జీవనశైలి మార్పులు బాగా తోడ్పడతాయి.

- రోజూ రాత్రిపూట 7-8 గంటల సేపు కంటి నిండా నిద్రపోవటం మంచిది.
- తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఉదయం అల్పాహారం మానెయ్యరాదు.
- వ్యాయామంతో ఒత్తిడి తగ్గుముఖం పడుతుంది. కాబట్టి రోజుకు కనీసం అరగంట సేపు వ్యాయామం చేయాలి.
- గోరువెచ్చటి నూనెతో నెమ్మదిగా మర్దన చేస్తే రక్త ప్రసరణ మెరుగుపడి జుట్టు ఊడటం తగ్గొచ్చు.

ఈనాడు సినిమా


పూజా హెగ్డే

దిగాక భయపడను

ఎన్ని సినిమాలు చేసినా, మరో కొత్త సినిమా అనగానే కథానాయికగా నా ప్రయాణం కొత్తగా మొదలైనట్టే ఉంటుందని చెబుతోంది పూజా హెగ్డే. తెలుగులో ప్రస్తుతం వరుస అవకాశాల్ని అందుకొంటూ దూకుడు ప్రదర్శిస్తోందీమె. ప్రభాస్, మహేష్, ఎన్టీఆర్... ఇలా అగ్ర కథానాయకుల చిత్రాలన్నింట్లోనూ ఆమే కథానాయిక. త్వరలో విడుదల కాబోతున్న 'రంగస్థలం'లో ప్రత్యేకగీతంలో ఆడిపాడింది. సినిమాల కోసం ప్రత్యేకంగా సన్నద్ధం కావడం అంటూ ఏమైనా ఉంటుందా? అని అడిగితే... "కథానాయకుల శైలితో పాటు... కథ పాత్రల తీరుతెన్నుల్ని కచ్చితంగా తెలుసుకొంటుంటా. అయితే ఎంత తెలుసుకొన్నా మనసులో కాస్త భయం ఉంటుంది. పాత్రలో ఎలా ఒదిగిపోతానో, సహ నటులతో ఎలా కలిసిపోతానో అని! అయితే అదంతా సెట్లోకి దిగేవరకే. ఒక్కసారి దిగాక మనసునిండా కథ, పాత్రలే ఉంటాయి. కానీ ఆ భయమే నాకు చాలా మేలు చేస్తుంటుంది. ఆ సినిమాల గురించి మరిన్ని ఎక్కువ కసరత్తులు చేయడానికి కారణమవుతోంద"ని చెప్పుకొచ్చింది పూజా హెగ్డే.

ష్... మేడమ్ నిద్రపోతోంది!

అనుకొన్నంత సులభంగా ఏమీ ఉండదు సినిమా తారల జీవితం. ఎర్రటి ఎండల్లోనైనా... రక్తం గడ్డ కట్టే మంచు కొండల్లోనైనా ఆడిపాడాల్సిందే, దర్శకుడి ఆలోచనలకి తగ్గట్టుగా సన్నివేశాలు పండించాల్సిందే. అవసరమైతే ఒకొక్క సన్నివేశం కోసం పదుల సార్లు కష్టపడాల్సిందే. అలాంటి సందర్భాల్లోనే తారలు అలసి సొలసి, షాట్ గ్యాప్‌లో ఇలా సేద తీరుతుంటారు. ప్రస్తుతం 'మహానటి'లో నటిస్తున్న సమంత ఆ సెట్లోనే ఇలా కుర్చీలో కూర్చుని చిన్నపాటి కునుకు తీస్తున్నారు. 'ష్.. మేడమ్ నిద్రపోతోంది' అంటూ పక్కనే తన బృందం చేరి ఆమెకి సపర్యలు చేస్తున్నట్టుంది. ఈ స్టిల్ సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది.

సెట్లో సందడి



సిల్లీ ఫెలోస్.. వీళ్లేనా?


అల్లరి నరేష్


సునీల్

అల్లరి నరేష్, సునీల్ కథానాయకులుగా భీమినేని శ్రీనివాసరావు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. రాయ్ కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. త్వరలోనే ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తారు. ఈ సినిమా కోసం పలు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వాటిలో 'సిల్లీ ఫెలోస్' అనే పేరు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. నరేష్ - భీమినేని కలయికలో వచ్చిన 'సుడిగాడు' మంచి విజయాన్ని అందుకుంది. తమిళంలో విజయవంతమైన 'తమిజ్ పాదం'కి రీమేక్ అది. అక్కడ 'తమిజ్ పాదం 2' కూడా విడుదలైంది. దాన్నే 'సిల్లీ ఫెలోస్' పేరుతో తెలుగులో తీస్తున్నారని సమాచారం.


దూసుకొస్తున్న టాక్సీ

'పెళ్లి చూపులు', 'అర్జున్ రెడ్డి' చిత్రాలతో ఆకట్టుకున్నాడు విజయ్ దేవరకొండ. ఇప్పుడు 'టాక్సీవాలా'గా మారాడు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా జీఏ 2, యువీ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్ కథానాయికలు. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. ఎస్‌కెఎన్ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మే 18న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. నిర్మాత మాట్లాడుతూ "బలమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. విజయ్ పాత్ర మరోసారి ఆశ్చర్యపరుస్తుంది. తన ఇమేజ్‌ని 'టాక్సీవాలా' మరింత పెంచుతుంది. జేక్స్ అందించిన సంగీతం, జాషువా పోరాటాలు ప్రధాన ఆకర్షణ. ఈనెల 23న ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తాము"న్నారు.


విజయ్ దేవరకొండ


సికిందర్ వచ్చేశాడు!

'టైగర్ జిందా హై'లో టైగర్ సింగ్ రాథోడ్‌గా సత్తా చాటి విజయాన్ని అందుకొన్నారు సల్మాన్‌ఖాన్. త్వరలో సికిందర్‌గా సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు. కానీ కథానాయకుడిగా కాదు...ప్రతినాయక ఛాయలున్న పాత్రలో. సల్మాన్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'రేస్ 3'. రేస్ చిత్రాల సిరీస్‌లో వస్తున్న ఈ చిత్రానికి అబ్బాస్ మస్తాన్ దర్శకుడు. తాజాగా ఈ సినిమాలో సల్మాన్‌ఖాన్‌కు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలై ఆకట్టుకుంటోంది. ఇందులో సల్మాన్‌ది నెగెటివ్ పాత్ర. "నా పేరు సికిందర్' అంటూ ఈ పోస్టర్‌ను ట్వీట్ చేశారు సల్మాన్. జూన్ 15న ఈ చిత్రం విడుదలకానుంది.


'రేస్ 3'లో సల్మాన్‌ఖాన్

జంబ లకిడి పంబ మళ్లీ

శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి ఇద్నాని జంటగా జె.బి.మురళీకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జంబ లకిడి పంబ'. రవి, జో జో జోస్, శ్రీనివాస్ రెడ్డి.ఎన్ నిర్మాతలు. ఈ చిత్ర లోగోను హైదరాబాద్‌లో అల్లరి నరేష్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "జంబ లకిడి పంబ పదాన్ని రేలంగి సృష్టించారు. దాన్నే నాన్న టైటిల్‌గా పెట్టి సినిమా తీశారు. ఆ చిత్రానికి దీటుగా ఉంటుందని భావిస్తున్నా. అందరికీ మంచి పేరు తీసుకురావాల"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "గతంలో వచ్చిన 'జంబ లకిడి పంబ'తో ఈవీవీ కామెడీలో కొత్త కోణాన్ని చూపారు. దానికి ఈ సినిమాకు ఏ సంబంధం లేదు. కథకు సరిపోతుందని ఆ పేరు పెట్టాం. టైటిల్ గౌరవాన్ని కాపాడేలా చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నామ"న్నారు.


శ్రీనివాస్‌రెడ్డి

ఎడిటర్ అనిల్ మల్నాడ్ కన్నుమూత

ప్రముఖ సినీ ఎడిటర్ అనిల్ మల్నాడ్ (60) సోమవారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. బాపు దర్శకత్వంలోని 'వంశవృక్షం' చిత్రం ద్వారా ఎడిటర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టారు అనిల్. ఆ తర్వాత బాపు దర్శకత్వంలోని దాదాపు 13 చిత్రాలకు ఎడిటర్‌గా సేవలందించారు. వంశీ దర్శకత్వంలోని 'సితార' చిత్రానికి 1985లో జాతీయ అవార్డును అందుకున్నారు. ఇక 'ఆలాపన' చిత్రానికి నంది అవార్డును సొంతం చేసుకున్నారు. మంచుపల్లకి, సితార, అన్వేషణ, ఆలాపన, లేడీస్ టైలర్, మహర్షి, ఏప్రిల్ ఒకటి విడుదల, చెట్టుకింద ప్లీడరు వంటి పలు చిత్రాలు అనిల్‌కు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. తెలుగులోనే కాకుండా తమిళంలోనూ 100 పైగా చిత్రాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మొత్తం 600 చిత్రాలకు ఎడిటర్‌గా సేవలందించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం 7.30 గంటలకు చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు చెన్నైలో జరగనున్నాయి.

- న్యూస్‌టుడే, చెన్నై




పవన్ కల్యాణ్ అభిమానిని!

'అప్పట్లో ఒకడుండేవాడు', 'మెంటల్ మదిలో'... ఇలా వైవిధ్యభరితమైన కథలతో మెప్పిస్తున్నాడు శ్రీవిష్ణు. నటుడిగా.. ఒక్కో సినిమాతో ఎదుగుతున్నాడు కూడా. 'మెంటల్ మదిలో'తో వాణిజ్యపరమైన విజయం కూడా దక్కింది. ఇప్పుడు 'నీదినాది ఒకే కథ' అంటూ మరో కథ వినిపించబోతున్నాడు. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో శ్రీవిష్ణు విలేకర్లతో మాట్లాడారు.


శ్రీవిష్ణు

■ 'నీది నాది ఒకే కథ' అంటే.. ఈ కథ ఏ ఇద్దరిదో కాదు. మధ్యతరగతికి చెందిన వారందరిదీ. రుద్రరాజు సాగర్ అనే ఓ కుర్రాడి కథ ఇది. ఇందులో పవన్ కల్యాణ్ అభిమానిలా కనిపిస్తాను. జీవితంపై నిర్లక్ష్యం అణువణువూ నిండుకున్న పాత్ర అది. చదువుకునే స్థాయి నుంచీ జీవితంలో స్థిరపడేవరకూ సాగే కథ. సమాజం కోసం రాజీపడిపోయి, నచ్చిన దారి మర్చిపోయి... ఎటో పయనించడంలో ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది తప్పు.. అని చెబుతున్నాం. తండ్రీకొడుకుల మధ్య సాగే దృశ్యాలు మెప్పిస్తాయి. తండ్రిగా దర్శకుడు దేవిప్రసాద్ నటన ప్రశంసల్ని అందుకోవడం ఖాయం. కొత్త మాటలు, పోకడలతో, ప్రతి ఒక్కరూ వారి జీవితాల్ని చూసుకున్నామనే భావన కలిగేలా దర్శకుడు చిత్రించాడు. పెద్ద పెద్ద సెట్లు, ట్రాలీలు, క్రేన్‌లు ఇవేమీ ఈ సినిమా కోసం వాడలేదు. ప్రతి సన్నివేశం సహజంగా రావడానికి చేసిన ప్రయత్నమిది"

■ విభిన్నమైన పాత్రలు చేయాలనే దృక్పథంలో నడుస్తున్నాను. 'వీరభోగ వసంతరాయలు' చిత్రం ఇలాంటిదే. ఇందులో కథానాయకుడుగా కాకుండా ఓ మంచి పాత్రలో నటిస్తున్నా. నారా రోహిత్, సుధీర్‌బాబు ఈ చిత్రానికి కథానాయకులు. నేను వింత గెటప్స్‌లో కనిపిస్తాను. 'అసుర' చిత్రం తీసిన కృష్ణ విజయ్‌తో 'తిప్పరా మీసం?' చిత్రంలో నటిస్తున్నాను. మీసాన్ని ఎప్పుడు పడితే అప్పుడు కాదు, తిప్పాల్సినప్పుడే తిప్పాలి.. అనే అంశాన్ని చెప్పే కథాచిత్రమిది. ఇదివరకు ఇలాంటి సినిమా రాలేదు. వీటితోపాటు ఓ పోలీస్ కథా చిత్రంలో నటిస్తున్నాను. ప్రదీప్ దర్శకుడుగా పరిచయం అవుతున్నాడు"


జాక్వెలిన్ ఫెర్నాండెజ్.

మాధురిలా మెప్పించిందా జాక్వెలిన్

'ఏక్ దో తీన్...' ఈ పాట వినపడగానే మోహినిగా స్టెప్పులతో మత్తెకించిన మాధురీ దీక్షిత్ కళ్ల ముందు కదలాడుతుంది. ఈ పాపులర్ పాటను ఇప్పుడు 'బాఘి 2'లో రీమేక్ చేశారు. మోడరన్ మోహిని అవతారం ఎత్తింది శ్రీలంక సుందరి జాక్వెలిన్ ఫెర్నాండెజ్. తాజాగా ఈ వీడియో సాంగ్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 'మాధురిలా చేయడం చాలా కష్టం.. కానీ నా వంతు ప్రయత్నం చేశాను' అని ఇప్పటికే చెప్పింది జాక్వెలిన్. అలా చెప్పినా కానీ అదరొగొట్టేస్తుంది అనుకున్నారు అంతా. ఈ పాటకు జాక్వెలిన్ అభిమానుల్ని మంచి స్పందన వస్తున్నా మాధురి అభిమానులు పెదవి విరుస్తున్నారు. "మాధురి ఆడిటోరియంలోకి రాగానే నమస్కార్ అంటూ పలికే ఒక్క మాటే బోలెడంత కిక్ ఇస్తుంది. కానీ ఈ పాటలో జాక్వెలైన్ ఏకంగా మోహిని అంటూ పరిచయం చేసేశారు. హుషారైన ఏ సందర్భానికైనా మాధురి 'ఏక్ దో తీన్..' గుర్తొస్తుంది. కానీ జాక్వెలిన్ భావోద్వేగాలు పలికించడం కంటే కూడా అందాల ప్రదర్శన మీదే ఎక్కువ దృష్టిపెట్టింది. ఇంత మంచి పాటకు జాక్వెలిన్ న్యాయం చేయలేదనిపిస్తుంది" అంటూ మాధురి అభిమానులు నిరుత్సాహపడుతున్నారు.



క క క కత్రిన... కౌగిలింత ఇదిగో షారుఖ్

ట్విట్టర్ తారా

'డర్' సినిమాలో జూహీ చావ్లా ఫొటో వద్ద నిల్చొని బరువైన హృదయంతో తన ప్రేమను వ్యక్తం చేస్తుంటాడు షారుఖ్. ఈ సన్నివేశాన్ని ప్రేక్షకులు మర్చిపోలేరు. ఇప్పుడు అలాంటిదే మరో సన్నివేశాన్ని సృష్టించాడు షారుఖ్. కత్రినా ఫొటో వంక ప్రేమగా చూస్తూ.. ఐస్‌క్రీమ్ తినిపిస్తున్నాడు. ఈ స్టిల్ కత్రినా, షారుఖ్ కలిసి నటిస్తున్న 'జీరో' సినిమాలోదో.. షారుఖ్ సరదాగా చేసిందో తెలియదు కానీ ట్విట్టర్‌లో పంచుకొన్నాడు. "నిజ జీవితంలో తను ఎలాగూ ఐస్‌క్రీమ్ తినదు. ఎందుకంటే ఫిట్‌నెస్ కోసం చాలా కష్టపడుతుంది కదా.. ఈ స్టిల్ చూస్తుంటే 'డర్' గుర్తుకొస్తుంది. ఐ లవ్ యు క క క కత్రిన" అని ట్వీటాడు షారుఖ్. దీనికి కత్రినా స్పందించింది. "ఆమె ఏమీ చేయలేకపోవచ్చు కానీ ఎర్ర డ్రెస్‌లో ఇలా కౌగిలింత ఇవ్వగలదు" అంటూ షారుఖ్‌ను గట్టిగా హత్తుకున్న ఫొటోను ట్వీట్ చేసింది కత్రినా.

ఎంత దూరమైనా...

రిచా పనయ్



రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'బృందావనమది అందరిది'. రిచాపనయ్, హర్షవర్ధన్ రాణే, లగడపాటి విక్రమ్, పృథ్వీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శ్రీనివాస్ వంగల, ప్రభాకర్‌రెడ్డి కూతురు నిర్మాతలు. తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ఉగాది సందర్భంగా టీజర్‌ని విడుదల చేశారు. 'ఈ ప్రపంచంలో డబ్బు తప్ప నన్నేదీ ఎట్రాక్ట్ చేయలేదు, అందుకే దాని కోసం ఎంత దూరమైనా వెళతాను' అంటూ మొదలయ్యే టీజర్ వినోదాన్ని పంచుతూనే ఆలోచన రేకెత్తించేలా ఉంది. దర్శకుడు మాట్లాడుతూ "అందరికీ వినోదాన్ని పంచే విభిన్నమైన కథతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. టీజర్‌కి మంచి స్పందన లభించింది. అది నాకెంతో ధైర్యాన్నిచ్చింది. తొలిసారి దర్శకత్వం వహిస్తున్నప్పటికీ చిత్రబృందం సహకారంతో ఓ మంచి చిత్రాన్ని తీస్తున్నామనే సంతృప్తి కలిగింది. విశాఖ సాగర తీరంలో వేసిన సెట్‌లో రిచాపనయ్, హర్షవర్ధన్ రాణే, శివప్రసాద్, హీరా సాహిలి, బెనర్జీ, తాగుబోతు రమేష్‌లపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించా"అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: తమ్మ శ్యామ్, పాటలు: సిరివెన్నెల సీతారామశాస్త్రి.

ఇదో కౌసల్య కథ!



ఈ చిన్నారి పేరు కౌసల్య. పుదుచ్చేరిలోని ఓ నిరుపేద కుటుంబంలో ఎనిమిది మంది సంతానంలో మూడో అమ్మాయి. పన్నెండేళ్లకే ఇంట్లోవాళ్లు పెళ్లి చేయాలనుకున్నారు. అయితే ఓ స్వచ్ఛందసంస్థ జోక్యంతో కాబోయే పెళ్లి నుంచి తప్పించుకుంది. ఆ తరువాత ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. పన్నెండో తరగతి అయ్యాక మిడ్‌వైఫరీ కోర్సులో చేరింది. మూడేళ్ల కోర్సు పూర్తిచేసి ఇప్పుడు ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగానికి అర్హతను పొందనుంది. ఇప్పుడు కౌసల్య తనలా బాల్యవివాహానికి బలయ్యే అమ్మాయిల్ని కాపాడేందుకు సిద్ధమైంది. పలు స్వచ్ఛందసంస్థల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఉద్యోగం వచ్చాక మారుమూల గ్రామాల్లో చిన్నవయసులోనే పెళ్లిళ్లై, ఆరోగ్యం పట్ల అవగాహన లేనివారికి సేవలందిస్తానంటోంది కౌసల్య. ఆమె సేవలకు మెచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించింది. సామాజికంగానే కాదు, తన ఇంట్లోనూ మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది కౌసల్య. తన తోబుట్టువులూ, చెల్లెళ్లూ... చదువుకునేలా తల్లిదండ్రుల్ని ఒప్పించింది. 'ఒకప్పుడు మా అమ్మానాన్నలు నాకు పన్నెండేళ్లకే పెళ్లిచేయాలనుకున్నారు. నాకు ఇష్టంలేకపోయినా తలొంచా. కానీ చివరకు నేను అనుకున్నదే జరిగింది. చదువుకున్నా. మరెవ్వరూ బలికాకూడదనే ఉద్దేశంతోనే అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా...' అంటుంది కౌసల్య.

వేసవిలో... వర్ణాల మేళా

వేసవి వచ్చిందంటే చాలు ఎంచుకునే దుస్తుల్ని ఒక్కసారిగా మార్చేస్తాం. ఏవయినా సరే తేలిగ్గా, సౌకర్యంగా ఉండాలి. చల్లదనాన్ని ఇవ్వాలి. చూసేందుకూ ఆహ్లాదంగా కనిపించాలి. ట్రెండీగానూ అనిపించాలి. మరి అలాంటి ఫ్యాషన్ పోకడలు ఈ ఏడు వేసవికి ఏం వచ్చాయి అంటారా... ఆ వివరాలే చెబుతున్నారు డిజైనర్ దీప్తిగణేష్.



వేసవి వచ్చిందంటే చాలు కాటన్ ఎంచుకోవడం మనకి ఎప్పటి నుంచో తెలిసిందే. కానీ దాన్ని ఉతకడం, గంజిపెట్టడం, ఇస్త్రీ... అబ్బో పెద్ద పనే. కానీ ఇప్పుడు వీటిల్లోనే సాఫ్ట్, మల్, ఆర్గానిక్, ఖాదీ, హ్యాండ్‌లూమ్ కాటన్... వంటివెన్నో రకాలు వచ్చాయి. ఇవి వేసుకునేందుకు తేలిగ్గా ఉంటాయి. ఉతకడం, భద్రపరచడం కూడా సులువే. ఇక ఈ కాలంలో ఎంచుకోదగ్గ మరో రకం రేయాన్. ఇవి శరీరాకృతికి తగ్గట్లుగా ఇమిడిపోతాయి. వాషింగ్‌మెషీన్‌లోనే ఉతికేయొచ్చు. ఈ కాలంలో రేయాన్‌లో స్ట్రెయిట్‌కట్, ఏలైన్ తరహాలో ట్యూనిక్‌లను ఎంచుకోవచ్చు. వీటితో పాటు లినెన్, మస్లిన్ రకాల్ని ఎంచుకున్నా ట్రెండీగా ఉంటాయి. కాటన్ ఖాదీలో లేత రంగులు కూడా లభిస్తాయి. ఇవి హుందాగా కనిపించేలా చేస్తాయి. చీరల్ని ఎంచుకోవాలనుకున్నప్పుడు కలంకారీ, లినెన్ వంటి రకాలు ట్రెండీగా ఉంటాయి.



ఎలా కుట్టించుకోవచ్చు...

కాటన్ రకాలతో సంప్రదాయశైలిలో ధోతీ కుర్తీలూ, సల్వార్లే కాదు...ప్యాంట్‌లూ, సూట్‌లు వంటివాటిని కూడా కుట్టించుకోవచ్చు. కాటన్‌తో ట్యూనిక్‌లు కుట్టించుకుని పలాజో, డెనిమ్, లెగ్గింగ్‌లకు జతగా వేసుకోవచ్చు. జియోమెట్రికల్, పూలూ, జంతువులూ, నమూనాల వంటి ఎన్నో రకాలు ఇప్పుడు ఆకట్టుకుంటున్నాయి. ఇవి అచ్చంగా అలానే ఎంచుకునే బదులు హాఫ్ అండ్ హాఫ్ తరహాలో మ్యాచింగ్‌గా చేసుకోవచ్చు.

■ షిఫాన్, జార్జెట్ వస్త్రాలు జాలువారుతూ ఉంటాయి. ఒకవేళ మీరు అనార్కలీ తరహాలో కుట్టించుకోవాలనుకుంటే డ్రెస్ పై భాగంలో కాటన్‌ని ఎంచుకుని అడుగున మాత్రం షిఫాన్, జార్జెట్ వంటివి జతచేయడం వల్ల లావుగా కనిపిస్తామన్న బాధా ఉండదు.



లేలేత ఛాయల్లో...

ఈ కాలంలో వేడిని తగ్గించే లేతఛాయల ఎంపికే మేలు. ముఖ్యంగా నలుపు కలిసిన నియాన్ రంగులకు దూరంగా ఉండాలి. దానికి బదులు తెలుపు కలిసిన టింట్ ఛాయలు ఆహ్లాదంగానూ అనిపిస్తాయి. ఇక కూరగాయలూ, పండ్లూ వంటివాటితో తయారు చేసిన సేంద్రియ రంగులు హాట్‌టాపిక్ ఇప్పుడు.

పీచ్, సముద్ర నీలం, ఆకుపచ్చా... వంటి ఇంగ్లిష్ రంగులూ, వాటి ఛాయలు ఫ్యాషన్‌గా చెలామణీ అవుతున్నాయి. ఇక మీ చర్మఛాయకు అనుగుణంగా ఈ టింట్ రంగుల్ని మేళవించి డిజైనర్లు దుస్తుల్ని రూపొందిస్తారు. వాటినీ ప్రయత్నించొచ్చు.







ఆకట్టుకునే డిజైన్లు...

వేసవి వచ్చిందంటే చాలు పూల ప్రింట్లు గుర్తొస్తాయి. వీటిల్లోనే ఆకులూ, కొమ్మలూ... ఇలా ప్రకృతికి సంబంధించిన ప్రతిదానికీ ఈ కాలంలో ప్రాధాన్యం లభిస్తుంది. పొడవాటి ఫ్లోరల్ గౌన్‌లు చక్కని ఎంపిక.

ఇక ప్రింట్ల విషయానికి వస్తే జామెట్రికల్, బాతిక్, లెహేరియా, షిబోరీ, టై అండ్ డై, కలంకారీ వంటివాటిని ఎంచుకోవచ్చు. ఇకత్ నేత పనితనం, త్రెడ్, లేస్ వంటి చేతి పనితనం కలిగిన డిజైన్లు చక్కని ఆలోచన. కలంకారీ, ఇకత్‌లను సిల్క్, కాటన్ రకాలకు కాలర్, హ్యాండ్‌కఫ్ వంటి చోట్ల డిజైన్ చేసి కొత్త లుక్‌ని తెచ్చిపెడుతున్నారు. వీటిల్లో బ్లేజర్‌లు ప్లెయిన్ దుస్తుల మీదకు బాగుంటాయి. టై అండ్ డైలో ఎసెమెట్రికల్ లాంగ్‌గౌన్ బాగుంటుంది. రేయాన్స్, కాటన్స్‌లో బ్లాక్ ప్రింట్‌ని వాడొచ్చు. వీటిల్లో ఫిగరేట్ ప్రింట్లు అంటే ఈఫిల్ టవర్ వంటి చారిత్రక కట్టడాల వంటివాటినిరూపొందించడం ప్రత్యేకత.

గులాబీలాంటి పెదాలకు పెరుగు

మనం తీసుకునే ఆహారం, అధిక వేడీ, సరైన శ్రద్ధ తీసుకోకపోవడం వల్ల పెదాలు సహజమైన రంగును కోల్పోయి నల్లగా మారతాయి. ఆ సమస్యను తగ్గించాలంటే కొన్ని రకాల పదార్థాలను ఆహారంలో చేర్చుకోవడమే దీనికి పరిష్కారం.

తేనె: ప్రతిరోజూ చెంచా తేనె తీసుకోవాలి. ఇది మీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాగే రాత్రుళ్లు పెదాలకు తేనె రాసుకుని మర్నాడు కడిగేయాలి. తేనెలోని యాంటిఆక్సిడెంట్లూ, మెగ్నీషియం లాంటి ఖనిజాలు ఆర్యోగ్యాన్ని ఇవ్వడంతోపాటు పెదాలపై ఉండే నలుపుదనాన్ని పోగొడతాయి.

టొమాటోలు: వీటిలో సెలినీయం అనే యాంటీఆక్సిడెంట్ ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఇది సూర్యకిరణాల నుంచి మీ చర్మాన్నీ, పెదాలను కాపాడుతుంది. కాబట్టి ప్రతిరోజూ దీన్ని ఏదో ఒక రూపంలో తీసుకునేలా చూసుకోవాలి. ఎండలో నుంచి రాగానే మీ పెదాలకు టొమాటో గుజ్జు లేదా రసం పూయడం వల్ల అవి తమ సహజ రంగును కోల్పోవు సరికదా తాజాగానూ ఉంటాయి.



గ్రీన్ టీ: టీ, కాఫీలు తాగడం వల్ల కూడా పెదవులు నల్లగా అవడానికి అవకాశం ఎక్కువ. కాబట్టి వాటికి బదులుగా గ్రీన్ టీ తీసుకుంటే మంచిది. ఇందులోని పాలీఫినాల్స్ శరీరంలోని ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. అంతేకాదు వయసు పెరగడం, ఎండవేడి వల్ల కమిలిపోయిన పెదాలకు రక్షణ కల్పిస్తాయి. టీ బ్యాగుల్ని పెదాలపై మృదువుగా మర్దనా చేయడం వల్ల ఎండిపోయి పగిలిన పెదాలకు సాంత్వన లభిస్తుంది.


పెరుగు: దీనిలో మాంసకృత్తులు మీ చర్మాన్ని దృఢంగా, నవయవ్వనంగా ఉంచుతాయి. దీన్ని రోజూ మీ భోజనంలో తీసుకోవాలి. కాస్తంత పెరుగును చేత్తో తీసుకుని మీ పెదాలకు రాసుకున్నా అవి క్రమంగా మృదువుగా మారతాయి. పిగ్మెంటేషన్ సమస్యను కూడా తగ్గిస్తాయి.

నిమ్మ: గోరువెచ్చటి నీటిలో నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. నిమ్మ సహజ బ్లీచ్‌లా పనిచేస్తుంది. నిమ్మతొక్కపై కొంచెం చక్కెర వేసి దాన్ని పెదాలపై మృదువుగా రుద్ది చూడండి. మార్పు మీకే తెలుస్తుంది.

బంగారం వెండి

19న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,886	2,895
వెండి (గ్రా)	41.00	41.10



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,250	31,250	31,150	31,250	31,150	31,250	30,870	31,050	31,110	31,110
ఆర్నమెంట్	29,170	29,200	28,900	29,000	28,900	28,930	28,860	29,060	28,920	28,920
వెండి(కిలో)	39,400	39,890	39,300	39,800	39,100	39,300	38,400	38,600	39,900	39,900

హీరోహోండా నుంచి బ్రిటానియా వరకూ...

లోగోలన్నీ నావే!

సంస్థ ప్రతిష్ఠను ప్రతిఫలిస్తుంది లోగో. అలాంటి లోగోలను డిజైను చేసేవారిలో మహిళలు తక్కువే. ఆ కొద్దిమందిలో చెప్పుకోదగ్గ పేరు బర్కా దత్తానీ. ప్రముఖ సంస్థల లోగోలు తయారుచేస్తూ.. అరుదైన గుర్తింపును తెచ్చుకుందామె. వాహన, ఆహారం, ఆరోగ్యం, వాణిజ్యం, రియల్‌ఎస్టేట్, హోటళ్లు... ఇలా దాదాపు వందల సంస్థలకు లోగోలను డిజైను చేసింది. ఇటీవల కేంద్రప్రభుత్వ నీటి ప్రాజెక్టుకు లోగో రూపొందించి ప్రధాని ప్రశంసలనూ అందుకుంది. అంతేనా... అమీర్‌ఖాన్, మాధవన్, శిల్పాశెట్టి వంటి పలువురు సినీ ప్రముఖులకు వ్యక్తిగత లోగో డిజైన్లనూ అందించింది.

మాది ముంబయి. మా నాన్న వ్యాపారి. చిన్నవయసు నుంచి ఆయన్ని చూస్తూ పెరిగిన నేను కాలేజీలో ఉన్నప్పుడే నా పాకెట్ మనీ నేనే సంపాదించుకోవాలనుకున్నాను. ఎంబీఏ చేసేటప్పుడు సెలవుల్లో బర్కాస్ ఎగ్జిబిట్స్ పేరుతో ఎగ్జిబిషన్స్‌ను నిర్వహించా. పెద్ద హాలును అద్దెకు తీసుకున్నా. చిన్నచిన్న స్టాళ్లకు అద్దెకిచ్చా. వ్యాపార సంస్థలకు అవసరమయ్యే సదుపాయాలు అందించడమే కాకుండా, కొన్నింటికి లోగోలకు సంబంధించిన ఐడియాలు కూడా ఇచ్చా. నాకంటూ కొంత పాకెట్ మనీ మాత్రమే కాదు... అనుభవం కూడా వచ్చింది. కొన్ని సంస్థలతో పరిచయం ఏర్పడింది. మరికొన్ని సంస్థల నుంచి ప్రశంసలూ అందాయి. అందుకే చదువైపోయాక ఈ రంగంలోకే రావాలనిపించింది. అలా ఎంబీఏ అయ్యాక బర్కాస్ బ్రాండ్ క్లినిక్ ప్రారంభించా.

ప్రముఖ సంస్థలకు...

దీన్ని ప్రారంభించిన కొన్ని రోజుల్లోనే ప్రముఖ సంస్థలు మా వినియోగదారులుగా మారాయి. వాళ్ల అవసరాలకు తగినట్లుగా ప్రకృతి వర్ణాలూ, అందాలకు ప్రాధాన్యమిస్తూ వాటిని రూపొందిస్తున్నా. మార్కెట్‌లో ఆ సంస్థ ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేది లోగోనే కాబట్టి.. చాలా జాగ్రత్తగా కొంత పరిశోధన చేశాకే వాటిని రూపొందిస్తా. ఒకసారి లోగో విడుదల చేసిన తరువాత మార్చే అవకాశం ఉండదు. అందుకే ముందే జాగ్రత్తలు తీసుకుంటా. ఇప్పటివరకూ హ్యుందాయ్, కెనటిక్, హీరోహోండా, మారుతీ సుజుకీ, నిస్సాన్, రాయల్ ఎన్‌ఫీల్డ్, స్కోడా, టయోటా, టీవీఎస్, సిలికాన్ సంస్థలు... బిర్లా, టాటా, మైక్రోసాఫ్ట్, బ్రిటానియా.. ఇలా వందలాది సంస్థలకు లోగోలు అందించా. వీటన్నింటివల్లా ఎంతో గుర్తింపు వచ్చింది. ఈ మధ్య కేంద్రప్రభుత్వం నుంచి 'ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజిమెంట్ ప్రోగ్రాం' కు సంబంధించిన లోగో కూడా తయారుచేశా. ఆ ప్రకటన విడుదలయ్యాక లోగో రూపొందించి పంపించా. వేలాదిమంది దీనికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఆలోచనకు తగినట్లుగా లోగో డిజైన్ చేసి పంపిస్తే... కేంద్రం నాకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వం నుంచి పిలుపూ వచ్చింది. లోగో డిజైన్‌ని వివరించమన్నారు. ఆకుపచ్చని రంగులో భూమి, గడ్డి డిజైన్ వచ్చేట్లుగా రూపొందించానని చెబితే ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఆ 'లోగో'నే వాడుతోంది. ఇవన్నీ చేయడానికి నాకంటూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉంది.





సినీ నటులకూ...

సంస్థలకే కాదు నటులు మాధవన్, అమీర్‌ఖాన్, రవీనాటాండన్, శిల్పాశెట్టి వంటివారికీ వ్యక్తిగతంగా లోగోలు తయారుచేశా. వారి నడతా, ప్రవర్తనా, ఆహార్యం... విజయాలన్నీ దృష్టిలో పెట్టుకుని రూపొందించా. ఎన్ని రకాలు చేసినా... ఎప్పుడూ కొత్తదనం కోసం ప్రయత్నిస్తూనే ఉంటా. ఇప్పటివరకూ దాదాపు యాభైమందికి ఉపాధి కల్పించగలుగుతున్నా.. అలాగే సంస్థ, లోగోను బట్టి ధర ఉంటుంది. నా చిన్నవయసు నుంచి మా నాన్న ఎయిడ్స్ రోగులకు చేయూతనందించడం చూస్తూ పెరిగా. దీంతో నాకు కూడా ఏదైనా సామాజిక సేవ చేయాలని ఉండేది. అందుకే అంధుల కోసం ఓ ట్రస్టు ప్రారంభించా. చిన్నారుల నుంచి పెద్దవారివరకూ అందులో ఉంటారు. పిల్లలకయితే చదువూ, పెద్దవారికైతే ఉపాధిని కల్పించడం మా సంస్థ లక్ష్యం. నేను సంపాదించే దాంట్లో నాలుగో వంతు ఈ సంస్థకే కేటాయిస్తా. మాకు ఇప్పటివరకూ తొమ్మిది శాఖలున్నాయి. త్వరలో హైదరాబాద్‌కీ దీన్ని విస్తరించనున్నా.

డియర్ వసుంధర

అతను అలా చేయడం తప్పు కాదా?



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

■ నేను మూడు వేల మంది ఉద్యోగులున్న సంస్థలో ఆరునెలల క్రితం చేరా. మా బృందంలో నాతో కలిపి సభ్యులు ఏడుగురు. ఇందులో మా రిపోర్టింగ్ మేనేజర్ హోదాలో ఉన్న వ్యక్తి అనుభవం... నాకన్నా చాలా తక్కువ. అతను మా వైస్‌ప్రెసిడెంట్‌కి సన్నిహితుడు కావడంతో ప్రతి విషయంలో అతనికి మా యాజమాన్యం అండగా ఉంటుంది. సమస్య ఏంటంటే... నేను చేరినప్పుడు అనువజ్ఞులు మా బృందాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు కానీ అది జరగలేదు. ఇప్పుడు మా మేనేజర్ తీరే నన్ను కలవరపెడుతోంది. నేను అతనితో కలిసి ఎలాంటి ప్రాజెక్టులూ ఇప్పటివరకూ చేయలేదు. అయితే నేను చేరిన కొన్ని వారాలకు ఓ ప్రాజెక్టు విషయంలో అతను నాతో చర్చించాడు. ఆ తరువాత తన లింక్డిన్ ప్రొఫైల్‌లో తను మాత్రమే దాన్ని చేసినట్లు రాసుకున్నాడు. కేవలం చర్చించుకున్నాం కాబట్టి అతనలా రాసుకుని ఉంటాడని వదిలేశా. తరువాత మరో రెండు ముఖ్యమైన ప్రాజెక్టుల విషయంలోనూ అంతే. అతను సలహాలు ఇవ్వలేదు. ఆలోచనలూ చేయలేదు. కానీ అన్నీ అతనే చేసినట్లు రాసుకున్నాడు. చాలా బాధేసింది. కోపంగానూ ఉంది. ఏం చేయమంటారు. **- ఓ సోదరి**

● ఒకరు చేసిన పనిని తన ప్రతిభగా చెప్పుకోవడం ప్రొఫెషనలిజం అనిపించుకోదు. అయితే చాలా సంస్థల్లో ఇలా జరగడం సర్వసాధారణం. సాటి ఉద్యోగులు ఇతరులు చేసిన పనిని తమదిగా చెప్పుకొంటారు. అయితే మీ విషయంలో ఓ అధికారి హోదాలో ఉన్న వ్యక్తి ఇలా చెప్పుకోవడం పూర్తిగా అనైతికం. అదీ కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ఇలా జరగడం నిజంగా బాధాకరమే. అదే మీకు అభద్రతను కలిగిస్తోంది. ఈ పొరపాటు సాటి ఉద్యోగులే చేసి ఉంటే ఏ మాత్రం ఆలోచించకుండా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. కానీ ఇక్కడ పొరపాటు చేసింది పై అధికారి. కాబట్టి ప్రస్తుతానికైతే మీరు ఆచీతూచీ వ్యవహరించడం మంచిది. మీ అధికారి ఆ విషయాన్ని లింక్డిన్ పేజీలో రాశారని చెప్పారు కదా.. అది తన వ్యక్తిగత పేజీనా లేదా సంస్థకు సంబంధించిందా అనేది తెలుసుకోండి. ఎందుకంటే లింక్డిన్ రెండు రకాల్లో ఉంటుంది. అతను వ్యక్తిగతంగా తన పేజీలో రాసుకుని ఉంటే.. మీరు కూడా మీ గురించి మీ పేజీలో ఫలానా ప్రాజెక్టు చేసినట్లు రాసుకోవచ్చు.. అదే సంస్థకు సంబంధించినదైతే హెచ్‌ఆర్ దృష్టికి మీ సమస్యను తీసుకెళ్లొచ్చు. మీరు కూడా అందులో భాగస్వాములైనట్లు వివరించొచ్చు. అవసరం అనుకుంటే... అందులో భాగం అయినట్లు ఉన్న ఉత్తరాలూ, ఈమెయిళ్లను చూపించొచ్చు. సమస్యనూ వివరించొచ్చు.

ఇకపై ఇలాంటి ఇబ్బంది రాకూడదనుకుంటే.. ఏదయినా కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన ఈమెయిళ్లూ, ఉత్తరాలు మీకు వస్తే... అందులో మీ పాత్ర కీలకమైతే.. వాటిని జాగ్రత్తగా భద్రపరుచుకోండి. ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు అవి మీకు ఎంతగానో ఉపయోగపడతాయి.

మీ ప్రశ్నలు ఇకపై vasucareer@eenadu.net కు పంపించగలరు.

టోల్ కలెక్టర్లుగా అమ్మాయిలు!



జాతీయ రహదారుల్లో దాదాపు నిర్మానుష్య ప్రాంతాల్లోనే టోల్‌ప్లాజాలు ఉన్నాయి. అయితే ఇక్కడ విధులు నిర్వహిస్తూ ఎక్కువ శాతం పురుషులే కనిపిస్తుంటారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం, ది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) దేశవ్యాప్తంగా మూడు వందలకు పైగా టోల్ ప్లాజాల వద్ద ఆయా పోస్టుల్లో కేవలం మహిళలను మాత్రమే నియమించాలని నిర్ణయించింది. మహిళాదినోత్సవం నాడే ఈ ప్లాజాల వద్ద మహిళల నియామకం జరిగింది. ప్రస్తుతం పగటిపూట విధులకు మాత్రమే వీళ్లు హాజరవుతున్నారు. ఈ మహిళలు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదింటి వరకూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్లాజాల వద్ద పది నుంచి పదిహేనుమంది పనిచేస్తారు. నిరంతరం అక్కడ సీసీటీవీ పర్యవేక్షణా, అలారంబటన్ ఉంటుంది. గతంలో టోల్‌ప్లాజాల వద్ద రద్దీ, ఇతర కారణాల దృష్ట్యా వాహనదారులు విధుల్లో ఉన్నవారిపై దాడి చేయడం జరిగిన నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రమాదంలో ఉన్నప్పుడు అలారం బటన్‌ని నొక్కితే రక్షణ సిబ్బందికి వెంటనే సమాచారం వెళుతుంది. ఈ నియామకాలు ప్రస్తుతం ముంబయి, దిల్లీ, పంజాబ్, కోల్‌కతా.. వంటి రాష్ట్రాల్లో జరిగాయి.



ఇదిలా ఉంటే తెలంగాణ ప్రభుత్వం కూడా తెలంగాణలో మొదటిసారి కొందరు మహిళల్ని ఈ పనిలో నియమించింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పరిధిలోని పుల్లూరు శివారు టోల్‌ప్లాజాలో పదిహేను మంది మహిళలను టోల్ కలెక్టర్లుగా నియమించారు. వీరంతా వారంరోజుల పాటు శిక్షణ పొంది 'మహిళా దినోత్సవం'నాడు విధుల్లో చేరారు. ఉండవల్లి పరిధిలోని గ్రామాలకు చెందిన అమ్మాయిలు ఈ ఉద్యోగాలను అందుకున్నారు. వీరంతా నిరు పేదకుటుంబాల నుంచి వచ్చినవారే. తల్లిదండ్రులకు అండగా నిలిచి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలనే ఇటువైపు వచ్చారు. **– న్యూస్‌టుడే, ఉండవల్లి**

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏఏఐలో 542 ఖాళీలు

సంస్థ: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), న్యూదిల్లీ.

అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ ఉత్తీర్ణత.

వయసు: 27 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక: గేట్-2018 స్కోరు ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.300

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 28.03.2018 నుంచి 27.04.2018 వరకు

దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరి తేది: 02.05.2018

వెబ్‌సైట్: https://www.aai.aero

ఇండియన్ కోస్ట్ గార్డ్

పోస్టు: ఫోర్‌మ్యాన్ ఆఫ్ స్టోర్స్

ఖాళీలు: 06

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ/ పీజీ/ డిప్లొమా, అనుభవం.

వయసు: 30 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక: నిబంధనల ప్రకారం.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్

చివరితేది: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (17-23 మార్చి 2018)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు.

https://indiancoastguard.gov.in/

ప్రవేశాలు

ఆసెట్-2018

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ 2018-19 సంవత్సరానికిగానూ వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశపరీక్ష.

అర్హత: ఆయా సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ, బీఈడీ, బీపీఈడీ ఉత్తీర్ణత.

ఎంపిక: ఆసెట్ ద్వారా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 22.03.2018

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 21.04.2018 (రూ.1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30).

వెబ్‌సైట్: http://audoa.in/

కృష్ణమూర్తి ఎంట్రన్స్

ఐఐటీల్లో ప్రవేశపరీక్ష జేఈఈ (మెయిన్స్, అడ్వాన్స్‌డ్)కి రెండేళ్ల శిక్షణను ఇచ్చే కృష్ణమూర్తి ఐఐటీ అకాడమీ (హైదరాబాద్) విద్యార్థుల ఎంపికకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తోంది.

అర్హత: పదోతరగతి పూర్తిచేసుకుంటున్న విద్యార్థులు

ప్రవేశపరీక్ష తేదీ: ఏప్రిల్ 18.

దరఖాస్తులు: సంస్థ కార్యాలయంలో మార్చి 22 నుంచి ఉదయం 9 గంటలు- మధ్యాహ్నం 2 గంటల మధ్య లభిస్తాయి. ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చు. పూర్తి వివరాలకు 27601234/9959985829 నంబర్లలో సంప్రదించవచ్చు.

ww.krishnamurthyiitacademy.com

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

కళాకారులకు ఓ కోర్సు!



థియేటర్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్న కళాకారులు వారి అభిరుచి మేరకు మూడేళ్ల డిప్లొమా కోర్సు చేయడానికి అవకాశం ఉంది. ఆయా విభాగాల శాస్త్రీయ అధ్యయనానికి ఈ కోర్సు వీలు కల్పిస్తుంది. తదనంతరం పరిశోధనలు చేసుకోవచ్చు. కళాశాలలు, యూనివర్సిటీల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

యాక్టింగ్, డిజైన్, డైరెక్షన్...వీటిపై మీకు ఆసక్తి ఉందా? బుల్లితెర, వెండితెరపై రాణించాలని కోరుకుంటున్నారా? పేరున్న సంస్థలో డ్రమాటిక్ ఆర్ట్స్ కోర్సుల్లో చేరాలనుకుంటున్నారా? అయితే మీ లాంటి వారికోసమే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఎదురుచూస్తోంది. ఈ సంస్థ మూడేళ్ల డిప్లొమా ఇన్ డ్రమాటిక్ ఆర్ట్స్ కోర్సులో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. గ్రాడ్యుయేట్లు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి రెసిడెన్షియల్ విధానంలో ఈ కోర్సులను అందిస్తున్నారు. జులై 16 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఆయా రంగాల్లో పేరున్న నిష్ణాతులు బోధిస్తారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ సంస్థను నిర్వహిస్తున్నారు.

ఇవీ అర్హతలు

ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం 6 థియేటర్ ప్రొడక్షన్లలో పాల్గొని ఉండాలి. ఇంగ్లిష్ లేదా హిందీ భాషలో ప్రావీణ్యం ఉండాలి. ముగ్గురు థియేటర్ నిపుణుల నుంచి రికమెండేషన్ ఉత్తరాలు, థియేటర్ అనుభవం ఉన్నట్లు తెలిపే డాక్యుమెంటేషన్ ఇవన్నీ జతచేయాలి.

జులై 1, 2018 నాటికి 30 ఏళ్లలోపు వయసు ఉండాలి (ఎస్సీ, ఎస్టీలకు గరిష్ఠ వయసులో అయిదేళ్ల మినహాయింపు).

సీట్ల వివరాలు: మొత్తం 26 సీట్లు ఉన్నాయి. వీటిలో 4 ఎస్సీలకు, 2 ఎస్టీలకు, 7 ఓబీసీలకు కేటాయించారు.

ఎంపిక విధానం

సీట్లకు అభ్యర్థుల ఎంపిక రెండంచెల్లో చేపడతారు. ముందుగా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించినవారికి ఫైనల్ పరీక్షలు (వర్క్‌షాప్స్) ఉంటాయి. దేశవ్యాప్తంగా 12 కేంద్రాల్లో వివిధ తేదీల్లో ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా కేంద్రాల వారీ మే 1 నుంచి జూన్ 8 వరకు ఇవి ఉంటాయి. ప్రిలిమినరీలో అర్హత సాధించినవారికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) కేంద్రం- న్యూదిల్లీలో జూన్ 26 నుంచి 30 వరకు అయిదు రోజుల పాటు వర్క్ షాప్స్ నిర్వహిస్తారు. ఫైనల్ పరీక్షలు (వర్క్‌షాప్స్)కు హాజరైనవారికి రెండువైపులా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. అలాగే వసతి సౌకర్యం కల్పిస్తారు. కోర్సుకు ఎంపికైన ప్రతి విద్యార్థికీ నెలకు రూ.8000 చొప్పున స్టయిపెండ్ అందిస్తారు. అభ్యర్థులు మెడికల్ టెస్టు (ఫిజికల్ ఫిట్‌నెస్)లో అర్హత సాధిస్తేనే ప్రవేశం లభిస్తుంది. జులై 16 నుంచి తరగతులు మొదలవుతాయి. కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఎంపికైన ప్రతి ఒక్కరూ రెసిడెన్షియల్ విధానంలో చదువుకోవడం తప్పనిసరి. తక్కువ ధరకు వసతి, భోజనం మొదలైన సౌకర్యాలు కల్పిస్తారు. ఎన్ఎస్‌డీ అందించే ఈ డిప్లొమా కోర్సు మాస్టర్ డిగ్రీతో సమానమైంది. ఈ అర్హతతో డ్రామా, యాక్టింగ్ కోర్సుల్లో పరిశోధనలు చేసుకోవచ్చు. లేదా కళాశాలలు, యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తులు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులకు రూ.50 ఫీజు చెల్లిస్తే సరిపోతుంది ఆఫ్‌లైన్ దరఖాస్తులకు రూ.150 ఫీజు చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: ఏప్రిల్ 16

వెబ్‌సైట్: https://nsd.gov.in/delhi

అఖిలభారత వైద్యవిద్య సీట్ల కూటమి (నేషనల్ పూల్)లోకి చేరడం వల్ల తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు మేలే జరుగుతుందంటున్నారు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కరుణాకరరెడ్డి. ఏ రాష్ట్ర వైద్యసీట్లు ఆ రాష్ట్ర విద్యార్థులకే దక్కాలనుకోవడం సంకుచిత స్వభావమనీ, వైద్యసీట్లను జాతీయ సంపదగా గుర్తించింది కాబట్టే.. అఖిల భారత స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశాలను నిర్వహిస్తోందన్నారు. ఇతర రాష్ట్రాల్లో సీట్లు పొందడం వల్ల కొన్ని అత్యుత్తమ కళాశాలల్లో పీజీ చదివే అవకాశం విద్యార్థులకు లభిస్తుందన్నారు. పీజీ వైద్యవిద్య ప్రవేశాలు ఈ వారాంతంలోగా ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఉపకులపతి 'చదువు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు..



పోయే సీట్లు తక్కువ... పోటీ పడేవి ఎక్కువ!

పీజీ వైద్యవిద్య ప్రవేశాలపై కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కరుణాకరరెడ్డితో ముఖాముఖి

◆ అఖిల భారత వైద్యవిద్య సీట్ల కూటమిలో ఎందుకు చేరాల్సి వచ్చింది?

దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఈ కూటమిలోకి ఎప్పుడో చేరిపోయాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలే చివరివని చెప్పొచ్చు. ఇందులో చేరడం వల్ల ఆయా రాష్ట్ర ప్రభుత్వ వైద్యకళాశాలల్లోని 50 శాతం పీజీ సీట్లను అఖిల భారత కూటమిలోకి ఇవ్వాల్సి వస్తుంది. దీన్నొక జాతీయ సంపదగా భావిస్తారు. ఈ సంపదను పొందే అవకాశం అందరికీ సమానంగా ఉంటుంది. అలా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన సీట్లను.. అన్ని రాష్ట్రాల విద్యార్థులకు వర్తింపజేస్తారు. సుమారు 8 వేల పీజీ సీట్లకు అన్ని రాష్ట్రాల విద్యార్థులూ పోటీపడతారు. ఏ రాష్ట్ర విద్యార్థులు ఎక్కువ కష్టపడతారో.. ఎక్కువ సమర్థులో.. ఎక్కువ ప్రతిభ సాధిస్తారో.. వారికి ఎక్కువ సీట్లు వచ్చే అవకాశాలుంటాయి. దేశం మొత్తం మీద ఈ విధానం అమల్లో ఉండాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఈ విధానంలోకి తెలుగు రాష్ట్రాలనూ ఆహ్వానించింది. మన రాష్ట్రాలూ సానుకూలంగా స్పందించాయి.

◆ పీజీ వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియలో తెలంగాణలో ఎన్ని కోటాలున్నాయి?

కూటమిలో చేరడం వల్ల రాజ్యాంగపరమైన రిజర్వేషన్లలో ఎలాంటి మార్పులుండవు. గత ఏడాది మాదిరిగానే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు ఈ ఏడాది కూడా యథావిధిగా కొనసాగుతాయి. స్థానిక విద్యార్థులకు 85 శాతం.. అన్‌రిజర్వుడ్ అంటే ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఇద్దరూ పాల్గొంటారు. దీనికి 15 శాతం కేటాయింపులున్నాయి. అయితే 15 శాతం అన్‌రిజర్వుడ్ కోటా, ఇన్‌సర్వీస్ వైద్యులకు 30 శాతం క్లినికల్ కోర్సుల్లో, 50 శాతం నాన్‌క్లినికల్ కోర్సుల్లో రిజర్వేషన్లు ఇప్పటివరకూ ఉన్నాయి. అఖిల భారత వైద్యవిద్య కూటమిలో చేరడం వల్ల ఈ అన్‌రిజర్వుడ్, ఇన్‌సర్వీస్ రిజర్వేషన్లను కొనసాగించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే దీనిపై ఉత్తర్వులు వెలువడుతాయి.

◆ రిజర్వేషన్లలో స్థానికత, ఏపీ అని ఎలా నిర్ణయిస్తారు?

రిజర్వేషన్ల కేటాయింపులో ఇప్పటికే అమల్లో ఉన్న రాష్ట్రపతి ఆదేశాల ప్రకారమే నడుచుకుంటాం. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు ఏ రాష్ట్రంలో చదువుకుంటారో.. వారికి ఆ రాష్ట్రమే స్థానికత కిందకు వస్తుంది. పీజీ వైద్యవిద్యకొచ్చేసరికి ఎంబీబీఎస్ ఎక్కడ చదివితే ఆ రాష్ట్రమే వారికి స్థానికతగా పరిగణనలోకి వస్తుంది. ఇది ఇప్పటివరకూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అమల్లో ఉన్న విధానమే.

◆ అఖిల భారత వైద్యవిద్య సీట్ల కూటమిలోకి ప్రైవేటు వైద్య కళాశాలల్లోని కన్వీనర్ కోటా సీట్లు చేరుతాయా?

ప్రైవేటు వైద్యకళాశాలల్లోని మొత్తం సీట్లలో 50 శాతం సీట్లను ఇప్పటికే కన్వీనర్ కోటాలోకి ఇచ్చేశారు. ఇక మిగిలిన 50 శాతం సీట్లను యాజమాన్య, ప్రవాస భారతీయ, వైద్యసంస్థ స్వేచ్ఛ కోటాల కింద నీట్ ర్యాంకుల ప్రాతిపదికనే భర్తీ చేయాల్సి ఉంటుంది. వీటిని కూడా కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పర్యవేక్షణలోనే భర్తీ చేస్తాం. కన్వీనర్ కోటాలోకి చేరిన 50 శాతం ప్రైవేటు వైద్యకళాశాలల సీట్లు అఖిల భారత కోటాలోకి చేరవు. కేవలం ప్రభుత్వ కళాశాలల్లోని మొత్తం సీట్లలో 50 శాతం చేరతాయి. అది కూడా విభాగాల వారీగా గుర్తించినప్పుడు కొన్నిసార్లు సగం కంటే తక్కువ సీట్లే చేరే అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఒక విభాగంలో పీజీ సీట్లు 5 ఉన్నాయనుకోండి.. రెండే అఖిల భారత కూటమిలో చేరతాయి.

◆ అఖిల భారత వైద్యవిద్య సీట్ల కూటమిలో చేరడం వల్ల తెలుగు విద్యార్థులకు నష్టమేననే భావన ఉంది? వాస్తవమెంత?

ఆ భావనలో వాస్తవం లేదు. తొలి 100 ర్యాంకుల్లో 50 మనమే సాధించలేదు కాబట్టి.. మనకు నష్టమనే భావన సరైంది కాదు. నిజానికి తెలంగాణలో మూడే ప్రభుత్వ వైద్యకళాశాలలున్నాయి. ప్రభుత్వ పీజీ సీట్లు దక్షిణాదిలో తక్కువున్నాయి. ప్రైవేటు పీజీ సీట్లు ఇక్కడ ఎక్కువున్నాయి. అదే ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రభుత్వ పీజీ సీట్లు ఎక్కువ. మరి 50 శాతం సీట్లు ప్రభుత్వ వైద్యకళాశాలల నుంచి ఈ కూటమిలోకి చేర్చుతున్నపుడు.. మన సీట్లు కోల్పోయేది చాలా తక్కువ. పోటీ పడేవే ఎక్కువ.

వచ్చే రెండేళ్లలో 80కి పైగా కొత్త ప్రభుత్వ కళాశాలలు రాబోతున్నాయి. 2 వేల పీజీ సీట్లు పెరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో అవకాశాలు పెరిగినట్లే. మన పిల్లలకు మంచి ర్యాంకులే వచ్చినా.. మన రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య పరిమితం కావడంతో ఎక్కువమంది పీజీ వైద్యవిద్యను అభ్యసించలేకపోతున్నారు. ఇప్పుడు అఖిల భారత కోటాలో చేరడం వల్ల దేశంలోని అత్యుత్తమ వైద్య కళాశాలల్లో పీజీ వైద్యవిద్యను అభ్యసించడానికి మార్గం సులభతరమైంది.

గట్టి ప్రయత్నం చేసిన విద్యార్థికి తాను కోరుకున్న పీజీ కోర్సులో ఏ రాష్ట్రంలోనైనా పొందే అవకాశాలు మెరుగయ్యాయి. ఉదాహరణకు ఒక విద్యార్థి జనరల్ మెడిసిన్‌లో సీటు కోరుకుంటే. . ఆ విద్యార్థికి వచ్చిన ర్యాంకుకు ఉత్తరాది రాష్ట్రంలో సీటు వచ్చిందనుకుందాం. వెళ్లాలి. అలా కాకుండా.. అక్కడ వరకూ వెళ్లకుండా.. మన రాష్ట్రంలోనే పీజీ సీటులో చేరాలనుకుంటే.. అప్పుడు తను కోరుకున్న జనరల్ మెడిసిన్ కాకుండా ఉదాహరణకు ఈఎన్‌టీలోనో మరో కోర్సులోనో చేరి రాజీపడాల్సి వస్తుంది.

విద్యార్థులు మరో ప్రాంతంలో చదివితేనే అక్కడి సంస్కృతులు తెలుస్తాయి. విశాల దృక్పథంతో రోగులకు చికిత్సలందించగలుగుతారు. ఇతర రాష్ట్రాల్లో అభ్యసించడం వల్ల కేంద్ర వైద్య సంస్థల్లో పనిచేయడానికి ముందుకొస్తారు. జాతీయస్థాయిలో ఉద్యోగావకాశాలు, వృత్తిపరమైన అవకాశాలు పెరుగుతాయి. తద్వారా రాష్ట్రంలోనూ పోటీ తగ్గుతుంది. అందువల్ల ఈ ఒక్క సంవత్సరం ర్యాంకులను పరిగణనలోకి తీసుకోవద్దు. దేశవ్యాప్తంగా అవకాశాలు మెరుగయ్యాయనే స్ఫూర్తితో ముందుకెళ్లాలి. ఇప్పుడు కష్టపడినా కోరుకున్న సీటు దక్కించుకోలేని స్థితి నుంచి కష్టపడితే సాధించగలిగే స్థితికి చేరుకోవడం శుభపరిణామమే కదా!

◆ ఇతర రాష్ట్రాల్లో పూచీకత్తు అనేది ఏమైనా ప్రతిబంధకంగా మారుతుందా?

దీనిమీద వేర్వేరు అభిప్రాయాలున్న మాట వాస్తవం. అఖిల భారత స్థాయిలో వైద్యవిద్యలో ఒకే విధమైన విధానాన్ని అమలుచేయాలని ఇటీవల మన ప్రభుత్వం కూడా కేంద్రప్రభుత్వాన్ని కోరింది. ఒకే విధమైన కోటాను అఖిల భారత స్థాయిలో అమలు చేస్తున్నప్పుడు ఒకే విధమైన నియమ నిబంధనలుండాలని ఆ ప్రతిపాదనల్లో కోరాం. పీజీ వైద్యవిద్యలో ఒక్కో రాష్ట్రంలో ఒక రకమైన నిబంధనను అమలు చేస్తున్నారు. వారి రాష్ట్రంలో పీజీ వైద్యవిద్య పూర్తిచేసిన అనంతరం తప్పనిసరిగా అక్కడే కొంత కాలం పనిచేయాలనేది నిబంధన. ఒక రాష్ట్రంలో ఏడాది ఉంటే.. ఇంకో రాష్ట్రంలో రెండేళ్లు.. మూడేళ్లు కూడా ఉంది. ఒకవేళ పనిచేయకపోతే కొంత మొత్తాన్ని చెల్లించాలనే నిబంధన కూడా పెట్టారు. ఇది కూడా కొన్ని రాష్ట్రాల్లో రూ.5 లక్షలుంటే.. కొన్నింటిలో రూ.25 లక్షలు.. రూ.50 లక్షలు కూడా ఉంది. దీన్ని దేశ వ్యాప్తంగా ఒకే విధంగా ఉండేలా అమల్లోకి తీసుకురావాలని కోరాం. ఒకవేళ పూచీకత్తు మన రాష్ట్రంలో అమలు చేయాల్సి వస్తే.. ఈ విధానం ఎలా ఉంటుందనేది కూడా పరిశీలిస్తున్నాం.

అయినా పూచీకత్తు అనేది ప్రతిబంధకంగా భావించకూడదు. మనం కోరుకున్న సీటు దక్కుతున్నప్పుడు ఆ కోర్సులో చేరడంపైనే దృష్టిపెట్టాలి. మన రాష్ట్రం కాకపోతే ఏ రాష్ట్రంలో నచ్చిన కోర్సు వస్తే అక్కడ చేరిపోవాలి. ఆ రాష్ట్ర ప్రభుత్వ వైద్యకళాశాలల్లో చదువుకొని.. అక్కడి ప్రభుత్వ నిధులతో వైద్యవిద్య అభ్యసించి.. ఆ రాష్ట్రంలో ఒకట్రెండు ఏళ్లు పనిచేయాల్సి వస్తే.. అందుకు వెనుకడుగు ఎందుకు వేయాలి? కోరుకున్న కోర్సు దక్కుతున్నపుడు ఇవన్నీ చిన్న విషయాలే. పైగా అక్కడేమీ ఉచిత వైద్యసేవలందించడం లేదు కదా! పనిచేసినన్ని రోజులూ ఉపకార వేతనం పొందుతారు కదా! జాతీయ భావన ఉండాలి.

◆ పూచీకత్తు అఖిల భారత కోటాకే ఉంటుందా? రాష్ట్ర ప్రభుత్వ కన్వీనర్ కోటాకూ ఉంటుందా?

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి నిబంధనను ఎత్తేసింది. ఒకవేళ పూచీకత్తును సరళీకృతంగా పెట్టాల్సి వచ్చినా.. అన్ని సీట్లకూ ఉంటుంది. కేవలం అఖిల భారత కోటా విద్యార్థులకు పూచీకత్తు పెట్టి.. కన్వీనర్ కోటా విద్యార్థులకు పూచీకత్తు పెట్టకపోవడమంటూ ఉండదు. అలా చేస్తే వివక్ష చూపినట్లు అవుతుంది. న్యాయపరంగా అది నిలబడదు కూడా. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే విధానముంది. అయితే నిబంధనలన్నీ అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే విధంగా ఉండాలనేదే మన డిమాండ్.

● **అయితరాజు రంగారావు,** ఈనాడు-హైదరాబాద్



◆ ఎన్నిసీట్లు అఖిల భారత కోటాలోకి చేరతాయి?

ప్రభుత్వ కళాశాలల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సీట్లు సుమారు 705. వీటిలో సుమారు 350 వరకూ అఖిల భారత కోటాలోకి చేరతాయి. మరికొన్ని పీజీ సీట్లకు ఇంకా అనుమతులు రావాల్సి ఉంది. మరో వారంలో ఎన్ని సీట్లు కచ్చితంగా చేరుతాయనే స్పష్టత వస్తుంది. ఈ కోటాలోకి చేరిన సీట్లు పోను మిగిలిన సీట్లూ.. ప్రైవేటు కళాశాలల నుంచి వచ్చిన కన్వీనర్ కోటా సీట్లు కలుపుకొని సుమారు 710 వరకూ కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉంటాయి. మనం జాతీయ స్థాయికిచ్చిన సీట్లకు.. దాదాపు 20 రెట్లు అధికంగా పీజీ సీట్లు అందుబాటులోకి వస్తాయి.

◆ అఖిల భారత కోటాలో చేరాలంటే రాజ్యాంగ సవరణ ఏమీ అక్కర్లేదా? ఇంకా ఏమైనా ఆటంకాలున్నాయా?

సందేహాలేమీ అక్కర్లేదు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర పీజీ సీట్లు అఖిల భారత కోటా సీట్ల జాబితాలోకి చేరిపోయాయి. ఉస్మానియా, గాంధీ, కాకతీయ, నిమ్స్ కళాశాలల నుంచి 50 శాతం పీజీ సీట్లు ఆ కోటాలో గుర్తించారు. వైద్యవిద్యలో రాజ్యాంగ సవరణ అక్కర్లేదని గత ఏడాది సూపర్ స్పెషాలిటీ సీట్ల ప్రవేశాల సందర్భంగానే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయాన్ని న్యాయస్థానమూ సమర్థించింది. కాబట్టి ఇంకా ఆటంకాలంటూ ఏమీ లేవు. అఖిల భారత వైద్యవిద్య కూటమిలో చేరడమనేది పురోగమన విధానం. దీన్ని స్వాగతించాల్సిందే.

◆ పీజీ సీట్ల ప్రవేశాలు ఎప్పుడు ప్రారంభమవుతాయి?

ఈ వారంలోగా ప్రవేశ ప్రకటన వెలువడుతుంది. అఖిల భారత వైద్యవిద్య సీట్ల కూటమి ప్రకటనే ఇంకా వెలువడలేదు. ఆ ప్రవేశ ప్రక్రియ మొదలైన కనీసం రెండుమూడు రోజుల తర్వాత మన ప్రక్రియ కూడా ప్రారంభం అవుతుంది. సీట్ల సమాచారాన్ని కూడా అప్పుడే ప్రకటిస్తాం. అఖిల భారత కూటమి సీట్ల భర్తీని కేంద్రం నిర్వహిస్తుంది. రాష్ట్రంలో కన్వీనర్, ప్రైవేటులోని యాజమాన్య కోటా సీట్ల భర్తీ ప్రక్రియను ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది.

పై చదువులు ఏవి మేలు?

బీఏ (హెచ్‌టీపీ) పూర్తిచేశాను. పై చదువులు ఏవి చదివితే మేలు? నాకున్న ఉద్యోగావకాశాలేవి? - కేవీటీ, హైదరాబాద్

జ: బీఏ (హిస్టరీ, తెలుగు, పాలిటీ) పూర్తి చేసినవారు పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో తమకు ఆసక్తి ఉన్నటువంటి (పై మూడింటిలో) ఏదో ఒక కోర్సును స్పెషలైజేషన్‌గా ఎంచుకుని తమ పై చదువులు కొనసాగించవచ్చు. లేదా ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సును ఎంచుకుని బిజినెస్ రంగంలో ఉద్యోగం లేదా సొంత వ్యాపారాన్ని స్థాపించుకోవచ్చు. సాధారణంగా బీఏ (హెచ్‌టీపీ) చదివినవారు ప్రభుత్వ పరీక్షలైన గ్రూప్-1, గ్రూప్-2లకు సన్నద్ధం కావడం లేదా యూపీఎస్‌సీ పరీక్షలకు సన్నద్ధమై మంచి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించవచ్చు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్ వంటి కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాన్ని పొందవచ్చు. హిస్టరీ పట్ల ఆసక్తి ఉన్నవారు ఎంఏ ఆర్కియాలజీ కోర్సును ఎంచుకుంటే మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయి.

స్టార్టప్‌కు ఏ కెమిస్ట్రీ?

స్టార్టప్ స్థాపనలో ఏ కెమిస్ట్రీ కోర్సు ఉపయోగపడుతుంది? ఆర్గానిక్, అనలిటికల్, ఫిజికల్ కెమిస్ట్రీల్లో భవిష్యత్తుకు ఉపయోగపడేదేది? కోర్సులను అందించే విశ్వవిద్యాలయాలూ, ఉద్యోగావకాశాలనూ తెలపండి. ఐఐటీ దిల్లీలో పీహెచ్‌డీ ఉందా? - డి. పౌర్ణమి

జ: అంకుర సంస్థ/ స్టార్టప్‌ను స్థాపించడంలో ఆచరణాత్మకమైన వ్యాపార ఆలోచన చాలా ముఖ్యం. అమెరికన్ కెమికల్ సొసైటీ ప్రెసిడెంట్ జోసఫ్ ప్రకారం సమాజం ఎదుర్కొన్న/ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలకు కెమిస్ట్రీ పరిష్కారం చూపగలదు. కాబట్టి ముందుగా మీరు ఏ కెమిస్ట్రీ మంచిదో పక్కనపెట్టి సమస్యను కనుక్కోవడానికి ప్రయత్నించి ఆ తరువాత ఆ మార్గంలో అడుగులు వేయడం మంచిది.

ఆర్గానిక్ లేదా అనలిటికల్, ఫిజికల్ కెమిస్ట్రీ కూడా భవిష్యత్తులో ఉపయోగపడేవే. ఇవి వేటికవే తమదైన ప్రత్యేకతను కలిగివున్నాయి. కాబట్టి మీరు మీకు నచ్చిన స్పెషలైజేషన్‌ను ఎంచుకోండి.

ఐఐటీ-దిల్లీ, బాంబే, బెంగళూరు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లాంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, సంస్థలు ఎంఎస్‌సీ కెమిస్ట్రీ, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ+పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. ఉద్యోగావకాశాల పరంగా ఎంఎస్‌సీ కెమిస్ట్రీ పూర్తిచేసినవారికి రిసెర్చ్ సైంటిస్ట్, సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్, కెమికల్ అనలిస్ట్, రిసెర్చ్ అనలిస్ట్, ఉపాధ్యాయ వృత్తిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను సాధించుకోవచ్చు.

● **ప్రొ. బి. రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

రాహుల్‌కు వాజ్‌పేయి తంత్రమే శరణ్యం

- భావసారూప్య పార్టీలతో జట్టుకడితేనే కాంగ్రెస్‌కు అవకాశాలు
- ఒకింత అనుకూలంగా పరిస్థితులు
- దగ్గరవుతున్న ప్రాంతీయ పార్టీలు
- 2014 స్థాయిలో బలంగా లేని భాజపా

ఈనాడు - దిల్లీ

భాజపాను ఢీకొట్టి వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ముందున్న ఏకైక మార్గం.. పొత్తులు పెట్టుకోవడమే. 1999లో వాజ్‌పేయి 24 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి, తొలిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఐదేళ్లు నడిపిన రీతిలో రాహుల్ కూడా మైత్రి మంత్రాన్ని పఠించాల్సిందేనన్న అభిప్రాయం వినపడుతోంది. ఉత్తర, పశ్చిమ భారత దేశంలో తనకు బాగా పట్టున్న చోట్ల భాజపా పరిస్థితి 2014లో స్థాయిలో పటిష్ఠంగా లేకపోవడం కాంగ్రెస్‌కు ఒకింత ఊరట కలిగించే అంశం. ఇదే సమయంలో 'హస్తం' పార్టీ కూడా మూడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికే పరిమితమై ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భాజపాను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ గట్టిగా శ్రమించాల్సిందే.

తగ్గిన ప్రభ..

యూపీలో తనకు గట్టి పట్టున్న గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్‌లో భాజపా ఓటమిపాలైంది. ఆ రాష్ట్రంలో ఎస్పీ-బీఎస్పీలు పొత్తు దిశగా అడుగులు వేస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2014 లోక్‌సభ ఎన్నికల గణాంకాల ప్రకారం.. యూపీలో భాజపా 34 సీట్లు మాత్రమే గెల్చుకునే అవకాశం ఉంటుంది. మునుపటి ఎన్నికల్లో ఈ పార్టీ.. మొత్తం 80 సీట్లకు గాను 73 గెల్చుకోవడం ఇక్కడ ప్రస్తావనార్హం. పశ్చిమ బెంగాల్, ఒడిశాల్లో భాజపాకు స్వల్పంగానే లాభించవచ్చు. బలమున్న ప్రాంతాల్లో కోల్పోయిన సీట్లను భర్తీ చేసే స్థాయిలో ఇవి ఉండవు. దక్షిణాన.. భాజపా స్థాయి నామమాత్రమే. దీనికితోడు ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న మోదీ సర్కారు.. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, మధ్యతరగతిలో అసంతృప్తి వంటి అంశాల్లో ఒకింత ఆత్మరక్షణ పరిస్థితిని ఎదుర్కొంటోంది. మిత్రపక్షాల్లోనూ లుకలుకలు మొదలయ్యాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన ప్రకటించింది. తెదేపా.. ఎన్డీఏ నుంచి వైదొలిగింది. ఎల్జేపీ, అకాలీదళ్ కూడా భాజపాపై అసంతృప్తిగా ఉన్నాయి.



కలిసొస్తున్న పార్టీలు..

2019 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా ఓటమికి ఉమ్మడి కార్యాచరణను రూపొందించడం ద్వారా భావసారూప్య పార్టీల మధ్య సహకారం ఉండాలని కాంగ్రెస్.. ప్లీనరీలో తీర్మానించుకుంది. "మూడో కూటమికి అవకాశం తక్కువే. కాంగ్రెస్ ఒక్కటి మాత్రమే భాజపాను ఓడించడం సాధ్యం కాదు. అయితే ప్రస్తుత విపక్షాల్లో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్సే అవతరించడం ఖాయం. అందువల్ల ఇతర పార్టీలతో కలసి లౌకిక సంకీర్ణం కోసం కాంగ్రెస్ చొరవ తీసుకొని, నాయకత్వం వహిస్తుంది" అని కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ తెలిపారు. అయితే అది సాకారం కావడానికి ముందు విపక్ష పార్టీలు.. అధికార పార్టీ పాలనకు వ్యతిరేకంగా గట్టి వాదన వినిపించాలని, కలిసికట్టుగా సాగుతామన్న విశ్వసనీయ హామీని ఇవ్వాలని ఒక స్వతంత్ర విశ్లేషకుడు తెలిపారు.

> 2014 స్థాయి ఘన విజయాన్ని పునరావృతం చేయడం భాజపాకు అంత సులువు కాదు. గత ఏడాది గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా.. కాంగ్రెస్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొంది. ఇటీవలి ఉప ఎన్నికలు, సర్వేలను బట్టి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణల్లో ప్రభుత్వ వ్యతిరేకత సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

> ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్ వంటి భాజపా వ్యతిరేక ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌పై తమ కఠిన వైఖరిని సడలించాయి. త్రిపురలో పరాజయం తర్వాత.. కాంగ్రెస్‌తో జట్టుకట్టాలని సీపీఎంపై అంతర్గతంగా ఒత్తిడి పెరుగుతోంది.

వికటించొచ్చు..

అయితే భారత్ వంటి భిన్నత్వాలు కలిగిన దేశంలో గణాంకాలే కాకుండా అనేక అంశాలూ ఫలితాలను ప్రభావితం చేస్తాయి. భాజపా వ్యతిరేక పార్టీలన్నీ ఉమ్మడిగా భాజపాను ఎదుర్కోవాలని నిర్ణయిస్తే.. అది వికటించే అవకాశమూ ఉంది. ప్రజల్లో మోదీ పట్ల సానుభూతికి దారితీయవచ్చు. 1971లో కాంగ్రెస్ వ్యతిరేక కూటమిని ఇందిరా గాంధీ ఇదే రీతిలో తెలివిగా ఎదుర్కొన్నారు. "పేదరికాన్ని తొలగించాలని నేను అంటుంటే.. వారు మాత్రం ఇందిరను తొలగించాలంటున్నారు" అని ఆమె ప్రచారం చేశారు. ఈ నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఫలితంగా కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. అదే రీతిలో భాజపా వ్యతిరేక పార్టీలన్నీ ఎన్నికలకు ముందే జట్టు కడితే.. మోదీ కూడా తెలివిగా నినాదాన్ని తెచ్చి, సొమ్ము చేసుకోవచ్చు. "భారత్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని నేనంటుంటే.. వారు మాత్రం మోదీకి ఉద్వాసన పలకాలంటున్నారు" అని నినదించవచ్చు.

రాష్ట్ర స్థాయి నుంచి..

అందువల్ల భాజపా వ్యతిరేక పార్టీలతో రాష్ట్రస్థాయిలో అవగాహన కోసం కృషి చేయడమే రాహుల్ గాంధీ ముందున్న మేలైన మార్గం. ఈ విధానం ద్వారా ప్రధాన వ్యతిరేక శక్తులు.. భాజపాతో ముఖాముఖీ తలపడతాయి. ద్వితీయ శ్రేణి శక్తులు కూడా తమకు బలమున్న చోట్ల సీట్లు గెల్చుకుంటాయి. ఇలాంటి వ్యూహాత్మక పోటీలో భాజపా తర్వాత రెండో ప్రధాన జాతీయ శక్తిగా కాంగ్రెస్ అవతరించే అవకాశం ఎక్కువగా ఉంది.

అంత సులువేమీ కాదు..

ఇది జరగాలంటే భాజపా.. 180 కన్నా తక్కువగా సీట్లను గెల్చుకోవాలి. అయితే ఇప్పుడున్న స్థితిలో భాజపాకు 220 కన్నా సీట్లు తగ్గే అవకాశం లేదని ఆ పార్టీకి గట్టి వ్యతిరేకులుగా ఉన్నవారు కూడా చెబుతున్నారు. ఆ పార్టీ పటిష్ఠంగా ఉన్న చోట్ల కొంతమేర ఆదరణ తగ్గినప్పటికీ అసోంతోపాటు ఈశాన్యంలో కొన్నిచోట్ల కొత్తగా బలాన్ని పెంచుకుంది. నిజానికి 2014 నుంచి భాజపా, దాని మిత్రపక్షాలు చాలా రాష్ట్రాల్లో విజయం సాధించాయి. దీనికి భిన్నంగా కాంగ్రెస్ ఇప్పుడు కర్ణాటక, పంజాబ్, మిజోరం రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి మాత్రమే పరిమితమైంది. కర్ణాటకలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపా నుంచి కాంగ్రెస్ గట్టి పోటీ ఎదుర్కొంటోంది.

ఫలించిన విందు

మార్చి 13న సోనియా గాంధీ ఇచ్చిన విందుకు 19 విపక్ష పార్టీలు హాజరయ్యాయి. ఇది కాంగ్రెస్‌లో భరోసాను నింపాయి. అదే సమయంలో తృణమూల్, ఎన్సీపీ వంటి అనేక ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌పై అసంతృప్తి ఉన్నప్పటికీ ఆ సమావేశానికి వచ్చాయి. దీనికి నిర్దిష్ట కారణం ఉంది. "నేడు అనేక ప్రాంతీయ పార్టీల్లో కలవరానికి భాజపా హిందూత్వ ఎజెండా ఒక్కటే కారణం కాదు. మోదీ-అమిత్ షా నేతృత్వంలోని భాజపా 'నిరంకుశ' ఎన్నికల యంత్రంగా మారిందని ఆ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. దాదాపు ప్రతి పార్టీనీ మింగేసేలా భాజపా వ్యవహరిస్తోంది" అని ఓ స్వతంత్ర విశ్లేషకుడు తెలిపారు. ఈ ఆందోళన కారణంగానే వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడించాలన్న కాంక్ష విపక్ష పార్టీల్లో బలపడింది. అయితే భాజపాను ఓడించడానికి అదొక్కటే సరిపోతుందా? గణాంకాల కోణంలో చూస్తే దీనికి ఔననే సమాధానం వస్తోంది. గత ఎన్నికల్లో 282 సీట్లను గెల్చుకున్న భాజపాకు దేశవ్యాప్తంగా 31 శాతం ఓట్లే పడ్డాయి. అందువల్ల సంకీర్ణాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల సంఖ్యాపరంగా మేలే చేస్తుంది.

భారతీయ సాంస్కృతిక ప్రతిరూపం సర్దార్ పటేల్: వెంకయ్యనాయుడు



ఈనాడు, దిల్లీ: పార్లమెంటు లోపల, బయటా కూడా 'సంప్రదింపులు, సంభాషణలు, ఆలోచనలు' అనేవి ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సర్దార్‌పటేల్ భారతీయ సాంస్కృతిక ప్రతిరూపం అని అభివర్ణించారు. ఉపరాష్ట్రపతి సచివాలయంలో నిర్మించిన సమావేశపు గదిని సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. దీనికి మనదేశ మొదటి హోంమంత్రి సర్దార్ పటేల్ పేరు పెట్టారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ముఖ్యమైన ప్రతినిధులను వెంకయ్య ఇకమీదట ఇందులోనే కలవనున్నారు. ఇందులో 150 మంది కూర్చోవచ్చు. మూడు నెలల్లోనే ఈ సమావేశ మందిర నిర్మాణాన్ని పూర్తిచేసిన పట్టణాభివృద్ధి, కేంద్ర ప్రజాపనుల శాఖ, ఎన్ఎండీసీ అధికారులను ఆయన అభినందించారు.

సరిహద్దు పౌరుల మృతిపై భారత్ ఆగ్రహం

పాక్ డిప్యూటీ హైకమిషనర్‌ను పిలిపించుకుని నిరసన

దిల్లీ/ఇస్లామాబాద్: సరిహద్దులకు కిలోమీటర్ల దూరంలో ఉన్న పౌరులపైకి ఎలాంటి కవ్వింపులు లేకుండానే శక్తిమంతమైన ఆయుధాలతో గుళ్లవర్షం కురిపించిన పాక్ సైనికుల బరితెగింపుపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆదివారం జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట భింబర్ గలి సెక్టార్‌లో జరిగిన ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు భారత పౌరులు మృతి చెందగా, మరో ఇద్దరు చిన్నారులు గాయపడిన విషయం తెలిసిందే. భారత్‌లోని పాక్ డిప్యూటీ హైకమిషనర్ సయ్యద్ హైదర్ షాను సోమవారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ... దిల్లీలోని సౌత్ బ్లాక్‌కు పిలిపించుకుని తీవ్ర నిరసనను తెలిపింది. అమాయక పౌరుల ప్రాణాలను హరించటం సైనిక ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని పేర్కొంది. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా తన సైనిక బలగాలకు ఆదేశాలివ్వాలని పాకిస్థాన్‌కు గట్టిగా చెప్పింది. 2018లో ఇప్పటి వరకూ 506 సార్లు పాక్ దళాలు ఉల్లంఘనలకు పాల్పడ్డాయని, 23 మంది భారత పౌరులు మృతిచెందారని పాక్ డిప్యూటీ హైకమిషర్ దృష్టికి తీసుకెళ్లి, నిరసన తెలిపినట్లు విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

అజ్మీరు దర్గాలో ప్రధాని తరఫున 'ఛాదర్' సమర్పణ

జైపూర్: శాంతి.. ఐక్యత.. సౌహార్ద్రతలు భారత తాత్వికతకు మూలస్తంభాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. అజ్మీరులోని ప్రఖ్యాత హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గా(అజ్మీర్ దర్గా)లో ప్రధాని తరఫున కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ సోమవారం 'ఛాదర్'ను సమర్పించారు.

అక్కను కాల్చిచంపిన తొమ్మిదేళ్ల బాలుడు

- అమెరికాలో దారుణ ఘటన

వాషింగ్టన్: వీడియో గేమ్ నియంత్రణ సాధనం (కంట్రోలర్) ఇవ్వలేదన్న ఆగ్రహంతో అమెరికాలో ఓ బాలుడు తన సోదరిని కాల్చిచంపాడు. మిసిసిపీ రాష్ట్రంలోని మన్రో కౌంటీలో ఈ దారుణం చోటుచేసుకుంది. వీడియో గేమ్ విషయంలో తొమ్మిదేళ్ల బాలుడికి అతడి అక్క(13)తో గత శనివారం వాగ్వాదం చోటుచేసుకుందని అధికారులు వెల్లడించారు. నియంత్రణ సాధనం ఇచ్చేందుకు సోదరి నిరాకరించడంతో పట్టరాని కోపంతో ఊగిపోయిన బాలుడు తుపాకీ తీసుకొచ్చి కాల్పులు జరిపాడని తెలిపారు. బాలిక తల గుండా తూటా దూసుకెళ్లడంతో మెదడు ఛిద్రమయ్యిందని.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి ఆదివారం కన్నుమూసిందని వివరించారు. బాలుడి చేతికి తుపాకీ ఎలా వచ్చిందనే విషయంపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.

బామ్మను చితకబాదిన మనవరాలు!

- సామాజిక మాధ్యమంలో వీడియో కలకలం

కన్నూర్ (కేరళ): తొంభై ఏళ్ల బామ్మను దారుణంగా చితకబాది, ఇంటి నుంచి గెంటేసిందో మనవరాలు! అడ్డుపడిన ఆమె కుమార్తెనూ వదల్లేదు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమంలో కలకలం సృష్టిస్తున్నాయి. ఎట్టకేలకు పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి, బాధితులను ఆసుపత్రికి తరలించారు. కన్నూరుకు చెందిన కల్యాణి(90)ని ఆమె మనవరాలు దీపా(40) చాలా దారుణంగా చితకబాదింది. అడ్డుపడిన కల్యాణి కుమార్తెనూ వదల్లేదు. సహించలేకపోయిన పక్కింటి వాళ్లు... దీనంతటినీ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి, సామాజిక మాధ్యమంలో పెట్టారు. మానవ హక్కుల కమిషన్ దీపాపై కేసు నమోదు చేసింది. మనవరాలు తనను తిట్టని, కొట్టనిరోజు లేదంటూ వృద్ధురాలు విలపిస్తూ చెప్పిన దృశ్యాలు కంటతడి పెట్టించేవిగా ఉన్నాయి.

మేం చెబుతున్నదానినే నోబెల్ గ్రహీతా చెప్పారు

నిరుద్యోగంపై రాహుల్‌గాంధీ

దిల్లీ: దేశంలో నిరుద్యోగం గణనీయంగా పెరుగుతున్నా ప్రధాని నరేంద్రమోదీ మాత్రం 'అచ్ఛేదిన్' అంటూ మభ్యపెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. భారత్ పెద్దఎత్తున నిరుద్యోగాన్ని ఎదుర్కోబోతోందంటూ నోబెల్ పురస్కారం పొందిన ఆర్థికవేత్త పాల్ క్రగ్‌మేన్ కూడా ధ్రువీకరించారనీ, తాము రెండేళ్లుగా ఈ మాట చెబుతూ వస్తున్నామనీ చెప్పారు. భారీ స్థాయి నిరుద్యోగం మన దేశానికి పెద్ద ముప్పుగా పరిణమించబోతున్నా ప్రధాని మాత్రం ఆ విషయాన్ని అంగీకరించడం లేదని రాహుల్ సోమవారం ట్విటర్లో పేర్కొన్నారు. భారత్‌లో చివరకు మిగిలేది నిరుద్యోగమేనంటూ క్రగ్‌మేన్‌ను ఉటంకిస్తూ వెలువడిన వార్తాకథనాన్ని జతచేశారు.

23న భాజపా పార్లమెంటరీ పార్టీ భేటీ

దిల్లీ: భాజపా పార్లమెంటరీ పార్టీ భేటీ ఈ నెల 23న (శుక్రవారం) పార్టీ ప్రధాన కార్యాలయంలో జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, ఇతర సీనియర్ నేతలు పాల్గొననున్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం కొత్త భవంతిలోకి మారిన తర్వాత తొలిసారిగా అక్కడ జరగబోతున్న పార్లమెంటరీ పార్టీ భేటీ... విందుతో ముగియనుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో నెల కొన్న ప్రతిష్టంభన, ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో పార్టీ పరాజయం వంటి పరిస్థితుల నేపథ్యంలో జరగబోతున్న భేటీ ఇది.

రాహుల్ చెప్పినవన్నీ అబద్ధాలే.. రవిశంకర్: కాంగ్రెస్ ప్లీనరీ వేదికగా ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వం గురించి చెప్పినవన్నీ అబద్ధాలేనని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. అబద్ధాలు చెప్పడమే ఆయన హాల్‌మార్క్‌గా మారిందని విమర్శించారు.

ఆలయాల నిర్మాణంతో ప్రజా సమస్యలు పరిష్కారం కావు

- యోగి సర్కారుపై విరుచుకుపడ్డ స్వపక్ష, విపక్షాలు

లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ సర్కారుపై భాజపా మిత్రపక్షం ఎస్‌బీఎస్‌పీ విమర్శలు గుప్పించింది! ఆలయాల నిర్మాణంతో ప్రజాసమస్యలు పరిష్కారం కావని ఘాటుగా వ్యాఖ్యానించింది. యూపీలో భాజపా సంకీర్ణ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారమిక్కడ భారీ ఉత్సవాలను ఏర్పాటుచేశారు. అవినీతిపై ఫిర్యాదుల కోసం రూపొందించిన వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఆవిష్కరించారు. 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆయన ప్రకటించారు. అయితే, ఈ కార్యక్రమానికి భాజపా మిత్రపక్షం సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) దూరంగానే ఉండిపోయింది.

వాట్సాప్‌పై చైనా హ్యాకర్ల గురి

బెంగళూరు: వాట్సాప్ వినియోగదారులూ జాగ్రత్త..! ఈ సామాజిక అనుసంధాన వేదికను లక్ష్యంగా చేసుకుని మన ఫోన్లలోకి చైనా హ్యాకర్లు చొరబడుతున్నారని భారత సైన్యం హెచ్చరించింది. వాట్సాప్‌ను జాగ్రత్తగా ఉపయోగించాలని ఓ వీడియోనూ ఆదివారం విడుదలచేసింది. 'డిజిటల్ ప్రపంచంలోకి చొరబడేందుకు చైనా హ్యాకర్లు ఏ దారినీ వదిలి పెట్టడంలేదు. వారు వాట్సాప్ గ్రూప్‌లను ఎంచుకొంటున్నారు. 86తో వారి నంబర్లు మొదలవుతున్నాయి. వారికి గ్రూప్‌లో సభ్యత్వం ఇస్తే.. మీ సమాచారం కొల్లగొట్టే ముప్పుంది' అని దానిలో పేర్కొన్నారు.

మరో 'దాణా కేసు'లో దోషిగా లాలూ

- ప్రత్యేక న్యాయస్థానం తీర్పు



రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం వద్ద జగన్నాథ్ మిశ్రా

రాంచీ: దాణా కుంభకోణానికి సంబంధించిన మరో కేసులో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌ను ప్రత్యేక సీబీఐ కోర్టు దోషిగా తేల్చింది. మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రను నిర్దోషిగా ప్రకటించింది.

1990లలో దుమ్కా కోశాగారం నుంచి అక్రమంగా రూ.3.13 కోట్లను విత్‌డ్రా చేయడానికి సంబంధించిన ఈ కేసుపై సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి శివపాల్ సింగ్ తీర్పు చెప్పారు. లాలూతోపాటు మరో 18 మందిని దోషులుగా, మిశ్ర సహా 12 మందిని నిర్దోషులుగా ప్రకటించారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని 120బి (నేరపూరిత కుట్ర), 409 (దుర్వినియోగం), 420 (మోసం), 471 (తప్పుడు పత్రాలను అసలైనవిగా చూపడం), 477ఏ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లలో అధికార దుర్వినియోగం వంటి అభియోగాలపై దోష నిర్ధారణ జరిగింది. వీరికి విధించాల్సిన శిక్ష పరిమాణంపై ఈ నెల 21 నుంచి వాదనలు జరుగుతాయి. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు ఆర్జేడీ ఉపాధ్యక్షుడు రఘువంశ్ ప్రసాద్ సింగ్ తెలిపారు.

1990లలో లాలూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చోటుచేసుకున్న ఈ కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో లాలూపై దోష నిర్ధారణ జరగడం ఇది నాలుగోసారి. దేవ్‌గఢ్ కోశాగారం నుంచి అక్రమంగా నిధులు విడుదల చేయడానికి సంబంధించిన రెండో కేసులో ఆయనకు ఇప్పటికే శిక్ష పడింది. గత ఏడాది డిసెంబర్ 23 నుంచి ఆయన రాంచీలోని బిర్సా ముండా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. రూ.377.7 కోట్ల స్వాహాకు సంబంధించిన మరో కేసులో ఆయన 2013 సెప్టెంబర్ 30న దోషిగా తేలారు. ఆ కేసులో ఐదేళ్ల జైలు శిక్ష పడింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. శిక్ష పూర్తయ్యాక ఆరేళ్ల వరకూ ఆయన.. ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదు. రూ.37.62 కోట్ల విత్‌డ్రాకు సంబంధించిన మరో కేసులో ఆయనకు ఈ ఏడాది జనవరి 24న ఐదేళ్ల జైలు శిక్ష పడింది. మరోవైపు జగన్నాథ్ మిశ్ర.. రెండు కేసుల్లో దోషిగా తేలగా, రెండింటి నుంచి విముక్తి పొందారు. రాంచీలోని దొరాండా కోశాగారం నుంచి రూ.139 కోట్లను అక్రమంగా విత్‌డ్రా చేయడానికి సంబంధించిన ఐదో కేసు.. పెండింగ్‌లో ఉంది.

రూ.10 కోట్లు ఐటీ విభాగానికి కట్టండి

- నేషనల్ హెరాల్డ్ కేసులో యంగ్ ఇండియన్ సంస్థకు దిల్లీ హైకోర్టు ఆదేశాలు

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఆయన తల్లి సోనియా నిందితులుగానున్న "నేషనల్ హెరాల్డ్ కేసు"లో దిల్లీ హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలిచ్చింది. పన్ను వివాదానికి సంబంధించి రూ.249.15 కోట్లకు బదులుగా రూ.10 కోట్లు చెల్లించాలని యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్(వైఐపీఎల్)కు సూచించింది. ఈ మొత్తాన్ని నాలుగు వారాల్లోపు ఆదాయపు పన్ను(ఐటీ) విభాగం వద్ద జమచేయాలని జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ ఏకే చావ్లాలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. అప్పటివరకూ ఎలాంటి చర్యలూ తీసుకోకూడదని ఐటీ విభాగానికి సూచించింది. అంతేకాదు తమపై విచారణకు వ్యతిరేకంగా వైఐపీఎల్ దాఖలుచేసిన అభ్యర్థనపై స్పందించాలనీ ఐటీ విభాగానికి సూచించింది.

రూ.50 లక్షల మూలధన వ్యయంతో 2010 నవంబరులో వైఐపీఎల్‌ను నెలకొల్పారు. దీనిలో రాహుల్, సోనియా ప్రధాన వాటాదారులు.

బాలికను గర్భవతిని చేసిన వృద్ధుడు

తుళ్ళూరు,న్యూస్‌టుడే: దైవప్రార్థన ముసుగులో అభం శుభం తెలియని బాలికను ప్రలోభపెట్టి ఒక వృద్ధుడు గర్భవతిని చేశాడు. నాలుగు నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంలో మూడు రోజులక్రితం బాలిక కడుపునొప్పిగా ఉందని తల్లికి చెప్పడంతో అసలు విషయం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజధాని అమరావతిలోని వెంకటపాలెం గ్రామానికి చెందిన నీలం కోటేశ్వరరావు(60) వారంలో ఐదు రోజుల పాటు గ్రామాల్లో తిరుగుతూ పచ్చళ్లు విక్రయిస్తుంటాడు. శని, ఆదివారం రోజుల్లో ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ప్రార్థనలకు వెళుతున్న పెద్దలతో పాటు ఒక బాలిక కూడా వెళుతుండేది. ఈ క్రమంలో బాలికను నెమ్మదిగా లొంగదీసుకున్నాడు. శనివారం బాలిక తనకు కడుపునొప్పిగా ఉందని చెప్పటంతో తల్లి ఆమెను గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయగా బాలిక గర్భవతి అని తేలింది. వెంటనే ఆసుపత్రి సిబ్బంది తుళ్ళూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు రంగప్రవేశం చేసి విచారించగా నీలం కోటేశ్వరరావు తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని బాలిక వివరించింది. దీనికి కారకుడైన వ్యక్తిపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు సీఐ సుధాకరరావు చెప్పారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు వివరించారు.

నిర్మాణరంగ కూలీల కోసం నమూనా పథకం

- సెప్టెంబరు 30లోగా రూపొందించండి: సుప్రీం

దిల్లీ: నిర్మాణరంగ కూలీల సంక్షేమం కోసం ఈ ఏడాది సెప్టెంబరు 30లోగా ఓ నమూనా పథకాన్ని రూపొందించాల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, పింఛను వంటి అంశాలకు అందులో ప్రాధాన్యం కల్పించాలని జస్టిస్ ఎం.బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం సూచించింది. వారి ప్రయోజనాల కోసం రూ.37,400 కోట్లకుపైగా సేకరించారని.. అందులో రూ.9,500 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోందని పేర్కొంది. మిగిలిన సొమ్మును ఎందుకు వ్యయం చేయడం లేదని ప్రశ్నించింది. నిపుణుల కమిటీని ఏర్పాటుచేసి బీవోసీడబ్ల్యూ ప్రకారం ఆర్నెళ్లలో శాసనబద్ధ నిబంధనలను తయారుచేయాలని కూడా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది.

రష్యా పీఠంపై నాలుగోసారి పుతిన్

- అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం
- దొంగ ఓట్ల ఫలితమేనని ప్రత్యర్థుల ఆరోపణలు



మాస్కో: రష్యా అధ్యక్ష పీఠాన్ని మరో ఆరేళ్లపాటు వ్లాదిమిర్ పుతిన్ అధిష్ఠించబోతున్నారు. ఆదివారంనాటి ఎన్నికల్లో ఆయన చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేశారు. దీంతో వరుసగా నాలుగో దఫా అధికారం ఆయన చెంతకుచేరింది. అయితే ఆయన రిగ్గింగ్‌కు పాల్పడ్డారంటూ ప్రత్యర్థులు నిరసన గళమెత్తారు. మరోవైపు పశ్చిమ దేశాలతో దౌత్య బంధాలు మరింత దిగజారిపోతాయని హెచ్చరించారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచీ రష్యా పాలన పుతిన్ చేతుల్లోనే ఉంది. తాజా ఎన్నికల్లో ఇదివరకెన్నడూ లేనిరీతిలో ఆయన ఆధిక్యం (76.66 శాతం ఓట్లు) కనబరిచారు. దీంతో జీవితాంతం అధ్యక్షుడిగా ఆయన కొనసాగుతారని వార్తలు వచ్చాయి. వీటిని పుతిన్ తోసిపుచ్చారు.

2024 వరకూ..: 2024వరకూ అధ్యక్ష పదవిని పుతిన్ చేపట్టబోతున్నారు. జోసెఫ్ స్టాలిన్ తర్వాత దీర్ఘకాలం ఈ పదవిలో కొనసాగిన నేతగా ఇప్పటికే ఆయన చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ఆయనకు పోటీగా ఏడుగురు అభ్యర్థులు బరిలోకి దిగారు. తరచూ విమర్శల బాణాలు సంధించే ప్రధాన అభ్యర్థి అలెక్సీ నావల్నీ చివర్లో అనర్హతకు గురయ్యారు. దీంతో ఫలితాలు ఏకపక్షమయ్యాయి. 'ఈ ఫలితాల్లో ప్రజల ఆకాంక్ష, విశ్వాసం ప్రతిధ్వనిస్తున్నాయి' అంటూ చిరునవ్వులు చిందిస్తూ పుతిన్ విలేకరులతో చెప్పారు. తాము ఊహించిన దానికంటే 8నుంచి 10 శాతం ఎక్కువగా ఓట్లు పడినట్లు పుతిన్ ప్రచార సారథి ఆంద్రీ కొంద్రాషోవ్ తెలిపారు. ముఖ్యంగా క్రిమియాలో 92 శాతానికిపైగా ఓట్లు పుతిన్‌కే దక్కాయి.

అభినందనలు తెలిపిన మోదీ

ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పుతిన్‌కు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో అభినందనలు తెలిపారు. 'పుతిన్ సారథ్యంలో భారత్-రష్యాల మధ్య ప్రత్యేక, విశిష్ట వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని మోదీ ఆకాంక్షించారు.

సెన్సెక్స్ ▼ 253 **32923** | నిఫ్టీ ▼ 101 **10094** | డోజోన్స్ 24553 ▼ 393 | నాస్‌డాక్ 7307 ▼ 175 | రూపాయి 65.17 ▼ (ఒక అమెరికా డాలరుకు) 23 పైసలు | ముడి చమురు 66.14 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)

నిఫ్టీ	19న	మార్పు %
NTPC	167.00	1.30
MARUTI SUZUKI	8773.50	1.12
POWER GRID CORP.	194.20	1.01
L & T	1279.55	0.81
HUL	1309.40	0.79
LUPIN	766.60	0.62
M & M	742.70	0.26
GAIL (INDIA)	442.05	0.24

గ్రహణం (-)

నిఫ్టీ	19న	మార్పు%
HCL TECH	926.50	-4.25
TATA STEEL	574.95	-4.21
BHARTI AIRTEL	399.65	-4.10
TECH MAHINDRA	609.90	-3.91
BPCL	430.75	-3.75
INDIAN OIL CORP	177.90	-3.71
HPCL	352.35	-3.40
BAJAJ FINANCE	1631.85	-3.32

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.17	68.61	బ్రహెయిన్ దీనార్	160.23	183.62
పౌండ్ స్టెర్లింగ్	82.43	95.59	కువైట్ దీనార్	179.27	223.17
యూరో	72.60	84.21	ఒమన్ రియాల్	156.91	179.51
జపనీస్ యెన్/100	55.90	64.83	సౌదీ రియాల్	15.74	18.64
ఆస్ట్రేలియా డాలరు	45.57	52.72	యూఏఈ దిర్హమ్	16.11	18.83
సింగపూర్ డాలరు	44.88	53.18	మలేషియా రింగిట్	14.80	18.20
థాయ్ బాత్/100	189.52	226.67	చైనీస్ యువాన్	7.27	11.78



కొత్త ఫండ్లు మీకోసం



ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లు దిద్దుబాటు దిశగా పయనిస్తుండటంతో.. చిన్న మదుపర్లతో పాటు ఓ స్థాయి వాళ్లు కూడా మ్యూచువల్ ఫండ్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. వీళ్ల కోసమే ఫండ్ సంస్థలు ప్రత్యేక పథకాలతో ముందుకొస్తున్నాయి. ఈ వారం కొత్తగా వచ్చిన ఫండ్‌లను ఒకసారి చూస్తే..

1 ఐడీఎఫ్‌సీ ఫిక్స్‌డ్ టర్మ్ ప్లాన్- సిరీస్ 144 (1141 రోజులు)

- **ముగింపు తేదీ** : నేడు (మార్చి 20)
- **విభాగం** : క్లోజ్-ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్‌కాంపోజిట్ బాండ్‌ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : హర్షల్ జోషి

2 ఎస్‌బీఐ డెట్ ఫండ్ సిరీస్ సీ-14 (1122 రోజులు)

- **ముగింపు తేదీ** : నేడు (మార్చి 20)
- **విభాగం** : క్లోజ్-ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 70-100% రుణ పథకాల్లో, 0-30% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.1 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : రంజనా గుప్తా

3 ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్- సిరీస్ 82 ప్లాన్ టీ

- **ముగింపు తేదీ** : నేడు (మార్చి 20)
- **విభాగం** : క్లోజ్-ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 60-100% రుణ పథకాల్లో, 0-40% మనీమార్కెట్‌లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్‌అల్ట్రా షార్ట్ టెర్మ్ డెట్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్లు** : రాహుల్ గోస్వామి, రోహన్ మారు

4 ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్- సిరీస్ 82 ప్లాన్ ఎస్

- **ముగింపు తేదీ** : గురువారం (మార్చి 22)
- **విభాగం** : క్లోజ్-ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 80- 100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్లు** : రాహుల్ గోస్వామి, రోహన్ మారు

5 ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఫిక్స్‌డ్ టర్మ్ ప్లాన్- సిరీస్ పీఓ (1140 రోజులు)

- **ముగింపు తేదీ** : నేడు (మార్చి 20)
- **విభాగం** : క్లోజ్-ఎండెడ్ ఆదాయపథకం
- **కేటాయింపులు** : 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.1000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : మోహిత్ శర్మ

6 యూటీఐ- ఫిక్స్‌డ్ టర్మ్ ఇన్‌కమ్ ఫండ్ - సిరీస్ XXVIII XIV

- **ముగింపు తేదీ** : నేడు (మార్చి 20)
- **విభాగం** : క్లోజ్-ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్‌ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : సునీల్ పాటిల్

7 సుందరం ఎమర్జింగ్ స్మాల్ క్యాప్- సిరీస్ 2 (5 ఏళ్లు)

- **ముగింపు తేదీ** : ఏప్రిల్ 2
- **కేటాయింపులు** : 65% ఈక్విటీ, 35% ఫిక్స్‌డ్, మనీ మార్కెట్‌లో
- **రిస్క్** : కొంచెం ఎక్కువ
- **ప్రామాణిక సూచీ** : బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా
- **ఎగ్జిట్ లోడ్** : లేదు

మరోవైపు కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ వారం డివిడెండ్‌లను ప్రకటించాయి. అవేంటో చూస్తే..

పథకం	ఆప్షన్	ప్లాన్‌లు	డివిడెండు (యూనిట్‌కు)	రికార్డు తేదీ
ఎడెల్‌వైజ్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్	మంత్లీ డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.0.22	మార్చి 22
ఎడెల్‌వైజ్ ఎకనామిక్ రీసర్జెన్స్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1	మార్చి 22
ఎడెల్‌వైజ్ మిడ్ అండ్ స్మాల్‌క్యాప్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1.20	మార్చి 22
ఎడెల్‌వైజ్ ఈక్విటీ ఆపర్చ్యునిటీస్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.0.10	మార్చి 22
ఎడెల్‌వైజ్ ఈక్విటీ సేవింగ్స్ అడ్వాంటేజ్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.0.20	మార్చి 22
ఎడెల్‌వైజ్ లాంగ్‌టెర్మ్ ఈక్విటీ	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1.20	మార్చి 22
ఎడెల్‌వైజ్ లార్జ్‌క్యాప్ అడ్వాంటేజ్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.2	మార్చి 22
యూనియన్ ఈక్విటీ	డివిడెండ్	రెగ్యులర్	రూ.1	మార్చి 22
యూనియన్ ఈక్విటీ	డివిడెండ్	డైరెక్ట్	రూ.1.5	మార్చి 22
యూనియన్ ట్యాక్స్ సేవర్	డివిడెండ్	రెగ్యులర్	రూ.1	మార్చి 22
యూనియన్ స్మాల్‌క్యాప్	డివిడెండ్	రెగ్యులర్	రూ.1	మార్చి 22
యూనియన్ స్మాల్‌క్యాప్	డివిడెండ్	డైరెక్ట్	రూ.3	మార్చి 22
యూనియన్ అసెట్ అలకేషన్	డివిడెండ్	రెగ్యులర్	రూ.1	మార్చి 22
యూనియన్ అసెట్ అలకేషన్	డివిడెండ్	డైరెక్ట్	రూ.0.50	మార్చి 22
ఇండియాబుల్స్ బ్లూచిప్ ఫండ్	డివిడెండ్	రెగ్యులర్	రూ.4.26	మార్చి 22
యాక్సిస్ లాంగ్‌టెర్మ్ ఈక్విటీ	డివిడెండ్	రెగ్యులర్	రూ.2.50	మార్చి 22
యాక్సిస్ లాంగ్‌టెర్మ్ ఈక్విటీ	డివిడెండ్	డైరెక్ట్	రూ.1.50	మార్చి 22
సుందరం సెలెక్ట్ స్మాప్‌క్యాప్ సిరీస్2,3,4	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1	మార్చి 21
సుందరం వాల్యూ ఫండ్ సిరీస్, 2,3	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.2	మార్చి 21
డీఎస్‌పీ బ్లాక్‌రాక్ మిడ్‌క్యాప్	డివిడెండ్	రెగ్యులర్	రూ.2.60	మార్చి 22
డీఎస్‌పీ బ్లాక్‌రాక్ యూఎస్‌ఫ్లెక్సిబుల్ ఈక్విటీ	డివిడెండ్	రెగ్యులర్	రూ.1.10	మార్చి 22
జేఎం ఆర్బిట్రేజ్‌అడ్వాంటేజ్	డివిడెండ్	రెగ్యులర్	రూ.2.15	మార్చి 21
టారస్ నిఫ్టీ ఇండెక్స్	డివిడెండ్	రెగ్యులర్	రూ.6.70	మార్చి 22
టారస్ స్టార్‌షేర్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1.50	మార్చి 22
ఐసీఐసీఐప్రుడెన్షియల్ వాల్యూఫండ్ సిరీస్1	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1.70	మార్చి 22
ఐడీఎఫ్‌సీ ప్రీమియర్ ఈక్విటీ	డివిడెండ్	రెగ్యులర్	రూ.2.17	మార్చి 22
ఐడీఎఫ్‌సీ ప్రీమియర్ ఈక్విటీ	డివిడెండ్	డైరెక్ట్	రూ.2.24	మార్చి 22
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇండియా రికవరీ సిరీస్1	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1.45	మార్చి 22

బినానీ సిమెంట్స్‌పై అల్ట్రాటెక్ కన్ను

● కొనుగోలుకు ఒప్పందం ● దివాలా ప్రక్రియ నిలిపివేతకు ప్రయత్నం ● అంగీకరించిన బినానీ ఇండస్ట్రీస్

దిల్లీ: బినానీ సిమెంట్స్ వేలంలో మరో మలుపు. కొత్తగా అల్ట్రాటెక్ సిమెంట్ తెరపైకి వచ్చింది. ఆ కంపెనీకున్న అన్ని బకాయిలను తీరుస్తామని హామీనిచ్చి.. దివాలాలో ఉన్న ఆ కంపెనీని దివాలా కోర్టు పరిధికి బయటే సెటిల్‌మెంట్ చేయడానికి ముందుకొచ్చింది. అంటే ఆ బకాయిలకు హామీనివ్వడం ద్వారా బ్యాంకుల దివాలా ప్రక్రియను వెనక్కి తీసుకోవడానికి మార్గం సుగమం చేస్తోందన్నమాట. అందుకు బినానీ సిమెంట్స్ మాతృ సంస్థ బినానీ ఇండస్ట్రీస్ అంగీకరించింది కూడా.

బినానీ సిమెంట్స్‌లో 98 శాతం వాటాను కొనుగోలు చేయడం కోసం బినానీ ఇండస్ట్రీస్‌తో ఒక ఒప్పందాన్ని అల్ట్రాటెక్ సిమెంట్ కుదుర్చుకుంది. బినానీ సిమెంట్ కోసం బినానీ ఇండస్ట్రీస్‌కు రూ.7,266 కోట్లను అందజేయడానికి ఒక లేఖ(కంఫర్ట్ లెటర్)ను సైతం జారీ చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు అల్ట్రాటెక్ సమాచారం ఇచ్చింది. 'దివాలా ప్రక్రియ నుంచి బయట పడేయడం కోసం బినానీ సిమెంట్స్‌లో 98.47 శాతం వాటాను కొనుగోలు చేయడానికి ప్రాథమిక వాణిజ్య అవగాహనకు వచ్చామ'ని అందులో తెలిపింది అల్ట్రాటెక్ సిమెంట్ హామీనిచ్చిన ఈ నేపథ్యంలో తన రుణదాతలను దివాలా ప్రక్రియను వెనక్కి తీసుకోమని బినానీ సిమెంట్ మాతృ సంస్థ బినానీ ఇండస్ట్రీస్ కోరుతుంది.

మలుపులే.. మలుపులు..

బినానీ సిమెంట్స్‌ను రూ.6350 కోట్లతో కొనుగోలు చేయడానికి రుణదాతలు అంగీకరించారని దాల్మియా సిమెంట్ పేర్కొన్న కొద్ది రోజులకు ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. రూ.6,350 కోట్లతో పాటు.. బినానీలో 20 శాతం ఈక్విటీని సైతం రుణదాతలకు ఇస్తామని దాల్మియా ఆఫర్ చేసింది. బెయిల్ క్యాపిటల్-పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఇండియా రిసర్జన్స్ ఫండ్ సంయుక్త సంస్థే దాల్మియా భారత్. మేం దాఖలు చేసిన బిడ్ దివాలా చట్టప్రకారమే ఉందని దాల్మియా భారత్ వార్తా సంస్థ కోజెన్సిస్‌కు తెలిపింది. కాగా, సోమవారం ఉదయం నుంచి వరుస పరిణామాలు చోటు చేసుకున్నాయి. బినానీ సిమెంట్స్‌లో మొత్తం వాటాను విక్రయించి రుణదాతలకు అప్పులు తీర్చాలని భావిస్తున్నట్లు.. ఆ మేరకు నిధులను సమకూర్చాల్సిందిగా కోరుతూ తమ చెంతకు బినానీ ఇండస్ట్రీస్ వచ్చిందని అల్ట్రాటెక్ సిమెంట్ చెబుతోంది. దివాలా ప్రక్రియను పూర్తి చేయడానికి చేసే దరఖాస్తుకు మద్దతుగా ఒక లేఖను జారీ చేయాల్సిందిగా కూడా ఆ కంపెనీని కోరినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో బినానీ ఇండస్ట్రీస్ విజ్ఞప్తికి డైరెక్టర్లు అంగీకరించారని అల్ట్రాటెక్ సిమెంట్ తెలిపింది. అయితే దివాలా ప్రక్రియ నుంచి రుణదాతలు వెనక్కి వెళితేనే కొనుగోలు చేయాలన్న షరతుపై బోర్డు అంగీకరించిందని ఒక ప్రకటనలో తెలిపింది.



అల్ట్రాటెక్‌కే బినానీ ఓటు..

బినానీ సిమెంట్స్‌పై ప్రారంభించిన దివాలా ప్రక్రియను రద్దు చేయాలని ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు చేయడానికి బోర్డు నిర్ణయించినట్లు బినానీ ఇండస్ట్రీస్ పేర్కొంది. 'దివాలా ప్రక్రియ రద్దు అనంతరం బినానీ సిమెంట్స్‌లో ఉన్న మొత్తం 98.42 శాతం వాటాను అల్ట్రాటెక్ సిమెంట్‌కు విక్రయించడానికి సూత్రప్రాయ అంగీకారానికి వచ్చిన'ట్లు బినానీ ఇండస్ట్రీస్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. అల్ట్రాటెక్ ప్రకటన అనంతరం బినానీ ఇండస్ట్రీస్ ఆ మేరకు వెల్లడించడం గమనార్హం.

బినానీ సిమెంట్ సామర్థ్యం ఇదీ

అంతర్జాతీయ స్థాయిలో 11.25 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఈ కంపెనీకి ఉంది. దుబాయ్, చైనాల్లో ఈ కంపెనీకి యూనిట్లున్నాయి. ఇందులో 6.25 మిలియన్ టన్నులు దేశీయంగా(రాజస్థాన్) ఉత్పత్తి చేస్తున్నదే. తాజా కొనుగోలు ఒప్పందం కార్యరూపం దాలిస్తే.. దేశీయ సిమెంట్ పరిశ్రమలో అల్ట్రాటెక్ మరింత బలోపేతమవుతుంది. ప్రస్తుతమున్న 93 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం 104.25 మిలియన్ టన్నలకు చేరుతుంది.

సోమవారం అల్ట్రాటెక్ సిమెంట్ షేరు బీఎస్‌ఈలో 1.63% నష్టపోయి రూ.3966.60 వద్ద స్థిరపడింది. మరో పక్క దాల్మియా భారత్ 0.18% తగ్గి రూ.2835.15 వద్ద ముగిసింది.

నష్టాలు ఆగలేదు

● ఫెడ్ రేట్ల పెంపు భయాలు ● 33000 దిగువకు సెన్సెక్స్

సమీక్ష

వరుసగా అయిదో రోజూ సూచీల నష్టాలు కొనసాగాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు పెంచొచ్చన్న భయాలతో లోహ, టెలికాం, బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. డిసెంబరు త్రైమాసికంలో కరెంటు ఖాతా లోటు పెరగడం సైతం ఇందుకు తోడైంది. ఫలితంగా సెన్సెక్స్ 33,000 పాయింట్ల దిగువకు చేరగా, నిఫ్టీ సైతం కీలకమైన 10,100 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనడపడటం సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33268.97 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. మదుపర్ల అమ్మకాలు స్థిరంగా కొనసాగడంతో కొద్దిసేపటికే నష్టాల్లోకి జారిపోయిన సూచీ.. ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఒకానొకదశలో 32,856.54 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్.. చివరకు 252.88 పాయింట్ల నష్టంతో 32,923.12 పాయింట్ల వద్ద ముగిసింది. డిసెంబరు 6 తర్వాత సూచీకిదే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. ఇక నిఫ్టీ సైతం 100.10 పాయింట్ల నష్టంతో 10,094.25 దగ్గర స్థిరపడింది.

బీపీసీఎల్, ఐఓసీ డీలా: సహజవాయువు సంస్థ గెయిల్‌లో చెరో 26% ప్రభుత్వ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు వార్తల నేపథ్యంలో బీపీసీఎల్, ఐఓసీ షేర్లు డీలాపడ్డాయి. ఇంట్రాడేలో 4.33% కోల్పోయిన బీపీసీఎల్ షేరు.. చివరకు 4.01% నష్టంతో రూ.429.50 వద్ద ముగిసింది. ఇక ఐఓసీ షేరు ఒకానొకదశలో రూ.176 వద్ద 52 వారాల కనిష్ఠానికి చేరింది. చివరకు 3.71% నష్టంతో రూ.177.80 దగ్గర స్థిరపడింది.


సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టాలు చవిచూశాయి. టాటా స్టీల్ 4.24%, భారతీ ఎయిర్‌టెల్ 4.16%, విప్రో 2.60%, యెస్ బ్యాంక్ 2.57%, కోల్ ఇండియా 2.51%, ఇన్ఫోసిస్ 2.16%, ఏషియన్ పెయింట్స్ 2.04%, బజాజ్ ఆటో 2.01%, అదానీ పోర్ట్స్ 1.94%, ఎస్‌బీఐ 1.78%, టాటా మోటార్స్ 1.28%, సన్‌ఫార్మా 1.07% చొప్పున డీలాపడ్డాయి. ఎన్‌టీపీసీ 1.03%, మారుతీ సుజుకీ 1%, పవర్‌గ్రిడ్ 0.99%, ఎల్ అండ్ టీ 0.95%, హిందుస్థాన్ యునిలీవర్ 0.80%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం 3.40% కోల్పోయింది. స్థిరాస్తి 3.01%, లోహ 2.65%, టెక్ 2.08%, ఐటీ 1.98%, పీఎస్‌యూ 1.84%, చమురు- గ్యాస్ 1.70%, మన్నికైన వినిమయ వస్తువులు 1.46% మేర నష్టాలు నమోదు చేశాయి.

మార్కెట్ కబుర్లు

- 500 ఎంజీ, 750 ఎంజీ మోతాదుల్లో మెట్‌ఫార్మిన్ ఎక్స్‌టెండెడ్ రిలీస్ (ఈఆర్) బిళ్లల తయారీకి **గ్రాన్యూల్స్ ఇండియా** చేసిన దరఖాస్తుకు యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం తెలిపింది.
- **బంధన్ బ్యాంక్** తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు 14.56 రెట్ల అధిక స్పందన లభించింది. రూ.10 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.370-375 ధరల శ్రేణిగా నిర్ణయించి, రూ.4,500 కోట్ల సమీకరణ నిమిత్తం వచ్చిన ఇష్యూ సోమవారంతో ముగిసింది.
- గొలుసుకట్టు హోటళ్ల సంస్థ **లెమన్ ట్రీ హోటల్స్** రూ.1,040 కోట్ల సమీకరణ కోసం ఐపీఓకు వస్తోంది. ఈనెల 26-28 తేదీల్లో జరిగే ఇష్యూకు, ధరల శ్రేణిని రూ.54-56గా నిర్ణయించారు.
- గుజరాత్‌లో 8 వరుసల్లో వడోదర కిమ్ ఎక్స్‌ప్రెస్‌వేలో కొంతభాగాన్ని నిర్మించేందుకు రూ.2,043 కోట్ల ఆర్డరు ఎన్‌హెచ్ఏఐ నుంచి లభించినట్లు **ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా** తెలిపింది.
- సొరియాసిస్ నివారణకు వినియోగించే డెసాక్సిమెటాసోన్ టాపికల్ స్ప్రే విక్రయాలకు యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం లభించినట్లు **లుపిన్** వెల్లడించింది.
- గుజరాత్‌లో 300 మెగావాట్లు, 200 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టులకు ఆర్డర్లు లభించినట్లు **సుజ్లాన్ గ్రూప్** తెలిపింది.
- నష్టాలు వస్తున్న **స్కూటర్స్ ఇండియా లిమిటెడ్‌**లో పూర్తి వాటాను, నియంత్రణాధికారాన్ని విక్రయించేందుకు, ఆసక్తిగల పార్టీల నుంచి దరఖాస్తులను ప్రభుత్వం కోరుతోంది. మే7 లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- తమిళనాడు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ నుంచి రూ.87.68 కోట్ల ఆర్డరు లభించినట్లు **బీజీఆర్ ఎనర్జీ సిస్టమ్స్** తెలిపింది.
- జీటీఎల్ ఇన్‌ఫ్రాలో 26% వాటా (315 కోట్ల షేర్ల) విక్రయానికి ఈనెల 27 లోపు బిడ్లు దాఖలు చేయాలని **యూనియన్ బ్యాంక్** కోరింది.
- **కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్**కు చెందిన ముంబయి కార్పొరేట్ కార్యాలయ భవనం విక్రయానికి తాజా బిడ్లను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌బీఐ, ఇతర రుణదాతలు పేర్కొన్నాయి. ఈనెల 27న వేలం నిర్వహిస్తారు.

19న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
20వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

కోల్ ఇండియాను వెనక్కినెట్టిన వేదాంతా

● రికార్డు స్థాయిలో రూ.21.20 డివిడెండు

● నిఫ్టీ-50 కంపెనీల్లో రెండో అత్యుత్తమం

ముంబయి: ప్రభుత్వ రంగ బొగ్గు దిగ్గజం కోల్ ఇండియాను అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంతా వెనక్కినెట్టింది. ఒక్కో ఈక్విటీ షేరుపై వేదాంతా రికార్డు స్థాయిలో రూ.21.20 మధ్యంతర డివిడెండుగా ప్రకటించింది. తద్వారా నిఫ్టీ-50 కంపెనీల్లో అత్యుత్తమ డివిడెండు ప్రకటించిన కంపెనీల్లో వేదాంతా ఒకటిగా నిలిచింది. కోల్ ఇండియా డివిడెండు రాబడి 6 శాతంగా ఉండగా.. వేదాంతా ప్రస్తుతం 7 శాతానికి పైగా డివిడెండును ఇవ్వనుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డివిడెండు రాబడి అత్యధికంగా 11 శాతానికి పైగా ఉంది. ప్రాథమిక లోహ ధరలు భవిష్యత్ అంచనాలు మెరుగ్గా ఉండటం, వాటాదార్లకు మంచి ప్రతిఫలాన్ని అందించడానికి కంపెనీ ప్రాధాన్యం ఇవ్వడంతో వేదాంతా రికార్డు స్థాయిలో డివిడెండు ప్రకటించిందని విశ్లేషకులు అంటున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖవిలువ కలిగిన షేరుపై రూ.21.20 డివిడెండుగా చెల్లించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందుకు రికార్డు తేదీగా బుధవారం (మార్చి 21)ను కంపెనీ నిర్ణయించింది. ఇందుకోసం కంపెనీ రూ.7,881 కోట్లు వెచ్చించనుంది.

గృహోపకరణాలపై అమెజాన్ దృష్టి

● ఏటా మూడింతలవుతున్న వ్యాపారం

● కొత్తగా 6 ప్రత్యేక గోదాములు

● నిల్వ సామర్థ్యం రెట్టింపు

● హైదరాబాద్ గోదాము విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: అమెజాన్‌లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్లు, వాషింగ్ మిషన్లు వంటి గృహోపకరణాల విక్రయాలను మరింతగా పెంచుకోవడానికి ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ ఇండియా దేశ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. పంపిణీ నెట్‌వర్క్‌ను మరింతగా పటిష్ఠం చేసుకుంటోంది. గత కొద్ది కాలంగా వార్షిక ప్రాదిపదికన అమెజాన్‌లో జరిగిన గృహోపకరణాల విక్రయాలు మూడింతలవుతున్నాయి. ఈ వృద్ధిరేటు రానున్న కాలంలో కూడా కొనసాగగలదని, ఇందుకు అనుగుణంగా గోదాములను పెంచుకుంటున్నామని, నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేసుకుంటున్నామని అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (భారత్ కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్) అఖిల్ సక్సేనా 'ఈనాడు'కు తెలిపారు.

నిల్వ సామర్థ్యం రెట్టింపు..

ప్రస్తుతం గృహోపకరణాలు, ఫర్నీచర్‌ను ఉంచడానికి అమెజాన్‌కు 9 గోదాములు (ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు) ఉన్నాయి. కొత్తగా 6 కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న వాటిలో 5 కేంద్రాల సామర్థ్యాలను పెంచుతున్నామని సక్సేనా తెలిపారు. ఇందులో హైదరాబాద్‌లోని గృహోపకరణాల గోదాము కూడా ఉంది. కొత్త కేంద్రాలతో గృహోపకరణాల నిల్వ చేసుకునే స్థలం సామర్థ్యం 25 లక్షల ఘనపు అడుగుల నుంచి 53 లక్షల ఘనపు అడుగులకు పెరుగుతుందని, గోదాములు నిర్మించిన స్థలం 5 లక్షల చదరపు అడుగుల నుంచి 13 లక్షల చదరపు అడుగులకు పెరుగుతుందన్నారు. ప్రస్తుతం 150 నగరాలు, పట్టణాల్లో ఆన్‌లైన్‌లో గృహోపకరణాలను కొనుగోలు చేసే సదుపాయాన్ని అమెజాన్ కల్పిస్తోంది. ఈ పట్టణాల సంఖ్యను 400కు పెంచామని, అదనంగా 25 డెలివరీ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. దీంతో మొత్తం డెలవరీ కేంద్రాలు 60కి చేరతాయని చెప్పారు. బుక్ చేసిన తర్వాతి రోజే డెలివరీ చేసే సదుపాయం ప్రస్తుతం 20 పట్టణాల్లో ఉండగా.. దీన్ని 30 పట్టణాలకు విస్తరించినట్లు అఖిల్ తెలిపారు. 15 గృహోపకరణాల గోదాములతో సహా అమెజాన్‌కు దేశంలో మొత్తం 62 గోదాములు ఉన్నాయి.



విస్తరణ ప్రణాళికలను వెల్లడిస్తున్న అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అఖిల్ సక్సేనా, కేటగిరీ అధిపతి సుచిత్ సుభాస్

ఖాతాదారులను ఇలా ఆకర్షిస్తున్నాం..

దాదాపు రెట్టింపు ఖాతాదారులను చేరడానికి నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నామని అమెజాన్ ఇండియా కేటగిరీ అధిపతి (అప్లియన్స్) సుచిత్ సుభాస్ తెలిపారు. అమెజాన్‌లో ప్రధాన గృహోపకరణాల కంపెనీలు 200 ఎక్స్‌క్లూజివ్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాయన్నారు. 'ఉత్పత్తుల గురించి ఫోటోలు, వీడియోలు తదితరాల ద్వారా వెబ్‌సైట్‌లో ఎంతో సమాచారాన్ని అందిస్తున్నాం. ఖాతాదారులు పట్టణమంతా కొన్ని రోజులపాటు తిరిగి తెలుసుకునే సమాచారాన్ని ఇంటి వద్దే ఉండి తెలుసుకుని ఉత్పత్తిని ఎంచుకుంటున్నారు. ఇది ఆన్‌లైన్‌లో గృహోపకరణాలను కొనుగోలు చేయడానికి ఎక్కువ దోహదం చేస్తోంది. టెలిఫోన్ లైన్ ద్వారా కూడా అమెజాన్ ఖాతాదరులకు సమాచారాన్ని అందిస్తోంది. సర్వేలు నిర్వహించి వారికి తగిన ఉత్పత్తిని సూచిస్తోంది. తక్కువ వ్యయం అయ్యే నెలవారీ వాయిదా చెల్లింపులు (ఈఎంఐ), మెరుగైన ఎక్స్ఛేంజీ ఆఫర్లు, క్యాష్ ఆన్ డెలివరీ, గృహోపకరణం బిగింపు వంటి సదుపాయాలను అమెజాన్ కల్పిస్తోంది. ఇటువంటి చర్యలు అమెజాన్ ద్వారా గృహోపకరణాల కొనుగోలును పెంచుతున్నా'యన్నారు.

'ప్రీమియం'కు మొగ్గు: ఖాతాదారులు ఇన్వర్టర్ ఏసీలు వంటి ప్రీమియం ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారని సుచిత్ చెప్పారు. 'హైదరాబాద్‌లో కొనుగోలు చేసే (అమెజాన్ ద్వారా) ప్రతి రెండు వాషింగ్ మిషన్లలో ఒకటి ఫ్రంట్‌లోడ్ వాషింగ్ మిషన్ ఉంటోంది. ప్రతి మూడు ఏసీల్లో ఒకటి ఇన్వర్టర్ ఏసీ ఉంటోంద'ని తెలిపారు.



ఫోర్డ్ ఎకోస్పోర్ట్‌లో కొత్త మోడల్

కారు ధర రూ.10.47 లక్షలు

దిల్లీ: ఫోర్డ్ ఇండియా నుంచి పెట్రోల్ రకం టాప్-ఎండ్ మోడల్ పెద్ద కారు (ఎస్‌యూవీ) టైటానియం ప్లస్ విపణిలోకి వచ్చింది. దీని ధర రూ.10.47 లక్షలు (ఎక్స్‌షోరూం ధర). మూడు సిలిండర్ల 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, 17 అంగుళాల మిశ్రమలోహ చక్రాలు (అల్లాయ్ వీల్స్), ఆరు ఎయిర్ బ్యాగులు దీని ప్రత్యేకతలు. విపణిలోకి కారును విడుదల చేసిన సందర్భంగా ఫోర్డ్ ఇండియా ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) రాహుల్ గౌతమ్ మాట్లాడుతూ 'ఫోర్డ్ ఎకోస్పోర్ట్‌ను విడుదల చేసినప్పటి నుంచి వినియోగదార్లు కోరుతున్న మేరకు తాజాగా టైటానియం ప్లస్‌ను ఆరు ఎయిర్‌బ్యాగులతో అదనపు భద్రతను దృష్టిలో ఉంచుకొని విడుదల చేశాం. ఈ కారును పరిచయం చేయడం ఆనందంగా ఉంది. మా వినియోగదార్లకు గొప్ప ఛాయిస్ ఇవ్వగలిగామ'ని తెలిపారు.

ఐఆర్‌సీటీసీలో ఓలా బుకింగ్!

దిల్లీ: ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లోగానీ, ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్‌లోగానీ ఓలా సర్వీసుల్ని బుక్ చేసుకునేందుకు వీలుగా ఓలాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని ఐఆర్‌సీటీసీ వెల్లడించింది. 6 నెలల పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రయాణికులు ఈ ప్లాట్‌ఫాంలలో ఓలా క్యాబ్‌లు బుక్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో తెలిపింది. ఓలా మైక్రో, ఓలా మినీ, ఓలా ఆటో, ఓలా షేర్.. ఇలా అన్ని రకాల సర్వీసులు ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ప్రయాణికులు వారం రోజులు ముందుగానే క్యాబ్‌లు బుక్ చేసుకోవచ్చని తెలిపింది. లేదంటే రైలు రైల్వేస్టేషన్‌కు చేరుకొనే సమయానికి బుక్ చేసుకొనేలా వెసులుబాటు కల్పించారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఓలాతో జత కట్టామని ఐఆర్‌సీటీసీ ప్రతినిధి ఒకరు తెలిపారు.

పెరిగిన ముందస్తు పన్ను వసూళ్లు

దిల్లీ: ముందస్తు కార్పొరేట్ పన్ను వసూళ్లు జనవరి-మార్చి మధ్యలో 11 శాతం పెరిగాయని ఆర్థిక శాఖకు చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఇంకా పూర్తి సమాచారం క్రోడీకరిస్తున్న నేపథ్యంలో ఇది మరింత పెరిగే అవకాశం కూడా ఉందని ఆయన తెలిపారు. కార్పొరేట్ సంస్థలు ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన మొత్తం పన్నులో 15 శాతం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో, 30 శాతం చొప్పున రెండు, మూడు త్రైమాసికాల్లో, మిగిలింది మార్చి 15లోపు చెల్లిస్తుంటారు. వ్యక్తిగత ఆదాయపు పన్నుతో కలిపి మొత్తం ముందస్తు పన్ను వసూళ్లు 13 శాతం (జనవరి-మార్చి) పెరిగాయని సదరు అధికారి చెప్పారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.10.05 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకొంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 18.7% అధికం. 'ఇప్పటివరకూ రూ.9 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలు చేశాం. ఇంకా రావాల్సిన మొత్తం బాగానే ఉంది. ఈ ఏడాది సవరించిన పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటామ'ని ఆ అధికారి తెలిపారు.

వ్యవసాయ ఉద్యోగమా.. వద్దులే



ఇదీ 21-25 ఏళ్ల యువత ధోరణి

అవకాశాలు అపారం.. అవగాహన అంతంతమాత్రం

● ఉద్యోగ భద్రత కొరవడటమూ కారణం ● సేంద్రియ ఉత్పత్తులకు అమిత గిరాకీ

దిల్లీ

వ్యవసాయ సంబంధిత రంగాల్లో ఉద్యోగాలపై యువత అతి తక్కువ ఆసక్తి చూపుతోందని జాబ్‌పోర్టల్ ఇండీడ్ సర్వేలో తేలింది. ఉద్యోగ భద్రత కొరవడటం, ఈ రంగం భవితపై సరైన అవగాహన లేకపోవడం, సొంతగా ఏదైనా సంస్థను ఏర్పాటు చేయాలనే ఆసక్తి లేకపోవడం ఇందుకు కారణమని వివరించింది. 2017 (జనవరి-డిసెంబరు) మొత్తంమీద ఈ అధ్యయనం నిర్వహించినట్లు తెలిపింది. వ్యవసాయ సంబంధిత రంగాల్లో ఉద్యోగావకాశాల గురించి వెతుకులాటలు ప్రతివారం 25% తగ్గినట్లు వెల్లడించింది.

జాబ్ పోర్టల్ ఇండీడ్ సర్వే

- ✦ తాజాగా డిగ్రీ పూర్తి చేసిన వారు, కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నవారు, వృత్తి శిక్షణ (ఇంటర్న్‌షిప్) అవసరమైన 21-25 ఏళ్ల వారు వ్యవసాయ రంగంపై అతి తక్కువ ఆసక్తి చూపుతున్నారని తేల్చింది.
- ✦ వ్యవసాయ రంగంలో ఉద్యోగాలపై ఆసక్తి ప్రదర్శించే వారి సగటు కంటే ఎక్కువగా 31-35 ఏళ్ల వారు మక్కువ చూపుతున్నారని తెలిపింది. అవసరమైన నైపుణ్యాలు, ఇతర అవరోధాలను ఎదుర్కొనే సామర్థ్యం ఉండటమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది.
- ✦ అయితే 2007 నుంచి చూస్తే, ఈ రంగంతో ముడిపడుతున్న యువత 4 శాతం పెరిగారు.
- ✦ ఇవన్నీ గమనిస్తే, వ్యవసాయ సంబంధిత రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఇంతేకాక, ఉద్యోగాలు కూడా సంఘటితమవుతున్నాయి.

యాంత్రీకరణ పెరుగుతోంది: అయితే వ్యవసాయ రంగం వృద్ధి చెందుతోందని, ముఖ్యంగా యాంత్రీకరణకు రైతులు మొగ్గుచూపుతున్నారని తెలిపింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇవి ఉన్నాయని పేర్కొంది. ఉద్యోగార్థులను వ్యవసాయ, అనుబంధ రంగాల్లోకి ప్రోత్సహించడం ఇప్పటి అవసరమని వివరించింది.

- ✦ 2018లో వ్యవసాయరంగం 2.1 శాతం వృద్ధిని సాధిస్తుందని ఇటీవలి ఆర్థిక సర్వేలో ప్రభుత్వం అంచనా వేసింది.
- ✦ సీఎస్‌డీఎస్-కేఏఎస్ యువజన సర్వేలో కూడా, దేశీయ యువతకు అత్యధికంగా ఉపాధి కల్పిస్తోంది వ్యవసాయ రంగమే అని తేలింది.

జీవన ప్రగతికి వ్యవసాయం కీలకం

జీవన ప్రగతికి దోహదం చేసే రంగాల్లో వ్యవసాయం ముఖ్యమైనది. దేశీయంగా వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఇండీడ్ ఇండియా ఎండీ శశికుమార్ పేర్కొన్నారు. 'వ్యవసాయ వ్యాపారం, వ్యవసాయ వనరుల నిర్వహణ, ఆహార సాంకేతికతలు వంటి విభాగాల్లో నిపుణుల అవసరం ఉంటుంది. సహజ (సేంద్రియ) వనరులతో ఉత్పత్తుల తయారీపై పలు అంకుర సంస్థలు దృష్టి సారిస్తున్నాయి. రా ప్రెసరి, ఎపిగామియా, పేపర్‌బోట్, జస్‌డివైన్, ఆంటిడోట్, 24 మంత్రా వంటి సంస్థలు ఈ కోవలోకి వస్తాయి. తమ వినియోగదారుల జీవనశైలికి తగిన ఉత్పత్తుల ఆవిష్కరణే ఈ సంస్థల తదుపరి లక్ష్యమవుతుంద'ని అన్నారు.

స్వేచ్ఛాయుత ఉద్యోగాలపై ఆసక్తి

● ఇచ్చేందుకు సంస్థలూ సిద్ధమే

● కెల్లీ సర్వీసెస్ సర్వే

భారత్ సహా ఆసియా-పసిఫిక్ (అపాక్) దేశాల్లో స్వేచ్ఛాయుత (ఫ్రీలాన్స్) ఉద్యోగాలు పెరుగుతున్నాయని కెల్లీ సర్వీసెస్ సర్వేలో వెల్లడైంది. సంప్రదాయ పూర్తిస్థాయి ఉద్యోగాలకు బదులు, తమకు అనువైన సమయాల్లో, ఒకటికంటే ఎక్కువ సంస్థలకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారని తెలిపింది. అభిప్రాయాలు తెలిపిన వారిలో 39 శాతం మంది అభ్యర్థులు, నియామక మేనేజర్లు కూడా స్వేచ్ఛాయుత ఉద్యోగాలకు అనుకూలంగా ఉన్నారని సర్వే పేర్కొంది. 2017 అక్టోబరు-నవంబరు నెలల్లో అపాక్ దేశాల్లోని 20-70 ఏళ్ల ఉద్యోగార్థులు, నియామక మేనేజర్లతో ఆన్‌లైన్‌లో అభిప్రాయాలు సేకరించి, ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. ఆస్ట్రేలియా, హాంకాంగ్, భారత్, ఇండొనేషియా, మలేషియా, న్యూజిలాండ్, సింగపూర్, థాయిలాండ్, వియత్నాంలలో 9,295 మందిని సంప్రదించి, ఈ నివేదికను రూపొందించారు.

- ✦ ఇతర అపాక్ దేశాలకు సంబంధించి, హాంకాంగ్‌లో అభిప్రాయాలు తెలిపిన వారిలో 55 శాతం మంది స్వేచ్ఛాయుత/కాంట్రాక్టు ఉద్యోగాలకు సిద్ధమన్నారు. వియత్నాంలో వీరి శాతం 50 శాతంకాగా, మలేసియాలో 37 శాతమే.
- ✦ ఫ్రీలాన్స్ పని పద్ధతి వల్ల కంపెనీలకు వ్యయం తగ్గుతుంది. ఉద్యోగులకు సంతృప్తి, దానికి తగ్గట్లే ఉత్పాదకతా అధికంగా ఉంటుంది. అయితే ఉద్యోగులకు భద్రత కొరవడుతుంది.

సంస్థలూ మారాలి

ఉద్యోగార్థుల అభిప్రాయానికి అనుగుణంగా సంస్థలూ మారాలి. తమ నియామకాల్లో కాంట్రాక్టు పద్ధతులకూ అవకాశం ఇవ్వాలి. నిపుణులకు అవకాశం కల్పించడంలో భిన్న నియామక పద్ధతులు వినియోగిస్తే, ఖర్చు రూపేణ సంస్థలకు కలిసి వస్తుంది.

- థామయ్య బీఎన్, కెల్లీ సర్వీసెస్ ఇండియా ఎండీ

హైదరాబాద్‌లో హీరో మోటో శిక్షణ కేంద్రం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడికి జ్ఞాపికను అందిస్తున్న హీరో మోటోకార్ప్ సీఎస్ఆర్ అధిపతి విజయ్ సేథ్. పక్కన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తదితరులు

స్వర్ణ భారత్ ట్రస్ట్‌తో చేతులు కలిపిన కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు సమీపంలోని ముచింతల్ గ్రామంలో హీరో మోటోకార్ప్ ప్రపంచ స్థాయి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ద్విచక్రవాహనాల నిర్వహణ, మరమ్మతులో ఐటీఐ విద్యార్థులకు, ట్రైనీలకు ఇందులో శిక్షణ ఇస్తారు. వారిని మరింత మెరుగైన నిపుణులుగా తీర్చిదిద్దుతారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద స్వర్ణ భారత్ ట్రస్ట్‌తో కలిసి ఈ శిక్షణ కేంద్రాన్ని హీరో మోటోకార్ప్ ఏర్పాటు చేసింది. పేద విద్యార్థులను గుర్తించడం వంటి కార్యకలాపాలను ట్రస్ట్ చేపడుతుంది. కేంద్రాన్ని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో హీరో మోటోకార్ప్ సీఎస్ఆర్ అధిపతి, సీఐఓ విజయ్ సేథ్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హీరో మోటోకార్ప్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీఎంఎల్ఏ కేసుకు నీరవ్ ఆటంకాలు

● ఫైర్‌స్టార్ డైమండ్స్‌తో ఫిర్యాదు అందుకే

● హైకోర్టుకు నివేదించిన ఈడీ

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను రూ.11,000 కోట్లకు పైగా మోసగించిన కేసులో విచారణను ఎదుర్కొంటున్న నీరవ్ మోదీ, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దాఖలైన కేసును తన సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్స్ ద్వారా పరోక్షంగా సవాలు చేస్తున్నారని దిల్లీ హైకోర్టుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఫిర్యాదు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.మురళీధర్, జస్టిస్ ఐఎస్ మెహ్తాలతో కూడిన బెంచ్ ఎదుట అదనపు సొలిసిటర్ జనరల్ సందీప్ సేథి ఈడీ తరపున వాదనలు వినిపించారు. దేశం నుంచి పరారైన నీరవ్ మోదీ, చట్ట ప్రక్రియను దుర్వినియోగం చేసేందుకు తన సంస్థతో సవాలు చేయిస్తున్నారని ఈడీ ఆరోపించింది. పీఎంఎల్ఏ కేసు నిందితుల్లో ఒకటైన ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ఈ కేసులో ఈడీ దర్యాప్తుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును కోరింది. 'ఇంతముందుగా మధ్యంతర ఉత్తర్వులు కోరడం సరికాదని, ప్రక్రియను దుర్వినియోగ పరచడమే' అని ఈడీ తెలిపింది.

జన్యులోపాల కారణంతో క్లెయిమ్‌లు తిరస్కరించొద్దు

బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఆదేశం

దిల్లీ: ఆరోగ్య బీమా పాలసీదార్లకు ఊరట. ఇక నుంచి జన్యుపరమైన లోపాలను (జెనెటిక్ డిజార్డర్) కారణంగా చూపుతూ బీమా కంపెనీలు ఆరోగ్య బీమా క్లెయిమ్‌లను తిరస్కరించడానికి వీల్లేదు. ఈ మేరకు భారతీయ బీమా నియంత్రణ, ప్రాధికారిక సంస్థ (ఐఆర్‌డీఏఐ) వాటికి ఆదేశాలు జారీ చేసింది. అలాగే కొత్త ఆరోగ్య బీమా పథకాల్లోనూ క్లెయిమ్ వర్తించని కారణాల్లో 'జన్యుపరమైన లోపాల'ను చేర్చొద్దని కూడా సూచించింది. బీమా పాలసీల్లో జన్యుపరమైన లోపాలను క్లెయిమ్ వర్తించని అంశాల్లో చేర్చడం రాజ్యాంగంలోని సమానత్వ హక్కును వివరించే 14వ ఆర్టికల్‌ను ఉల్లంఘించినట్లు అవుతుందన్న దిల్లీ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఐఆర్‌డీఏఐ తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

రివర్స్ ఛార్జీకి మోక్షమెన్నడో

● రిటర్న్‌ల సరళీకరణపై నిర్ణయం వాయిదా ● ఇ-వేబిల్లు అమలుకు తొలి అడుగు



సతీష్ సరాఫ్

చార్టర్డ్ అకౌంటెంట్

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) రిటర్న్‌ల దాఖలు విషయంలో వ్యాపారులకు మరికొన్ని నెలలు ఇబ్బందులు తప్పవు. ఎందుకంటే సరళీకరణ ప్రక్రియపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే జీఎస్టీ మండలి 26వ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రిటర్న్‌ల ప్రక్రియను సరళీకరించే దిశగా అడుగులు పడతాయేమోనని వ్యాపారులు ఎంతగానో ఆశలు పెట్టుకున్నారు. నెలవారీ రిటర్న్‌లను ఒక్క పేజీకి పరిమితం చేస్తుందేమోనని కూడా ఎదురుచూశారు. కాని అలాంటి ప్రకటనలేవీ లేకపోవడం నిరాశను మిగిల్చింది. అంతేకాదు రిటర్న్‌లు, ఇ-వేబిల్లు, రివర్స్ ఛార్జీ విధానం అమలు లాంటి పలు అంశాలపై రోజంతా విస్తృత చర్చ జరుపుతారేమోనని అనుకుంటే.. ఆశ్చర్యకరంగా సగం పూటలోనే సమావేశాన్ని ముగించేశారు.

జీఎస్టీ అమలు విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించి ప్రభుత్వానికి సిఫారసులు చేయడం జీఎస్టీ మండలి విధి. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని ఈ మండలి ఇప్పటివరకు 26 సమావేశాలను నిర్వహించి పలు సిఫారసులు చేసింది. ఇక రిటర్న్‌ల దాఖలు సరళీకరణ విషయంలో కీలక నిర్ణయం ఉంటుందనే అంచనాలుండటంతో ఇటీవలి 26వ సమావేశంపై ముందునుంచే ఆసక్తి నెలకొంది. అయితే సరళీకరణ ప్రక్రియను వాయిదా వేస్తూ, ఇతర అంశాలకే జీఎస్టీ మండలి ప్రాధాన్యం ఇచ్చింది. వీటిపై ప్రభుత్వానికి కొన్ని సిఫారసులు కూడా చేసింది. అవేమిటో అంశాల వారీగా చూద్దాం.

రిటర్న్‌ల విశ్లేషణ.. చర్యలు

ప్రస్తుతమున్న నెలవారీ రిటర్న్‌లు జీఎస్టీఆర్-3బీ, జీఎస్టీఆర్-1లను ఈ ఏడాది జూన్ వరకు కొనసాగించేందుకు జీఎస్టీ మండలి సిఫారసు చేసింది. అయితే ఆ లోపు రిటర్న్‌ల ప్రక్రియ సరళంగా ఉండేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉంది. మరోవైపు జీఎస్టీఆర్-3బీ ఫారంలో వ్యాపారులు పొందుపరిచిన టర్నోవరు వివరాలతో జీఎస్టీఆర్-1 ఫారంలోని వివరాల లెక్క సరిపోవడం లేదనే విషయాన్ని జీఎస్టీ మండలి పరిగణనలోకి తీసుకుంది. అందువల్ల మరోమారు వివరాలను విశ్లేషించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. పై రెండు రిటర్న్‌ల మధ్య ఎక్కడెక్కడ వ్యత్యాసాలున్నాయో గుర్తించి వాటి కారణాలు విశ్లేషించాలని తెలియజేసింది. ఈ విశ్లేషణ ఆధారంగా వచ్చిన ఫలితాలను బట్టి పన్ను, వడ్డీ, జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది.



సమస్యల పరిష్కారానికి ఓ వ్యవస్థ

ప్రస్తుతం రిటర్న్‌ల దాఖలుకు సంబంధించి వివిధ రకాల సమస్యలు/ ఇబ్బందులను పన్ను చెల్లింపుదార్లు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యతను జీఎస్టీ అమలు కమిటీకి (జీఐసీ) జీఎస్టీ మండలి అప్పగించింది. జీఎస్టీ మండలి సిఫారసు మేరకు జీఆర్ఎం ఆ బాధ్యతను తీసుకొని వాటికి పరిష్కారం చూపితే పన్ను చెల్లింపుదార్లకు గొప్ప ఊరటనిచ్చే పరిణామమే. జీఎస్టీ అమలు విజయవంతానికి కూడా ఇది దోహదం చేస్తుంది.

ఎగుమతిదార్లకు ప్రోత్సాహకాల గడువు పొడిగింపు

ప్రస్తుతం ఎగుమతిదార్లకు వివిధ రకాల పన్ను ప్రోత్సాహకాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇప్పుడు వీటిని ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు పొందే వీలు కల్పిస్తూ జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి ఎలక్ట్రానిక్ వ్యాలెట్ (ఇ-వ్యాలెట్) విధానాన్ని తేవడం ద్వారా ఎగుమతిదార్ల రిఫండ్‌ల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు కూడా సిఫారసు చేసింది. అదేమిటంటే ఊహాజనిత లేదా అదృశ్య కరెన్సీ (నోషనల్/ వంప్చువల్ కరెన్సీ) రూపంలో డీజీఎఫ్‌టీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్) ద్వారా ఇ- వ్యాలెట్‌లో జమ చేస్తారు. ఇ-వ్యాలెట్లలో జమ అయిన ఊహాజనిత కరెన్సీని దిగుమతుల చెల్లింపులకు ఎగుమతిదార్లు ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల రిఫండ్ వచ్చే వరకు వేచి చూసే పనితో పాటు దిగుమతుల కోసం అదనపు నిధులు వెచ్చించే పని తప్పుతుంది.

రివర్స్ ఛార్జీ మళ్లీ వాయిదా

జీఎస్టీ కింద నమోదుకాని వ్యక్తుల దగ్గర నుంచి రూ.5,000కు మించి కొనుగోళ్లు జరిపితే రివర్స్ ఛార్జీ చెల్లించాలని జీఎస్టీ చట్టం చెబుతోంది. అయితే ఈ విధానం అమలును ప్రభుత్వం వాయిదా వేసుకుంటూ వస్తోంది. తాజాగా ఈ వాయిదా గడువును జూన్ 30కి పొడిగించింది. జీఎస్టీ పరిధిలోకి వ్యాపారులందర్నీ తేవాలన్నదే రివర్స్ ఛార్జీ విధానం వెనక ప్రధాన ఉద్దేశం. ఇలా ప్రతిసారి వాయిదా వేసుకుంటూ వస్తే.. ఆ ఉద్దేశం ఎన్నటికి నెరవేరుతుందో మరి.

టీడీఎస్/ టీసీఎస్ వర్తింపు

టీడీఎస్ (మూలం వద్ద పన్ను మినహాయింపు), టీసీఎస్ (మూలం వద్ద పన్ను వసూలు)కు సంబంధించిన నిబంధనల వర్తింపును ఈ ఏడాది జూన్30కి జీఎస్టీ మండలి వాయిదా వేసింది. అయితే కాంట్రాక్టర్లకు చేసిన చెల్లింపులపై మూలం వద్ద పన్నును ప్రభుత్వ విభాగాలు మినహాయించుకోవచ్చు. అలాగే సరఫరాదార్ల దగ్గరనుంచి మూలం వద్ద పన్నును ఇ-కామర్స్ సంస్థలు వసూలు చేయాలి. జీఎస్టీ కింద నమోదైన కొందరి వ్యాపార తీరును గమనించేందుకు టీడీఎస్, టీసీఎస్ నిబంధనలు ఉపయోగపడతాయి. అయితే వీటిని వాయిదావేయడం వల్ల ఆ ప్రయోజనం నెరవెరకుండా పోతోంది.

ఎదురుచూద్దాం

పైన పేర్కొన్న జీఎస్టీ మండలి సిఫారసుల్లో ప్రభుత్వం ఎన్నింటికి నోటిఫికేషన్లు జారీ చేస్తుందో, ఏయే వాటిపై చర్యలు చేపడతుందో రానున్న రోజుల్లో తెలుస్తుంది. అలాగే రిటర్న్‌ల దాఖలు సరళీకరణ ప్రక్రియను ఎప్పుడు తీసుకొస్తుందనే విషయంపై స్పష్టత రావాలంటే కూడా మరికొన్ని నెలలు ఎదురుచూడాల్సిందే.

మరింత మెరుగ్గా ఇ-వేబిల్లు విధానం

అంతరాష్ట్ర (ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి) సరకు రవాణాకు ఏప్రిల్ 1 నుంచి ఇ- వేబిల్లును తప్పనిసరి చేయాలని జీఎస్టీ మండలి సమావేశం సిఫారసు చేసింది. అదే రాష్ట్రంలోనే సరకు రవాణాకైతే ఇ-వేబిల్లు వర్తింపును దశలవారీగా అమలు చేయాలని సూచించింది. దీనికి సంబంధించి తేదీలను త్వరలోనే ప్రభుత్వం నోటిఫై చేయనుంది. అయితే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఇ-వేబిల్లు విధానంలో కొన్ని కొత్త అంశాలను జీఎస్టీ మండలి చేర్చింది. అవి ఇవీ..

- ✦ రూ.50,000 విలువకు మించి సరకు రవాణాకు ఇ-వేబిల్లు తప్పనిసరి.
- ✦ ఒక్కో వినియోగదారువి రూ.50,000 విలువ లోపున్న వస్తువులను సరఫరా చేసినట్లయితే రవాణాదారు ఇ-వేబిల్లును తీసుకోనవసరం లేదు.
- ✦ జీఎస్టీ మినహాయింపు ఉన్న వస్తువుల విలువను ఇ-వేబిల్లు కోసం పరిగణనలోకి తీసుకోరు.
- ✦ ప్రజా రవాణాను కూడా రవాణా విధానంలోకి చేర్చారు.
- ✦ ఇ-వేబిల్లును పొందడం నుంచి రైల్వేలకు మినహాయింపును ఇచ్చారు. అయితే ఇ- వేబిల్లు లేకుండా సరకు రవాణా చేయడం కాని పొందడం కాని రైల్వేలు చేయకూడదు. రైలును రవాణా మార్గంగా ఉపయోగించుకునే వ్యక్తి ఇ-వేబిల్లును రైల్వేకు సమర్పించాల్సి ఉంటుంది. రైల్వేల వద్ద పన్ను రశీదు లేదా సరఫరా చలానా ఉంటే సరిపోతుంది.
- ✦ ఇ-వేబిల్లు గడువు సమయం లేదా 72 గంటల్లో ఏది ముందయితే ఆ లోపే వస్తువుల స్వీకర్త వస్తువుల స్వీకరణ లేదా తిరస్కరణకు సంబంధించి ధ్రువీకరణ జరగాలి.
- ✦ ఏదేని పని (జాబ్ వర్క్) నిమిత్తం ఒక వ్యక్తి వస్తువులను సరఫరా చేసినట్లయితే, జీఎస్టీ కింద గుర్తింపు ఉన్న ఆ వ్యక్తి ఇ-వేబిల్లును పొందవచ్చు.
- ✦ 50 కి.మీల లోపు సరకు రవాణాకు ఇ-వేబిల్లులో పార్ట్-ఎ ఉంటే సరిపోతుంది. పార్ట్-బితో అవసరం లేదు.
- ✦ ఓవర్ డైమెన్షినల్ కార్గో (ఓడీసీ)లకు అదనపు గడువు సమయం ఉంటుంది. ఓడీసీ లంటే వాహన లోడింగ్ స్థలం పరిమాణాన్ని మించి సరుకు ఆక్రమించడం.
- ✦ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఇ-వేబిల్లు వర్తింపు సమయాన్ని పొడిగించేకునే వీలు.
- ✦ ఈ రోజు ఏ సమయంలోనైనా ఇ-వేబిల్లును తీసుకుంటే మరుసటి రోజు అర్ధరాత్రి వరకు 'ఒక్క రోజుగా' పరిగణనలోకి తీసుకుంటారు.
- ✦ ఇ-వేబిల్లును ఒక్క పన్ను అధికారి పరిశీలించాక సరకు గమ్యస్థానం చేరేవరకు అదే రాష్ట్రానికి చెందిన మరో పన్ను అధికారి లేదా ఇతర రాష్ట్రానికి చెందిన పన్ను అధికారులు పరిశీలించడానికి వీల్లేదు. ఏదేని ప్రత్యేక సందర్భంలోనే ఇందుకు మినహాయింపు ఉంటుంది.
- ✦ రైలు, విమానం, ఓడల ద్వారా సరకు రవాణా చేయదలిస్తే సరకు రవాణా ప్రారంభమయ్యాక కూడా ఇ-వేబిల్లును పొందే వీలుంది.



స్త్రీ వేషధారణలో ఎంపీ శివప్రసాద్

హోదా కోసం గృహిణి వేషం

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రోజుకో వేషంతో వినూత్నంగా నిరసన తెలుపుతూ వస్తున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్ సోమవారం పార్లమెంటు ఆవరణలోకి గృహిణి వేషంలో వచ్చారు. ఏపీ మహిళల బాధలను చెప్పడానికే తానీ వేషంలో వచ్చినట్లు ప్రకటించారు. "మహిళలు మోదీపట్ల చాలా నిరాశ, కోపంతో ఉన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని, విభజన హామీలన్నీ నెరవేరుస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత హోదా లేదు ప్యాకేజీ అన్నారు. ఇప్పుడు అన్నీ ఇచ్చేశామని చెప్పి మోసం చేస్తున్నారు. మోదీ ఆంధ్రప్రదేశ్‌ను, మహిళలను అనేక రకాలుగా దెబ్బకొట్టారు. పెద్ద నోట్ల రద్దుతో ఆడవాళ్లు కనీసం చిల్లరక్కూడా నోచుకోని విధంగా చేశారు. మా డబ్బును మేం డ్రాచేసుకోలేని పరిస్థితి తీసుకొచ్చారు. ఇప్పుడు తాళిబొట్టుకూడా ఆధార్‌లింకు పెడతారేమోనన్న ఆందోళన అందరిలో వచ్చింది. అందుకే ఆయన మళ్లీ రాకూడదని మహిళలంతా కోరుకుంటున్నారు" అని శివప్రసాద్ ధ్వజమెత్తారు.

రాష్ట్రం కోసం మహాయజ్ఞం

- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి వెల్లడి


తిరుమల, న్యూస్‌టుడే: విళంబినామ సంవత్సరంలో రాష్ట్రానికి అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురవుతాయని, కుజుడి ప్రభావం అధికంగా ఉందని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. ఈ కష్టాలు తొలగిపోవడానికి మహాయజ్ఞం పేరిట ఉపశాంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న స్వరూపానందేంద్ర సరస్వతి అనంతరం ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. త్వరలో విశాఖలోని శారదా పీఠంలో ఉపశాంతి క్రతువు జరుగుతుందని, ఈ యజ్ఞం విజయవంతం కావాలని శ్రీవారిని వేడుకున్నానని వెల్లడించారు.



శ్రీవారిని దర్శించుకుని వస్తున్న విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

విభజన హామీల సాధనకు 29 సార్లు దిల్లీకి

- ప్రధాని సహా కేంద్రమంత్రులను పదే పదే కలిసిన చంద్రబాబు
- చివరిసారి జనవరి 12న ప్రధానితో, 17న అరుణ్‌జైట్లీతో భేటీ



ఈనాడు, అమరావతి: విభజన హామీల అమలు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు గత నాలుగేళ్లలో 29 సార్లు దిల్లీకి వెళ్లారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా గెలిచిన తర్వాత సీఎంగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు తొలిసారిగా దిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ సహా కేంద్రమంత్రులను కలిసిన ఆయన చివరిసారిగా ఈ ఏడాది జనవరి 12న ప్రధానితోనూ, 17న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీతోనూ భేటీ అయ్యి విభజన చట్టాన్ని అమలు చేయాలని, రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, జాతీయ విద్యాసంస్థలకు నిధులు కేటాయించాలని, విదేశీ సాయం కింద చేపట్టే ప్రాజెక్టులకు రుణాలను నాబార్డు ద్వారా అందించాలని, 2014-15 సంవత్సరం రెవిన్యూ లోటు భర్తీ నిధులు విడుదల చేయాలని అరుణ్‌జైట్లీని చివరిసారిగా విన్నవించారు. అయినా అవేవి నెరవేరలేదు. అంతకు ముందు కూడా ప్రత్యేక హోదాను ప్రకటించాలని పలుదఫాలుగా విన్నవించినా ఫలితం లేదు. సీఎం దిల్లీ పర్యటనల్లో ఎవరెవర్ని కలిశారు, ఏయే అంశాలపై విన్నవించారనే వివరాలు eenadu.netలో..

మోదీ ప్రభుత్వ విశ్వసనీయతకు గండి: 'సామ్నా'

ముంబయి: కేంద్రంలో సుదీర్ఘ కాలంపాటు తమ ప్రభుత్వమే కొనసాగుతుందన్న భాజపా నేతల కలలకు తెలుగుదేశం పార్టీ అవిశ్వాస తీర్మానం ముగింపు పలికిందని శివసేన వ్యాఖ్యానించింది. నరేంద్ర మోదీ నాయకత్వానికి 2014 లోక్‌సభ ఎన్నికల్లో వెల్లువెత్తిన ప్రజాదరణ కూడా తగ్గుముఖం పడుతోందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర అపనమ్మకం ఏర్పడిందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల్లో ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకోవటం ఖాయమని అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో శివసేన అభిప్రాయపడింది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ అనివార్యతల వల్లే తెదేపా అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిందని, జాతీయ ప్రయోజనాలేవీ ఇందులో లేవని పేర్కొంది. ఎన్డీయే ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజార్టీ ఉన్న పరిస్థితుల్లో ఈ తీర్మానం వ్యర్థ ప్రయత్నంగా పేర్కొంది. అయితే, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలే అవిశ్వాస తీర్మానాన్ని తిరుగులేని ఆధిక్యంతో ఆమోదిస్తారని జోస్యం చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీని నిలబెట్టుకోకపోవటంపై తెదేపా, వైకాపా విడివిడిగా అవిశ్వాస తీర్మానాలను ఇచ్చిన విషయాన్ని సంపాదకీయం ప్రస్తావించింది.



ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనపై సోమవారం విజయవాడలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు కొణతాల రామకృష్ణ, శివాజీ, కె.రామకృష్ణ, చలసాని శ్రీనివాస్, పి.మధు, తులసిరెడ్డి, శ్రీధర్ తదితరులు

అంతిమ పోరాటం

- హోదా కోసం దిల్లీ దిమ్మతిరిగేలా ఉద్యమం
- రౌండ్ టేబుల్ సమావేశంలో స్పష్టం చేసిన నాయకులు

ఈనాడు డిజిటల్, అమరావతి: "ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన పోరాటం నిర్ణయాత్మక దశకు చేరుకుంది. ఏపీని తక్కువగా చూస్తున్న కేంద్రం మెడలు వంచేలా ఉద్యమ పంథాను అమలు చేస్తాం" అని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి వ్యవస్థాపకులు చలసాని శ్రీనివాస్ ప్రకటించారు. విజయవాడలో సోమవారం ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్రం స్పందించకపోతే పన్నుల చెల్లింపు కూడా నిలిపేసేందుకు వెనకాడం అన్నారు. హామీలు అమలుకాకపోవడంలో కేంద్రం మొదటి దోషి అయితే తెదేపా రెండో దోషిగా ఉందన్నారు.

అవిశ్వాసం సభ ముందుకు రాకుండా కుట్ర

"భాజపా కొన్ని ప్రాంతీయ పార్టీలను చేరదీసి అవిశ్వాస తీర్మానం సభ ముందుకు రాకుండా కుట్రపన్నుతోంది" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. "దిల్లీకి దిమ్మ తిరిగేట్టుగా జాతీయ రహదారుల దిగ్బంధం, రైలురోకో, విమానాల రాకపోకలను అడ్డుకుందాం. ఆందోళనలకు ముఖ్యమంత్రి మద్దతు ఇస్తారో.. పోలీసులతో అడ్డుకునే ప్రయత్నం చేస్తారో అది కూడా తెలుస్తుంది" అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు. భాజపా నాయకులను నిలదీయండని ప్రజలకు పిలుపునిచ్చారు. "అవిశ్వాసాన్ని తిరస్కరిస్తే తీవ్ర ప్రతిఘటనతో ఉద్యమం కొత్తపుంతలు తొక్కాలి" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు పేర్కొన్నారు.

కార్యాచరణ

- 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జాతీయ రహదారుల దిగ్బంధం
- ఉద్యమం సమష్టిగా చేయాలి
- అన్ని చోట్లా ఐకాసలు ఏర్పాటు చేయాలి

ప్రాణత్యాగానికైనా సిద్ధం: "ఒక పార్టీ దేశానికి అన్నంపెట్టిన అన్నపూర్ణను అవమానించాలనుకుంటోంది" అంటూ సినీనటుడు, ప్రత్యేక హోదా సాధన పోరాట నాయకుడు శివాజీ భాజపాపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇంతవరకు ఇలాంటి ప్రధానిని చూడలేదంటూ మోదీపై విరుచుకుపడ్డారు. "భాజపా నన్ను లక్ష్యం చేసుకుంటోంది. నాకు ప్రాణహాని ఉంది. అయినా భయపడేది లేదు. రాష్ట్ర ప్రయోజనం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం" అని ప్రకటించారు.

ఏపీ విభజన సమయంలో గుర్తుకు రాలేదా?

"సభ అదుపులో లేదంటూ అవిశ్వాసం నుంచి కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. స్పీకర్ ద్వారా నాటకాలాడుతోంది. ఏపీని విభజించినపుడు సభ అదుపులోనే ఉందా?" అంటూ వైకాపా నాయకులు పార్థసారధి, మల్లాది విష్ణు ప్రశ్నించారు. విభజన చట్టంలోని ప్రతి హామీని నెరవేర్చేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి చెప్పారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ భాజపా నేతలు ఏపీని త్రిపురగా చూస్తామంటున్నారని కానీ తమిళనాడులాగా వారికి ఇక్కడ డిపాజిట్ కూడా దక్కకుండా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. సాధన సమితి పోరాటానికి జనసేన మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు శ్రీధర్ ప్రకటించారు. సీపీఐ, సీపీఎం నేతలు రామకృష్ణ, మధు సలహాదారులుగా జనసేన ముందుకుసాగుతున్నట్లు పవన్‌కల్యాణ్ చెప్పమన్నారన్నారు. ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ తదితర పార్టీలకు చెందిన వక్తలు ఉద్యమ కార్యచరణపై సూచనలు చేశారు.

పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నా

- భాజపా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు

ఈనాడు, దిల్లీ: ప్రత్యేకహోదా పేరు లేకపోయినా ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన నిధులిస్తే చాలంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జాతీయ మీడియాతో చేసిన వ్యాఖ్యలను భాజపా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు స్వాగతించారు. ప్రత్యేకహోదా కోసం పట్టుబడదామా? లేదంటే అందుకు సమానమైన ప్రయోజనాలను తెచ్చుకుందామా? అన్నది మిగతా పార్టీలుకూడా ఆలోచించుకోవాలని సూచించారు. హోదాకు సమానమైన ప్రయోజనాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. హరిబాబు సోమవారం దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ భాజపాతో ఉన్నారా? లేదా? అన్నది తనకు తెలియదని చెప్పారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలంటూ ఏఐసీసీ ప్లీనరీలో తీర్మానం చేయడాన్ని హరిబాబు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హోదా గురించి చట్టం చేయకుండా అధికారం లేనప్పుడు తీర్మానం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

హోదాకు కట్టుబడి ఉన్నాం: జనసేన

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధనకు జనసేన కట్టుబడి ఉందని, పవన్ కల్యాణ్ అభిప్రాయాన్ని 'న్యూస్-18' రిపోర్టర్ పొరపాటుగా అర్థం చేసుకున్నారని.. జనసేన ట్విట్టర్‌లో పేర్కొంది. "ప్రత్యేక హోదా సెంటిమెంట్ కాదు. అది అవసరం. నిరుద్యోగ సమస్యను అధిగమించడానికి అది అవసరం" అని పవన్ పేర్కొన్నట్లు తెలిపింది.

ఎన్డీయేకే ఏపీ ప్రజలు ఓటేశారు: రాంమాధవ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో విశ్వాసంతో ఎన్డీయేకి ఓటు వేశారని, అదే విశ్వాసంతో రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తెలిపారు. సోమవారం ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'నాలుగేళ్ల క్రితం ఏపీ ప్రజలు నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయేను చూసి ఓట్లు వేశారు. దానిని కేవలం తెదేపా ఓటుగానే పరిగణించడం సరికాదు. ప్రస్తుతం లోక్‌సభలో ప్రవేశపెడుతున్న అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవడానికి భాజపాకు తగినంత బలం ఉంది. అయితే సెంటిమెంటు పేరుతో తీసుకొచ్చిన ఈ అవిశ్వాసం వెనక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి ఏపీకి చాలా చేశాం. భవిష్యత్తులోనూ చేస్తాం' అని రాంమాధవ్ తెలిపారు.

ఏప్రిల్ తొలి వారంలో భాజపా కార్యవర్గం భేటీ!

ఈనాడు అమరావతి: ఏప్రిల్ మొదటి వారంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలో జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అందించిన చేయూత, తెదేపా వైఖరిపై ప్రజల్లోకి వెళ్లేందుకు భాజపా సిద్ధంకానుంది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. భాజపా రాష్ట్ర ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న సిద్ధార్థనాథ్ సింగ్ స్థానంలో మరొకరిని నియమించనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన సమాచారం కావాలంటే జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను సంప్రదించాలని కేంద్ర నాయకత్వం రాష్ట్ర నేతలకు సూచించింది. దీని ప్రకారమే ఆయనతో గత వారం రాష్ట్ర నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

పవన్, జగన్.. మోదీకి కోవర్టులు

- రాష్ట్ర మంత్రుల ధ్వజం

ఈనాడు అమరావతి; తుని, రాజమహేంద్రవరం, కడప, న్యూస్‌టుడే: జనసేన నేత పవన్ కల్యాణ్, వైకాపా అధ్యక్షుడు జగన్ ప్రధాని నరేంద్ర మోదీ తరఫున కోవర్టుల్లా పనిచేస్తున్నారని, ఆయన రాసిచ్చిన స్క్రిప్టు ప్రకారం నడుస్తున్నారని మంత్రులు అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పి.నారాయణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కి జరిగిన నష్టాన్ని చూసి దేశమంతా స్వచ్ఛందంగా మద్దతిస్తుంటే పవన్ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'న్యూస్-18' ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవన్ చేసిన వ్యాఖ్యల్ని సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రులు తీవ్రంగా ఖండించారు. "మోదీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై హామీ ఇవ్వలేదని పవన్ అనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. రాష్ట్ర భాజపా ఎన్నికల ప్రణాళికలో ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారు. మోదీ స్వయంగా చెప్పాలా? ఆయన పార్టీ చెబితే మోదీ చెప్పినట్టు కాదా?" అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. చంద్రబాబుకి రెండున్నర, కేసీఆర్‌కి ఆరు మార్కులు వేస్తానని పవన్ అనడంపైనా అచ్చెన్నాయుడు మండిపడ్డారు. "కేసీఆర్‌ని పొగడకపోతే హైదరాబాద్‌లో ఒక్క నిమిషం ఉండనివ్వరు. అందుకే ఆయనను పొగుడుతున్నారు. మేం ప్రజల మార్కులతో ముందుకెళుతున్నాం. మీ మార్కులు మాకు అవసరం లేదు" అని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుపై పవన్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రహితమైనవని దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. "నవయుగ సంస్థకు పోలవరం పనులు అప్పగించాలని నిర్ణయించింది కేంద్ర మంత్రి గడ్కరీనే. ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్ర నిపుణుల కమిటీనే చెప్పింది. ఇలాంటి సమయంలో ఈ ప్రాజెక్టుని కేంద్రమే తీసుకోవాలి, అవినీతిపై విచారణ జరిపించాలంటూ పవన్ బురదజల్లడం మంచిది కాదు" అని పేర్కొన్నారు. పవన్ రోజుకొక డైలాగ్ చెబుతున్నారని, ఆయన మాటల్లో నిలకడ లేదని నారాయణ ధ్వజమెత్తారు.

అవిశ్వాసానికి 40 శాతం ఎంపీల మద్దతు: అయ్యన్నపాత్రుడు

కేంద్ర ప్రభుత్వంపై తెదేపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి 40 శాతం మంది ఎంపీలు మద్దతు ఇస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తునిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనివ్వకుండా మోదీ రాక్షస పాలన చేస్తున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు అనేక సార్లు మోదీని, కేంద్ర మంత్రులను కలిసినప్పుడు అవమానకరంగా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎప్పుడూ బయటకు చెప్పుకోకుండా వాటిని భరించామన్నారు.

కేంద్రం భయపడింది: చినరాజప్ప

పార్లమెంటులో తెదేపా ఎంపీలు అవిశ్వాస తీర్మానం పెట్టడంపై కేంద్ర ప్రభుత్వం భయపడిందని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు ఉన్న పలుకుబడి వల్ల అవిశ్వాస తీర్మానానికి పలు పార్టీలు మద్దతు ప్రకటించడంతో జడిసి, పార్లమెంట్‌లో అలజడి సృష్టించి వాయిదా వేసుకున్నారని విమర్శించారు.

అమిత్‌షాకూ చెక్ పెడతాం

రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల అభీష్టం మేరకు అవసరమైతే భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు కూడా చెక్‌పెట్టేందుకు తెదేపా ముందుంటుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన కడపలో విలేకరులతో మాట్లాడారు. 40 రోజుల నుంచి జగన్మోహన్ రెడ్డి అవిశ్వాస తీర్మానం పెడతామని చెబుతున్నా జాతీయ స్థాయిలో ఎవరూ నమ్మలేదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్న తక్షణమే దేశంలోని 8పార్టీలు సంఘీభావం తెలిపాయన్నారు.

మీ ఎంపీలపైనే నమ్మకం లేదా: యనమల

అవిశ్వాస తీర్మానం అంటే భాజపా భయపడుతోందని, వాళ్ల పార్టీ ఎంపీలపైనే నమ్మకం లేనట్లుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీపై అసంతృప్తితో ఉన్న భాజపా ఎంపీలు అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని భాజపా భయపడుతోందా?' ' అని యనమల ప్రశ్నించారు. "జనసేన అధినేత పవన్‌కల్యాణ్, వైకాపా అధినేత జగన్ మాటల్లో చిత్తశుద్ధి లేదు.. రాష్ట్రానికి అన్యాయం చేసిన భాజపాకు మద్దతు పలుకుతున్నారు.. వారి వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని" రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు విమర్శించారు.

పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని అడ్డుకునేందుకు భాజపా ప్రయత్నిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథరెడ్డి ఆరోపించారు. అనుకూల పార్టీలతో ఆయా రాష్ట్రాల అంశాలను ఉభయ సభల్లో ప్రస్తావించేలా చేస్తున్న ప్రయత్నాలు స్పష్టంగా అర్థమవుతున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వంపై చేసే పోరాటంలో తమతో కలిసి రావాలని, భాజపా, వైకాపాలతో కలిసి రాజకీయాలు చేయడం మానుకోవాలని జనసేన అధినేత పవన్‌కు హితవు పలికారు.

పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తే పరువు బజారున పడుతుందని కేంద్రంలోని భాజాపా నేతలు భయపడ్తున్నారని, అందుకే చర్చకు రాకుండా వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు. గోద్రా అల్లర్లలో నరేంద్రమోదీ ప్రమేయాన్ని అప్పట్లో చంద్రబాబు ఎత్తి చూపినందుకే కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

లోక్‌సభలో భాజపా కుమ్మక్కు!

- తెదేపా ఎంపీల విమర్శ

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో 'మ్యాచ్ ఫిక్సింగ్'కు పాల్పడిందని తెదేపా ఎంపీలు ఆరోపించారు. తెలంగాణ, తమిళనాడులోని అధికార పార్టీ ఎంపీలతో సభలో ఆందోళన చేయిస్తూ.. తెదేపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా చేస్తోందని విమర్శించారు. 'ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్యాయం చేసిందని మేం అవిశ్వాసం పెట్టాం. కేంద్రం న్యాయం చేయట్లేదనే ఆ రెండు రాష్ట్రాల పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. మేం పెట్టిన అవిశ్వాసాన్ని ఆ రెండు పార్టీలు కేంద్రంపై ఆయుధంగా ఎందుకు వినియోగించుకోవు' అని ప్రశ్నించారు. సోమవారం పార్లమెంటు వాయిదాపడ్డాక తెదేపా ఎంపీలు విలేకరులతో మాట్లాడారు. కేంద్రం చర్చకు అనుమతించే వరకూ అవిశ్వాసం నోటీసు ఇస్తూనే ఉంటామని పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం చెప్పారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడు దేనికైనా తెగిస్తామని మురళీమోహన్ పేర్కొన్నారు. చర్చకు భయపడి ప్రభుత్వం పారిపోతోందని అవంతి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

ఇది చీకటి రోజు: జేసీ దివాకర్‌రెడ్డి

10 శాతానికి పైగా సభ్యుల సంతకాలతో అవిశ్వాసం నోటీసు ఇస్తే పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. పార్లమెంటు చరిత్రలో ఇది చీకటి రోజు. తెదేపా అవిశ్వాసం నోటీసుకు మద్దతుగా సోనియాగాంధీతో సహా సుమారు 100 మంది ఎంపీలు లేచి నిలబడినా స్పీకర్‌కు కనిపించలేదు. సభలో జరుగుతున్న పద్ధతిని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

స్క్రిప్టు ప్రకారమే

స్పీకర్ స్పందిస్తున్నారు: గల్లా జయదేవ్

కేంద్ర మంత్రులు సభలో వారి శాఖలకు సంబంధించి పత్రాలను టేబుల్ చేస్తున్నప్పుడు సభ బాగానే ఉందట. అవిశ్వాసం తీర్మానం రాగానే.. సభ ఆర్డర్‌లో లేదంటూ స్పీకర్ వాయిదా వేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ ఇచ్చిన స్క్రిప్టు ప్రకారం స్పీకర్ స్పందిస్తున్నారు. ఓ వైపు ఏపీకి పొరుగున్న రెండు రాష్ట్రాల పార్టీలతో సభలో గందరగోళం చేయిస్తూ.. మరోవైపు అవిశ్వాసంపై చర్చకు సిద్ధమంటూ రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటనలిస్తున్నారు. నిజంగానే చర్చకు సిద్ధమైతే ఆ విషయాన్ని స్పీకర్‌కు చెప్పండి. ప్రజలు అమాయకులు కారు. అన్నీ గమనిస్తున్నారు.

కమిటీ వేయాలి: నిమ్మల కిష్టప్ప

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్లో 80 శాతం పూర్తిచేశామని కేంద్రం చెబుతోంది. దీనిపై అన్ని పార్టీల ప్రతినిధులతో ఒక కమిటీ వేయాలి. కేంద్రం చెబుతున్న విషయాన్ని ఆ కమిటీ నిర్ధారిస్తే మేం తలొగ్గుతాం.

వారికీ ఆ పరిస్థితి రావచ్చు: రామ్మోహన్‌నాయుడు

వెల్‌లో ఆందోళన చేస్తున్న అన్నాడీఎంకే, తెరాస పార్టీలతో మాట్లాడి సభను సజావుగా నడిపించే సమర్థత కేంద్రానికి లేదా? ఈ రోజు ఏపీకి పట్టిన గతే రేపు ఆ రెండు రాష్ట్రాలకు రావచ్చు. ఆ పార్టీలు అవిశ్వాసంపై చర్చకు కలిసి రావాలి.



సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో నిరసన వ్యక్తంచేస్తున్న తెదేపా ఎంపీలు. వారికి మద్దతుగా నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి

తెదేపా ఎంపీల నిరసనకు రేణుకాచౌదరి సంఘీభావం

సభా కార్యకలాపాల ప్రారంభానికి ముందు తెదేపా ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన కొనసాగించారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి వారికి సంఘీభావం తెలుపుతూ కాసేపు నిరసనలో పాల్గొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడాలంటూ నినదించారు.



నిరసన తెలుపుతున్న వైకాపా ఎంపీలు. చిత్రంలో బొత్స సత్యనారాయణ

అన్యాయం జరుగుతుందనే స్పీకర్ విందు బహిష్కరణ

ఈనాడు, దిల్లీ: ఏపీకి అన్యాయం జరుగుతోంది కాబట్టి స్పీకర్ ఇచ్చిన విందును వైకాపా బహిష్కరించిందని వైకాపా లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్లమెంట్ వాయిదాపడ్డాక వైకాపా ఎంపీలు విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. అవిశ్వాసం నోటీసుకు మద్దతుగా ఎంతమంది ఎంపీలున్నారో తెలుసుకునేందుకు స్పీకర్ ప్రయత్నించి సభ అదుపులో లేదని వాయిదా వేశారని, ఇందులో ఆమె తప్పిదం ఏమీ లేదని అన్నారు. తనను చూసే పార్లమెంట్‌లో అన్ని ప్రతిపక్షపార్టీలూ అవిశ్వాసానికి మద్దతునిచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రచారం దారుణమని, ప్రజలను ఎంతకాలం మోసగిస్తారని ప్రశ్నించారు. కేంద్రం అవిశ్వాసంపై చర్చకు అనుమతించాలని వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంపీగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్ నుంచి పీఎం వరకు ఎవరినైనా కలిసేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. తాను ఎవరినైనా కలవాలంటే చంద్రబాబు అనుమతి అవసరం లేదన్నారు. "ప్రధానిని నేను కలవడం ద్వారా కేసుల నుంచి ఊరట పొందుతున్నాని న్యాయవ్యవస్థకు దురుద్దేశాలను అంటగడుతూ చంద్రబాబు చెప్పదలచుకుంటే మీడియా ముందుకు వచ్చి చెప్పమనండి, తగురీతిలో సమాధానమిస్తాం' అన్నారు.

అవిశ్వాసమంటే ఆషామాషీ కాదు

- లోక్‌సభ మాజీ ఉన్నతాధికారుల మనోగతం

దిల్లీ: ప్రభుత్వంపై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చర్చకు చేపట్టడమంటే ఆషామాషీ కాదనీ, మిగతా తీర్మానాలతో పోలిస్తే అదెంతో భిన్నమైనదని పార్లమెంటు మాజీ ఉన్నతాధికారులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయం విషయంలో తెదేపా, వైకాపా సమర్పించిన అవిశ్వాస తీర్మానాల నేపథ్యంలో వీరి అభిప్రాయాలను పీటీఐ వార్తాసంస్థ తెలుసుకొంది. తీర్మానాన్ని చర్చకు పెట్టకుండా వదిలేయడానికి సభలో గందరగోళం ఒక అడ్డంకి కాదని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పి.డి.టి. ఆచార్య చెప్పారు. సభ ప్రశాంతంగా లేకపోయినా నోటీసు సక్రమంగా ఉంటే చాలనీ, తీర్మానాన్ని చర్చించవచ్చనీ చెప్పారు. 'అవిశ్వాస తీర్మానాలను మిగతావాటి మాదిరిగా అనుమతించలేం. ఇది ప్రత్యేక ప్రస్తావన. స్పీకర్ కేవలం ఆ నోటీసు గురించి సభ్యులకు తెలియపరుస్తారు. నిబంధనల ప్రకారం పత్రాలన్నీ ఉంటే ఆ తీర్మానం విషయంలో ఆమె ముందుకు వెళ్తారు. సభను దారిలోకి తీసుకురావడం స్పీకర్ విధి. తీర్మానానికి మద్దతుగా 50 మంది సభ్యులు నిల్చొంటే చర్చకు తేదీ, సమయాన్ని మాత్రం సభాపతి నిర్ణయిస్తారు. అవిశ్వాస తీర్మాన నోటీసును ఇవ్వడం లోక్‌సభ సభ్యులకు ఉన్న హక్కు. దానిని తోసిపుచ్చజాలరు' అని ఆచార్య స్పష్టం చేశారు.

మరో మాజీ సెక్రటరీ జనరల్ బాలశేఖర్ మాత్రం ఈ అభిప్రాయంతో విభేదిస్తున్నారు. సభ గందరగోళంగా ఉంటే అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు చేపట్టడంలో ఆచరణాత్మక ఇబ్బందులుంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 'సభ్యులు తమ స్థానాల్లోనూ, సభాపతి స్థానం ముందు నిల్చొంటే తీర్మానానికి మద్దతునిస్తున్న 50 మంది ఎవరనేది లెక్కించడం కష్టమవుతుంది. ఎందుకంటే ఈ లెక్కకి ఓటింగ్ ఏమీ ఉండదు, కేవలం సభ్యుల్ని లెక్కించడమే. తీర్మానానికి మద్దతు తెలపడానికి కాకుండా నిరసన కోసం నిల్చొన్నవారిని కూడా లెక్కించినట్లయితే అంకెలపై వివాదం నెలకొంటుంద'ని వివరించారు. అవిశ్వాసం సహా ఏ అంశాన్ని చర్చించాలన్నా సభ ఒక పద్ధతిలో ఉండాలనీ, లేనట్లయితే సభ్యుల లెక్కింపునకు వీలుండదనీ మరో మాజీ అధికారి చెప్పారు.

ఛాంపియన్స్



దంగల్ మహిమ

దంగల్ సినిమాలో పురుషులతో కుస్తీలో తలపడి గెలుస్తుంది గీతా ఫొగాట్. ఆ సినిమానే గుర్తుకు తెస్తూ ఒక అమ్మాయి నిజంగా పురుషులతో కుస్తీ ఆడి విజేతగా నిలిచింది. నిజామాబాద్‌లోని కోటగిరిలో జరిగిన కుస్తీ పోటీల్లో 15 ఏళ్ల మహిమ అనే మహారాష్ట్ర బాలిక.. పురుషులతో పోటీపడటమే కాదు విజేతగా నిలిచి బహుమతి అందుకుంది. 10 ఏళ్ల నుంచి రెజ్లింగ్‌లో ఉన్న ఆమె ఇప్పటిదాకా 50కి పైగా పోటీల్లో పాల్గొంది.

– ఎత్తొండ (కోటగిరి, న్యూస్‌టుడే)

అవును.. షమిని కలిశా: అలిష్బా



దిల్లీ: క్రికెటర్ మహ్మద్ షమిని చుట్టుముట్టిన వివాదం సోమవారం మరో మలుపు తిరిగింది. షమితో తనకు పరిచయం ఉందని, అతణ్ని తాను దుబాయ్‌లో కలుసుకున్నానని పాకిస్థాన్ మహిళ అలిష్బా అంగీకరించింది. "అవును నేను అతణ్ని కలిసిన మాట నిజమే. నేను తరచుగా దుబాయ్ వెళ్తుంటా. ఎందుకంటే నా సోదరి అక్కడే ఉంటుంది. ఒక అభిమానిగా షమిని కలిశా. తర్వాత స్నేహితురాలినయ్యా. అతడికి సందేశాలు పంపించా" అని తెలిపింది. అతడితో కలిసి ఎప్పుడూ తాను హోటల్‌కు వెళ్లలేదని పేర్కొంది. "నేను నా సోదరి ఇంటికి వెళ్లా. ఉదయం హోటల్‌కు వెళ్లి షమితో పాటు అల్పాహారం చేశానంతే. మా మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలూ లేవు. ఎవరికీ కనీసం అబద్ధం కూడా చెప్పలేని వ్యక్తి (షమి) దేశాన్ని ఎలా మోసం చేయగలడు" అని చెప్పింది.



గెలుపు మనది.. సంబరం లంకది

కొలంబో: శత్రువుకి శత్రువు మిత్రుడు అంటారు. ఆదివారం భారత-బంగ్లా మధ్య జరిగిన ముక్కోణపు టోర్నీ ఫైనల్లో అదే జరిగింది. అంతకు ముందు శ్రీలంకతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్ అద్దాలు పగలకొట్టడం.. మైదానంలో బాహాబాహీకి దిగే ప్రయత్నం చేయడం.. గెలిచిన తర్వాత నాగిని నృత్యాలతో చేయడం.. లంక అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. అందుకే తమ దేశం ఫైనల్లో లేకపోయినా దాదాపు 20 వేల మంది అభిమానులు స్టేడియానికి వచ్చి భారత్‌కు మద్దతుగా నినాదాలిచ్చారు. మువ్వన్నెల పతకాన్ని ఊపుతూ టీమ్ఇండియా విజయాన్ని బలంగా ఆకాంక్షించారు. "లంక అభిమానుల మద్దతు అద్భుతం. పరాయి దేశంలో ఆడుతున్నట్లే లేదు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడే కాదు., బౌలింగ్ సమయంలోనూ పూర్తిస్థాయిలో మమ్మల్ని ప్రోత్సహించారు" అని మ్యాచ్ అనంతరం రోహిత్ శర్మ చెప్పాడు. కార్తీక్ సిక్స్ కొట్టగానే తమ దేశమే గెలిచినంత ఆనందంగా లంక అభిమానులు సంబరాలు చేసుకున్నారు. విజయం అనంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ లంక జాతీయ పతాకాన్ని ఊపుతూ ఆ దేశ అభిమానులకు కృతజ్ఞతలు చెప్పాడు. "లీగ్ మ్యాచ్‌ల్లో మేం ఆడిన మ్యాచ్‌లకు జనాలే రాలేదు. ఫైనల్‌కు మాత్రం లంక అభిమానులు భారీస్థాయిలో హాజరై అండగా నిలవడం ఆశ్చర్యాన్ని కలిగించింది" అని దినేశ్ కార్తీక్ అన్నాడు. మొత్తానికి బంగ్లా మీద కోపంతో ఉన్న లంక అభిమానులు భారత్ విజయంతో శాంతించారు.

రోహిత్ ఆ సిక్స్ చూడలేదట..: ఆదివారం టీ20 ఫైనల్లో ఆఖరి బంతికి సిక్స్‌తో దినేశ్ కార్తీక్ భారత్‌కు చిరస్మరణీయ విజయం అందించాడు. కోట్ల మంది అభిమానులు ఆ షాట్‌ను ఆస్వాదించారు. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఆ సంచలన సిక్స్‌ను చూడలేదు. కారణమేంటని అడిగితే.. మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లే అవకాశముందని భావించి ప్యాడ్లు కట్టుకోవడానికి డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్లాడట. ఈ విషయాన్ని రోహితే చెప్పాడు.

మమ్మల్ని క్షమించండి



దిల్లీ: దినేశ్ కార్తీక్ అద్భుత ఇన్నింగ్స్‌తో నిదహాస్ ట్రోఫీ గెలుచుకున్న భారత్ ఆనందంలో మునిగిపోగా.. మరోవైపు విజయానికి చేరువగా వచ్చి ఓటమిపాలైన బంగ్లా క్రికెటర్లు నైరాశ్యంలో కూరుకుపోయారు. ఆ జట్టు బౌలర్ రుబెల్ హుస్సేన్ తమను క్షమించాలంటూ ఫేస్‌బుక్ వేదికగా అభిమానులను కోరాడు. మ్యాచ్‌లో కీలకమైన 19వ ఓవర్ వేసిన రుబెల్.. దినేశ్ కార్తీక్ దెబ్బకు 22 పరుగులు సమర్పించుకున్న విషయం తెలిసిందే. దాంతో 12 బంతుల్లో 34 పరుగులుగా ఉన్న సమీకరణం.. 6 బంతుల్లో 12 పరుగులుగా మారి మ్యాచ్ భారత్ వైపు మొగ్గేలా చేసింది. "మ్యాచ్ తర్వాత నిరాశకు లోనయ్యా. మ్యాచ్ గెలిచే స్థాయి నుంచి ఓడిపోయే స్థితికి వస్తామని అనుకోలేదు. ప్రతి ఒక్కర్నీ క్షమాపణ కోరుతున్నా. మమ్మల్ని మన్నించండి" అని రుబెల్ పేర్కొన్నాడు.

సత్తా ఉన్నోడే కానీ..

దినేశ్ కార్తీక్.. ఇప్పుడు ఏ భారత క్రికెట్ అభిమాని నోట విన్నా ఈ పేరే! బంగ్లాదేశ్‌తో ముక్కోణపు టీ20 సిరీస్ ఫైనల్లో చివరి రెండు ఓవర్లలో అతడి విధ్వంసం.. చివరి బంతికి సిక్సర్ బాది భారత్‌ను గెలిపించిన వైనం క్రికెట్ ప్రియుల్ని ఉర్రూతలూగించింది. ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో అతను జాతీయ క్రికెట్ హీరో అయిపోయాడు. 14 ఏళ్లుగా అంతర్జాతీయ క్రికెట్లో కొనసాగుతున్న కార్తీక్.. ఇన్నాళ్లూ భారత క్రికెట్ అభిమానులకు ఒకలా కనిపించాడు. ఇప్పుడు మరోలా కనిపిస్తున్నాడు. మరి ఇంత సామర్థ్యం ఉన్నవాడు ఎందుకు స్టార్ కాలేకపోయాడు..? ఇన్నేళ్లలో ఎన్నడూ చూడని మార్పు కార్తీక్‌లో ఇప్పుడే ఎందుకు కనిపిస్తోంది..?

"నాకు ప్రతి టోర్నీ ఎంతో కీలకం. ఒక టోర్నీలో పేలవ ప్రదర్శన చేస్తే నాపై వేటు పడుతుంది. నేను ఎప్పుడూ నా అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ సాగాలి. భారత జట్టులో చోటు కోసం ఇప్పుడు పోటీ అంత తీవ్రంగా ఉంది"

– దినేశ్ కార్తీక్



ఈనాడు క్రీడావిభాగం

టీమ్ఇండియాలో స్టార్ ఆటగాళ్లుగా ఎదిగిన సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌ల సమకాలీనుడు దినేశ్ కార్తీక్. వీరితో పాటు అంబటి రాయుడు, ఆర్పీ సింగ్, రాబిన్ ఉతప్పలతో కలిసి 2004లో అండర్-19 ప్రపంచకప్ ఆడాడు దినేశ్. ఆ జట్టులోని మిగతా వాళ్లందరి కంటే ముందుగా టీమ్ఇండియా తలుపు తట్టింది కూడా కార్తీకే. అండర్-19 ప్రపంచకప్ ఆడిన కొన్ని నెలలకే అతను భారత జట్టులోకి వచ్చాడు. టెస్టులతో పాటు వన్డేల్లోనూ భారత్‌కు 2004లోనే ప్రాతినిధ్యం వహించాడు. కార్తీక్ అరంగేట్ర సమయంలో టీమ్ఇండియా కోచ్‌గా ఉన్న జాన్ రైట్.. అతడిని భారత భవిష్యత్ కెప్టెన్‌గా అభివర్ణించడం విశేషం. కానీ కార్తీక్ అంచనాల్ని అందుకోలేకపోయాడు. జట్టులో ఎంతో కాలం చోటు నిలుపుకోలేకపోయాడు. నాటి నుంచి గత 14 ఏళ్లలో జట్టులోకి రావడం, పోవడం అతడికి అలవాటుగా మారిపోయింది. జూనియర్ స్థాయిలో దినేశ్ కేవలం బ్యాట్స్‌మన్ మాత్రమే. కానీ భారత జట్టుకు ఆడే అవకాశాల్ని మెరుగుపరుచుకోవడం కోసం అతను ఆలస్యంగా వికెట్ కీపింగ్‌లోకి అడుగుపెట్టాడు. అందుకే ఇందులో అతడి నైపుణ్యం సాధారణం. రెగ్యులర్ వికెట్ కీపర్లతో పోలిస్తే అతను ఒక మెట్టు కిందే ఉంటాడు. ఇది అతడికి ఎప్పుడూ ఒక ప్రతికూలతే.

ధోని అడ్డు నిజమే కానీ..



కార్తీక్ టీమ్ఇండియాలోకి వచ్చిన ఏడాది తర్వాతే ధోని అంతర్జాతీయ క్రికెట్లోకి అరంగేట్రం చేయడం విశేషం. అయితే ధోని వచ్చాక కార్తీక్‌తో పాటు దేశంలోని మిగతా వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ అందరికీ కళ్లెం పడిపోయింది. ఇంతింతై అన్నట్లు ఎదిగిపోయిన మహికి ఎవరూ పోటీ ఇవ్వలేకపోయారు. ధోనికి గాయమయ్యో.. లేదా విశ్రాంతి తీసుకునో.. ఇంకేదైనా కారణంతోనో దూరమైతే తప్ప వేరే వాళ్లకు అవకాశం లేకపోయేది. దీంతో దేశవాళీల్లో సత్తా చాటుకున్నా ఆశించిన స్థాయిలో అవకాశాలు అందని వాళ్లలో కార్తీక్ కూడా ఒకడు. 14 ఏళ్ల వ్యవధిలో కార్తీక్ 23 టెస్టులు, 79 వన్డేలు మాత్రమే ఆడాడంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఐతే కేవలం కార్తీక్ రెగ్యులర్ ఆటగాడు కాలేకపోవడానికి కేవలం ధోని అడ్డంకినే కారణంగా భావించలేం! ధోనీని మించే ప్రదర్శనతో వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్‌గా అతడి స్థానానికి చెక్ పెట్టడం కష్టమే కానీ.. ఒక బ్యాట్స్‌మన్‌గా జట్టులోకి రావడానికి, నిలదొక్కుకోవడానికి కార్తీక్‌కు అవకాశం లేకపోలేదు. కానీ అతను తన ప్రతిభకు న్యాయం చేయలేకపోయాడు. అప్పుడప్పుడూ లభించిన అవకాశాల్ని కూడా సద్వినియోగం చేసుకోలేదు. అలా చేసుకుని ఉంటే.. ధోని రిటైరయ్యాక టెస్టు జట్టులో వికెట్ కీపర్ అతనే అయ్యేవాడు. వికెట్ కీపింగ్‌లో లోపాలకు తోడు.. బ్యాట్స్‌మన్‌గా నిలకడ లేమి కార్తీక్ ఎదుగుదలకు అడ్డంకిగా మారింది. అందమైన బ్యాటింగ్ శైలి, చక్కటి టైమింగ్, ఎలాంటి బౌలింగ్‌నైనా ఎదుర్కొనే సామర్థ్యం ఉన్నప్పటికీ.. అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవడంలో దినేశ్ విఫలమయ్యాడు. ఐపీఎల్‌లో ఒక దశలో కార్తీక్‌కు రూ.12.5 కోట్ల ధర పలకడం విశేషం. కానీ అందులోనూ కార్తీక్ ఎప్పుడూ తన సామర్థ్యానికి న్యాయం చేసే ప్రదర్శన చేయలేదు.

కార్తీక్‌ను మార్చిన 'బాధల నిలయం'

ఇన్నేళ్లు చూసిన కార్తీక్ వేరు.. గత ఏడాదిగా చూస్తున్న కార్తీక్ వేరు. అతడిలో పట్టుదల, పరిణతి కనిపిస్తోందిప్పుడు. ఫిట్‌నెస్ కూడా మెరుగైంది. ఈ మార్పు వెనుక పెద్ద కథే ఉంది. ఈ కథేంటో తెలియాలంటే మూడేళ్లు వెనక్కి వెళ్లాలి. 2015లో కార్తీక్ ఫామ్ బాగా దెబ్బ తింది. రంజీ సీజన్లో 12 ఇన్నింగ్స్‌ల్లో 32 సగటుతో 355 పరుగులే చేశాడు. ముందు ఏడాది ఐపీఎల్ సీజన్‌కు రూ.9 కోట్లు తీసున్న కార్తీక్.. 2016 వేలంలో రూ.2 కోట్ల ధరకు పడిపోయాడు. తన ప్రదర్శన ఇలాగే కొనసాగితే టీమ్ఇండియా గురించి ఆలోచించే పరిస్థితే ఉండదని, తర్వాతి ఐపీఎల్ సీజన్‌కు తనను ఏ ఫ్రాంఛైజీ కొనదని ఆందోళన చెందాడు దినేశ్. అప్పుడే ముంబయి మాజీ ఆటగాడు అభిషేక్ నాయర్ నిర్వహించే 'బూట్ క్యాంప్' గురించి అతడికి తెలిసింది. క్రికెట్ కెరీర్ ముగిశాక నాయర్.. యువ క్రికెటర్లలో శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంచేందుకు 'బూట్ క్యాంప్' పేరుతో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాడు. ఇందులో పాల్గొనడమే కార్తీక్‌లో మార్పు తెచ్చింది. ఈ శిబిరంలో శిక్షణ భిన్న రకాలుగా ఉంటుంది. ఆటగాళ్లకు సౌకర్యాలు దూరం చేసి వారిని మానసికంగా దృఢంగా మార్చేందుకు 'బాధల నిలయం' (హౌస్ ఆఫ్ పెయిన్)లో ఉంచుతారు. పెద్దగా సౌకర్యాలేమీ లేని ఒక గదిలో కొన్ని రోజులు జీవనం సాగించాలి. చిన్నతనం నుంచి విలాసవంతమైన జీవితం గడిపిన కార్తీక్ ఈ గదిలో బాగా ఇబ్బంది పడ్డాడు. కొన్ని రోజుల తర్వాత అందులోంచి బయటికొచ్చేస్తానని నాయర్‌ను వేడుకున్నా అతను అంగీకరించలేదు. ఈ గది నుంచి బయటికి వచ్చాక కొన్ని రోజుల పాటు కఠినమైన శారీరక శిక్షణ ఉంటుంది. జిమ్ చేయడంతో రెండు ప్రాక్టీస్ సెషన్లతో పాటు వివిధ రకాల శారీరక దృఢత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలి. ముంబయి మాజీ ఆటగాడు ప్రవీణ్ ఆమ్రె సాయంతో బ్యాటింగ్ లోపాల్ని కూడా దిద్దుకున్నాడు కార్తీక్. సాధన కోసం అతను నెట్స్ ఉన్న ఒక మైదానాన్ని అద్దెకు తీసుకోవడమే కాక.. 15 మంది కుర్రాళ్లను కొన్ని నెలలకు జీతమిచ్చి నియమించుకోవడం విశేషం. ఇలా కొన్ని నెలల పాటు కష్టపడ్డాక కార్తీక్ ఆట మెరుగైంది. అతడిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ ప్రభావం తర్వాతి ఫస్ట్‌క్లాస్ సీజన్లోనే కనిపించింది. 14 ఇన్నింగ్స్‌ల్లో 50కి పైగా సగటుతో 704 పరుగులు చేశాడు. 9 వన్డేల్లో 118 సగటుతో 607 పరుగులు బాదాడు. నిరుడు ఐపీఎల్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు. దీంతో మళ్లీ కార్తీక్ టీమ్ఇండియాలో ఆడే అవకాశం దక్కింది. నిరుడు ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి అతడికి సెలక్టర్లు తరచుగా అవకాశాలిస్తున్నారు. అప్పట్నుంచి 8 వన్డేల్లో 61 సగటుతో 183 పరుగులు, 10 టీ20ల్లో 84.5 సగటుతో 169 పరుగులు చేశాడు కార్తీక్. మిడిలార్డర్లో ఉండటం వల్ల అతడికి ఎక్కువ ఓవర్లు ఆడే అవకాశం దక్కట్లేదు. పునరాగమనంలో అతను 4 వన్డేలు, 7 టీ20ల్లో నాటౌట్‌గా నిలవడం విశేషం. ముక్కోణపు టీ20 సిరీస్‌లో ఐదు ఇన్నింగ్స్‌ల్లోనూ నాటౌట్‌గానే నిలవడం గమనార్హం. ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న కార్తీక్.. తనను బ్యాటింగ్ ఆర్డర్లో పైన పంపకపోవడంపై అసంతృప్తితోనూ ఉన్నాడట. ఫైనల్లో శంకర్‌ను తన కంటే ముందు పంపడంపై అసహనం ప్రదర్శించినట్లు రోహితే స్వయంగా చెప్పాడు కూడా. ఐతే కార్తీక్ ముందే బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే ఓ మోస్తరు వేగంతో ఆడేవాడేమో. భారత్ సులువుగా గెలిచేదేమో! పరిస్థితి అదుపు తప్పాక వచ్చి అసాధారణంగా ఆడి భారత్‌ను గెలిపించాడు కాబట్టే ఇప్పుడు అతను హీరో అయ్యాడు. కాబట్టి తనను దిగువన దింపినందుకు కార్తీక్ రోహిత్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిందే!

ఆఖరి బంతి సిక్స్ వీరులు

ముక్కోణపు టీ20 టోర్నీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై ఆఖరి బంతికి సిక్స్ కొట్టి భారత్‌కు సంచలన విజయాన్ని అందించాడు కార్తీక్. ఇలా ఆఖరి బంతికి సిక్స్ బాది జట్టును గెలిపించిన వీరుల్లో కొందరు...

మియా పంచ్




ఆఖరి బంతికి సిక్సర్... ఈ మాట వినగానే గుర్తొచ్చేది ఒకప్పటి పాకిస్థాన్ స్టార్ బ్యాట్స్‌మన్ మియాందాదే. 1986 ఆస్ట్రేలేసియా కప్ ఫైనల్లో జావెద్ ఈ అద్భుతమైన షాట్ ఆడాడు. 246 పరుగుల ఛేదనలో పాక్ గెలవాలంటే చివరి బంతికి నాలుగు పరుగులు చేయాలి. ఐతే భారత్ పేసర్ చేతన్ శర్మ ఫుల్‌టాస్ వేయడంతో ఆ బంతిని మియాందాద్ సిక్సర్‌గా మలిచి పాక్‌కు సంచలన విజయాన్ని అందించాడు.

జూలు విదిల్చాడు



1999 ప్రపంచకప్‌లో కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆఖరి ఓవర్లో గెలవాలంటే 11 పరుగులు చేయాల్సి వచ్చింది. ఆ ఓవర్ రెండో బంతికి బౌచర్ కూడా వెనుదిరిగాడు. ఆఖరి బంతికి 4 పరుగులు అవసరం కాగా.. సిక్సర్ బాదిన లాన్స్ క్లూసెనర్ జట్టుకు విజయాన్ని అందించాడు.

టేలర్ తడాఖా




2006లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో జింబాబ్వే ఆఖరి ఓవర్లో గెలవాలంటే 17 పరుగులు చేయాల్సి వచ్చింది. 50వ ఓవర్లో రెండో బంతికి సిక్స్ బాదిన బ్రెండన్ టేలర్ జట్టును విజయానికి చేరువ చేశాడు. ఆఖరి బంతికి ఐదు పరుగులు కావాల్సి ఉండగా సిక్స్ బాదిన టేలర్ జట్టును గెలిపించాడు

చందర్‌పాల్ చెలరేగాడు



2008లో శ్రీలంకతో వన్డేలో చందర్‌పాల్ తనలో మరో కోణాన్ని చూపించాడు. విండీస్ గెలవాలంటే చివరి రెండు బంతుల్లో పది పరుగులు చేయాలి. ఐదో బంతిని ఫోర్‌గా మలిచిన చందర్‌పాల్.. ఆఖరి బంతిని మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్స్ బాది జట్టును విజేతగా నిలిపాడు.

మెక్‌లారెన్ మెరుపులు



2013లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో దక్షిణాఫ్రికా ఆఖరి బంతికి మూడు పరుగులు చేయాల్సి ఉండగా.. మెక్‌లారెన్ భారీ సిక్స్ బాది జట్టుకు అనూహ్య విజయాన్ని అందించాడు.


ఫెదరర్‌కు డెల్'పోటు'

ఇండియన్ వెల్స్ టైటిల్ సొంతం



ఇండియన్ వెల్స్: ఫెదరర్ జోరుకు అడ్డుకట్ట పడింది. అర్జెంటీనా ఆటగాడు మార్టిన్ డెల్‌పొట్రో అతడికి చెక్ పెట్టి, ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో అతడు 6-4, 6-7 (7-8), 7-6 (7-2)తో ఫెదరర్‌పై విజయం సాధించాడు. డెల్‌పొట్రో మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకుని మరీ నెగ్గడం విశేషం. అతడికి ఇదే తొలి ఇండియన్ మాస్టర్స్ టైటిల్. ఇండియన్ వెల్స్ మాస్టర్స్ మహిళల సింగిల్స్‌లో నవోమి ఒసాక (జపాన్) విజేతగా నిలిచింది. ఫైనల్లో ఒసాక 6-3, 6-2తో దారియా కసట్కిన (రష్యా)పై నెగ్గి కెరీర్‌లో తొలి టైటిల్ సాధించింది.

చాహల్ @ 2



దుబాయ్: ముక్కోణపు టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన టీమ్ఇండియా స్పిన్నర్లు చాహల్, వాషింగ్టన్ సుందర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో చాహల్ 12 స్థానాలు ఎగబాకి రెండో స్థానం సాధించగా.. సుందర్ 151 స్థానాలు మెరుగుపర్చుకుని 31వ ర్యాంకును అందుకున్నాడు. ఫైనల్లో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్నందించిన దినేశ్ కార్తీక్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 126వ స్థానం నుంచి 95వ స్థానానికి చేరుకున్నాడు.

బాలల కోర్టుల ఏర్పాటుపై నివేదికలివ్వండి

- హైకోర్టులకు సుప్రీం కోర్టు ఆదేశం

దిల్లీ: బాలలపై జరిగే నేరాలను వేగంగా విచారించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసే అంశంపై వివరాలను ఇవ్వాలని సుప్రీం కోర్టు సోమవారం అన్ని హైకోర్టులనూ ఆదేశించింది. ఇలాంటి న్యాయస్థానాలు ఉండాలని, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని బాలల హక్కుల పరిరక్షణ చట్టం-2005లోని 25, 26 సెక్షన్లు చెబుతున్న నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. "నిబంధనలను దృష్టిలో పెట్టుకొని, 25, 26 సెక్షన్ల కింద హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లు నివేదికలను సమర్పించాలని ఆదేశిస్తున్నాం. అవి అందాక ఈ అంశంపై దృష్టి సారిస్తాం" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆదేశాలు అందిన రెండు వారాల్లోగా నివేదికలు తమకు అందాలని తెలిపింది. ప్రత్యేక కోర్టులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం కోసం ఇప్పటికే చర్యలు చేపట్టి ఉంటే. . వాటికి తాజా కేసు అవరోధం కాబోదని స్పష్టంచేసింది. అనాథ శరణాలయాల నిర్వహణ, దత్తత తీరు, ఆ తర్వాత చిన్నారులకు ఎదురవుతున్న పరిస్థితులపై అన్ని రాష్ట్రాల నుంచి స్పందనను కోర్టు లోగడ కోరింది. దత్తత పేరుతో అనాథలను అక్రమంగా రవాణా చేస్తున్న ఉదంతాలు పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకోవడంపై ఆందోళన వ్యక్తంచేసింది. దత్తత పేరుతో చిన్నారులను విక్రయించడం కన్నా దారుణం మరొకటి లేదని వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్‌లో అనాథ పిల్లల హక్కులు ఉల్లంఘనకు సంబంధించిన ఒక కేసులో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) చేపట్టిన చర్యలపై కలకత్తా హైకోర్టు స్టే ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ కమిషన్.. సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

గ్రంథాలయ ఉద్యోగులకు త్వరలో 010 పద్దు కింద వేతనాలు

మంత్రి గంటా శ్రీనివాసరావు

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని త్వరలోనే 010 పద్దు ద్వారా వేతనాలు అందించనున్నట్లు రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. పింఛన్లు, ఆరోగ్య కార్డులు జారీ చేస్తామన్నారు. సంస్థలో పని చేస్తున్న పొరుగు సేవల సిబ్బందికి పెరిగిన జీతాలు, బకాయిలు చెల్లిస్తామన్నారు. స్వీపర్లు, బుక్ డిపాజిట్ కేంద్రాల్లో సిబ్బందికి వేతనాలు పెంచనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర ప్రథమ సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజును మంత్రి అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బండారు హనుమంతరావు, డైరెక్టర్లు, 13 జిల్లాల సంఘాల నాయకులు, ఉద్యోగులు ఇందులో పాల్గొన్నారు.

రైలు ప్రయాణమా.. బహు పరాక్..!

- వేసవి ప్రారంభంతో దోపిడీలకు తెగబడుతున్న ముఠాలు
- రాష్ట్రంలో రోజుకు నాలుగైదు ఘటనలు నమోదు
- సరైన తనిఖీలు లేకే రెచ్చిపోతున్న వైనం
- అరవై శాతం రైళ్లలోనే గస్తీ సిబ్బంది

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్తున్న రైళ్లల్లో దొంగతనాలు పెరుగుతున్నాయి. వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉత్తరాది ముఠాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. తాజాగా రెండు రోజుల కిందట నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో అయిదుగురు సభ్యుల ముఠా తెనాలి వద్ద దోపిడీకి పాల్పడటం, పోలీసులు వారి వెంటపడటంతో నగదు సంచి పడేసి పరారయ్యారు. అలాగే కుర్బా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ బంగారం వ్యాపారస్థుడిని కొందరు దొంగల ముఠాల సభ్యులు పోలీసులమంటూ బెదిరించి, ఒంగోలు వద్ద రైలు నుంచి దించేసి బంగారాన్ని దోచుకున్నారు. ఇవి కేవలం తార్కాణాలు మాత్రమే.. ఈ తరహా ఘటనలు రాష్ట్రంలో సగటున రోజుకు నాలుగు చోటుచేసుకుంటున్నాయని జాతీయ నేర గణాంక సంస్థ నివేదిక స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలో 2014లో 1498 చోరీలు చోటుచేసుకోగా... 2015లో ఆ సంఖ్య 1501కు.. 2016లో 1625కు పెరిగింది. 2016లో అంతకు ముందు రెండేళ్లతో పోలిస్తే దాదాపు 8.46 శాతం మేర పెరిగాయి.



మన దగ్గరే ఎక్కువ ఎందుకంటే..

బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ధరించి ప్రయాణాలు చేసే వారిలో ఎక్కువగా దక్షిణ భారతదేశం వైపే ఉండటంతో దోపిడీ ముఠాలు ఇటు వైపు కన్నేస్తున్నాయని పోలీసు వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించే రైళ్లు ఎక్కువ శాతం అర్ధరాత్రి దాటాకే రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఆ సమయంలో అంతా నిద్రలో ఉండటంతో దొంగల ముఠాలు రెచ్చిపోతున్నాయి. ప్రధానంగా ఉత్తర ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, హరియాణా, సోలాపూర్ ముఠాలు దోపిడీలకు పాల్పడుతున్నాయి. కనీసం పది మంది ఉండే వీరు రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు మాదిరి వేర్వేరుగా ఏసీ బోగీల్లో ఎక్కుతారు. ఆపై అదును చూసుకుని దోపిడీకి పాల్పడతారు. మరికొందరైతే ఏయే ప్రాంతాల్లో రైలు నెమ్మదిగా వెళ్తుందో ముందే అంచనా వేసుకుని అక్కడ కిందికి దిగి కిటికీల పక్కన ఆదమరిచి ఉన్న ప్రయాణికుల మెడలోని గొలుసులు తెంపుకొని పరారవుతారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె, పిడుగురాళ్ల-నడికుడి-బాపట్ల-తెనాలి-కొలకలూరు, తెనాలి-కావలి, సత్తెనపల్లి-నడికుడి, ఆదోని-గుత్తి-అనంతపురం, గూడూరు మధ్య ప్రాంతాల్లోనే ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి.

రైళ్లల్లో చోరీల్లో మొదటి అయిదు స్థానాల్లో ఉన్నరాష్ట్రాలు (2016లో)

రాష్ట్రం పేరు	చోరీల సంఖ్య
మహారాష్ట్ర	6551
ఉత్తరప్రదేశ్	6483
మధ్యప్రదేశ్	4387
దిల్లీ యూటీ	3837
ఆంధ్రప్రదేశ్	1625

గస్తీ సిబ్బంది సరిగా లేక..

ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే రైళ్లల్లో 60 శాతం వాటిల్లోనే పోలీసు గస్తీ ఉంటోంది. ప్రతి బోగీని క్షుణ్ణంగా తనిఖీ చేయాలంటే ఒక్కో రైలుకు కనీసం 8 మంది సిబ్బంది అవసరం. కానీ గస్తీ ఉండే రైళ్లలోనూ ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉంటున్నారు. విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసు జిల్లా పరిధిలో సుమారు...200, గుంతకల్లు రైల్వే పోలీసు జిల్లా పరిధిలో సగానికి పైగా ఖాళీలున్నాయి. దీంతో పూర్తిస్థాయి తనిఖీలు సాధ్యపడటం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని దోపిడీ ముఠాలు రెచ్చిపోతున్నాయి.

పొట్టి చిత్రం.. గట్టి సందేశం!

- ప్రజలను అప్రమత్తం చేసేందుకు లఘుచిత్రాలతో ముందుకెళ్తున్న వివిధ జిల్లాల పోలీసులు
- సమస్యలు, పరిష్కారాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం

ఈనాడు, కడప: మారుతున్న నేరాల సరళి, వివిధ సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీసులు విభిన్న ఆలోచనలతో ముందుకు వెళుతున్నారు. లఘుచిత్రాల (షార్ట్‌ఫిల్మ్స్)తో దృశ్య ప్రదర్శనలు చేపడుతూ చైతన్య పరుస్తున్నారు. ప్రధాన సమస్యలపై స్పష్టంగా వివరిస్తూ..వాటిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలు తెలియజేస్తున్నారు. రాయలసీమ జిల్లాలను పట్టిపీడిస్తున్న మట్కా, రోడ్డుభద్రత, దొంగతనాలు, విద్యార్థుల ఆత్మహత్యల అంశాలపై కడప జిల్లా పోలీసులు పరివర్తన, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్), క్షణం.. తదితర లఘుచిత్రాలను రూపొందించారు. స్థానిక నటీనటుల ద్వారా వీటని రూపొందించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఈ వీడియోలను ఉంచి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం 'సంచారరథం' తయారీలో నిమగ్నమయ్యారు.



క్షణం లఘుచిత్రం లోగో

రాష్ట్రంలో జరిగిన అనేక కీలక ఘటనల దృశ్యాలు ఓ వాహనంలోని ఎల్‌ఈడీ తెరపై ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావలని భావిస్తున్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు కూడా మహిళా ఉద్యోగుల లైంగిక వేధింపులపై 'బ్రేక్ ద సైలెన్స్', మహిళల భద్రతపై 'వి ఆర్ వాచింగ్' పేరుతో లఘుచిత్రాలు రూపొందించారు. తెలియని నంబరు, ఒక్క క్షణం ఆలోచించండి. . అంటూ సందేశం ఇస్తున్నారు. వీరితో పాటు వివిధ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు కూడా లఘుచిత్రాలను రూపొందించడంలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఈ విషయమై కడప జిల్లా ఎస్పీ బాబూజీ 'ఈనాడు'తో మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకు లఘుచిత్రాలు చక్కగా ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. మున్ముందు మరిన్ని అంశాలపై లఘుచిత్రాలు సిద్ధం చేసి.. ప్రజలకు చేరువ చేస్తామని ఆయన వివరించారు.

అహోబిలం ఆలయాన్ని సందర్శించిన విదేశీ భక్తులు

ఆళ్లగడ్డ గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలోని అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని సోమవారం అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన 46 మంది భక్తులు దర్శించుకొన్నారు. వీరు కోల్‌కోతాలోని హరేరామ హరేకృష్ణ వేదపాఠశాలలో గత కొన్నాళ్లుగా అభ్యసిస్తున్నారు. రెండురోజుల పాటు అహోబిలంలో బస చేసి నవనారసింహ క్షేత్రాలను దర్శించుకొనేందుకు వచ్చినట్లు స్థానిక మఠం మేనేజర్ బద్రినారాయణ తెలిపారు. ఇక్కడి క్షేత్రం, పరిసరాలు అద్భుతంగా ఉన్నాయని ఈ సందర్భంగా భక్తులు పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో ఈ భక్తుల బృందం హరేరామ హరేకృష్ణ నామంతో చేసిన కీర్తనలు పలువురిని ఆకట్టుకొన్నాయి.



అహోబిలంలో కీర్తనలు చేస్తూ వెళుతున్న విదేశీయులు

మధుమేహ ఔషధంతో ఊబకాయం చిత్తు



న్యూయార్క్: మధుమేహ వ్యాధి చికిత్సలో ఉపయోగించే ఓ ఔషధం ఊబకాయాన్ని తగ్గించుకోవడంలోనూ తోడ్పడుతుందని తాజా అధ్యయనంలో శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మన శరీరంలో 'గ్లుకగాన్ లైక్ పెప్టైడ్ 1(జీఎల్‌పీ-1)' అనే సహజసిద్ధ హార్మోన్ రక్తంలో చక్కెర నిల్వలను నియంత్రిస్తుంది. ఆకలినీ క్రమబద్ధీకరిస్తుంది. మధుమేహ చికిత్సలో వినియోగిస్తున్న సరికొత్త సమ్మేళనం 'సెమాగ్లుటైడ్' రసాయనిక నిర్మాణం కూడా జీఎల్‌పీ-1ను పోలి ఉందని అమెరికాలోని సౌత్ కరోలినా వైద్య విశ్వవిద్యాలయం పరిశోధకులు తాజాగా గుర్తించారు. ఊబకాయంతో బాధపడుతున్న వ్యక్తులు అదనపు బరువును తగ్గించుకోవడంలో ఈ ఔషధం దోహదపడుతున్నట్లు గుర్తించారు. 957 మంది ఊబకాయులపై ఏడాదిపాటు పరిశోధనలు నిర్వహించి ఈ విషయాన్ని తాము నిర్ధారించామని.. తాజా అధ్యయనంలో భాగంగా పరీక్షించినవారెవరికీ మధుమేహం లేదని పరిశోధకులు తెలిపారు.

సూర్యకాంతి పరిమాణం గుర్తింపు

పూర్తి స్థాయిలో పనిచేస్తున్న 'నాసా' సరికొత్త సాధనం



వాషింగ్టన్: సూర్యుడి నుంచి వెలువడే కాంతిశక్తి పరిమాణాన్ని గుర్తించడానికి తమ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)పై 'నాసా' సరికొత్త సాధనాన్ని అమర్చింది. 'టోటల్ అండ్ స్పెక్ట్రల్ సోలార్ ఇర్రేడియన్స్ సెన్సర్' (టీఎస్ఐఎస్-1)గా పేర్కొంటున్న ఈ సాధనం ఇప్పుడు సంపూర్ణంగా పనిచేయడం మొదలైంది. నిర్దేశిత వివరాల సేకరణలో నిమగ్నమై ఉందని 'నాసా' వెల్లడించింది. భూగోళ రేడియో ధార్మికతపై సూర్యుడి ప్రభావం, ఓజోన్‌పొర, పర్యావరణ వ్యవస్థలపై సూర్యుడి ప్రభావంపై అవగాహనకు ఈ సాధనం పంపే వివరాలు ప్రాతిపదికగా ఉపయోగపడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే...భూ వ్యవస్థలు, వాతావరణ మార్పులపై సౌరవైరుధ్య ప్రభావాలను తెలుసుకోవడానికి ఈ వివరాలు కీలకమని ఓ శాస్త్రవేత్త వెల్లడించారు. గత డిసెంబరు 15న 'టీఎస్ఐఎస్-1'ను ప్రయోగించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.


వయాగ్రాతో పేగు క్యాన్సర్ ముప్పు దూరం!



వాషింగ్టన్: ప్రతిరోజు స్వల్ప మోతాదులో వయాగ్రా ఔషధాన్ని తీసుకుంటే పేగు క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. పేగుల గోడలపై అసాధారణ రీతిలో పెరగడం ద్వారా క్యాన్సర్‌కు దారితీసే హానికర కణాల సమూహాన్ని ఈ ఔషధం ప్రభావవంతంగా తొలగిస్తుందని వెల్లడించింది. మానవుల్లో పేగు క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యు ఉత్పరివర్తనాలను ఎలుకల్లో సృష్టించి అమెరికాలోని అగస్టా విశ్వవిద్యాలయ పరిశోధకులు తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. నీటితో కలిపి వయాగ్రా ఔషధాన్ని అందించినప్పుడు ఎలుకల్లోని పేగులపై హానికర కణాల సమూహాలు దాదాపు సగానికి తగ్గిపోతున్నట్లు వారు గుర్తించారు. 'సైక్లిక్ జీఎంపీ' అనే రసాయనం విడుదలను వయాగ్రా పెంచుతుందని.. తద్వారా కణాల అనుచిత వృద్ధికి అడ్డుకట్ట పడుతుందని వెల్లడించారు. మనుషుల్లో త్వరలోనే ఈ ఔషధాన్ని పరీక్షించనున్నట్లు తెలిపారు.

అంతుచిక్కని అంతరిక్ష ఖాళీల పరిశీలన

- తొలిసారిగా ఆక్స్‌ఫర్డ్ పరిశోధకుల ఘనత



లండన్: సుదూర విశ్వంలో తారా మండలాల మధ్య ఉన్న అంతుచిక్కని ఖాళీ ప్రదేశాలను ఖగోళ శాస్త్రవేత్తలు ఎట్టకేలకు పరిశీలించారు. సరికొత్త విధానం సాయంతో వాటిలోకి తొలిసారిగా తొంగిచూశారు! విశ్వం విస్తరణ కారణంగా శూన్యం వంటి ఈ ప్రదేశాలు ఆవిర్భవిస్తుంటాయని బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు డేవిడ్ అలాన్సో తెలిపారు. 'కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్(సీఎంబీ)' పటాల సాంకేతికతను ఉపయోగించి 774 ఖగోళ ఖాళీలను తాజాగా తాము పరిశీలించినట్లు వెల్లడించారు. విశ్వవ్యాప్త సగటుతో పోలిస్తే.. వాటిలో పీడనం స్థాయి తక్కువగా ఉందని తెలిపారు.

పురుషులకు సురక్షిత గర్భనిరోధక మాత్ర

- అమెరికా శాస్త్రవేత్తల ఆవిష్కరణ



వాషింగ్టన్: పురుషుల్లో ప్రభావవంతంగా పనిచేసే గర్భ నిరోధక మాత్రను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. దాని వాడకం సురక్షితమని తేలినట్లు వెల్లడించారు. వాస్తవానికి పురుషులు వినియోగించేందుకు వీలుగా కొన్ని గర్భనిరోధక మాత్రలను శాస్త్రవేత్తలు గతంలోనే అభివృద్ధి చేశారు. అయితే, అవి కాలేయంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని.. రోజుకు ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో మాత్రలను వేసుకోవాల్సి వస్తుందని తేలడంతో వాటి వినియోగానికి ఎవరూ మొగ్గుచూపలేదు. ఇందుకు పరిష్కారమార్గంగా 'డైమిథేన్‌డ్రోలైన్ అండెకనోఏట్(డీఎంఈయూ)' అనే ఔషధాన్ని అమెరికా శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. డీఎంఏయూ మాత్రల వాడకం అత్యంత సురక్షితమని.. రోజుకు ఒక్క మాత్ర వేసుకుంటే సరిపోతుందని వారు నిర్ధారించారు.

ఇ-సిగరెట్లతో కాలేయంలో పేరుకుపోతున్న కొవ్వు

లాస్ ఏంజిలెస్: ఎలక్ట్రానిక్(ఇ)-సిగరెట్లు ఆరోగ్యానికి హానికరం కాదన్న ఆలోచన వట్టి భ్రమేనని పరిశోధకులు తేల్చారు! వాటిని వినియోగించేవారిలో కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తే ముప్పుందని తెలిపారు. ఎలుకలపై పరిశోధనల ద్వారా అమెరికాలోని చార్లెస్ ఆర్ డ్ర్యూ వైద్య, వైజ్ఞానిక విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ ప్రభావాలను నిర్ధారించారు. ఇ-సిగరెట్ల ఆవిరి ప్రభావానికి తాము గురిచేసిన ఎలుకల కాలేయాల్లో కొవ్వు మితిమీరి పోగుపడినట్లు తెలిపారు. ఫలితంగా వాటిలో కాలేయ సంబంధిత వ్యాధులు తలెత్తాయని.. ఆరోగ్యం క్షీణించిందని వెల్లడించారు.

నిలుపుదలకు ఉత్తర్వులు.. మళ్లీ నిర్ణయంలో మార్పు..!

మూడు వర్సిటీల్లో పోస్టుల భర్తీపై సమన్వయం కరవు

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యాశాఖలో అధికారుల నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. మూడు విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి సంబంధించి నియామకాలు నిలుపుదల చేస్తూ గతంలో ఉత్తర్వులు జారీచేసిన అధికారులు..తాజాగా ఆ నిర్ణయంలో మార్పు దిశగా అడుగులు వేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో రాయలసీమ, జేఎన్‌టీయూ కాకినాడ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవీ కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వర్సిటీల్లోని రిజర్వు కేటగిరి ఆచార్యులు, అసోసియేట్ ప్రొఫెసర్, సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ చేయొద్దంటూ ఫిబ్రవరి 12న ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. కొత్త ఉపకులపతులు వచ్చే వరకు ఈ ప్రక్రియను నిలుపుదల చేయాలని రిజిస్ట్రార్లను ఆదేశించారు. పదవీకాలం ముగిసే సమయానికి కంటే ఆరునెలల ముందు నుంచి ఎలాంటి పోస్టుల భర్తీ చేయకూడదనే రాష్ట్ర ప్రభుత్వ నిబంధన ఉన్నందునే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు అప్పట్లో ఉన్నత విద్యామండలి ప్రకటించింది. అయితే ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసే సమయానికే రాయలసీమ వర్సిటీలో పోస్టుల భర్తీ దాదాపుగా పూర్తయింది. జేఎన్‌టీయూకాకినాడ, విక్రమసింహపురి వర్సిటీల్లో పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీ చేసుకునేందుకు తమకు అవకాశం ఇవ్వాలంటూ జేఎన్‌టీయూ కాకినాడ, విక్రమసింహపురి ఉపకులపతులు ఉన్నత విద్యాశాఖకు లేఖలు రాశారు. వీటిని పరిశీలన కోసం ఉన్నత విద్యామండలికి పంపించారు. ఉమ్మడిఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి ప్రత్యేక పరిస్థితుల్లో పోస్టుల భర్తీ చేసుకునేందుకు అవకాశం ఇచ్చినందున ఈ వర్సిటీలకు ఇవ్వాలని ఉన్నత విద్యాశాఖలోని కీలక అధికారి భావిస్తున్నారు. మంత్రి పేషీ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు నిలిపివేస్తున్నట్లు గతంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి వరదరాజన్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని కాదంటూ ఉన్నతాధికారి ఆదేశాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

నిబంధనలు పరిశీలిస్తున్నాం: ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఉపకులపతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. పోస్టుల భర్తీపై యూజీసీ, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు పరిశీలిస్తున్నాం. వాటి ఆధారంగా ఆదేశాలు జారీ చేస్తాం.

ప్రాథమిక స్థాయిలోనే బడికి స్వస్తి

- 2.15 శాతం మంది బడి మానేస్తున్నారు
- స్థూల ప్రవేశాల నిష్పత్తిలోనూ వెనుకబాటే

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రాథమిక విద్యతోనే చదువు మానేస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఐదో తరగతి తర్వాత ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వెళ్తున్న వారి సంఖ్య జాతీయ సరాసరితో పోల్చితే తక్కువగా నమోదవుతోంది. అధికారిక లెక్కల ప్రకారమే ప్రాథమిక స్థాయిలో 2.15శాతం మంది బడి మానేస్తున్నారు. దీంతో స్థూల ప్రవేశాల నిష్పత్తి తగ్గుతోంది. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో పాఠశాలకు దూరమవుతున్నవారు 1.56శాతం ఉండగా.. తొమ్మిది, పదిలో చదువు మానేస్తున్నవారు 1.3శాతం మంది రాష్ట్రంలో ఉన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు వారిపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఆ తర్వాత చదువు మానేస్తున్న వారిని పెద్దగా పట్టించుకోవడం లేదనే వ్యాఖ్యలున్నాయి.

జాతీయ సగటుకంటే తక్కువ

ప్రాథమిక విద్యలో 2016-17లో రాష్ట్ర స్థూల ప్రవేశాల నిష్పత్తి(జీఈఆర్) 82.79శాతం ఉండగా జాతీయ సగటు 99.21శాతంగా నమోదయింది. ఒకసారి బడిలో చేరిన పిల్లలందరూ పై తరగతులకు వస్తున్న దాన్నిబట్టి స్థూల ప్రవేశాల నిష్పత్తిని లెక్కిస్తారు. బడిబయట పిల్లల సంఖ్య అధికంగా ఉండడంతో జీఈఆర్ తగ్గిపోతోంది. రాష్ట్రంలో 1.03లక్షల మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు ఇటీవల అధికారులు నిర్వహించిన సర్వేలో తేలింది. వాస్తవానికి ప్రస్తుతం అధికారులు చూపుతున్న లెక్కలకంటే ఎక్కువే ఉంటారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. గిరిజన, మన్యం ప్రాంతాల్లో సర్వేలు పూర్తి స్థాయిలో జరగలేదనే విమర్శలున్నాయి. గతంలో బడిబయట పిల్లల సంఖ్య 56,054గా మాత్రమే చూపించేవారు. మూడు, ఐదు తరగతులు చదువుతున్న వారిలో ఒకటో తరగతి స్థాయి పుస్తకాలను చదవగలిగేవారు 55శాతం నుంచి 60శాతం ఉండగా.. లెక్కల్లో తీసివేతలు, ఇతరత్రా చేయగలుగుతున్నవారు 75శాతం నుంచి 78శాతం ఉన్నారు.

రాష్ట్ర, జాతీయ సరాసరి స్థూల ప్రవేశాల నిష్పత్తి (శాతాల్లో)

రాష్ట్ర సరాసరి	2014–15	2015–16	2016–17	జాతీయ సరాసరి
ప్రాథమిక	88.21	84.48	82.79	99.21
ప్రాథమికోన్నత	79.47	81.33	80.87	92.81
ఉన్నత	72.40	75.51	76.08	80.01

జిల్లాలవారీగా బడిబయట పిల్లలు సంఖ్య ఇలా..

జిల్లా	బడిబయట పిల్లలు	బీసీ	ఎస్సీ	ఎస్టీ
అనంతపురం	4741	2896	998	280
చిత్తూరు	4167	1477	875	1131
తూర్పుగోదావరి	8257	3230	2146	1739
గుంటూరు	14512	5353	3545	2157
కడప	2796	1129	652	308
కృష్ణా	10525	4603	3094	1207
కర్నూలు	7844	5144	1674	242
నెల్లూరు	9369	2348	1796	4373
ప్రకాశం	11439	4032	4522	1840
శ్రీకాకుళం	6464	4626	680	745
విశాఖపట్నం	8668	2595	611	4344
విజయనగరం	3606	1522	330	1605
పశ్చిమగోదావరి	7925	3119	2033	1210
మొత్తం	1,00313	42,074	22,956	21,181



సమస్యను చొక్కాగా చెప్పారు..

నిజామాబాద్‌కు చెందిన వెంకటయ్య అనే వ్యక్తికి కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద భూమి ఉంది. అన్ని పత్రాలున్నా ఆ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని కలెక్టర్‌కు రెండేళ్ల నుంచి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి నిరసనగా సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఇలా తయారై వచ్చారు. వేసుకున్న చొక్కాపై ముందు, వెనుకాల తన సమస్యను రాసుకొని అధికారుల ముందు ఇలా నిరసన తెలిపారు. తన భూమిని తనకు ఇప్పించాలని వేడుకున్నారు.

-ఈనాడు, నిజామాబాద్

ఆర్థికంగా ఎదగాలి... ఆధిపత్యం సాగాలి...

- ఇవే ప్రాధాన్యంగా చైనా కొత్త మంత్రివర్గం ఏర్పాటు
- సరిహద్దుల్లో వివాదాల నేపథ్యంలో విదేశాంగ మంత్రికి స్టేట్ కౌన్సిలర్ హోదా
- రక్షణ మంత్రిగా క్షిపణి నిపుణుడు!

బీజింగ్: అమెరికా తర్వాత ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థికశక్తిగా ఉన్న చైనా... ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకునే దిశగా కొత్త మంత్రివర్గాన్ని కూర్చింది. సరిహద్దు వివాదాల్లో చాకచక్యంగా వ్యవహరించడం; అంతర్గతంగా, ప్రపంచ వ్యాప్తంగా తన ప్రతిష్ఠను పెంచుకోవడమే లక్ష్యంగా... నియామకాల్లో కొత్త పంథాను అనుసరించింది. ప్రధాని లీ కెక్వియాంగ్ సోమవారం తన మంత్రివర్గాన్ని ప్రకటించారు. నలుగురు ఉప ప్రధానులు సహా 26 శాఖలకు మంత్రులను ప్రకటించారు. ఈ నియామకాలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది.

దౌత్యం ఆయన కనుసన్నల్లోనే...

విదేశాంగమంత్రి వాంగ్ యీకు ప్రభుత్వం అత్యున్నత 'స్టేట్ కౌన్సిలర్' హోదాను కల్పించింది. దీంతో కీలకమైన దౌత్య వ్యవహారాలన్నీ ఇక ఆయన కనుసన్నల్లోనే జరుగుతాయి. భారత్‌తో నెలకొన్న సరిహద్దు వివాదాల విషయంలో ఆయన చాకచక్యంగా వ్యవహరిస్తారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. భారత్‌ను దృష్టిలో పెట్టుకుని లెఫ్టినెంట్ జనరల్ వీ ఫెంఘీకు రక్షణశాఖ బాధ్యతలను అప్పగించడం మరో కీలక పరిణామం! రక్షణశాఖను శరవేగంగా పునర్ వ్యవస్థీకరించడంలోనూ, ఆధునికీకరించడంలో ఆయన ముఖ్య భూమిక పోషించారు. సరిహద్దు వివాదాల నేపథ్యంలో వలసలపైనా చైనా సర్కారు దృష్టి పెట్టింది. ఇమిగ్రేషన్ వ్యవహారాలను చూసేందుకు ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేసింది. కొత్తగా సహజ వనరుల పరిరక్షణ; వృద్ధుల సంక్షేమం; అత్యవసర పరిస్థితుల నిర్వహణ శాఖలకు క్యాబినెట్‌లో చోటు కల్పించడం విశేషం.

వృద్ధి బాట.. సుమారు మూడు దశాబ్దాల పాటు రెండంకెల అభివృద్ధిని నమోదుచేసిన చైనా కొన్నేళ్లుగా ఆర్థికంగా ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో దేశ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టగల సామర్థ్యమున్న లియూను ఉప ప్రధానిగా నియమించింది. ఇప్పటికే అధ్యక్షుడు జిన్‌పింగ్ ముఖ్య అనుచరుడు, అవినీతి నిరోధకశాఖ పూర్వాధిపతి వాంగ్ కిషాన్ ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. మరోవైపు- ఆర్థిక సంస్కరణల్లో కీలకపాత్ర పోషిస్తున్న యీ గాంగ్‌ను జాతీయ బ్యాంకు 'పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా' అధ్యక్షునిగా ప్రభుత్వం నియమించింది. బ్యాంకింగ్, బీమా రంగాలనూ కలిపేసింది. ఆర్థికశక్తిగా చైనా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఈ మార్పులు దోహదపడగలవని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

జిన్‌పింగ్‌కు మోదీ శుభాకాంక్షలు: రెండో దఫా చైనా అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన జిన్‌పింగ్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఆయన మరింతగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా సామాజిక మాధ్యమం 'వీబో'లోని జిన్‌పింగ్ ఖాతాలో మోదీ తన సందేశాన్ని రాశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00